UNIVERSAL
LIBRARY
OU_204315
UNIVERSAL
LIBRARY

శ్రీ

ఆంధ్ర గీత లక్ష్య విజయము

అను

స్తోత్ర తిర్లిల.

గ్రంథకర్త,

మహారాజ్ — రాజ్ — జలాదత్ — దస్తగహ

శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దర్,

ఉయ్యూరు యెస్టేటు జమీందారుగారు.

పరిశోధకులు,

కరూరుపల్లి పూర్ణయ్య శాస్త్రిగారు, ప్రధాన పండితులు,

శ్రీరాజా రంగయ్యప్పారావు గారి హైస్కూలు, నూజవీడు.

శేతపాటి భగవంతరావుగారు,

గుర్నాథంగారి కవిమిత్ర గానసారాది వివిధ గ్రంథకర్తలు,

గానభాషోపాధ్యాయులు, ఉయ్యూరు యెస్టేటు, నూజవీడు, కృష్ణాజిల్లా.

ఇందలి,

శిలాచిత్రములు మద్రాసు ముగ్గుల్ ఆఫీసువారిచేతను,

త్రివర్ణ చిత్రములు కలకత్తా యూరోప్ అంపసన్న వారిచేతను,

బ్లాకు చేయబడినవి.

మొదటి కూర్పు 1000 ప్రతులు.

నూజవీడు,

శ్రీ గాన ముద్రాక్షరశాలయందు,

ముద్రించబడినది.

1927

రిజిష్టర్డు కాపీరైటు.

వెల రు. 2—0—0

విషయసూచిక.

1 ప్రాస్థవ.

2 కథాసందర్శనము.

3 భూమికా వివరణ పట్టిక.

4 ప్రదర్శనముయొక్క నిర్ణీతకాల పరిమితి.

5 ఆంధ్ర వీరలక్ష్మీ విజయము అను జ్యోతిర్లీల.

6 అనుబంధములు.

  1 కఠినపదములకు అర్థములు.

  2 జ్యోతిశ్శాస్త్ర పరిభాషా వివరణములు.

  3 పద్మనాయక వీర బిరుద పాఠములు, అర్థములు.

  4 సంస్కృతనాటకలక్షణము, నాట్యశాలావర్ణనము.

  5 శుద్ధపదపట్టిక.

ఆంధ్రభట సంఘమునకు ఈ గ్రంథమూల్యము ఒసంగఁబడినది.

వలయువారు:—

డాక్టరు జోగయ్యశర్మ, ఆంధ్రభట కార్యదర్శి,

పవరుపేట, ఏలూరు.

అని వ్రాయవలెను.

శ్రీ శో భ నా దీ పి కా.

నాం ది.

శ్రీసముదారుఁడే సుకృతిసిద్ధులఁ గాచి ప్రసుప్తదిత్యులన్
గాసి యొనరించు నా విసువుగల్గు సుపోషణములఁ జేయుచుండుట న
న్యాసము దీర్ఘుఁడై గురుసభాప్రణయిన్ నరిమించి తెల్పు నా
దాసుఁడు భార్గవున్ ముదితమైత్రిగృహాదుల [illegible] సేయుచున్.

వి నా య క స్తు తి.

తే. గీ. తల్లినమ్మినపూంతి నున్నదనుఁ గనుట,
సంద్రశి నెదిరించి తానో దొన్ను పాల సలరుట,
ప్రసమయోగమొనరించను పెన్నుభక్తి యొసఁగుట,
నొట్టి జాతిక ఫలముత్తై సట్టఁగలదొ!

గ్రం థ స ము చ్ఛ యం.

సీ. భారతాఖ్యానంబు, భాగవతంబు, నై
 షధము, [illegible] సంగ్రహంబు,
హరివంశ, [illegible] హరిసంకీర్తనము, వసు
 చరితంబు, తారావిలాసకథయును,
అల కళాపూర్ణోదయంబు, ప్రభావతీ
 ప్రద్యుమ్నచరితము, [illegible]
హరిదాసుఁడు, [illegible] రామాయణంబు,
 రంగనాథాఖ్య శ్రీరామకథయు,
ఉత్తరహరివంశ నోత్తర రామాయ
 ణంబులు, జైమినీయంబు పర్వ,

గీ. మింటను, గౌరన [illegible], రసికమనోభి
 రామ, మలయ [illegible] వతారముల చరిత్ర,
భర్తృహరి తెన్గు, వేమన్న పద్యపంక్తి
 మొదలుగా పూర్వసద్గ్రంథములకు మ్రొక్కి.

సీ. మానవతీకథ, మానితరుక్మిణీ
 రమణి కల్యాణంబు, రంగరాయ

ఘన సమవాకారమును, సుప్రసన్నదూ
దవము, చిత్రరేఖీయ దర్శనంబు,
తిరుపతివేంకటేశ్వర భారతంబును,
పానుగంటి నృసింహ భవ్యకృతులు,
గద్యతిక్కన వరో కమనీయఫణితియు,
సూరి గంభీర వాగ్ధోరణియును,

గీ. రాశిరంయుక్త, విమలాభిరామచరిత,
ప్రణయమహిమంబు, వేంకటపార్వతీశ
రచన, రామలింగారెడ్డి వచనగరిమ
మొదలు నాధునిక గ్రంథములను బొగడి.

క. పద్యంబుల గద్యంబుల
హృద్యంబగునీతి లోకహితబోధనలన్
వేద్యం బొనరించిన గురు
విద్యాగ్రంథముల కేను వినతు లొసరున్.

గ్రంథ ప్రశంస.

చ. మహిమదలిర్పంగా భువనమండలి నంబరవీధి నేతలన్
మహిత జనంపులోకనియమంబున ద్రిప్పుచు జీవకోటికిన్
విహిత మొసంగఁజేయు హరి వేమఱుఁ గూర్చెడుగాక తారకా
గ్రహయుత సౌమ్యయోగ విసరంబు జగంబులు మోద మందఁగన్.

ఉ. భూతలమానవాళిబలముల్ గ్రహరాజ విరాజమాన వి
ఖ్యాతమహత్త్వసత్త్వముల సందనిమౌట నధీనమౌట ఖ
ద్యోతిత కుజాదిమూర్తులను యుద్ధమునన్ మనుజాళి గెల్చుటల్
నీతియె? యందురేమొ! భువినేతలు దివ్యుల మున్ జయింపరే!

సీ. జన్మతారకనామ సకలలోకారాధ్య
లక్ష్మీశను సృష్టిమూలంబు కొంత,
సిద్ధాంత ఫల సుప్రసిద్ధభాగప్పయ
జ్యోతిర్విశేష సంస్తుతి యొకింత,
వర కాకతీయాంధ్ర వంశ రాజోత్తంస
మాన్య రుద్రాంబికా మహిమ కొంత,
సహజ ధైర్య ధురీణ సప్త సప్తతి గోత్ర
పద్మనాయక శౌర్యఫణితి కొంత,

తే. కలిసి, రసములు దొలఁకెడు తలఁపు లొలయ,
వింత చిన్నెల వన్నెపూబంతిఁ బోలు
నాంధ్ర వీరలక్ష్మీజయం బఖిల సుజన
వినుత కౌతుక పాత్రతఁ దనరుఁ గాత.

సూత్రధారస్తుతి.

గీ. తారలన్ గ్రహముల వేషధారులుగను,
సంబరమునెల్ల నాట్యరంగంబు గాను
భవ్యతర జగన్నాటక ప్రౌఢి నెఱపు
సూత్రధారుండు దయ మమ్ముఁ జూచుఁగాక.

కత్తితో అభివాదనము సల్పు ఆంధ్రయోధుఁడు.

కథా సందర్భము.

సృష్ట్యాదిని బ్రహ్మసభలో గ్రహపూరుషులు గ్రహబలము అధిక మనియు, ప్రజాపతులు వ్యక్తిస్వాతంత్ర్యమే బలవత్తర మనియు, జర్చసేయుదురు. భూలోకమున హిందూదేశమున నేకశిలానగరసామ్రాజ్యమునకు మహారాజ్ఞి యగు రుద్రమాదేవికాలమునం దీ వివాదపరీక్ష జరుగునట్లు అర్ధనారీశ్వరునిచే నిర్ణయింపఁబడెను. ప్రజాపతులలో నొక్కఁడగు వసిష్ఠుఁడు భాస్కరాచార్యుఁడనగను, కళయను ప్రజామాత యాతని కూఁతురగు లీలావతిగను, భూలోకమున నార్యావర్తమున జనించిరి. ఆ భాస్కరాచారి తన కొమార్తెతో దక్షిణాపథమునకు వచ్చి, యేకశిలానగరమున రుద్రమాదేవి సన్నిధి నాశ్రయించి, వ్యక్తిస్వాతంత్ర్యవాదియై జ్యోతిర్విద్యను సాధించుచుండెను. అతని ప్రయత్నమునకు భంగము కలిగించుటకై దేవగిరి రాజగు మహాదేవుని నోరుగంటినగరముపై దాడివెడలుటకు గ్రహపూరుషులు ప్రేరేపించెదురు. అట్లు గ్రహబల సంయుతులై వచ్చిన దేవగిరిసైన్యములను ఓరుగంటి ప్రభ్వియగు రుద్రమాదేవి స్వసామర్థ్యముచే నోడించి, వ్యక్తిస్వాతంత్ర్యమే బలవత్తర మను వాదమును నిరూపించును.

జ్యోతిశ్శాస్త్రవిశేషములను దృశ్యరూపమున వ్యక్తపఱచుట గ్రంథోద్దేశము.

పురుషప్రయత్నమునకు ప్రకృతిసత్వములు స్వాధీనము లని నిరూపించుట కథా పర్యవసాన ధర్మము.

మన పూర్వులగు నాంధ్రవీరుల సద్గుణకీర్తనమే గ్రంథకర్తకుఁ బ్రతిఫలము.

ఇందు చరిత్రాంశముల సంబంధమునకు వీరభద్రరావుగారి ఆంధ్రులచరిత్రయొక్క ద్వితీయభాగమును, K. V. Subramanya Iyar's Historical Sketches of anicient Dekkan, Vol. I ను పరిశీలించునది.

భూమికా వివరణపట్టిక.

దేవతలు.

సంఖ్య. భూమికానామము. — ప్రవేశ సమయము.

1 శ్రీమహావిష్ణువు. బ్రహ్మాదిబ్రహ్మణ్యుడైన పరమాత్మ, శ్రీభూనీలాదేవులు, అనంతుడు, గరుడుడు, విష్వక్సేనుడు, నిత్యముక్తులు, ఈతనికి అనుచరవర్గము. నీలమేఘశ్యామలుడు, పీతాంబరధారి, శంఖచక్రగదాఖడ్గధరుడు. — 1 వ అంకము.

2 అర్ధనారీశ్వరుడు. బ్రహ్మచే సృష్టి చేయబడి, కథ సంవిధానము నిర్ణయించిన దేవత, భుజంగభూషణుడు, త్రిశూలధారి, ఖట్వాంగధారి. (కృత్రిమ స్త్రీస్తనలు వలదు.) — డిటో

3 బ్రహ్మ. సృష్టికర్త. పసుపుపచ్చని దట్టుబట్టలతో, జటామాలతో నుండు తాపసరూపుని దుస్తులు. (కృత్రిమ శ్మశ్రువులు వలదు.) — డిటో

4 సరస్వతి. విద్యాధిదేవత, బ్రహ్మదేవు భార్య. జలతారుపనిచేసిన తెల్లని చీర రవిక, తెల్లని పుష్పములు, భూషణములు. — డిటో

గ్రహస్వరూపములు.

5 సూర్యుడు లేక రవి. గ్రహరాజు. గ్రహములన్నిటికి పరిపాలన విధానమును ప్రహారముల వలన జెప్పించును. ఆ విధానమును నడిపించును. ప్రథమద్వితీయాంకములలో – తేజోమయుండును మెరయుచుండు తనుచ్ఛాయయు, తెల్లని దుస్తులును, – పంచమాంకములలో పారసీక యువకుని దుస్తులు. — 1, 2 అంకములు. పంచమాంకములో 1 వ రంగము. 3 వ రంగము.

6 చంద్రుడు. గ్రహపూరుషుడు, శాంతమూర్తి. 1 వ, 2 వ అంకములలో స్వచ్ఛతేజముగల దేహకాంతి దుస్తులు. 5 వ అంకములో సూర్యునివలె. — డిటో

7 కుజుడు. గ్రహపూరుషుడు. యుద్ధకారకుడు. 1 వ, 2 వ అంకములలో ఎఱ్ఱని దేహకాంతి దుస్తులు, 5 వ అంకములో సూర్యునివలె. — డిటో

8 బుధుడు. గణితశాస్త్రజ్యోతిషకారకుడగు గ్రహము, చంద్రుని కుమారుడు. స్థూలకాయుడు. 1 వ, 2 వ అంకములలో ఆకుపచ్చని దుస్తులు. 5 వ అంకములో సూర్యునివలె. — డిటో

9 గురువు. దేవగురువు విద్యాధికారియగు గ్రహము. 1 వ, 2 వ అంకములలో పసుపుపచ్చని వస్త్రములు. బ్రహ్మతేజస్సు. 5 వ అంకములో పారసీక మతబోధకుని వలె నల్లని దుస్తులు. — సూర్యునివలె.

10 శుక్రుడు. రాక్షసగురువు. గానకళాకారకుడగు గ్రహము. ఏకాక్షి. దుస్తులు గురువువలె. — డిటో

11 శని. ఆయుఃకారకుడు, మృత్యుకారకుడు నగు గ్రహము. సూర్యుని భార్యయగు ఛాయకు కుమారుడు. ఒకకాలు కుంటు. నీలవర్ణపు దుస్తులు. 5 వ అంకములో రవివలె. — యు 4 వ అంకము లో తృతీయరంగము

12 రాహువు.	ఛాయాగ్రహము. రాక్షసుఁడు. పాముచర్మమువంటి దుస్తులు. [illegible]. 5 వ అంకములో రవివలె.	4 వ అంకములో 1 వ రంగము.
13 కేతువు.	ఛాయాగ్రహము, మోక్షకారి. పిలకవాఁడు, చిన్న తల, రాహువు [illegible] వలె పాముచర్మమువంటి దుస్తులు.	
14 సనకుఁడు, సనందనుఁడు, సనత్కుమారుఁడు, సనత్సుజాతుఁడు.	బ్రహ్మమానసపుత్రులు, సంసారము త్యజించినవారు. తాపస యువకుల దుస్తులు.	1 వ అంకము.
15 అత్రి, మరీచి, కశ్యపుఁడు, వసిష్ఠుఁడు.	ప్రజాపతులు. వ్యక్తిస్వాతంత్ర్యమును గూర్చి గ్రహపూరుషులలో వాదము చేసినవారు. దేవగురునకుఁ దగిన స్వాత్యకాంతి, దుస్తులు.	డిటో
16 శచి, అనసూయ.	ప్రజాపతుల భార్యలు. దేవతాస్త్రీలకుఁ దగిన దుస్తులు, భూషణములు.	డిటో
17 అశ్విని మొదలైన తారలు.	గీ యువతి మొదలగు నక్షత్ర గోళాధిదేవతలైన దివ్యకాంతలు, చంద్రుని భార్యలు. కన్యకాస్త్రీలు వుండవలసిన స్వచ్ఛవసనములు, పైని జలతారువని గలవి. కిరణకాంతిని సూచించు కిరీటములు. స్వచ్ఛమైన రత్నములు చెక్కఁబడిన భూషణములు.	2 వ అంకము.

న రు లు.

18 సుభద్రమోహిని, మహారాష్ట్రి.	13 వ శతాబ్దమున ఏకశిలానగర సామ్రాజ్యమునకు ఏలిక, గణపతి చక్రవర్తి కొమార్తె. మహారాష్ట్ర దుస్తులలోనుండు. [illegible] గల చిత్రరూపము ధరించునది. (ఈ పాత్ర స్త్రీలచే ధరింపఁ దగినదిగా వ్రాయఁబడినది గాని పురుషులు తాల్చవలసినదిగా గ్రంథకర్త యుద్దేశము కాదు.)	3 వ అంకములో 1, 2 రంగములు, 4 వ అంకములో 2వ రంగము, 5 వ అంకములో 3వ రం.
19 లీలావతి.	విద్యాకన్య, భాస్కరాచార్యుని కొమార్తె. శచి యను ప్రజామాత 10 సం. యొక్క యవతారము. చంద్రమదేవికి నెయ్యురాలు. జౌత్తకీయ విద్యాకన్యల దుస్తులు.	3వ అంకములో 1, 3 రంగములు, 4వ అంకములో 2వ రంగము, 5వ అంకములో 3 రం.
20 భాస్కరాచారి.	లీలావతి తండ్రి, జౌత్తకీయబ్రాహ్మణుఁడు. జ్యోతిష్కుఁడు. 50 సం॥ వసిష్ఠ ప్రజాపతి యొక్క యవతారము. జౌత్తకీయ బ్రాహ్మణ వేషము.	3వ అంకములో 3వ రంగము, 5 వ అంకములో 3 వ రంగము,

21	మల్లికార్జునుడు.	రుద్రమదేవికి మేనత్త కుమారుడు. కథానాయకుడు. ఆంధ్రక్షత్రియుల దుస్తులు.	20 సం. 3వ అంకములో 2 రంగము, 4 అంకములో 2, 3 రంగములు, 5 అంకములో 2, 3 రంగములు.
22	ప్రసాదాదిత్యుడు.	పద్మనాయకవీరుడు. రేచర్ల గోత్రికుల నాయకుడు. ఓరుగంటి సేనానాయకుడు. పద్మనాయక వీరుల దుస్తులు.	40 సం. 3 అంకములో 1, 2, 3 రంగములు, 5వ అంకములో 2, 3 రం.
23	[illegible].	విశ్వగోత్రులకు నాయకుడు. ఓరుగంటి సేనానాయకులలో నొకడు. పద్మనాయకవీరుల దుస్తులు.	40 సం. 3వ అంకములో 2 రంగం. 5 అంకంలో 2, 3 రంగములు.
24	రాఘవవర్మ.	ఆంధ్రసామ్రాజ్యము యొక్క దండనాయకుని కుమారుడు, లీలావతికి ప్రియుడు. రాజవంశ్యులగు క్షత్రియుల దుస్తులు.	20 సం. 3 అంకములో 1, 2 రంగములు, 4 అంకములో 3 రంగము, 5 అంకములో 3 రంగము.
25	మహాదేవరాజు.	దేవగిరి రాజ్యమునకు రాజు. [illegible] జయింపబడి, సింహాసనమును [illegible]. మహారాష్ట్ర క్షత్రియుల దుస్తులు.	40 సం. 5 అంకములో 1, 3 రంగములు.
26	పద్మనాయకవీరులు.	[illegible] నాయకులు [illegible]. ఓరుగంటి కోటను [illegible] ప్రతి [illegible] అనుబంధమును చూచునది.	3 వ అంకము 2 వ రంగం, 5వ అంకములో 2, 3 రంగములు.
27	భట్టుమూర్తులు.	కాకతీయులసభలో [illegible]. పద్మనాయకుల [illegible] రంగము. [illegible].	3 వ అంకములో 2 వ రంగము.
28	దేవగిరి దూతలు.	మహాదేవరాజు యొక్క నాయకులు మొదలగు అనుచరులు.	మహాదేవరాజు వలె.
29	దాదులు, ప్రతీహారి, చేటి మొదలగువారు.	మహారాణి రుద్రమదేవి యొక్క పరివారము.	3 అంకం 2, 3 రంగములు, 4 వ అంకంలో 2 వ రంగము.

ప్రదర్శనముయొక్క కాలపరిమితి.

			గం. ని.
1 వ అంకము.	...	...	0—45
విశ్రాంతి.	...	...	0—5
2 వ అంకము.	...	...	0—45
విశ్రాంతి.	...	...	0—5
3 వ అంకము.	...	...	1—10
1 వ రంగము.	...	0—16	
విశ్రాంతి.	...	0—2	
2 వ రంగము.	...	0—30	
విశ్రాంతి.	...	0—2	
3 వ రంగము.	...	0—20	
		1—10	
విశ్రాంతి.	...	...	0—5
4 వ అంకము.	...	...	1—19
1 వ రంగము.	...	0—15	
విశ్రాంతి.	...	0—2	
2 వ రంగము.	...	0—45	
విశ్రాంతి.	...	0—2	
3 వ రంగము.	...	0—15	
		1—19	
విశ్రాంతి.	...	...	0—5
5 వ అంకము.	...	...	1—26
1 వ రంగము.	...	0—16	
విశ్రాంతి.	...	0—2	
2 వ రంగము.	...	0—16	
విశ్రాంతి.	...	0—2	
3 వ రంగము.	...	0—50	
		1—26	
		ప్రదర్శనమున కంతకు.	5—45

ఈ నాటక మంతయు ప్రదర్శించుటకు అవకాశములేనప్పుడు 1వ, 2వ అంకములలోని కథను క్లుప్తముగా ప్రేక్షకులకు దెల్పి, 3వ అంకమునుండియే దృశ్యములు ప్రారంభించునది.

శ్రీ

జ్యోతిర్లీల.

ప్రథమాంకము.

ప్రదేశము—సృష్టికి బూర్వము మహాశూన్యముగ నుండిన ఆకాశము.

ప్రవేశము—పద్మాసనముపైఁ గూర్చుండి ధ్యానముచేయు బ్రహ్మ, ఒకింత దవ్వుగ నంజలిబద్ధయయి పద్మపత్రమునపై నాసనించియుండునట్టి సరస్వతి.

బ్రహ్మసరస్వతు లున్నచోట్లు వెలుఁగుగను, కొదువప్రదేశ మంతయు చీఁకటిగను ఉండును.

సరస్వతి—ఆహా! సకలచరాచర హేతుభూత సృష్టికారకుం డగు శ్రీమన్నారాయణుని యపరిమిత మాహాత్మ్య మే నెంతయని కొనియాడఁగలను! అనంతంబును, అనుపమానం

బును, అగమ్యాగోచరంబును, అనిర్వాచ్యంబును అగు నా యాదిమూర్తి కౌతుక-నిర్హేతుక యథేచ్ఛానుసరణ లీలాప్రమోద మేదుర వ్యాపార కారణాంకూరమై సదా మాయాగర్భాంధకార పరివ్యాప్త జడమయ ప్రకృతిబీజమును ఆశ్చర్యజనక పంచ భూతాత్మక బ్రహ్మాండాంతర్గత గోళోపరిస్థిత చిత్రతరరూప దీపిత జీవకోటిఫల యుతం బగు స్వర్గభూజంబుగా నింక వర్ధిల్లఁజేయనున్నది. ఏ మహామహుని యిచ్ఛామాత్ర కారణంబున వ్యక్తినొంది, నే నత్యంతధన్య నైతినో యా దేవాధిదేవుని సంస్తవం బొనర్చెదను.

త్రిభంగివృత్తము.

ప్రవిమలనిజరుచి నివహ నిభృతకల సువికసితాంధ వివేశుఁ,
కల్మషనాశుఁ, స్వాత్మసకాశుఁ,
దివి పవన సలిల దహన భువి వినిమయుత విభజిత తాదిమహత్త్వుఁ,
సన్నుతసత్త్వుఁ, భూరిమహాత్ముఁ,
భువన రచన ఘన వివరణ విధగుణ భవగత పద్మజకారిఁ,
ధర్మవిహారిఁ, కల్మషహారిఁ,
అవికల గురుతప జపయుత మునిగణ వివిధ వచోనుత చర్యుఁ,
దైవతవర్యుఁ, భక్తసపర్యుఁ.

ధ్వనివృత్తము.

శ్రీహరిదేవుఁ, శివకరు, కరుణా
సింధు, జగత్పతి, సరసిజనేత్రుఁ,
దేహధృతాంతి ర్వికలహృదయ సం
దేహ నివారణ పదయుగు, పద్మా
మోహనరూపుఁ, నతజనహృదయా
మోదకరుఁ, భవకలుషవిదూరుఁ,
"పాహి" యటంచుఁ వినయ నత మతిఁ
భావన సేయుచు వినుతి యొనర్తుఁ.

(ధ్యానస్థిత యగును.)

బ్రహ్మ—(కన్నులువిచ్చి, చూచి,) ఆహా! అనంతంబగు నీ నిరామయ మహావివర విధానతత్త్వం బెంతసేపటినుండి యూహించుచున్నను నాకు నిదమిత్థ మని బోధకము కాకున్నది. దరి యంచు లేక, క్రిందు మీఁదులు పోల్పరాక, దిక్కులు తెలియక, భాగంబు లేర్పఱుపనీక, రూపెఱుంగనీక, యొక్కటేరీతి నవిచ్ఛిన్నంబును, దురవగాహనంబును నగు నీ తెలియఁబడనిదాని నేమని చెప్పఁగలను! (యోచించి) ఏదియో యొక మహా

పదార్థం బిందు సువ్యక్తంబుగాక మఱుఁగుపడియున్నట్లు అనుమానము కల్గుచున్నది. కాకున్న నీ పరివ్యాప్తాంతరాళము యొక్క ప్రయోజనంబేమి? ఏమియు నిశ్చయింప వీలులేక నిర్వ్యాపారంబగు మన్మనంబు సంశయాకులం బగుచున్నది. నే నొక్కరుండ నిందు చేయునదేమి? (ఒక్కింతసేపు కన్నులు మూసి, తెఱచి, అటు నిటుఁజూచి,) ఓహో! ఇంతకు మునుపటికంటె నిప్పుడిప్పు డీ దుర్భేద్యమాయాపటలంబు ఒకింత తెఱపియై, నాకుఁ దెల్విఁ గలిగించుచున్నది. (మరలఁ జూచి) అకటా! ఈ మహాంతరాళంబున నే నొక్కరుఁడను, నే నుండు నీ మహాకమలంబును దిక్కు నిం కెవ్వరును గానరాకున్నారే! ఇదివఱ కేమియుఁ దెలియనప్పటికంటె నిప్పుడు కొంత తెలియుట, మఱింత సంశయాకులంబును, భయదంబును గా నున్నది. (ఒకింత యోచించి) ఇందు నేనొక్కరుఁడనే యుంటినా? ఇంకెవ్వరైనఁ గూడ నున్నారా? క్రమక్రమంబుగ ప్రవర్ధమానంబులగు నీ ప్రబోధనోదయకాంతుల సాహాయ్యమునఁ బరీక్షించెదఁగాక! (అటు నిటుఁ జూచి, సరస్వతిని గాంచి,) ఓహో! నాయెదుట నేదియో యొక భవ్యవ్యక్తి కానవచ్చుచున్నదే! ఇద్దానిం గాంచుట కన్నుల కెంత యానందముగ నున్నది. తన తేజంబుచేఁ దాఁ దెలియఁబడు జ్యోతిఃప్రభ వోలె నీభవ్యతేజము దివ్యసువికాసంబునకుఁ దాని యాదర్శమగుచున్నది. ఈ రూపము కన్నుల కింతియానందముగనున్నదికదా! దీనిపల్కులు వినిన నవి యెంత శ్రోత్రపేయములుగా నుండఁగలవో! (సంతోషముతో సరస్వతివంకఁ జూచుచుండును)

సరస్వతి—(కన్నులువిచ్చి, చూచి, తనలో) నన్ను సృష్టించిన మహామహుఁడు "నీవు విద్యాధిదేవత వగు సరస్వతివి. బ్రహ్మకు భార్యవై సృష్టికార్యంబున నాతనికిఁ దోడ్పడుము" అని నా కనుజ్ఞ నిచ్చి, యంతర్ధానుఁడయ్యె. అప్పుడు నాకు వేదవిజ్ఞానము స్ఫురించెను. తోడనే యీ మహాకమలంబును, దీనిపైనున్న యీ పావనమూర్తియు నా కగపడిరి. ఇతఁడే సృష్టికర్త యగు బ్రహ్మ. ఈతని దర్శన భాగ్యంబుచే నేను ధన్యనైతిని. శ్రీహరి యాజ్ఞానుసారముగా నెట్లు వర్తింపవలెనో! (యోచించి) శ్రీహరి నుతియే సర్వార్థసిద్ధికి సాధకము. (ప్రకాశముగా)

చంద్రవర్మవృత్తము.

భర్గ పద్మభవ భావిత గుణాసం
వర్గలోల! యపవర్గ వితరణా
సర్గ పుష్టి లయ సాధనకర! స
న్మార్గచార నుత మానిత చరణా! (ధ్యానస్థితయగును.)

బ్రహ్మ—అరరే! ఏమి దీని కంఠమాధుర్యము! రూపము కన్నుల కెంత సమ్మోదదాయకముగ నున్నదో యంతకంటె నతిశయముగ నీమె గానమాధుర్యము నాకు శ్రోత్రపేయముగ నున్నది. శ్రుతివిహితంబులగు నీమె పల్కులు వినినతోడనే కఠినతరయగు

మ ద్వాగ్ధోరణియు మృదులస్వరము నొందుచున్నది. ఈ దివ్యమూర్తియం దెంత ప్రభావము లేనిదే యీభంగి నాలో నింత మార్పుకల్గునా? రూపముఁ గాంచిన తోడనే విజ్ఞానమును, వాక్యంబుల వినినతోడనే వాక్శుద్ధియు నాకుఁ గలుగఁ జేసిన దీనికొక్క సంస్పర్శచే నింక నెంతటివిశేష మేర్పడఁగలదో! (తలయూచి) కాని సౌమ్య తేజోమయం బగు నిద్దాని నే స్పృశింపఁదగునా! (యోచించి) అనునయంబుగఁ గొంచెము సమీపించి చూచెద! (పద్మాసనమునుండి దిగును.)

సరస్వతి—(తనలో) ఈ మహామహుఁడు నన్ను గాంచి, యిచ్చటికి వచ్చుచున్నాఁడు. నా మనంబు లజ్జాకులం బగుచున్నది. (సిగ్గునఁ దలవంచుకొనును.)

బ్రహ్మ—(సరస్వతి సమీపమునకు వచ్చి) దాపునకు వచ్చినకొలంది నీమూర్తి తేజోవిలాస మెంత స్పష్టముగ, భాసురముగఁ గన్పట్టుచున్నది! దీని తనువెంత కోమలం బై యుండునో! కొంచెము స్పృశించి చూచెదఁగాక. (అంటఁబోవును.)

సరస్వతి—మహాత్మా! మన్నించి నిలువఁదగును.

బ్రహ్మ—ఆహా! ఈమె వాక్య మెంత వినసొంపుగ నున్నది. ఈమె నాతో సంభాషించుటచే ధన్యాత్మకుండ నైతిని. (సరస్వతితో) భద్రాకారా! మనోహరమగు నీ రూపమును కనులవిందుగాఁ గాంచితిని, మనోజ్ఞంబగు నీమృదులస్వరంబు వినుచు, నీచెంతనయు చుండుట నాకు సుఖప్రదంబుగ నున్నది సుమా! సుదతీ! నీ వగపడకముందు నిరి యామము లేని యీ మహాంధకార నిహారంబు నేమియుఁ దెలియక కలవరపడు చుంటిని. కాని నిన్ను గాంచినతోడనే యానందాంబుధి దేలుచుంటిని.

సరస్వతి—మహాత్మా! తాము సకల చరాచర సృష్టికార్యంబునకు సమర్థులు. సత్యలోక ప్రభువులు.

బ్రహ్మ—సకల చరాచరమా! సత్యలోకమా! సర్గకార్యమా! అవేమిటివో నే నెఱుంగను. కాని సౌందర్యవనితా! నిన్ను దప్ప నాకవేవియు నక్కఱలేదు.

సరస్వతి—(తనలో) ఆహా! సకల సృష్టికార్యధురంధరుఁడు కాఁదగు నీ మహాత్ముం డెంతగా మాయచేఁ గప్పఁబడి యున్నవాఁడు! ఈతని యజ్ఞానంబును బోఁదోలుట యెట్లు! (యోచించి ప్రకాశముగా) దేవా! ఇంతవరకు తా మాసీను లై యుండిన యా మహా పద్మ నాళాంతరబలంబు నొకసారి పరీక్షింపఁదగును.

బ్రహ్మ—లావణ్యమయీ! దానిలోనేమున్నది?

సరస్వతి—దేవా! అనుచరి వాక్యంబు నాదరింపఁ దగును.

బ్రహ్మ—మంచిది. చూచెదగాక! (పోయి చూచి ఆశ్చర్యముతో) ఓహో! మహాశ్చర్యము! మహాశ్చర్యము! నే నింతవఱకు నిచ్చటనే యుండియు దీనిఁ గాంచనైతినే! సుతనూ! రమ్ము. రమ్ము. నీవుకూడ వచ్చి చూడుము.

సరస్వతి—(చిఱునగవుతో) మహాత్మా! తా మందుఁ గాంచున దేమి?

బ్రహ్మ—నే నిందుఁ గాంచునది యేమని చెప్పఁగలను! దీని లోపల నూహ కందరానంతటి మహాకాశంబును, అట్టి యాకాశమునం దచ్చటచ్చట మెఱయుచుఁ దిరుగుచున్న గోళంబులును గాన్పించుచున్నవి, వానిపైని వింతవింత రూపములు గల వ్యక్తులున్నవి. వానిలోఁ గొన్ని మనలఁ బోలునవికూడ నున్నవి. ఇది యున్నట్టుండక క్షణక్షణమునకు మాఱుచు, నెప్పటికప్పుడు క్రొత్తదగు విచిత్రరూపములతో నతిశయిల్లుచున్నది. ఎంత యద్భుతము! ఎంత చిత్రము! ఇదంతయు నేమిటి?

సరస్వతి—అదియే చరాచరాత్మకం బగు లీలావిభూతి. తమ సృష్టిచే వ్యక్తతఁ గాంచవలసిన బ్రహ్మాండసర్గము.

బ్రహ్మ—ఇదంతయు దీని లోపల నుండుటకుఁ గారణ మేమి?

సరస్వతి—ఆ మహాపద్మము శ్రీమన్నారాయణుని నాభిప్రదేశమునం దుదితమైనది. వెనుకటి మహాకల్పము ముగిసిన వెనుక శ్రీహరియందు లీనమైన సర్వప్రపంచమును ఆ పద్మనాళంబుగుండ తమకిప్పుడు కానిపించుచున్నది. శ్రీహరి సర్వాత్మకుండుకదా!

బ్రహ్మ—శ్రీహరి! అతఁ డెవరు? ఎక్కడ నున్నాఁడు?

సరస్వతి—(తనలో) అకటా! సర్వప్రపంచ సృష్టికర్త కాఁబోవునట్టి యీమహాత్మునకు శ్రీమన్నారాయణునకుఁ గలఁడను జ్ఞానము లేక జడుఁడై యున్నాఁడు. ఎంతటివారైనను శ్రీశుని కరుణకుఁ బాత్రులు కాకుండిరేని యెందుకును గొఱగారు. ఈ మహానీయుని యీదుస్థితినుండి తొలఁగించుటకు నే నేమి చేయఁగలదానను! (యోచించును.)

బ్రహ్మ—లావణ్యమయీ! నా ప్రశ్నకు నుత్తర మీయవేమి? నే ననినదానిచే నీ కేమైన నప్రియమయ్యెనా!

సరస్వతి—దేవా! తమ సంశయములఁ దీర్ప నా కొక సులభోపాయము పొడకట్టుచున్నది. (అంజలిబద్ధ యగుచు) ఇట్లంజలిబద్ధనై దైవస్తుతి యొనర్చు నన్ను తమరు అనువర్తింపవలెను.

బ్రహ్మ—అట్లే! నీవు చెప్పినట్లు చేసెదను.

సరస్వతి } బ్రహ్మ } —(అంజలిబద్ధులై ప్రక్కగా నిలుతురు.)

సరస్వతి } బ్రహ్మ } —

శ్రీవృత్తములు.

శ్రీ రా మే శా!
శౌ రీ! దే వా!
కా రు ణ్యా భా!
సీ తే జా నీ!

స్త్రీవృత్తము.

సా రో, హా రి
స్థై ర్యా, ధా రా!

నారీవృత్తము.

నాగేంద్రా! నాదము
క్షోణీశా! స్మర్తాధారా!

మృగీవృత్తము.

గాంభీర్యాగ్, ధీగుణ్యాత్,
ధీసంధానా!

పంక్తివృత్తము.

ఘోరోగ్ర నిమా నుమాన్య భావా స్థి
స్థాయీ సుశీలో, శాంతాకారా!

సరస్వతి—సీ. సర్వజగత్ప్రభూ! సర్వదేవోత్తమాత్మ!
చిత్రతత్వస్మృతిం దెలంగించినట్టి
ప్రకృతి యాంగిరు నీదు పాదార్చనాలీల
మాయికి సుఖస్థితి నూయ మమ్మొ
క్రమ్మరి సన్మార్గ గమనీయ చైతన్య
విస్మృతి నొందింప ని వ్విధికి సన్నుం
దోసము బంచితి నైన దుస్సాధ్య మి మ్మహా
కార్యంబు మాకు నీ కరుణ లేక

తే. మరవగాహ తమోజాడ్య భరము లైన
మా మనంబుల భవదీయ మహిమ కలన

జ్ఞానశక్తిమయాత్మక ఘనవివేక
భాసురములుగఁ జేయవే పరమ పురుష!

(శ్రీమన్నారాయణుఁడు ప్రత్యక్షమగును.)

బ్రహ్మ—ఓహో! దివ్యదర్శనము! నా యజ్ఞానంబు నశించినది.

సరస్వతి—ధన్యాతి ధన్యుల మైతిమి.

బ్రహ్మ— మత్తకోకిల.

ఏ మహామహు పాదపద్మము లెప్పుడున్ భజియింపఁగా
నీమహత్త్వము, నాత్మసిద్ధియు, నీరశాంతి వివేకముల్
కామితాఖిలసర్వసిద్ధియుఁ, గల్గు నా పరమేశ్వరున్
శ్రీమనోహరుఁ గాంచి ధన్యతఁ జెందె మామక జన్మముల్.

సరస్వతి— తరళవృత్తము.

తొలుత సృష్టము, నిర్వికారము, దుర్గమం బగు మాయలో
పల, నిజాంశము నాదికాశము భవ్యశబ్దగుణంబుగా
కలది సర్వవిహారయోగ్యత నందె నెవ్వని యాజ్ఞమై
తలఁతు నా యఖిలేశు, నవ్యయు, తత్త్వకారణు, నాద్యునిన్.

బ్రహ్మ—సీ. నిత్యవిభూతికి నెలవైన వైకుంఠ
నగర మందిరమందు నాగరాజ
శయ్య నఖిలలక్ష్మీ సౌభాగ్యదైన రమా
నీ ... లు గొలువ
భక్తకోటుల
గప,
శతకో

తే. స

సరస్వతి—ఆజ్ఞాపింపఁబడి, ధన్యాత్మ్యులము కావలయును.

విష్ణువు—కాల మనాద్యంతము. ప్రకృతి నాశరహితంబు. పరతత్వం బవ్యయంబు.

బ్రహ్మ—అవహితుండను.

విష్ణువు—గతకల్పంబున సృష్టిం బొందింపఁబడిన ప్రకృతిని పునస్సృష్టివ్యక్తంబు గావింపవలయును.

బ్రహ్మ—విధేయుండను.

విష్ణువు—వత్సా! నీకు తోడునీడ యగు భార్యగ నుండ సరస్వతి నిర్మింపఁబడియె.

బ్రహ్మ—మఱియు ననుగ్రహింపఁబడితిని.

విష్ణువు—నియమితకార్యంబు నిర్వర్తింపుము.

బ్రహ్మ—తావక కృపాలేశంబు గలుగ నే కొఱంతయురాదు.

బ్రహ్మ
సరస్వతి } —

వనమయూరవృత్తము.

శ్రీరమణ! భూరమణ! చిన్మయవిహారా!
వారిరుహనేత్ర! మునివర్యనుతిపాత్రా!
చారుగుణహార! పదసారఖిల గాఙ్గో
దార పరితుష్ట నిజ దాస పరివారా!

(శ్రీహరి యంతర్ధానుండగును.)

బ్రహ్మ—ప్రేయసీ! శ్రీహరి కృపావిశేషం... ...డనైతిని. మఱియు,

ఆ. శ్రీశు నాభి భాగ్య...
... సృష్టి కర్త న...

దేయా ర్థాంగ

సరస్వతి—విధేయురాలను. నాథా! తా మీ కమలాసనంబుపై నధివసింపవలెను.

బ్రహ్మ—మంచిది. నీ పాణిపద్మంబు సహాయముగా నిట్లిమ్ము.

(ఆశ్వాస్య కరగ్రహణము చేసి, పద్మాసనముపై కెక్కి, ఉభయులును కూర్చుండురు.)

నీ సహాయమునను, పరమేశ్వరుని దర్శనంబునను, నా యజ్ఞానంబు నశించినది. ఇంక సృష్టికార్యంబునకు నియుక్తుండ నగుదును.

సరస్వతి—నాథా! సృష్టి యనంగ సుప్తంబగు ప్రకృతి చైతన్యముతో ప్రబోధము నొందుటకదా?

బ్రహ్మ—అవును. పరమేశ్వరుని యాజ్ఞచే ప్రకృతికి నట్టి ప్రబోధము కొంతవరకుఁ గలిగినది. అనఁగా ప్రకృతి పంచభూతములుగాఁ గొంతవఱకు విడియున్నది.

సరస్వతి—ఈ భూతపంచకము నెట్లెఱుంగనగును?

బ్రహ్మ—చెప్పెదను.

సీ. మొదటి దాకాశ మయ్యది శబ్దము గుణంబు
గలది శ్రోత్రేంద్రియాకలనఁ దెలియు
అల స్పర్శేంద్రియసాధ్య మా స్పర్శగుణముతో
నుండెడి వాయువు రెండవయది
మూడవ దనలంబు గూడి తేజోగుణం
బునఁ జక్షురింద్రియమునఁ గనఁగ
రసగుణాత్మకమౌట రసనేంద్రియంబుచే
గ్రోలఁదగు సలిలంబు నాలుగవది
తే. యైదవది గంధగుణమున నలరుచుండి
ఘ్రాణశక్తి నాఘ చేఁ గెలుగు పృథివి
పంచ భూతంబులును గుణ ప్రకరములును
సాధనేంద్రియములు నివే నళినాక్షి.

ఇట్లు మూలప్రకృతి ఆకాశము, వాయువు, తేజస్సు, జలము అను పంచభూతములుగా విభజింపఁబడి యున్నది. వానికి క్రమంబుగ పంచతన్మాత్రలనఁబడు శబ్ద స్పర్శ రూప రస గంధంబు లయిదును గుణంబులై శ్రోత్ర త్వక్ చక్షు ర్జిహ్వా ఘ్రాణంబు లను జ్ఞానేంద్రియ పంచకంబుచే నెఱుంగఁదగిన వై యుండు. ఆ జ్ఞానేంద్రియంబులకుఁ దోడుగా వాక్పాణి పాద పాయూపస్థలను కర్మేంద్రియంబులును నిర్మింపఁబడియె. వీని నన్నింటి నేలించి కర్మ ఫలానుగుణంబుగ నడపింప మనసు మనోబుద్ధ్యహంకార రూప భేదంబున సాత్త్విక రాజస తామస గుణంబులతోడ నలరుచుండును.

సరస్వతి—నాథా! అనంతరసృష్టి యేది?

బ్రహ్మ—అది మనచే నిశ్చయింపఁబడ వలసియున్నది. ముందుగ నీ యంధకారముఁ బాపుటకై సూర్యుండు సృజింపఁబడవలెను.

సరస్వతి—మీ ప్రయత్నము విజయప్రద మగుగాక.

బ్రహ్మ—(ధ్యానించుచు,)

సీ. మహిత తేజోమూర్తి మాధవాంశ ధరుండు
గ్రహరాజు సంపూర్ణ ఘన బలుండు
నిఖిల జీవత్రాణ నిర్మాణ కిరణుండు
చతురశ్ర పీఠికా స్వర్ణ గేహ
పిత్ర రాజ్య హయ యజ్ఞ శ్రీమ సింహాసన
ఛత్ర తామ్రమణీ నేత్రకారి
బ్రాహ్మణకులపతి పైత్యతత్వ తనుండు
కల్యసత్వాధిక క్షత్రియుండు

తే. సర్వలోక ప్రచారణ జనన దాత
సకలలోక ప్రభాకార సాకరుండు
పద్మమిత్రుండు సూర్యుండు పరమపూజ్యుఁ
డుదయ మగుఁగాక లోకముల్ ముదముఁ జెంద.

సరస్వతి—తథాస్తు.

(సూర్యుఁడు ప్రవేశించును.)

సూర్యుఁడు—పూజ్యులైన బ్రహ్మదంపతులకు నమస్కరించుచున్నాఁడను.

బ్రహ్మ—సర్వాంధకారవిధ్వంసకుఁడగు సూర్యునకు విజయ మగుఁగాక.

సూర్యుఁడు—అనుగ్రహింపఁబడితిని. మన్నియమిత కార్యభారం బుపదేశింపఁబడునుగాక!

బ్రహ్మ—శ్రీనిష్ఠ నాఁటిచే జగముల సృజించుచున్న బ్రహ్మనగు నేను లోకములకు వెలుఁగు నిచ్చుటకై నిన్ను సృజించితిని.

సూర్యుఁడు—విధేయుఁడను.

బ్రహ్మ—తేజోమయంబగు నీ మండలము చుట్టును పరిభ్రమణ మొనర్చునట్టి కొన్ని గ్రహగోళంబు లేర్పడఁ గలవు. వానిపైని వివిధములగు జీవకోట్లు నింపఁబడును. ఈ

యన్నింటికిని కాలక్రమంబుగ తేజస్సును, జీవనమును, కలుషహారములగు నీకిరణముల చేత నొనగూర్చుచుందుము.

సూర్యుఁడు—ధాతా! ఈ ప్రపంచమున కంతకు నామండలమే మధ్యమస్థానమా?

బ్రహ్మ—ప్రపంచమున కంతకును కాదు. నిన్ననుసరించి తిరుగు గోళప్రపంచములకు నీ మండలమే మధ్యమస్థానము. గ్రహగోళములు నీచుట్టు నెట్లు తిరుగుచున్నవో యటులే వానిని వెంటఁబెట్టుకొని నీవు ప్రద్యుమ్న మండలము చుట్టును, మీయందఱను గూడఁ బట్టుకొని యాప్రద్యుమ్నుఁడు అనిరుద్ధ మండలము చుట్టును ప్రదక్షిణము సలుపుచుందురు. ఇట్టి పరంపరకు తుది మొదలు లేదు. సర్వమును శ్రీమన్నారాయణుని యనీకమైయున్నది. ఇఁక నీ కనుచరులుగ నుండు గ్రహగోళాధికార పురుషుల నిదె సృజయించెదను.

సీ. మాతృ గో కృషి సితమణి వృష జల కారి
రాజవైశ్యుండు చంద్రగ్రహంబు
(చంద్రుఁడు ప్రవేశించును)
భాతృ క్షేత్ర నాగణ పర్వత విష కారి
సైన్యనాథుండు కుజగ్రహంబు
(కుజుఁడు ప్రవేశించును)
గణిత వాణిజ్య శంకా యుక్తి ధనకారి
తరుణ శాంతుండు బుధగ్రహంబు
(బుధుఁడు ప్రవేశించును)
బ్రహ్మవిద్యా ధర్మ భక్తి సంతాన సౌ
భాగ్యాధికారి జీవగ్రహంబు
(గురువు ప్రవేశించును.)
వనితా కళా భోగ వర్ష పుష్ప సుగంధ
గానాధికారి శుక్రగ్రహంబు
(శుక్రుఁడు ప్రవేశించును)
హీనసేవాదోష పాపవ్యసన రోగ
నిధి మృత్యుకారి శనిగ్రహంబు
(శని ప్రవేశించును)
తే. మారి దేశాట నోత్పాత కారి రాహు
(రాహువు ప్రవేశించును.)
వఖిల వైరాగ్య మోక్ష దాయకుఁడు కేతు

(కేరువు ప్రవేశించును.)

ఉద్భవించిరి లోకోపయోగముగను
సూర్యమండల సంపరిచర్యులగుచు.

గ్రహములు—ధాతా! సృజింపఁబడితిమి. ఆజ్ఞాపింపఁబడుదుము గాక.

బ్రహ్మ—గ్రహపూరుషులారా!

మ. రవితేజోనిధి యాజ్ఞచే నియత మార్గప్రాప్త సంచార గో
ళవితానాధిపులై పరాత్పరుని లీలానాట్యసంసృష్టి యో
గ్యవిధిన్ మీ బలశీలవర్తనల లోకక్షేమమున్ గోరుచున్
దివిపై ద్వాదశరాసులన్ దిరుగుఁడీ దివ్యప్రభావాఢ్యులై.

గ్రహములు—విధేయులము. విధేయులము.

సూర్యుఁడు—విధాతా! మీ యాజ్ఞ నెఱింగితిని. లోకక్షేమమునకై దినంబుల నిర్మింతు. మా మా మండలంబులకుఁ జెందిన జీవసృష్టిని గూర్చి వివరింపఁ బ్రార్థించుచున్నాము.

బ్రహ్మ—మంచిది. అట్లే వివరింతును. ఆలకింపుఁడు. ఆ సృష్టి రెండు ముఖ్యమగు భేదములు కలది. వానిలో నొకటి స్థూలప్రపంచమునకుఁ జెందినది. రెండవది సూక్ష్మప్రపంచమునకుఁ జెందినది.

సరస్వతి—ప్రాణేశా! ఈ రెంటికిని భేద మేమి?

బ్రహ్మ—దేవగణము మున్నగు దివ్యపురుషులకుఁ జెందినది సూక్ష్మప్రపంచసృష్టి. ఇది ఉత్తమాధమక్రమంబున నేర్పడియున్నది. అట్లగా మీచే నింపఁబడుచున్న వస్తువులు సమున్నతోన్నతంబులగు లోకంబులయందే యుత్తమోత్తములై యుద్భవిల్లును. అట్లు మొదట మహామహులును, ఆ పైని క్రమక్రమముగ మహాత్మ్యము తగ్గుచున్నవారలును సృష్టింపఁబడుదురు. ఇది రెండవదగు స్థూలప్రపంచసృష్టి అధమోత్తమక్రమమున నేర్పడఁగలదు. అనఁగా మొదటగ నిర్జీవతుల్యంబులగు శిలాదులును, వానినుండి వృక్షసముదాయంబులును, వానినుండి జలచరసంతతియు, ఆమీఁద జలస్థలసంచారయోగ్యతకల సకల జంతుసంతానమును గలిగి, నా స్థూలసృష్టిక్రమక్రమాభివృద్ధిలోఁ గూడినదై లోకంబుల నిండును.

సరస్వతి—మహాత్మా! ఈ రెండువిధము లగు సృష్టిమార్గంబులకును భేదము సెలవిచ్చితిరి. వీనికిఁ గల పరస్పర సామరస్యము కూడ నానతీయవలెను.

బ్రహ్మ—సూక్ష్మప్రపంచములోని ప్రతివ్యక్తికిని స్థూలప్రపంచమందు ఉపాధి యనఁబడు దేహ మొకటి యుండును. ఆ దేహము క్రమక్రమాభివృద్ధి నొందుటకు సూక్ష్మ

ప్రపంచవ్యక్తి సాహాయ్యపడుచుండును. ఇఁక నీ సూక్ష్మప్రపంచవ్యక్తి ధర్మార్థ కామ మోక్షము లను కర్మానుగుణముగా ననుభవించుటకు స్థూలదేహమే సాధన మగును. ఇదియే యీ రెండువిధము లగు సృష్టిప్రక్రమంబులకు ను గల సామరస్యము; కావున నిప్పుడు జీవలోకజనకులుగా నుండఁదగు మహాపురుషుల సృజించెదను. (ధ్యానించి)

తే. అకలుషాత్ములు, హరిభక్తు, లమల చరితు,
లఖిల వేదార్థవిజ్ఞాను, లఖిలలోక
సంచరణ దక్షులును, తపస్సత్వ బలులు,
ఘనులు సనకాదు లుదయంబు గాంత్రు గాక!

సరస్వతి—తథాస్తు!

(ప్రవేశము:—సనక, సనత్కుమార, సనత్సుజాతాది బ్రహ్మమానసపుత్రులు.)

సనకాదులు—

సమానీవృత్తము.

సార హీన జన్మ రుజా
దూర హారి శాంతి గనన్
శ్రీ రమేశు నెంచి మనో
వైరి రాజిఁ గెల్వ వలెన్.

(అనుమఁ బ్రవేశించి) వాణీహిరణ్యగర్భులకు నమస్కారము.

బ్రహ్మ—సనక సనందనాది మన్మానసపుత్రులారా! శ్రీహరి యానతివొప్పున ప్రజాసృష్టికిఁ బూనుకొన్న నేను మిమ్ములను ప్రజాభివృద్ధి యొనర్చుటకు సృజించినాఁడను.

సనకాదులు—ఓ వాణీనాథా! తండ్రీ! మన్నించి యీ మహాకార్యభారమునుండి మమ్ముఁ దొలగింప వేఁడెదము.

ఉ. శ్రీహరినామసంస్మరణ సేయుచు, లోకములెల్ల పావనం
బౌ హితరీతి, సత్తపమునందుఁ జరింతుముకాక యిట్టి దు
ర్మోహకరంబుఁ బాపమయమున్ గనుభీకరమైన సంసృతి
వ్యూహమునందుఁ బోరఁ జన నోపుదు మెంతయు నబ్జసంభవా!

సరస్వతి—నాథా! తమ వచనానుసారముగ నుద్భవించిన మానసపుత్రు లగు నీ సనక సనందన సనత్కుమార సనత్సుజాతులు నల్వురును కేవల సత్వమూర్తులు. వారికి సంసృతిపైఁ గోర్కి యుండదు.

బ్రహ్మ—(ధ్యానించి) అట్లయినచో కేవల రాజసమూర్తుల సృజించెదను.

తే. పూర్వ చరితులు, హరిభక్తి నీతి పరులు,
రాజసాత్మ్యులు, కామినీ రాగ మతులు,
వీర్య బలులు, ప్రజాపతుల్, శౌర్య ధనులు,
వారి సతులును జన్మంబు వడయ వలయు.

(ప్రవేశము:—మరీచి, అత్రి, అంగిరసాది ప్రజాపతులు; వారి సతులగు, కళ, అనసూయ, స్మృతిలోనగువారు)

మరీచ్యాదులు—వాణీశహిరణ్యగర్భులకు నమస్కరించుచున్నాము.

బ్రహ్మ—అంద ఱాసీనుల రగుఁడు. (ప్రజాపతులు ఆసీను లగుదురు.)

ప్రజాపతులు—వాణీశా! మమ్ము సృష్టించిన కారణము సెలవీయుఁడు.

బ్రహ్మ—ప్రజాపతులారా!

శా. మీరా? ప్రాజ్ఞులు వీర్యసద్బలయుతుల్, మీచెంత నుత్కృష్టి యీ
నారీరత్నములా? పరిగ్రహణ మాన్యాకార యోగ్యానుసం
చారంబుల్ గలవారు; మాకు వలయున్ సమ్యక్ ప్రజాసంతతుల్,
కారే సాయము బ్రహ్మసృష్టికి; రమాకాంతుండు మి మ్మేలెడిన్.

మరీచి—వాణీశా! తావక వచన విధేయులమై వర్తింపఁదగిన మ మ్మింతగాఁ గోరవలయునా! కాని యనుకూలదాంపత్యంబున కనుమతి యిరుతెఁగులనుండి రావలయునుగదా?

సరస్వతి—ప్రజానాథులారా! నిజమేకదా.

కళాదులు—'వినఁ దలంచుకొని, అమ్మా! సరస్వతీ! నీవే యానతీయఁదగును.

సరస్వతి—(అవధరించి బ్రహ్మతో) నాథా! లజ్జాస్వభావము గల యబల లంతకంటె విపులముగ నెట్లు సమ్మతిఁ దెలుపఁగలరు?

బ్రహ్మ—అస్మత్కార్యం సిద్ధి నెరవేరినట్లే. పరమసంతోషము. పరమాహ్లాదము. ఇఁక కోట్ల కొలఁదిగఁ బ్రజాసృష్టికిఁ గొదవ యుండదు. ఇఁక కాలచక్ర విభాగానుసరణిగ సృష్టి జయప్రదముగఁ గొనసాగఁగలదు.

సూర్యుఁడు—వాణీశా! కాలవిభాగంబునుఁ గూర్చి తాముముందుగ నొక్కింత వివరింపవలెను.

అందఱు—మే మందఱమును నదియే వినఁగోరుచున్నాము.

బ్రహ్మ—(ధ్యానించి) పరమాత్మ కాలశరీరి యని చెప్పఁబడును. కావున కాలంబు పరమాత్మ వలె నాద్యంతరహితం బని యెఱుంగనగు. ఐనను లోకవ్యవహారార్థమై మనమన చేష్టావకాశంబులం బట్టి దాని విభజింపవలయు.

ఆ. కన్ను మూసి తెఱచు కాలంబు క్షణమాను;
కల్ప మగును సృష్టి కలిగి యణఁగ;
కాల మాన మందుఁ గల కొలందియు గొప్ప
లివియ; నసమ నెన్నొ యేండ్లు కడచు.

నా నుడివిన ప్రకారము నిమేషాది మహాకల్పాంతకాలంబును ఆయాప్రజ లాయాప్రదేశానుగుణంబుగ ననేకరీతుల విభజించి, దానికి భిన్నభిన్ననామంబు లుంపఁగలరు. అది యెట్లున్నను, దానిముఖ్యవిభాగం బిట్లుండఁగలదు.

సీ. నేల చుట్టు నొకసారి తిరుగు నేగోళ మం
దుండు వారల కది యొక్క దినము
తన కక్ష్యపై సూర్యు దిరిగిచుట్టఁగ నొక్క
వత్సరం; బదియె దేవతల దినము;
నలువదిమూఁడు లక్షలు; వేలు నిర్వది
యగు వత్సరములు మహాయుగంబు
లవి వేయి నిండఁగా నగు పదునాల్గు మ
న్వంతరములు; నాకు నదియె పగలు;

తే. సంతదగు రాత్రి నాకు; బ్రహ్మాండసృష్టి
నాదు రాత్రుల నిలుచు; దినముల నడచు;
నట్టి దినరాత్రివర్షంబు లరుగ నూఱు
నాకు పరమాయు వగును సుశ్లోకులార!

నా పరమాయుః ప్రమాణకాలంబే మహాకల్పం బనఁబడు. ఇట్టి మహాకల్పము లనంతములు. మహాకల్పకాలాయుః ప్రమాణుఁడ నగు నావంటి బ్రహ్మ లనేకులు శ్రీ పరమేశ్వరుని లీలావినోద సర్గకార్యంబుకొఱకు నిదివఱకుఁ గల్పింపఁబడిరి. ఇంకను గల్పింపఁబడఁగలరు. మఱియు ప్రతి కల్పంబునందును.

తే. సాధువులఁ బెంపఖలులను సంహరింప
ధర్మసంస్థాప్య మొనరింప ధర భరింప
ఘనదయామతి యుగయుగంబునను బుట్టు
దేవతానత పాదుండు శ్రీవిభుండు.

అందఱు—అద్భుత మద్భుతము. కాలవిభాగమూలమును గూర్చి వాణీనాథుని వాక్యములు విని ధన్యులమైతిమి.

బ్రహ్మ—శ్రీశు నానతిని మీ కెఱింగించుటచే నేను మత్కార్యంబు నెఱవేర్చినవాఁడ నైతిని. ఇంక మీ రందఱు చని మీ మీ కార్యంబుల నెఱవేర్పుఁడు. కొనసాగెడి కాలచక్రంబు క్షణమైనను నిలువదు. ఇక్కడ నొక్క క్షణమైన నితరలోకంబుల యుగశతములు గడచుచుండును. నే నింక వివిధ ప్రపంచ సృష్టికార్యంబునకుఁ గడఁగ వలయు. భానూ! నీ వేగి, గ్రహముల నియత మార్గ వర్తులఁగా నొనరించి, తద్బల సాహాయ్యంబున లోకవాసుల నెల్లర సంరక్షింపుచుండుము.

మరీచి—వాణీశా! ఒక విజ్ఞప్తి. గ్రహములకును నీ యాదేశంబున జనింపనున్న ప్రజాకోటికిని గల యన్యోన్యసంబంధము ను గూర్చి యొక్కింతయైనఁ దెలియ వలదా?

సూర్యుఁడు—ఇందుఁ దెలియుట కేమికలదు. ప్రజలు గ్రహబలాధీనచర్యు గలిగి వర్తింపవల సినవారే కదా!

మరీచి—అది కొంతవఱకు సత్యమే. కాని పురుషప్రయత్నము వ్యర్థమే యనఁదగునా?

సూర్యుఁడు—వ్యర్థముకాక మతేమియగును? పురుషప్రయత్నమను నది కేవలము భ్రమము. సర్వమును కాలనియామకుల మగు గ్రహచారాధీనమై యున్నది.

మరీచి—ఆ సిద్ధాంతమునకు మాత్రము మా చిత్తంబు లంగీకరించుట లేదు. ఏలయన పురుషప్రయత్నమున కవకాశమే లేక ప్రజాజీవితముయొక్క దినచర్యయంతయుఁ గేవలముగ గ్రహచర్యాధీనంబే యగుదో ప్రజలకుయుక్తాయుక్త విచార జ్ఞాన సమర్థంబగు జ్ఞానేంద్రియపంచకం బేల ప్రసాదింపఁబడవలయు? దీనికి వినియోగం బెచ్చట? శాస్త్రంబుల ప్రయోజనం బేమి? కావునఁ బ్రకృతియందుఁ బురుషప్రయత్నావకాశంబును గల దని విశ్వసింపక తీరదు. ఈ యుభయశక్తుల సమన్వయంబును, బలాబలంబులును తీర్మానింపఁబడవలసియున్నది. ఓ వాణీశా! ఇది యిప్పుడు విచారణీయాంశ మగుచున్నది.

బ్రహ్మ—భవ్యులారా! ఈమహావిషయమును గూర్చి యిప్పుడు తర్కించు టెందులకు? కాల క్రమంబుననదియే నిర్ణీతము కాఁగలదు. మీర లేగి మీ మీ పనులను జూచుకొనుఁడు.

మరీచి—వాణీశా! మేము జీవలోక జనకులము.........

సూర్యుఁడు—మేము జీవకోటి చారిత్ర నియామకులము.

మరీచి—ఇట్టి యిరుతెఱఁగులవారమును బరస్పరసానుభూతితో వర్తించినచో బ్రపంచ ధర్మమును గొనసాగింపగలుగుదుము కాని, యిట్టిమహద్విషయంబులఁ గూర్చి భేదాభిప్రాయులమై యుంటిమేని యెట్లు కొనసాగింపఁ గలుగుదుము.

బ్రహ్మ—ఏమునులో, నా వచనము నాలింపరుగా! ఈ మహాసమస్యార్థ మిప్పుడేల తర్కించెదరు.

సూర్యుఁడు—సమస్యార్థమున మహత్వ మందుటచేతనే తమను కోరవలసివచ్చెను. స్వల్పాంశములగునెడ మాలో మేమే తీర్మానించుకొనఁగలుగుదుము గదా.

బ్రహ్మ—(కోపముతో) వాగ్వాదములతో సృష్టికార్య నిర్వహణమునకు అంతరాయముఁ గలిగింతురా? శాంతమూర్తులై యీ సనకాదులును, రాజస స్వభావులై ప్రజాపతులును, వాగ్వాదపరులై గ్రహపూరుషులును, నాకు సహాయులగుటలేదు. కేవల తామసునే సృజించి మీ సంశయముల నన్నిటిని తీర్తును.

(ధ్యానించి)

కం. బలవంతుఁడు సక్రోధుఁడు
విలయకరుం డిష్టరూప విభజిత తనువుల్

సరస్వతి—నాథా! శాంతింపవలయును. శాంతింపవలయును. తాము తలంచు మూర్తి లోకంబులన్నింటిని నశింపఁజేయు మహాతామసిగా వ్యక్తిగాంచుచున్నాఁడు.

(తెరలో రౌద్రధ్వనులు వినఁబడును.)

(అందఱును భయమున నిల్తురు.)

బ్రహ్మ—ఓహో! ఈ మహాతామసమూర్తి యుద్భవించి నన్నే మ్రింగుటకు వచ్చుచున్నట్లున్నది. ఆలసింపఁ జనదు. ఈ మహాభీకరమూర్తియొక్క పౌరుషమునం దించుక స్త్రీత్వమును జేర్చుట సమంజసము. (అనుకంపముతో)

లలితాంగి, దుర్గ, శాంభవి,
యలఘు కృపాహృదయ జనన మందఁగవలయున్.

(అర్ధనారీశ్వరుఁ డగు శివుఁడు రౌద్రాకారముతోఁ బ్రత్యక్షమగును.)

అర్ధనారీశ్వరుఁడు—ఆః! ఆః! పద్మోద్భవా! భ్రమ పరాధీనమనస్కా! నన్ను సగ మాఁడది యగునట్లు సృజించి, రాఁగల వీరలోకంబుచే నవ్వించెదవా! ఇట్టివాఁడవీ సర్గకార్యం బెట్లు నిర్వహింపనేర్తువు. చూపుము, నాచే సంహరింపఁబడఁదగిన లోకములేవియో! లెమ్ము! త్వరగ! అట్లుచూపవేని నిన్నే నాకోపమున కాహుతిగాఁ జేసికొందును.

సరస్వతి — (అర్ధనారీశ్వరునకు నమస్కరించుచు.)

సీ. హైమవతీనాథ! యఘనివారక! శూలి!
పన్నగభూషణ! భక్తవరద!
వృషభరాడ్వాహన! విశ్వమం దేవేళఁ
బాపవిషవ్యాప్తి ప్రబలి, ఖలులు
పురవార మాక్రమింతురు క్రొవ్వి, యవ్వేళఁ
గల్మషవిలయాధికారి యగుచుఁ
గ్రాలు నీ మూఁడవకన్ను మంటలు రేఁగఁ
దగుఁగాని నీ మిత్రతతులమైన

తే. మము విరోధింపఁగా నేల! మానితాత్మ!
నిజసతీ సమ్మ్రదాశ్లేష నిరత సౌఖ్య

భాగ్య మిచ్చినఁ గోపమే బ్రహ్మపైని
నెయ్యముం గూర్మి తిగునుగదయ్య యీశ!

అర్ధనారీశ్వరుఁడు—(పార్వతీభాగము తెలియకుండునట్లు వేషము మార్చి) పావనీ! సరస్వతీ! మృదువులగు నీ సౌమ్యవాక్యములకు సంతసించి శాంతుండనైతిని. పద్మోద్భవా! కార్యకారణసంబంధము అమోఘమైనది. సృష్టికర్తవగు నీవు విభ్రమంబున నన్ను అర్ధనారీశ్వరునిగాఁ జేసిన కారణంబున, నింక నీచే సృజింపఁబడు ప్రతివ్యక్తి యందును, అర్ధనారీశ్వర ప్రకృతి లీనంబై, ప్రచ్ఛన్నంబై యుండఁగలదు. మరియు వాణీశా! మదీయసృష్టికిఁ గారణమైన నీయకాలకోపంబునకుఁ గారణమే నెఱుంగుదును.

గ్రహపూరుషులు—(తమలో) నీతఁడు మాపైఁ గోపించునాయేమి?

బ్రహ్మ—దేవా! ఆ కారణ మెఱుంగుదునేని దానికిఁగూడఁ గారణంబగు నీప్రజాపతులయొక్కయు, గ్రహపూరుషులయొక్కయు, సంశయ విచ్ఛేదమొనర్పుము.

ప్రజాపతులు—(తమలో) ఈతఁడు మమ్మే విచ్ఛేద మొనర్చునేమో!

అర్ధనారీశ్వరుఁడు—(చిఱునగవుతో) సర్వవిచ్ఛేదకున కయినను సంశయవిచ్ఛేదము సులభము కాదు. మఱియు సంశయనివారణకు స్వానుభవమే ప్రబలమగు సాధనము. తరువాతగాని పరులు చెప్పు సమాధానములు సమంజసములుగాఁ దోఁచవు. కావున గ్రహపూరుషులారా! ప్రజాపతులారా! మీర లుభయులును దీనిఁగూర్చి యొకపన్నిదముఁ జరుపుకొని, లక్ష్యలక్షణవిధానమున మీవివాదాంశమును దీర్మానించుకొనుఁడు.

గ్రహపూరుషులు }
ప్రజాపతులు } —దేవా! తద్విధానమును గూడఁ దామే యానతీయవలెను.

అర్ధనారీశ్వరుఁడు—భవ్యులారా! అట్లేని వినుండు. ప్రజాపతులగు మీరు కొందఱు భూమిపై మానవజన్మంబుల నవతరించి, కేవలమానుష శక్తి నేదేని దుర్ఘట సత్కార్యసాధనకై వినియోగించి వ్యక్తిస్వాతంత్ర్యమే బలవత్తరమను మీ వాదమును జయప్రదము గావించు కొనుటకై ప్రయత్నింపుఁడు.

ప్రజాపతులు—విధేయులము.

అర్ధనారీశ్వరుఁడు—గ్రహపూరుషులారా! మీరు గ్రహబలాధిక్యవాదులు. కావున వేఱుగా జన్మంబు లెత్తనావశ్యకము లేదు. ఆకాశమున సంచరించుచు నీ ప్రజాపతులే కార్యమునకు అధికోత్సాహముతో బూనుకొందురో దానిని మీ గ్రహచార బలంబుచేతఁ బ్రతిఘటించి, మీగ్రహబలాధిక్యవాదమును స్థిరపఱుచుటకై ప్రయత్నింపుఁడు.

గ్రహపూరుషులు—వినతులము.

సరస్వతి—గౌరీశా! సంశయవిచ్ఛేదమార్గములలో స్వానుభవవిధానమును గూర్చి సెల విచ్చితిరి. ఇఁక సమాధానప్రక్రియను గుఱించి కూడ నొకింతయానతీయ వేఁడు చున్నదానను.

అర్ధనారీశ్వరుఁడు—పూజ్యతమా! నిన్నుఁ బోలు పావనియగు నొక స్త్రీవ్యక్తియే, యీ ప్రక్రియను నిర్వచింపఁగలదేమో! భావికాల మెట్లుండునో నేనుమాత్రము నిర్ణయింపఁ గలనా? అయినను ముందుగ స్వానుభవసంబంధ మగు ప్రయత్నమును వీరలు కొన సాగించిరేని తరువాత సమాధానవిధానమును, సంసిద్ధి కాఁగలదు. గ్రహపూరుషులారా! ప్రజాపతులారా! ఈ పద్ధతి మీకు సహింపదేని సర్వసంశయనివారక మగు (శివశూలాయుధమును జూపి) వే ఱొక మార్గమును మీకుఁ జూపి తీరుదును.

గ్రహపూరుషులు, ప్రజాపతులు—మహాత్మా! తమ వచనానుసరణిగ నన్యోన్య ప్రతిఘటనకై ప్రయత్నింతుము.

బ్రహ్మ—లెస్సగాఁ బలికితిరి. ఈ ప్రయత్నముయొక్క పర్యవసానముగా నొక యుత్కృష్ట ధర్మము సాధింపఁబడనున్నది. కావున నీ కథ వినోదజనకముగను, లోకోపయోగ కరముగను వర్ధిల్లుఁగాక.

అర్ధనారీశ్వరుఁడు—మఱియు దీని పర్యవసానము అన్యోన్య ద్వేషజనకముగా నుండక జ్యోతి ర్విశేషములను దెలుపునట్టి లీలగా పరిణమించునుగాక.

సరస్వతి—కావున నీలీల జ్యోతిర్లీలగాఁ బెంపొందుఁగాక.

గేయము.

పన్నగభూషణ! భక్తజనావన! పాపవిశోషణ! గిరినిలయా!
నిన్నుఁదలంప లభించు శుభావహ నిర్ణయముల్ శివ! భవతరణా!
సన్నుతచారిణి! సాధ్వసకారిణి! శక్తి! మహేశ్వరి! గిరితనయా!
మన్ననసేయు ముమా! సతి! శాంభవి! మత్తఖిలాసురవగవిలయా!

(అని సరస్వతి వినుతించుచుండఁగా తెర దిగును.)

ప్రథమాంకము సమాప్తము.

శ్రీ

జ్యోతిర్లీల.

ద్వితీయాంకము.

ప్రదేశము:—భచక్రము.

[ప్రవేశము:—తారలు. మేషాదిరాసుల క్రమంబున అశ్విన్యాది నక్షత్రపాత్రలు తమ తమ రాశినామములఁ దెల్పు నర్ధచంద్రపతాకలను బట్టి, చుట్టు నాట్యముసేయుచుండగా తెర నెత్తఁబడును.]

తారలు:— కళకరగడ.

శ్రీరమేశు కాలపురుషు చిద్విలాస గేహమైన
భూరి శింశుమారచక్ర పూత శీర్షరమ్యమైన
పుణ్యమూర్తి ధ్రువకీర్తి బుధనుత ప్రభావృత్తైన
గణ్యమాన మాన మాన గమన సుమన సాధ్యుఁ డైన
ధ్రువుని సప్తదేవమునుల, కోడి సురల నెల్ల వేడి
రవి శశి గురు లాదిగ గ్రహ రాజ రాజి నెల్లఁ గూడి
కడఁగి మేష వృషభ మిథున కటక సింహ కన్యక లన
నడగు తులయు కీట చాప మకర కుంభ మీనము లన
పదియు రెండు రాసులందు భానుఁ జుట్టి యంబరమున
"తధిమిత" యని యిర్వదేడు తారలాడు సంతసమున.

(నాట్యము చాలించి)

అశ్విని—తారామణులారా! ఈనాఁడీ మేషరాశియందు కొండొక కార్యార్థమై గ్రహపూరుషు లందఱును సమకూడ నున్నారని కదా మన మందఱమును మనమన నక్షత్ర మండలంబులనుండి, యంశమూర్తులఁ దాల్చి, యిందుఁ జేరితిమి. భరణీ! వారి యాగమనమునకై సర్వంబు సంసిద్ధముగ నున్నదా?

భరణి—ఉన్నది.

కృత్తిక—ఇదిగో కేతువు నిదే వచ్చుచున్నాఁడు.

[ప్రవేశము. వెనుకకు నడచును కేతువు.]

రోహిణి—పలువురును నవ్వునట్లు వెనుకకు నడచెద వేమి?

కేతువు—సృష్ట్యాదినుండి యెన్ని యుగములింతకుఁ గడచెనో అప్పటినుండియు నభోవీథిపై రాహువును, నేను, వెనుకకు నడచుట కలవాటు పడితిమి కదా. ఇపుడు క్రొత్తనడక యెట్లువచ్చును? కాని యిది మేషరాశియేనా?

అశ్విని—ఏరాశియో నక్షత్రములఁ జూచి గుర్తింపలేవా?

కేతువు—నక్షత్రము లాయా చోట్లఁ గదలక యుండునప్పుడే రాశివిభాగము చేయఁజాలక నేను కలవరపడుచు దారితప్పకుండుటకై మా యన్నయగు రాహువునకు సూటిగ చుక్కయెదురుగ నడచుచుందును. ఇఁక మీ రింత యిక్కడ గుమిగూడి కలసిమెలసి గంతులువేయుచు నాట్యము త్రొక్కుచుండఁగా నేరాశి యెక్కడనో గుర్తుపట్టుట బ్రహ్మకైన తరమనుకొంటిరా!

భరణి—రాశిశీలములఁ బట్టియైన గుర్తించి జ్ఞప్తికిఁ దెచ్చుకొనలేవా?

కేతువు—ఏమో. నాటకము నడుప బూటకపు టట్టతల తగిలించుకొని వచ్చితిని గాని తలలేని నాకు చదువుట కోపికయు, మెదడుండ కంటియుండదగిన జ్ఞాపకశక్తియుఁ గూడ నున్నదనుకొంటిరా? అదిగాక సహజము వైరాగ్యచింతయు, మోక్షాపేక్షయుఁ గల నాకు ప్రాపంచికవిషయములందు బుద్ధి నిలుచుటయెట్లు? (తల గోకుకొని) పోనీ. ముందుగ ఈరాశిని గూర్చి చెప్పుఁడు. ఇంకపై మఱవక జ్ఞప్తియందుంచుకొనెద.

అశ్విని—అట్లే చెప్పెదను. ఇదిగో. మొదట నశ్వినినగు నేనును, భరణియుఁ, గృత్తికా పాదంబుతోఁ గలిసి మేషరాశియగుదుము. తరువాత కృత్తిక మూఁడుపాదంబులును...

కేతువు—ఆఁగు మాగుము. నా కొక్క సందేహము కలిగినది. ఒకటిన్ని మూఁడున్నా ఏడా, ఎనిమిదా?

కృత్తిక—ఇదేమి గణితము? ఏడును గాదు. ఎనిమిదియుఁ గాదు. నాలుగు.

కేతువు—(వ్రేళ్లతో లెక్కించి) సరియే. ఒప్పెదను. పోనీ! కృత్తికా! ఆప్రకారమైన మేషంబున నొక్కపాదంబును వృషభంబున మూఁడు పాదంబులును గల నీకు నాలుగు కాళ్ళుండి తీరవలెనే! కడమ రెం డెక్కడ దాఁచియుంచితివి?

కృత్తిక—ఉత్తమాంగ మగు తలయే లేని నీవు హస్తములనుఁ గూడ కాళ్లుగా లెక్కించుకొనుము.

అశ్విని—కేతూ! ఈనాఁడు మిగుల మందబుద్ధివై యుంటివేమి? ఇక్కడ నాల్గు పాదము లనఁగా నాల్గు భాగము లని యర్థము. ప్రతి నక్షత్రము నాల్గు భాగములుగా విభజింపఁబడినది. ఇఁక రాశిశీలముల వినుము.

అశ్వినియు, భరణియు, కృత్తికాపాదంబును గలిసి మేషరాశి యగును. అది రక్తవర్ణము, అగ్నితత్వము, రాత్రి బలము, తూర్పున కాధిపత్యము, పృష్ఠోదయము, కాలపురుషశీర్షత్వము, పాదజలము, స్థిరత్వము, క్రూరస్వభావముఁ గల పురుష రాశి. ఇది రవికి ఉచ్ఛస్థానము. శనికి నీచ. గురుచంద్రులకు మిత్రము. శుక్రునకు సమము. బుధునకు శత్రుత్వమును గలది. దీనికి కుజుఁ డధిపతి!

కేతువు—ఇట్లు అన్నిరాసుల నుండునా?

అశ్విని—ఉండును.

కేతువు—ఇన్ని విశేషము లొక్కొక్క రాశికే యుండునెడల అన్నిరాసుల శీలభావములు చెప్పినచో నాటకమాడవచ్చిన నేనును, చూడవచ్చిన యీ ప్రేక్షకులును గూడ పారవులము కావలసివచ్చునే. రాశి శీల వివరముల పట్టిక తయారుచేసి నల్లవేసి యొప్పగించెద. కాని నాకొక్క సందేహము తోఁచుచున్నది. గ్రహములకు మిత్రత్వ సమత్వము లని, యుచ్చ నీచ లని యేమో యంటివి. ఈ శత్రుత్వ మిత్రత్వాదులు గ్రహముల నెత్తి గీతల మహిమయా, కాక గృహాధికారిణులైన మీలో మీకేమైన నాంతరరహస్యసందర్భము లున్నవా?

కృత్తిక—(కోపములో) చంద్రవదనల మైన మమ్ము గుర్తెఱిఁగి మాటాడుము.

కేతువు—చెంపలు వైచుకొందును. నా యర్థమది కాదు.

అశ్విని—(నవ్వుచు) కృత్తికా! వాని మాటలకేమి! కేతూ! నీసందేహము వాపెద వినుము. ఏ చోటికి కే గ్రహము చేరునప్పుడది నిలువుగఁ బ్రసరించు సునిశిత కిరణకాంతినిచ్చునో యా చోటా గ్రహమునకు ఉచ్చస్థలము. మిక్కిలి యేటవాలుగఁ బ్రసరించు దుర్బల కిరణములు కలుగు చోటు నీచస్థలము. కిరణప్రసార మనుకూలముగ నుండు చోటు మిత్రము. సమముగ నుండు చోటు సమము. వ్యతిరేకముగ నుండుచోటు శత్రుస్థానము. ఇప్పుడు తెలిసినదా?

కేతువు—ఇంతేనఁటమ్మా! దీనిలో నేవియో చిక్కు సందర్భము లున్నవని తలఁచితిని. మొత్తమునీఁద నక్షత్రము లెన్నియుంటివి?

అశ్వని—నక్షత్రముల సంఖ్య యనంతము. ఐనను రాశివిభాగంబుకొఱ కేర్పడినవారము మే మిరువదేడుగురము.

కేతువు—అట్లు నియమించుట సృష్టికర్త గ్రహములమగు మాపై దయదలఁచి సుమా! మీ యిరువదేడ్గురనే చుట్టి తిరిగివచ్చునరికే కా ళ్ళీడ్చుకొనిపోవును. ఈ యసంఖ్యాకంబు లగు నక్షత్రముల కన్నింటికి బలాదూరు తిరుగుచున్నచో గ్రహాధికారమున కొక్క నమస్కారము చేసి, వేఱుదారి పట్టవలసినదే.

కృత్తిక—కా ళ్ళీడ్చుకొనుచుఁ బదునెనిమిది సంవత్సరములకుఁ గాని రాశిప్రదక్షిణ మొనర్పఁ జాలని నీ కక్ష్యామార్గము మాత్రము సులభగమ్యముగా నున్నదా యేమి?

కేతువు—ఏమో! నాకు దేవుఁడిచ్చిన నిక్కబల మాపాటిదే. అశ్వనీ! ఒక్క విషయము నిన్ను చాలదినములనుండి యడుగఁదలఁచితిని. అడుగునెడఁ గోపము రాదుకదా.

అశ్వని—రాదు. అడుగుము.

కేతువు—రాజ్యాధిపత్యము విషయములో ఛాయాగ్రహముల మగు మా కొక్క గొప్ప లోపము జరుగుచున్నదమ్మా!

భరణి—ఏమది?

కేతువు—సూర్యచంద్రుల కొక్కొక్క రాజ్యాధిపత్యమే యైనను రాజగ్రహము లగుటచే వారి కిన్ని కోట్ల నవ్యాహతముగ జరిగిపోవును. తక్కినవారలకు పరిధి కామూల నొకటి, ఈమూల నొకటి చొప్పున భూలోకప్రభులకు వేసవి చలి బంగళాల వలె రెండేసి యిండ్లు కలవుగదా! మాకొక్క పంచయైన నిలుపకపోవుటకు మాచే మీకు అంత యపకార మేమిజరిగినది?

కృత్తిక—గ్రహరాజంబగు సూర్యుని, మా యందఱకును ప్రాణవల్లభుండైన చంద్రుని గ్రహణమిషచే మీరు బాధించుచుండుట మాకు ప్రీతికరమే యనుకొనుచుంటివా!

కేతువు—అది పురాతన సందర్భమమ్మా. క్షీరసాగరమథనమునాఁటి వైర మిప్పటికిని మాలో రగులుచున్న దనుకొంటివా యేమి? అది వట్టి లోకాపవాదము. ఛాయాగ్రహముల మగు మాచేత ఎమ్ముపుష్టి, రక్తపుష్టి గల గ్రహములు బాధింపఁబడుట యెట్లు? ఆ మహారాజులకు మేము వంగివంగి వందనము లిడుదుమే. వెనుకఁ బోవుచున్నను మా నీడ వారిపైఁ బడక మానదు. ఏమిచేయుమందువు?

అశ్వని—అది యట్లుండనిమ్ము. సంభాషణలో సందర్భావశ్యకతను మఱచుచున్నాము. కేతూ! నీవు పాకశాలాధికారివి. గ్రహపూరుషులకు ప్రియమగు వంటలఁ జేయింప వలెను. వారి వారి రుచిభేదములనైన జ్ఞప్తియందుంచితివా?

కేతువు—ఎంత తెలివితక్కువవాఁడైనను తిండికి మెండుకాకుండునా? గ్రహపూరుషుల రుచి పదార్థములఁ జెప్పెదను వినుఁడు. రాజగు సూర్యుఁడు పైత్యతత్వముఁగల గ్రహము. కావున నతనికి చేదుకారముల రుచి కలిసిన గోదుమధాన్యముల వంటకమునందు ప్రీతి. వాతశ్లేష్మశరీరి యగు చంద్రుఁడు మెత్తనివాఁడు. ప్రియభార్యలైన మీరలు ఉప్పుడుబియ్యము పెట్టినను నాతఁడానందించును. కుజునకు పైత్య మతిశయించుటచేఁ గాఁబోలు మంచి చేదుకందులైనగాని నెమరునకు రావు. వాతపిత్తశ్లేష్మములు మూఁడును ప్రకోపించి యుండుటచేతఁ గాఁబోలు బుధునకు కాంతాభిరుచి పూజ్యమైనను ఖాదనంబున మాత్రము షడ్రస గ్రహణ పారీణతా పాండిత్యము మెండు. గురువుగారికి సనుమ శ్లేష్మము కొంచె మభివృద్ధిమైనది. కావున పంచదార పానకములో నానవేసిన సెనగలు పెట్టించిననే కాని రోగము నివృత్తి కాదు.

కృత్తిక—వంటలరుచినుండి వైద్యమునకు దిగితివేమి? వంటలరుచికిని వైద్యమునకును చాల దూరమే.

కేతువు—దూరమైననేమి? నా వైద్య మైహికాముష్మికములకు రెంటికిని బనికివచ్చునది.

కృత్తిక—అవును. నీ కైహికము. రోగి కాముష్మికము.

కేతువు—మఱియు మోక్షకారకుఁడ నగు భిషఙ్మణిని. నా చేతి మాత్ర వైకుంఠయాత్రయే. అది ధూమకేతు సహస్ర తుల్యమైన పటుత్వముఁ గలది యని యెఱుఁగవు? తరువాతఁ జెప్పనిండు. సంతత శృంగారరసానుభూతిచే వాతశ్లేష్మాభివృద్ధియై, పైత్య మడుగంటి, పండ్లు పులియుటచేఁ గాఁబోలు పాపము శుక్రుఁడు మెత్తగ నుడికిన అలచందలు మాత్రము చప్పరింపఁగలఁడు. శనిగానికి నవనాడుల వాత మతిశయించుటచే మంచి వగరైన కషాయముతో మెదిపిన తిలల పిండము గాని గొంతు దిగదు. ఇఁక మాయిద్దఱను గూర్చియు మీయిష్టము. కాని రాహువునకుఁ గొందెము అనుముల పిండియు, నాకు చేరెఁడు ఉలవచారును మాత్రము పోయింపుఁడు.

అశ్విని—చాలుఁజాలు. నీయుపన్యాసము బాగుగనేయున్నది. నిన్న వంటకములఁ జేయింపుమని వేడుకకొంటిని. మీ మీ యిచ్ఛానుసారముగ నిదివఱకే యిందు సర్వము సంసిద్ధము చేయఁబడినవి. గ్రహపూరుషులు వచ్చు సమయమైనది.

రోహిణి—అందఱకంటె ముందుగ ప్రాణేశ్వరుండు తన చల్లని కిరణంబుల వెదచల్లుచు వచ్చుచున్నాఁడు.

కృత్తిక—కేతూ! నీ వామూల నొదిఁగి కూర్చుండుము. నీ నీడ యీమహాపూరుషు పాదంబులనైన సోఁకరాదు.

కేతువు—ఇప్పుడు నా నీడ యూరనిపైఁ బడదు. అందుకు సమయాసమయములు లేవను కొంటివా!

అశ్విని—సోదరీమణులారా! నాథుని కెదురేగుదము. రండు.

[ప్రవేశము:—చంద్రుడు.]

చంద్రుఁడు—సతులారా! సమకూర్పఁబడిన ముత్యముల వరుసవోలె కన్నుల కానందంబుఁ గొల్పుచున్నారు.

అశ్విని—నాథా! సతీపతు లొండొరుల సాన్నిధ్యంబుచే నలరువారుకదా?

చంద్రుఁడు—కాంతలారా!

శా. తారానాథుఁడ తారలందును లసత్సంపూర్ణ దివ్యప్రభా
తారుణ్యంబున నెల్లవారలకు మోదంబుం బ్రసాదించు సం
చారాధీశుఁడ సత్కవుల్ కృతుల; నయ్యానంద సామోదయా
చేరిక్ గొలుపారు మీ తనుకు లే కేహొంను దీపించిరే.

మ. పరమాత్మ్యుండు నిజాంశచే వెలుఁగుచున్ భక్తావళీ సన్నిధిన్
వర సంద్రష్టనుఁడై వెలుంగు; ఘన శోభాస్ఫారమా హీరమున్
గరమొప్పంగ దంచుట్టు రత్నకములుం గల్గంగ; ధీమంతుఁడౌ
పురుషుండుం గను రాజిలున్ నిజసతీ పుణ్యప్రభాయుక్తుఁడై.

అశ్విని—నాథా! మాపైఁ గల యనురాగవిశేషముచే నట్లు సెలవిచ్చితిరి. కాని తమ చల్లని వెలుఁగునకు మా సహకార మెంతటిది!

చంద్రుఁడు—ఎంతటిదియైన నగును. అది యట్లుండె. కాని నేఁడు మనకుం గల కార్యక్రమంబు చెప్ప మఱచితిని. నేఁడు మేషరాశికి గ్రహపూరుషు లందఱును విచ్చేయుదురు.

అశ్విని—ర మ్మాటంబుచే ఫలింపనున్న విశేషాంశ మానతీవలయు.

చంద్రుఁడు—అదియే చెప్పనుంటిని. తొల్లి సృష్ట్యాదిని బ్రహ్మసభలో నర్ధనారీశుని సమక్షమున ప్రజాపతులకును, మన కధినాథుండైన సూర్యభగవానునకును, దమలో నెవరి శక్తి బలవత్తర మనుటనుగూర్చి యించుక చర్చ జరిగినది.

రోహిణి—నాథా! తేజోనిధియగు సూర్యభగవానునకును, ధీమంతులైన ప్రజాపతులకును స్వల్పులకుంబోలె వాగ్వాద మెంచుఁబడుట ఉభయులుం ద్రికాలవేదులేకదా.

చంద్రుఁడు—రోహిణీ! నా పల్కొక్కటి జ్ఞప్తియం దుంచుకొనుము. ఎంతటి విజ్ఞానులకైనను కానిమ్ము. కాలకర్మపాశంబులకుం గట్టువడి వ్యక్తావ్యక్త జ్ఞాన వేషభాషల నటింపక తీరదు.

కం. ఎంతటి ధీమంతు లైనం
గాంతా! కడవంగ లేరు కర్మవిపాకం
బెంతను సాధనమాత్రుల
మంతయుఁ బరవశము; కారణాధిపుఁ డెవఁడో.

కం. కాల నియామకులము గ్రహ
పాలుర మే మెల్లఁ గాల కర్మ వశత మా
పాలిటి దిఙ్మార్గములన్
దేలుచు బొంగరములట్లు తిరిగెద మెపుడున్.

కం. జీవుల సుఖదుఃఖములన్
మావలనన్ గాదు సేయ; మా మా గతులున్
శ్రీవిభుని యధీనము లగుఁ
గావున మన కేల కార్యకారణకథల్?

కానున్న కార్యక్రమము ప్రకృత సంభాషణ సందర్భమునకు నుదాహరణము కాఁగలదు. కావున నేను మా గ్రహకూటంబునఁ జర్చింపఁబడు విషయములఁ బూర్తిగఁ జెప్పనిందు. అట్లానాఁడు శివునియొక్కయు, బ్రహ్మయొక్కయు సమ్ముఖమున్న రవియు, ప్రజాపతులును పై యర్థమునే తేటపఱుప వాగ్వాద మొనరించిరి. ప్రజాపతుల వాదమును బరిపూర్తిగ నోడింపఁ దగు నుపాయంబును బన్నుటకై నేఁ డిన్ని గ్రహము లిందుఁ గూడనున్నవి. గ్రహరాజుల యాగమనమునకై సర్వ మాయితముగ నున్నదా!

అశ్విని—ఉన్నది.

చంద్రుఁడు—అదిగో గోళాధిపు లందఱు నేతెంచుచున్నారు. సతులారా మనమేగి యాతిథ్య మునిచ్చెదము రండు.

[ప్రవేశము:—కుజ, బుధ, గురు, శని, శుక్ర, రాహువులు.]

చంద్రుఁడు—గురువర్యా! విచ్చేయుఁడు. నెయ్యులారా! రండు. కుమారా! బుధా! త్వరితగతిఁ గలిగియు ముందుగ రాక ఆలసించితివేమి? రాహూ! సందియపడకుము రమ్ము. కేతూ! ఇంతవఱకును నిన్నుఁ జూడనైతినే!

కేతువు—చూడఁబడుట కేను నిజబలశీలములు గల గ్రహమునా? అన్ని పీడలలో నిది యొక పెద్దపీడ.

చంద్రుఁడు—(స్వగతము) మూల నొదిగెద వేల! ముందునకు రమ్ము. మోక్షకారివి. భవ్యులారా! అందఱును లోనికి విచ్చేసి గృహంబు పావన మొనర్పుఁడు. (తారలతో) కల్యాణులారా! మీరు వేగి లోన విశ్రమింపుఁడు. సూర్యాగమనమున నర్ఘ్యాదులం గొనిరా వచ్చును. (తారలు నిష్క్రమింతురు) పావనమూర్తి యగు భానుం డింత తడయుటకుఁ గతం బేమై యుండునో?

గురువు—ఇప్పుడే రాఁగలఁడు.

శని—నిండుపున్నమనాఁటి నీ సౌరు తాను డాసిన సమావాస్యయందువలె ఖిలమగు నని సందియపడెనేమో.

బుధుఁడు—అవాచ్యము లాడకుము. పూజ్యుండగు మత్పితరుని భవ్యతేజంబు ఖిలమగుటయేమి! సూర్యమండలాభిముఖ మగు గోళార్ధంబుఁ బ్రకాశించుచుండును. వంకరచూపు గల కొన్ని గోళంబుల కది కొంతయే కనిపించును.

చంద్రుఁడు—బుధా! తొందరపడెద వేల? శనీ! మనమునందే గాక మాటలయందును వక్రత గల మా బుధుని పలుకుల పాటింపకుము. భాను నాలస్యమునకుఁ గారణ మేమంటివి?

శని—ఏమియు లేదు. ఆలస్య మాధిక్యమునకు సూచకకదా.

కుజుఁడు—అట్లైన నందఱికంటె నెక్కుడ మందగతి గల నీ వత్యధికుఁడవా?

శని—కయ్యమున కెప్పుడును కాలు ద్రవ్వుచు సమయమునకు స్తంభించియుండు నీవే యధికుఁడవు లెమ్ము.

శుక్రుఁడు—గ్రహములారా! ఏల వాదులాడెదరు? సూర్యచంద్రులనుఁ దప్ప మన కందఱకును వక్రచలనమో, వంకరచూపో, వింతస్వభావమో, వ్యత్యస్తకరణమో, ఏదియో, యొకటి కొలఁదిగనో గొప్పగనో యుండియేతీరెనది. మొదట నడక చూడుఁడు. గురువును, నేనును, బ్రాహ్మణులమే. సమానగౌరవము గలవారమే.

గురువు—(లోనలో) రాక్షసుల నాశ్రయించి బ్రతుకు నీతఁడు నాకు సమానుఁడా?

శుక్రుఁడు—అయినను ఆతఁడు ఒక్కొక్క రాసియందు సుమా రొక్కసంవత్సరంబు వంతున పదునొకండు సంవత్సరముల, మున్నూట పదుమూఁడు దినములకుఁ గాని సూర్యప్రదక్షిణము చేయఁడు. నేనో ఒక్కొక్కరాసిని నెలలోపుననే దాఁటుచు, రెండువందల యిరువదియారు దినములకే పరిధిని చుట్టిరాఁగలను. కుజుఁడు ఒక సంవత్సరము మూఁడువందల యిరువదియొక్క దినములకు పండ్రెండురాసులును దిరుగును. చంద్రకుమారుఁడైన బుధుఁడు............

బుధుఁడు—నన్నుఁ గూర్చి నేనే చెప్పుకొందును. సూర్యమండలంబునకు మిక్కిలి దగ్గఱగ నుండు పరిధి మార్గంబున నేను ఎనుబదియెనిమిది దినములకే పండ్రెండు రాసులను తిరుగఁగలను.

శుక్రుఁడు—శని యిరువది తొమ్మిది సంవత్సరంబుల నూట యిరువదియేను దినములకు తన తండ్రియగు భానుని ప్రదక్షిణము సేయును. రాహుకేతువులు నక్షత్రయుక్తినొక్కొక్కఁడు చుక్క యెదురుగ వెనుకనడకతోఁ బదునెనిమిదివత్సరములకుఁ బండ్రెండురాసులను చరింతురు. చంద్రుఁ డిరువదియేడు దినములలోనే పండ్రెండురాసులను గిఱ్ఱునఁ దిరిగి వచ్చును. దానికిఁ గారణములు లేకపోలేదులెండు.

చంద్రుఁడు—దనుజగురూ! ఆ కారణము లేవి?

శుక్రుఁడు—ఏవా? ఇటు వినుము.

సీ. ఇరువదేడ్గురు కూర్మి యిల్లాండ్ర సమరీతి
దినమొక్క తారఁగాఁ దనుపుటకునో
మింట వేలుపుజంట లంటి క్రీడలఁ జొక్క
సుధ నింపి, తమిఁ బెంపఁ జూచుటకునో
తన మండలంబున మను పితరుల కెల్ల
గమనంపు వేసటఁ గజపుటకునో
వెనువెంటఁ గబళింపఁ జను రాహుకేతువుల్
చేర రాకుండంగఁ బాఱుటకునో

చంద్రుఁడు—గీ. కావు కావివి నిజమగు కారణములు
తెలఁగి నేఁ జనియెడుకక్ష్య చిన్నది సుమి,
కక్ష్య లిటు చిన్నపెద్దవౌ కారణమున
గలిగె భేదంబు మా గమన గతులయందు.

గురువు—గమ్యమానం బగు మార్గంబుల దవ్వు చావు లట్లుండఁగా స్వభావసిద్ధములగు మంద తీవ్ర గమనభేదంబులు మనకు వేవందువా?

శని—మీలో నావంటి కుంటికాలివాఁ డున్నప్పుడు లేకేమి? గురువరా! గ్రహముల దృష్టి భేదములఁ గూర్చి చెప్పరేమి?

గురువు—సూక్ష్మదృష్టియు వాక్చాతుర్యమును గలిగి, కవియగు రాక్షసగురువర్యుఁడే గ్రహంబుల దృష్టిభేదంబులఁ గూర్చి యుపన్యసింప సమర్థుఁడు.

శుక్రుఁడు—(తనలో) నా యేకాక్షిత్వమునుఁ గూర్చి యపహసించుచున్నాఁడు. కానిమ్ము. (ప్రకాశముగా) తారానాథుండును......

గురువు—ఆ!

శుక్రుఁడు—తారానాథుండును, రవియు, రాజగ్రహము లగుటచే వారికి దిక్చక్రమున కీవల నుండి యావలవఱకు నిశ్చలమగు నెదుటిచూపు సప్తమరాశిపైఁ బ్రసరించుచుండును. ఇఁక నొక్కకన్నుగల నాకును, ఒక్కటే సూటియైన చూపు. అదియు సప్తమరాశిపైనే ప్రసరించును. నిజముగ రాజానుమతముగ మన కందఱకును సప్తమరాశివీక్షణ మున్నదిలెండు. కాని మనలోఁ గొందఱు ప్రక్కచూపులవారును, ఓరగంటిసైగలవారును లేకపోలేదు.

కుజుఁడు—ఎవరువారు?

శుక్రుఁడు—ఎవ్వరనినవారే! కుజా! ఒక్కమాట నడిగెదను. నిజము వచింపుము. క్రౌర్యప్రకృతిఁ గల క్షత్రియగ్రహమవు కదా! నీకు తిన్నని సప్తమదృష్టితోపాటు నాల్గవయింటి పార్శ్వవీక్షణమును, ఎనిమిదవయింటి దూరావలోకనమును ఎందుకు?

కేతు—వ్యభిచార కారకుఁడు............

కుజుఁడు—నోరు మూయుము.

కేతు—తలయే లేని నేను నో రెట్లు మూయుదును?

కుజుఁడు—పోనిమ్ము. ఆకాశకాహళము వంటి కుత్తుక కొక ధూమకేతువు నడ్డము వేసికొనుము. శుక్రాచార్యా! నా చతుర్థాష్టమ దృష్టులకుఁ గారణము చెప్పెదను వినుము. రణవిజయ కారకుఁడ నగు నేను—

రాహువు—కలహకారకత్వము కాని విజయాధికారము నీకెక్కడిది? అది నా వంతు.

కుజుఁడు—ఛాయాగ్రహమ వగు నీ వేగ్రహముతోఁ జేరెదో వాని ననుసరించుటయే కాక నీకొక్క యధికారము వేఱుగ నున్నదా? ఊరకుండుము. శుక్రాచార్యా! అట్లు రణకారి నగు నేను వ్యూహ నిర్మాణ నిర్వహణమందు కొంచె మీవలనావలఁ జూచుటకు పార్శ్వ సమ దీర్ఘ దృష్టులు ఆవశ్యకములుకావా?

శుక్రుఁడు—ఏమో! కొంతవఱకు సహేతుకముగనేయున్నది. కాని బృహస్పతికి సప్తమదృష్టితోపాటు పంచమ నవమ దృష్టు లెందుకో!

గురువు—నిజమగు కారణము నాకే తెలియదు. కాని యిట్లుండు నని తలంచెద. విద్యాకారకుఁడ నగు ముసలివాఁడను. కావున నిరత గ్రంథావలోకనచే పార్శ్వంబగు పంచమరాశిదృష్టియు, ముదుసలితనముచే నవమ దూరదృష్టియు సంఘటిల్లెనేమో.

శుక్రుఁడు—కాని శనిగా! నీకుఁ దృతీయ దశమ దృష్టు లెందుకురా?

శని—అదేమి? "శనిగా" "రా" అని నీచేఁ బిలువఁబడుట కంత తక్కువవాఁడనా!

శుక్రుఁడు—బానిసవగు నిన్ను నట్లు పిలువు మనెదవు;

శని—అట్లయిన చండాలగ్రహ మగు రాహువును "రాహుగాఁడా" యనలేదేమి!

రాహువు—అట్లనినచో శుక్రుని మంచికన్ను చిదుకఁబొడిచి, నీ మంచికాలిని విఱుగఁదన్ననా!

చంద్రుఁడు—ఆఁగుఁ డాఁగుఁడు. గోళాధికారులకుఁ దగని ధోరణిగ సంభాషింపఁ దగునా? గురువర్యా! లోకవ్యవహారమున కావశ్యక మగునట్లు మనలో మనకు భేదము లున్నను వైషమ్యరహితులమై యుండునట్లు తాము సెలవొసంగవలయు.

గురువు—అవును. తత్త్వభేదము గల వస్తువు లుండుట లోకధర్మము. కావుననే మనలో మన కనేకభేదములు కలవు. అది భగవత్సంకల్పము. అట్టివానిని లోపములుగ నెన్నుకొనరాదు. ఇంక నీ ప్రసంగములఁ గట్టిపెట్టుఁడు. మన కందఱకును రాజైన సూర్యభగవానుఁడు విచ్చేయుచున్నాఁడు.

చంద్రుఁడు—(కెలవంకఁ జూచి) అశ్వినీ! అర్ఘ్యమాల్యాదులఁ దెప్పింపుము.

(తారలు అర్ఘ్యాదులతోఁ బ్రవేశింతురు. సూర్యుఁడు ప్రవేశించును.)

తారలు—సీ. మంగళంబు ఖగోళ మహారాధి విభునకు
మంగళం బమిత భా మండితునకు
మంగళం బారోగ్య మార్గ ప్రదాతకు
మంగళం బమల పతంగునకును
మంగళం బబ్జ సమ్మాన తేజస్వికి
మంగళంబు తమ స్సమాపకునకు
మంగళం బఖిల సన్మౌని వందితునకు
మంగళం బుదయార్ఘ్య మానితునకు

గీ. మంగళంబు సంజ్ఞా సతీ మనసఖునికి
మంగళము పుణ్యజన లభ్య మండలునకు
మంగళంబు త్రిమూర్త్యంశ సంగతునకు
మంగళం బభ్రమణి కిదే మంగళంబు.

(తారలు అర్ఘ్యాదుల నిచ్చెదరు.)

సూర్యుఁడు—గురువర్యులారా! వందనములు.

గురువు, శుక్రుఁడు—విజయోస్తు.

సూర్యుఁడు—మిత్రమా! చంద్రా! నీ తారలకును నీకును శుభంబేకదా? గ్రహగోళ పాలకులారా! మీకును క్షేమమా!

చంద్రుఁడు—సకల శుభ ప్రదాత వగు నీవు రాజుగానుండ శుభంబులకేమి కొఱఁత?

సూర్యుఁడు—మంచిది. నేఁటి మన గ్రహసమావేశంబునకు అంతయు సంసిద్ధముగనున్నదా?

చంద్రుఁడు—తమ రాకయే సర్వార్థసిద్ధిప్రదము.

అశ్విని—భవ దుచ్చస్థానం బగు మేషరాశి మహాపీఠము నలంకరింపవలయు.

సూర్యుఁడు—అశ్వినీ! అటులే చేసెద. (పీఠంబు నెక్కి) అంద ఱాసీనుల రగుఁడు.

(అందఱును ఉచితాసనములఁ గూర్చుండురు.)

సూర్యుఁడు—మన మండలము కొంతకాక కార్యార్థమై నేఁడు అంశమూర్తులఁ దాల్చి ఇందొక్కచోఁ జేరితిమి. గురువర్యా! నేఁటి సభాప్రయోజనమును గూర్చి నిర్వచింపుఁడు.

గురువు—రాజాజ్ఞ తెలంగున వర్తించెద. గ్రహగోళాధిపతులారా! లోకచారిత్ర నియామక దివ్యావతారులారా! నియతప్రచారవేగంబుల మీ మీ కక్ష్యలయందు అతులిత తేజంబునం బరగు తామందఱు నేఁడిక్కడకు విచ్చేయుటకుఁ గతంబు మీ రిదివఱ కెఱింగినదే. అయినను కార్యకారణ సందర్భ వివరణము, లక్ష్యసాధన ప్రయోజక మగును. గావున రాజు నానతి శిరసావహించి వివరించెద. మునువరకిదా సృష్ట్యాది కాలంబున మనకును ప్రజాపతులకును స్వత్వ పరత్వ సామర్థ్యములం గూర్చి బ్రహ్మ సభలో జరిగిన వాదంబు. అర్ధనారీశుని విజృంభణము. అప్పటినుండి నేఁటికిఁ గోట్ల కొలందిగ సౌరాబ్దంబులు గతించినవి. శివునియానతి నొప్పున బ్రజాపతులు తమ ప్రతిజ్ఞా పరిపాలనమునకై భూలోకమునం జన్మించి గ్రహబలముకంటె వ్యక్తిస్వాతంత్ర్యమే యధికమను తమవాదమును స్థిరపఱుప వలసియున్నది. అట్టి భూలోక మదిగో. (తెలవంకఁ జూపుచు.)

సీ. సౌమ్యానిలవ్యాప్తి జలదసంఘావృత్తి
 సమజలస్థలపూర్తి సకలజంతు
సంతానజీవన వంతమై, కుజశుక్ర
 పథముల నడుమను పరిధిఁ గల్గి,
ఘనవేగమున దేవదినమున కొకసారి
 సూర్యమండలమును చుట్టి తిరిగి,
తేజరిల్లు ధరిత్రి నంబుఁ ద్రిసహస్రయోజన
 మధ్యమంబు హిమోష్ణమానితంబు
గీ. గలిగి, చిత్రవర్ణస్ఫూర్తి నలరు నదిగొ;
మానవావళీ ధీప్రభా మానితంబు,
దివ్యతమ ధరా దేవతా ధిష్ఠితంబు,
మహిత పుణ్యప్రదంబు, భూమండలంబు.

మా ని నీ వృ త్త ము.

మండలభూమికి మధ్యమునందున
 మాన్యహిమాచల దక్షిణమం
దుండెడి కానన వృక్ష చయంబుల
 నొప్పెడి పర్వత పంక్తులపై
నుండి నదీనివహంబులు పాఱ స
 ముజ్జ్వల సస్య సమృద్ధిమెయిన్
బండు మహాజన జీవనయోగ్యము
 భారతవర్షము హర్షదమై.

శని—హిమంబుచే గొప్పవారెయో, వేడిమిచే గుబగుబ పొగలుసేగిరో, యుంకుస్పెలోకములకధిపతులమగు మనకెల్ల నట్టి ప్రదేశము హర్షనమనుటకంటె నమర్షనమనుటయే సరి.

సూర్యుడు—కుమారా! గురువుల వాగ్ధోరణి కడ్డురాకుము. గురువర్యా! తరువాత సెలవిండు.

గురువు—ఆభూమండలంబున నార్యధాని యనంబడు భరతఖండభాగమే మానవసృష్టి కాదిమస్థానంబును, ధర్మప్రాశస్త్యంబు గల కర్మభూమియు నను వారెరు నాదేశంబు మీకు విదితంబే. అట్టి చోట.

గీ. ఆది మానవ నిర్మాణ మగుట మొదలు
నరిగె నేటికి చాతుర్యగానుసరణి
ధర్మపరివర్తనము పెక్కుదార్ల; నిపుడు
లోపనియమంపు కలివేర దాపురించె.

చం. యుగయుగధర్మనర్తనల నొంది, మహాజను లెందఱెందఱో
విగత సమస్త కిల్బిష నివిక్త మనంబుల జీవితంబులన్
నిగమ నియామ మార్గపర నిర్మల వర్తనులై తరించి; రా
జగ దుపకార చేతనుల జన్మఫలంబు నుతింప శక్యమే?

ఉ. ఈ కలివేళఁ గాయ హృద యేంద్రియ పాటన మల్ప మూర్వి పై
నేకడ; నైన కస్తురిపయించిన వస్త్రముభాలి నార్యధా
నీ కమనీయ భూమి యది నేటికిఁ గాంచును పౌరుషాఢ్యులన్,
శ్రీకర కర్మయోగ వరసిద్ధి నిబద్ధుల, దేశభక్తులన్.

సూర్యుడు—గురువరా! ప్రజాపతులు తమ ప్రయత్నపరీక్ష కిట్టి యార్యధానినే తగు ప్రదేశముగాఁ దలంచిరా?

గురువు—అవును. ఆర్యధానియందు వింధ్యపర్వతములకు దక్షిణపార్శ్వమందుఁ గల దక్షిణాపథంబున నిప్పుడు కాకతిరాజ్యంబు అత్యున్నతదశయం దున్నది. ఈ హిందూరాజ్యనృపాలుర శాస్త్రానిలాషకారణంబుగా నిఖిలవిద్యలు నక్కడ వర్ధిల్లుచున్నవి. కావున నాప్రదేశమే తమకు సమయపాల నోచిత స్థానంబుగాఁ దలంచి, ప్రజాపతు లిప్పుడు తమ ప్రయత్నంబు నచ్చట ప్రారంభించిరి.

బుధుడు—ఆ ప్రయత్న మెట్టిది?

గురువు—వసిష్ఠప్రజాపతి భాస్కరుం డను నామంబుఁ గల విప్రుఁడుగా ఆర్యావర్తంబున జనించి, యధికోత్సాహముతో జ్యోతిర్విద్య సాధించెను. కళ యను ప్రజామాత

యా భాస్కరాచార్యునకు లీలావతి యను కూఁతురుగ జనించి, తండ్రికడ విద్య నభ్యసించి, జ్యోతిర్విద్యావ్యాపనమున నాతనికిఁ దోడగుచున్నది.

సూర్యుఁడు—జ్యోతిర్విద్యను సాధించుట ప్రజాపతుల వాదమున కెట్లు సహకారమగును?

గురుఁడు—గ్రహబలముకంటె వ్యక్తిస్వాతంత్ర్యమే బలవత్తర మను నంశమును మానవజన్మము ధరించి రూపింతుమనికదా వారి ప్రతిన; అట్లు మనబలము నతిక్రమించుటలో ముందుగా మన శీలముల నెఱుంగుటయే వారి ప్రథమప్రయత్నము కాఁగూడదా!

సూర్యుఁడు—మన బలశీలముల నెఱింగి, వారు చేయునదేమి?

గురుఁడు—మన బలశీలముల గుఱించిన రహస్యంబుల లోకంబునకు వెల్లడిచేయుటయే వారి యుద్దేశము.

చంద్రుఁడు—మన శీలబలాదులఁ దెలియఁజేయు జ్యోతిర్విద్యను లోకంబున వ్యాపింపఁజేయుట మనకు సంతోషకరమగు కార్యము కాదా?

గురుఁడు—అది పరిస్థితులను బట్టి యుండును. అనఁగా మనలను గూర్చి సంపూర్ణ విజ్ఞానము గలవారు మన కనుకూలురును, భక్తులును నై, అట్టివారిచే జ్యోతిర్విద్య వ్యాపించుచున్నచో మనము సంతసింపవలసినదే. కాని మనకుఁ బ్రతిస్పర్ధు లగువారు జ్యోతిశ్శాస్త్ర మభ్యసించునపుడు వారు దాని నేయుద్దేశముతో నేర్చుచున్నారో యోజింపవలదా? రంగుటద్దములగుండఁ జూడఁబడునప్పుడు స్వచ్ఛతేజంబును మలినముగఁ గాన్పించును. అట్లే మన ప్రతికక్షుల బోధనలచే లోకంబున వ్యాపించు జ్యోతిర్విషయంబులు మనయెడల నెట్టి దురూహలఁ బుట్టింపగలవై యుండునో యెవరు చెప్పఁగలరు.

చంద్రుఁడు—అట్లు దురూహలు మనయెడలఁ బ్రజలకుఁ గలుగునట్లు చేయుట ప్రజాపతుల వాదమున కేమి యుపయోగము?

గురుఁడు—చెప్పెదను. మన శీలబలాదులను బూర్తిగ నెఱుంగువారికి, మన బలమునుండి తప్పించుకొను మార్గములు కూడను తెలియక పోవు. అట్లు తెలిసికొనువారు మన భక్తులేని మన కరుణచే నట్టి యవకాశము కలిగెనని తలఁచి మనల నభినందింతురు. కాని ప్రతికక్షు లట్లు తలంపక తమశక్తిచే నట్టి యవకాశము లేర్పఱుచుకొంటి మని గర్వింతురు. ఈ రెండవయూహయే లోకమునఁ బ్రబలునేని యెండకు గొడుగు వేసికొనునట్లు గ్రహబలంబుల నన్నింటిని సులభంబుగ నివారింపఁగల మను దురూహ లోకమున వ్యాపించును. జనులు మనలఁగూర్చి యట్లు తలంచుట ప్రజాపతుల వాదమునకు గెలుపువంటిదే కదా!

చంద్రుఁడు—కావున వారొనర్చు జ్యోతిర్విద్యావ్యాపన ప్రయత్నమునకు మనము ప్రతికూలురుగా నుండవలెననియే తమయాదేశమా?

గురువు—అంతియగాక మనకు ప్రతికక్షు లగుటచే వా రేప్రయత్నము నధికోత్సాహముతో పూనుకొనెదరో దానిని మనము ప్రతిఘటించి మన ప్రతిఘటనము నతిక్రమించుచు వారు తమ ప్రయత్నము నెంతవఱకు కొనసాగింపఁ జాలుదురో పరీక్షింప వలయునని, అర్ధనారీశుని యానతిగదా!

సూర్యుఁడు—అదియే నాయభిప్రాయమును. ఇఁక మన పరీక్షావిధానమును నిర్ణయించుటకు ముందుగా వారి ప్రయత్నవివరంబు లెట్టివో పూర్తిగ నెఱుంగవలెను.

గురువు—అవును. వినుఁడు. భాస్కరాచార్యుని ప్రయత్నమగు జ్యోతిష రహస్య వ్యాపన కార్యంబునకై మయాచార్యకృతంబు లగు కొన్ని జ్యోతిషగ్రంథంబుల నతఁడు సాధింప మిగుల నుత్సాహియై యున్నాఁడు.

శని—దనుజశిల్పియు, రావణుని మామయు నగు మయుండను రాక్షసుండు ఈ మన సూర్య భగవానుని గూర్చి తపం బొనరించి పడసిన వరంబులచే నిఖిల ఖగోళవిజ్ఞాన సంపన్నుం డయ్యెనని విందుము. అతఁడు రచించిన గ్రంథములేనా యివి?

శుక్రుఁడు—అట్లే! ఘనకార్యసాధనలో మా రాక్షసులే యధికులు.

గురువు—(తీవ్రముగా) కావుననే పవిత్రము లగు దేవరహస్యముల గోప్య గౌరవమును భంగపరుపనున్నారు.

శుక్రుఁడు—అదెట్లు?

గురువు—ఎట్లా! చెప్పెద వినుము. పవిత్రములును దివ్యులే యెఱుంగఁదగినట్టివియు నగు జ్యోతిశ్శాస్త్రరహస్యములను మయుండు తా నెఱుఁగుటతో తృప్తిఁజెంది యూరకుండక ఆ మర్మంబు లన్నింటిని గ్రంథస్థములుగాఁ జేసినాఁడు. మఱియు నట్టి యుద్గ్రంథంబులను దనుజలోకమునఁ దనయొద్దనైన భద్రపఱుపక ఆ భూలోకమునందు తాను తపంబొనర్చిన యాశ్రమంబు చెంగట బిలంబున నిక్షిప్తములుగా నొనరించినాఁడు.

సూర్యుఁడు—ఇది భస్మాసురుని చరిత్రమును జ్ఞప్తికిఁ దెచ్చుచున్నదే! తరువాత!

గురువు—కాలక్రమంబున నా మయాచారి యాశ్రమప్రాంతముననే త్రిలింగదేశరాజధాని యగు ఏకశిలానగర మేర్పడినది. మయుఁడు గ్రంథంబుల దాఁచిన బిలప్రదేశంబు పై నిప్పుడొక కాళికాలయం బున్నది.

కుజుఁడు—ఈ కాళికాలయ మా నగరములో నున్నదా?

గురువు—లేదు. ఏకశిలానగర ప్రాకారమునకుఁ గొంచెము దూరమున నున్నది.

బుధుఁడు—కోట వెలుపల నుండు దేవళములో నిట్టియుద్గ్రంథము లింతకాల మెవ్వరికిని జిక్కక భద్రముగ నెట్లుండెను?

గురువు—ఈ యాలయము కోటవెలుపల నున్నను, త ద్రాజ్య పాలుర కభిమాన దైవత స్థలము. కావున భద్రముగ సేవింపఁబడుచున్నది.

శుక్రుఁడు—ఆ రాజులైన నీ గ్రంథములఁ దీయించుటకు ప్రయత్నింపలేదా?

గురువు—అందుల కేదియో సమస్యావిధానమగు ప్రతిబంధకమున్నట్లు తెలియుచున్నది. ఏది యెట్లున్నను ఆ యాలయంబులోని గ్రంథంబులు సాధించుటకై భాస్కరాచార్యుఁడు తన కొమార్తెయగు లీలావతితో దక్షిణాపథంబునకు వచ్చి—

శని—ఇట్టి గ్రంథము లక్కడ నుండుట భాస్కరాచార్యుం డను మానవుఁడుగా పుట్టిన వసిష్ఠ ప్రజాపతి యెట్లెఱుంగఁగలిగెను?

గురువు—ఇట్టియుద్గ్రంథంబు లా యాలయమున నుండుటను వార్త హిందూదేశమంతట ను వ్యాపించినది. ఇట్టి గ్రంథంబులను సాధించు పట్టుదలతో భాస్కరాచార్యుఁ బుట్టిన వసిష్ఠప్రజాపతి కొంతకాలమునకు తన కొమార్తె యగు లీలావతీపరిచయమూలంబున కాకతిరాజ్య పట్టభద్ర యగు రుద్రాంబామహారాజ్ఞ నాశ్రయించి, యామెయనుజ్ఞ చేఁ గాని తనకు లభింపని పూర్వోక్తగ్రంథములకొఱకు ప్రయత్నించుచున్నాఁడు. ఆంధ్ర సామ్రాజ్యలక్ష్మి యగు రుద్రాంబామహారాజ్ఞికి కల్యాణ మింకను కాలేదు. త్వరలో కానున్నది. ఆమె కల్యాణసమయమునఁ గాని యీ భాస్కరాచార్యునకీ గ్రంథ ములు లభింపవు. మన ప్రతిఘటనముల నతిక్రమించి భాస్కరాచార్యు యీ గ్రంథము లను రుద్రాంబాదేవి సాహాయ్యమునఁ బడయఁజాలెనేని ప్రాకృతుల వాదమునకు విజయ మేర్పడినట్లే యెంచఁదగును. సూర్యునానతిచే దివ్యదృష్టి నెక్కువగ వినియో గించి ఈ వివరము లన్నియు నేనారయఁ గల్గితిని కావున మన మీ యవసరమున నెట్లు ప్రతిఘటింపవలెనో యాలోచించి ఖగోళపాలురు తీర్మానింతురుగాక!

సూర్యుఁడు—గ్రహపూరుషులారా! వింటిరికదా గురువర్యుల యుపన్యాసమును!

గ్రహములు—వింటిమి.

సూర్యుఁడు—ఇఁక మనము సలుపవలసిన ప్రతిప్రయత్నమును గూర్చి యొక్కొక్కరుగ సెల విండు. కేతూ! నీ యభిప్రాయ మేమి?

కేతు—తలలేనివాని కాలోచన కూడనా! మఱియు శల్య మాంస రక్త చర్మ పటుత్వములు గాని, వివిక్త శీల బలాదులు కాని లేని పట్టి ఛాయాగ్రహము. మీయూహయే నాయూహ.

సూర్యుఁడు—రాహూ! నీయుద్దేశ మేమి?

రాహువు—గ్రహపూరుషులని యింతటిపేరులతో నాకాశవివరంబంతయు నవ్యాహతముగ నేలు మనకీ ప్రజాపతు లొక యడ్డు గలిగింతురా? మఱి ఘాను ముద్దీపించినచో నాశ్రములగు ప్రజాపతులతో సత్యలోకమువఱకును మాఁడిపోయెదరు. వేయేల! నాకు సెలవిండు. ఇప్పుడే సర్పాకృతిఁ దాల్చి, యూరు పేరు లేకుండ నీ భూలోకము నంత నొక్క నిమిషములో నొక్క కోఁబ్రక్రిందవేయుదు.

సూర్యుఁడు—ఆఁ! ఆఁ! అంత తీవ్రత కార్యవిచారణయం దుండఁగూడదు. అర్ధనారీశ్వరుం డానతిచ్చిన విధానమదికాదు. వారే కార్యము నధికోత్సాహముతో నలుపుచున్నారో దానిని మనము ప్రతిఘటింపవలసియున్నది. శనీ! నీవేమందువు?

శని—అనుట కేమున్నది? సరి యన్నచోఁ జేతనైన పని చేసెదను.

సూర్యుఁడు—ఏమది?

శని—మత్ప్రియులగు మ్లేచ్ఛనివహంబులం బురికొల్పి, ఓరుగంటి చెంతను పుస్తకంబులున్న కాళికాలయమునందుఁ జొన్పి, వారిచే నాలయంబు నపవిత్ర పఱిచించి, తత్కారణంబున మహిమకోల్పడునట్టి కాళినుండి గ్రంథంబుల హరించి, చించి, చలిమంట వైచుకొందును.

సూర్యుఁడు—నీ యూహవెంట వర్తించుటకు సమయ మిదికాదు. మ్లేచ్ఛనివహంబులు దక్షిణాపథంబున విజృంభించుకాల మింకను దాపురింపలేదు. మఱియు నిట్టి యుద్గ్రంథంబు భాస్కరాచార్యునకుఁ జిక్కనీయకుండుటకే మా ప్రయత్నముగాని వానిని ధ్వంసపఱచుటకాదు. కుజా! నీయుద్దేశమేమి?

కుజుఁడు—గురువర్యుల యుపన్యాసమునందు రుద్రాంబా వివాహసమయమునందే భాస్కరాచార్యునకు గ్రంథములు లభించునట్లు వివరింపఁబడియె. కావున నాతని కా గ్రంథములు చిక్కనీయకుండుటకై రుద్రాంబయొక్క వివాహము నాటంకపఱచు ప్రయత్నము నాలోచించెదము.

శుక్రుఁడు—కానున్న యామె శుభకల్యాణమును ఆఁపుటకు నీతరమా, నాతరమా!

కుజుఁడు—నాకుఁ దోఁచిన యుపాయమును జెప్పెద వినుండు. ఈ రుద్రాంబయొక్క కాకతి రాజ్యమునకు ప్రాంతమున దేవగిరిరాజ్యమున్నది. ఈ రెండురాజ్యములకును పూర్వమునుండియు బలవద్విరోధము కలదు. అది కారణముగా దేవగిరిరాజగు మహాదేవుని రుద్రాంబావివాహసమయమునకే కాకతీయరాజ్యముపైకి దాడివెడలునట్లు పురికొల్పెదము. మనగ్రహబలంబుల నా దేవగిరిసైన్యములకు సాహాయ్యముగా నొసంగి వారిచేత నీ భాస్కరాచార్యునకు నుత్సాహభంగ మగున ట్లా యాలయములోని జ్యోతిషగ్రంథంబుల గ్రహించి మనవద్ద గుప్తముగావించెదము. తనసైనికులగునట్టి యాంధ్రవీరులతో రుద్రాంబ దేవగిరిసైన్యముల నెదిరింపఁజాలుట, అందుపై నామె వివాహమగుట, భాస్కరాచార్యునకు గ్రంథములు చిక్కుట యను విషయములు మన ప్రతిఘటనల నతిక్రమించి సంభవించునో లేదో పరీక్షింతము.

సూర్యుఁడు—యుద్ధకారకుఁడై నందుకు కుజుఁడు తగినపరీక్షనే సూచించినాఁడు. ఒకవైపున అనఁగా ప్రజాపతుల పక్షమున భాస్కరాచార్యునిసంకల్పము, ఆంధ్రవీరుల దోర్బలము, రుద్రాంబాదేవి సాహసము. రెండవవైపున మనబలములతోఁ గూడిన దేవగిరి వీరుల పరాక్రమము. ఏదిగెలుచునో చూచెదము. శుక్రాచార్యా! తామేమందురు?

శుక్రుఁడు—నాకు కుజుని యభిప్రాయమే యాచరణీయ మని తోఁచుచున్నది.

సూర్యుఁడు—గురువర్యా! తమ యాదేశమేమి?

గురువు—విద్యావిషయమే గాని నా కితరప్రసంగముల పరిచయము లేదు. కాని కుజుని యభిప్రాయము ఆదరణీయముగ నాకును పొడకట్టుచున్నది.

సూర్యుఁడు—చంద్రా! నీ వేమందువు?

చంద్రుఁడు—నాకును కుజునియభిప్రాయమే సరియని తోఁచుచున్నది. ఐనను తా మెట్లు నిశ్చయించినను నేనుండు ప్రదేశమునుండి అనఁగా గోచారరీతిగా నీ గ్రహపూరుషుల నండందు నిలిపినఁ జాలవఱకుఁ గార్యసాధక మగును.

సూర్యుఁడు—అదియు సమాదరణీయమైన యంశమే! తారలారా! మీ రేమి సెలవిత్తురు?

అశ్విని—మేము తమ యాజ్ఞానుసారి యగు మా ప్రాణేశు నానతి ననుసరించువారమే.

సూర్యుఁడు—బాగుగా పలికితివి. సభ్యులారా! నాతీర్మానమును వినుఁడు. వసిష్ఠప్రజాపత్యవతార మగు భాస్కరాచార్యునకు కాళికాలయ నిక్షిప్తంబు లగు జ్యోతిషగ్రంథంబులు లభించుటకును, రుద్రాంబాదేవి వివాహకాలమునకును, సంబంధము కలదని గురు

వులు పిలవిచ్చిరి. అట్టి సంబంధము విడదీయుటకై ఇట్లొనర్చెదము. కుజుండు చెప్పినట్లు దేవగిరిరాజగు మహాదేవుని కాకతీయరాజ్యముపైకి దాడి వెడలునట్లు మన గ్రహగోళ బలంబులచే ప్రేరేపింతము. మన గ్రహగోళబలంబులతో, తోడుగ మన మండలము కూడ సంకేతమూర్తులం దాల్చి, స్వయముగ భూమిపై కరిగి, వారికిపులమని వెలిబుచ్చి, కాకతిరాజ్యము పైకి దాడి వెడలునట్లు పురికొల్పి, దేవగిరి రాజులతోం గూడ, ఏకశిలానగరమునకరిగెదము. ఈ దాడి రుద్రాంబాదేవి వివాహ సమయమునకే కాకతిరాజధాని చేరునట్లు సంఘటింతము. ఈ కల్లోలమునకుం గారణము రుద్రాంబాదేవి వివాహ మొక్కంత యాపుట. ఇంతలో మఱొకనుండు దేవగిరివారిచే, కాళికాలయములోని గ్రంథమును దీయించి, వానిని భాస్కరాచార్యునకుం జిక్కకుండ, మనవద్ద గుప్తపరచుటకును, ప్రయత్నింతము. ఉభయ సైన్యముల పరాక్రమమును వేడుకగం బరీక్షింతము.

గ్రహములు— ఔనౌను. అట్లే యొనర్చెదము.

సూర్యుఁడు— అట్లొనర్చుటచే నాదేశపు ప్రజలతో మనకు సన్నిహితపరిచయ మేర్పడంగలదు. అప్పుడు జ్యోతిర్విద్య గ్రహించుటకు వారు తగుదురో తగరో బాగుగాం బరీక్షింపవచ్చును. మఱియు యుద్ధములో గ్రహబలయుతులగు దేవగిరిసైన్యంబులను, కేవల మానవపరాక్రమంబుచే కాకతీయసైన్యవీరులు జయించిరేని ప్రజాపతుల వాదమునకు గెలుపు కలిగనని తలంపవచ్చును.

అందఱు:— ఔను! అట్లే!

సూర్యుఁడు— ఇంక నెల్లరమును భూలోక ప్రయాణోన్ముఖులము కావలెను.

తారలు— సూర్యదేవా! మా యాతిథ్యము స్వీకరించి మమ్ము ధన్యులం జేయవలెను.

సూర్యుఁడు— తారలారా! మీ యాతిథ్యముచే మేమే ధన్యుల మయ్యెదము.

అశ్విని— దేవా! ఇట్లు దయచేయవలెను. గోళాధిపులారా! ఇట్లు దయచేయుఁడు.

అందఱు— మంచిది. మంచిది.

[గ్రహపూరుషులు పోవగా తెరదిగును.]

ద్వితీయాంకము సంపూర్ణము.

శ్రీ

జ్యోతిర్లీల.

తృతీయాంకము.

ప్రథమరంగము.

ప్రదేశము:—భూలోకము, దక్షిణాపథము. ఓరుగంటిలోని రుద్రమదేవి అంతఃపురము.

ప్రవేశము:—మహారాజ్ఞి రుద్రాంబ, లీలావతి విశ్రాంతిగఁ గూర్చుండి యుందురు.

రుద్రమదేవి—లీలావతీ! ఏమనుచుంటివి!

లీలావతి—మహారాజ్ఞీ! రుద్రమాదేవీ! ఈ భూలోకమున నివసించు వారందఱును జ్యోతిర్విద్య నేర్వఁదగును. తమకు జ్యోతిర్విద్య కూడ సులభసాధ్యమే యనుచు విన్నవించు చుంటిని.

రుద్రమదేవి—పరమపూజ్యులును కీర్తిశేషులును నగు మాతండ్రి గణపతి చక్రవర్తిగారికి మేమును, మాచెలియలు గణపాంబయు నిరువురమే సంతానము. మా యిరువురిలో నన్ను చిన్ననాఁటినుండియు పుత్రునివలె ప్రేమించుచు, పూరుషోచితములగు గజాశ్వారోహణాదులను రాజ్యతంత్రావశ్యకవిద్యలను నాకు మాతండ్రిగారు నేర్పించి, వారితోఁగూడ దండయాత్రాదులం ద్రిప్పుచు, యుద్ధకరిచితి నలవఱుచుచునచ్చిరి. కావున జ్యోతిర్విద్యాదుల సాధించుటకు విశేషావకాశము లేకుండెను. ఇఁక స్త్రీలు నేర్వఁదగిన గానకళాది క్రీడావిద్యలఁ గూర్చి శ్రద్ధయే చేయమైతిమి.

లీలావతి—మహారాజ్ఞీ? ఎట్టిశాస్త్రమైనను మాబోంట్లకుఁ గష్టసాధ్యముగాని రాజ్యపాలనావశ్యకము లగు సకలవిషయంబుల నెఱుంగుటచే వివేకాధిక్యము గల తమవంటి ప్రభువులకు సులభసాధ్యమే.

ఆ. కష్టతరము మాకుఁ గను సులభము నీకు
విద్య లెల్ల హృదయ వేద్య మగుట
రవి కర ప్రభాపరం బన్య దూరంబు
లోక విషయ సార లోకనంబు.

ఆ. కుంభలగ్న జాత! గురుఁడు విద్యాకారి;
తనదు మీఁద మందుఁ దవరు వాక్య
జాల మీఁదు నుండె; సకల విద్యలయందు
రాని దొకటి కలదె రాజ్ఞి నీకు!

రుద్రమదేవి—శాస్త్రానుభవముఁ గల నీ వట్లు చెప్పుట విద్యనేర్చుటకై మమ్ము ఉత్సాహపఱుచుచున్నది. కావున మాకుఁ గొన్ని సందియములు తేటపఱుచుము.

లీలావతి—విధేయురాలను.

రుద్రమదేవి—ఆకాశంబుపై నుండు గ్రహంబులకును భూమిపై నుండు మనకును ఎట్టి సంబంధము కలదు?

లీలావతి—కార్య కారణ సంబంధము. అనఁగ సర్వవ్యాపారములందును మనలఁ బ్రేరేపించునవి ఖేచర గ్రహాదులు. వానిచేఁ బ్రేరేపింపఁబడువారము మనము.

రుద్రమదేవి—అంతదూరమునుండి అవి మనలఁ బ్రేరేపించు టెట్లు?

లీలావతి—మహారాజ్ఞీ! సూర్యకాంతిచే పద్మములు వికసించుటయు, చంద్రకాంతిచే నవి ముకుళించి కలువలు వికసించుటయు మనము వినునదియుఁ గనునదియుఁ గూడఁ గదా.

రుద్రమదేవి—అవును. సూర్య చంద్ర మండలంబులు గొప్పవగుటచే వాని కిరణప్రసారము భూమిపైకి నధికముగఁ గలుగును.

లీలావతి—రవి శశి మండలములు మిగుల సామీప్యమున నుండుటచేత ననవలెను. గొప్పవగుటచేతఁ గాదు. సామీప్యస్థితిచే మన కట్లు కనిపించినను రవిశశిమండలంబులకంటె కోట్లరెట్లుగ మండలాధిక్యముఁ గల తేజోమూర్తు లా మిన్నుకు నక్షత్రములలోఁ జాలఁ గలవు.

రుద్రమదేవి—అ దెట్లు?

లీలావతి—తల్లీ! చెప్పెద వినుము. ఒక క్షణమునకు అనఁగా కన్నుమూసి తెఱచునంతలో తేజఃపుంజంబులు (23,250) ఇరువదిమూఁడు వేల, రెండు వందల, యేఁబ దామడల దూరము వ్యాపింపఁగలవు. అట్టి తేజంబు చంద్రమండలమునుండి యిటకుం జేర నొక్కక్షణంబును, క్షణపాదంబును మాత్రమే పట్టును.

రుద్రమదేవి—అట్లయినఁ జంద్రమండల మీ భూమికి (30,000) ముప్పదివే లామడల దూరమున నున్నదా?

లీలావతి—గణితంబున ప్రభువుల సూక్ష్మవివేకము అపరిమితమైనది. మహారాజ్ఞీ! తేజఃపుంజంబులు సూర్యమండలమునుండి ఈ భూగోళంబునకు వ్యాపించుటకు ఘటికలో పాదంతే యగుచున్నది.

రుద్రమదేవి—(కొంచెము యోచించి) అందుచే భానుబింబంబు భూమికి (1,16,25,000) ఒక కోటి, పదునాఱు లక్షల, యిరువదియైదువే లామడల దవ్వున నున్న దని తలంపవలెను.

లీలావతి—మేలు తల్లీ! నీ బుద్ధిసూక్ష్మతకు మెచ్చితి. మఱియు నట్టి తేజఃప్రసారంబు సూర్యమండ లావృత గ్రహకోటిలో నన్నిఁటికిని దూరస్థం బగు వెలుపలి కక్ష్యాపథంబున సంచరించు నభస్థానమండలంబునకు నడచుటకు నాల్గు హోరల కాలంబు కాఁగలదు.

రుద్రమదేవి—(నవ్వుచు) ఎట్టెట్లూ! ఇఁక భూమిపై మనము వానికచేయు నిడివికొలఁతి లందుట లేదే!

లీలావతి—తల్లీ! అందనిదే నిజము. ఇంక నత్యంత దూరస్థంబు లగు నక్షత్రంబుల వఱకు నుండు నంతరాళ పరిమితి నెఱుంగఁజేయుటకు తేజస్సు వ్యాపించు కాలమును ఇన్ని వత్సరంబు లనుచు లెక్కింపఁదగుఁ గాని యామడల లెక్కయక్కఱకురాదు.

తే. వేగ నిరువదియునుమూఁడు వేలు, రెండు
నూఱు లేఁబది యామడల్ దూర మేగు
నొక్క తృటిలోన వెలు; గద్ది పెక్కు నెలల
యేండ్ల పయనంబునను తార నెనయఁ గల్గు.

ఆ. అట్టి కాంతిసత్వ మంబరంబునఁ బర్వ
నాకసమునఁ ద్రిప్పునట్టి ఘనులు
ఆ ఖగోళనాథు లవ్యాహతంబైన
శక్తి యుక్తు లనుట సాహసంబె!

ఆ మహామూర్తులనుండి వ్యాపించు విద్యుత్కాంతి పుంజంబుల పటిమంబునకు దవ్వు డా పను భేదము కలదా!

రుద్రమదేవి—అట్లయిన నీవుచెప్పిన మహావ్యాయామపరిమాణ మూహింప సూర్యమండలంబు కంటె నన్నివిధములఁ బెక్కుమడుఁగు లధికంబు లా తారామండలంబు లనితోఁచెడిని.

లీలావతి—అమ్మా! నిజస్థితియు నట్టిదే.

ఆ. ధరణికంటె వేలతరములు భానుండు,
వతనికంటె తార లధిక-మయిన

మండ లాప్తి వెల్గు చుండుట యోచింప
మదికి వచ్చు సృష్టి మహిమ కొంత.

తే. ఇట్టి సృష్టి చేయఁగఁజాలు నట్టి యజుని
జడత వాపుటకై సరస్వతి నొసంగి,
జగము వెలిగింప రవికిఁ దేజము సమర్చె
నెన్నఁ డవ్వాని మహిమంబు నెన్నఁ దరమె!

రుద్రమదేవి—అది యవాఙ్మానసగోచరమే. నీవు తేటపఱిచిన విషయము లద్భుతావహంబులు లీలావతీ!

లీలావతి—ఇంతకంటె సత్యాద్భుతంబు లగు సృష్టిరహస్యంబుల యోగచక్షుర్బలంబున వీక్షించి, లోకంబున కెఱింగించుటకై యార్యవర్యులైన పూర్వఋషులు వానిని గ్రంథస్థంబు లుగఁ జేసియున్నారు.

రుద్రమదేవి—గ్రంథంబు లన జ్ఞప్తికి వచ్చె. రుద్రాంబికాలయంబునందున్న జ్యోతిర్గ్రంథంబులఁ గూర్చి మఱల నడుగకపోతివి!

లీలావతి—మహారాజ్ఞీ! దూరస్థం బగు మా జన్మదేశంబునుండి వచ్చి, తద్గ్రంథములకొఱకై పూజ్యులగు నాతండ్రి భాస్కరాచార్యులును నేనును ప్రభువుల నాశ్రయించితి మని తమ మనంబున నుండ నేనవ్వానిఁగూర్చి మఱలమఱల విన్నవించుట తగునా?

రుద్రమదేవి—మన నగరమున మొన్న జరిగిన జ్యోతిర్విద్యాపరిషత్తునందు మీ తండ్రిగారు జ్యోతిర్విద్యనుగూర్చియు, పలువురకు వ్యతిరేకముగ నేదో వ్యక్తిస్వాతంత్ర్యమును గూర్చియు నుపన్యసించెద రని వింటిని. అట్టివానికి జ్యోతిర్విద్యావ్యాసంగము, జ్యోతిర్గ్రంథ సంపాదన ప్రయత్నము నెందులకు?

లీలావతి—అమ్మా! వ్యతిరేకమనుటకంటె వారు నుడివినది నూత్నవిషయ మనదగును. అనఁగా సర్వము గ్రహబలాధీన మని నేటివఱకు పలువుర యభిప్రాయము. వ్యక్తిస్వాతంత్ర్యము గ్రహబలమును అతిక్రమింపవచ్చు నని వారి యభిప్రాయము. దీని నిరూపించుటకే జ్యోతిర్విద్యావ్యాసంగమును వారు నిరంతరము సేయుచు, నా నుడివిన గ్రంథముల పరీక్షించుకొఱకు తమ సెలవుఁ గోరుచున్నారు.

రుద్రమదేవి—ఈ గ్రంథముల వెలికిఁ దీయింప మా తండ్రిగారు ప్రయత్నించినప్పుడు కాళి దుర్ఘటంబగు కాంక్షఁ జేసె నని వినియుంటివికదా?

లీలావతి—వింటిని. కాని అది యిట్టి దని యెఱుంగను.

రుద్రమదేవి—ఇష్టం వెలిఁగెదుగాక! వకుళా!

వకుళ—(ప్రవేశించి మహారాజ్ఞికి నమస్కరించును.)

రుద్రమదేవి—మెట్లప్రక్క గదిలోని ఎఱ్ఱగవిసెన కల చిన్నదంతపుపెట్టె నీవు తెమ్ము.

వకుళ—అనుజ్ఞ. (నిష్క్రమించును.)

రుద్రమదేవి—లీలావతీ! కాళి కోరిన కోరిక బహు దుర్ఘటమైనది. అసంభావిత మని కూడఁ దలంచితిని. తీక్ష్ణబుద్ధి కల నీ వేమయిన సమంజసార్థముఁ దీయఁగలవేమో చూతము. ఏమే! ఎంత యాలస్యము!

[తెరలో]

అమ్మా! వచ్చితిని.

[ప్రవేశము—పెట్టెతోడ చేటి.]

రుద్రమదేవి—ఆ చిన్నబల్లపై నునిచి పొమ్ము.

(చేటి అట్లు చేసి మహారాజ్ఞికి నమస్కరించి నిష్క్రమించును.)

రుద్రమదేవి—లీలావతీ! ఈ తాళపుచెవితో నా పెట్టె తీయుము. (లీలావతి అట్లు చేయును.)

లీలావతి—తెఱచితి. ఏమి యుత్తరువు?

రుద్రమదేవి—పచ్చపట్టుదారము కట్టియుంచిన భూర్జపత్రముల రెంటి నిట్లిమ్ము. (పుచ్చుకొని) చూచితివా? మీరు కోరెడి పుస్తకముం గూర్చిన శిలాశాసనసమస్యను ఈ చీటియందు లిఖింపఁజేసి, మా తండ్రిగారి కందించితి. దీని ననేకపర్యాయములు చదివినను నాకు సుబోధం బైనదికాదు. నీవు చదువుము. ఇదిగో చీటి.

లీలావతి—(పుచ్చుకొని)

ఆ. "గ్రంథములను గోరు కన్య ద్విజాంగన
పెండ్లివేళఁ దనదు ప్రియునిఁ గూడి,
వేయి మంది నాకు వేడుక బలి యిచ్చి,
బ్రహ్మచర్య దీక్షఁ బడయ వలయు."

(మఱలఁ జదివి యోచించును.)

రుద్రమదేవి—ఇది గ్రంథప్రచారణము నిచ్చగింపని కొందఱు మూఢులచే నేర్పఱుపఁబడి భావరహితమైన దబ్బరవ్రాఁత యేమో యని మా తండ్రిగారు సందేహించి, ఆ నాటి నియమంబు పాటింపక, దేవికి ఇతర పూజాదికము లొసఁగి, బలిద్వారము తెఱపింపఁ జూచిరి. అంతట కాళీవిగ్రహమునకు మోము చెమర్చెననియు, నది కాంచి గుబులొంది ప్రయత్నముల మాన్పించి, శాసనంబున కర్థము చెప్పుఁ డని మహారాజు పండితులఁ గోరఁగా వారు ఇదమిత్థ మని నిశ్చయింపఁ జాలకుండిరనియు, మా తండ్రిగారివలన నే వింటిమి. ఏదియో విధమగు నర్థముం దీయుదమన్నను పద్యమునం దొకదానికొకటి యసంబద్ధముగ నున్నది. కాని పద్యము మొదటిభాగమున నా కొక్కటి సూచితమగుచున్నది.

లీలావతి—వింతను.

రుద్రమదేవి—(నవ్వి) అందు సూచింపఁబడిన ద్విజాంగనవు నీవని

లీలావతి—అది నాయెడ నెట్లు వర్తించును?

రుద్రమదేవి—వర్తించునట్లు చేయు భారము మాది.

లీలావతి—తమ గంభీరోక్తుల యభిప్రాయ మెఱుంగలేకున్నదానను.

రుద్రమదేవి—తేటపఱతును. మీ యాత్రేయశాఖనుఁ జెందిన మా రెండవమంత్రికి పెద్ద కుమారుండును, రాజ్య కోశాధికారియు నగు రాఘవశర్మను గూర్చి వినియుంటివా?

లీలావతి—హాస్యభాషాశీలుం డని వినియుంటిని.

రుద్రమదేవి—వేడుకగ మాటలాడువాఁ డయ్యును మహామేధావి. నీకుఁ దగిన వయసుగల యువకుఁడు. అతనిపై నీ కహితము లేదని మాయుద్దేశము. నిన్నాతనికి పరిణయ మొనర్చుట మాకు సమ్మత మని మీ తండ్రిగారికిఁ దెలియఁజేసియుంటిమి.

లీలావతి—నన్నుఁ బాలించు మహారాజ్ఞి యవివాహితయై యుండఁగా నాపెండ్లికై తొందర యేల?

రుద్రమదేవి—(నవ్వి) ఆ విషయ మట్లుండనిమ్ము. కడమ రెండుపాదములయం దుండు భావ మేమి? వివాహమునకు సంసిద్ధమైన కాంత వేయిమందిని బలియిచ్చుటెట్లు? మఱల నామె బ్రహ్మచారిణి యగుటెట్లు?

లీలావతి—ఇదియే యసంభవముగ నున్నది. అమ్మా! సెలవైనచో నీ పద్యమునందలి గూఢార్థము మా నాన్నగారి నడిగెదను.

రుద్రమదేవి—ఆటంక మేమి? వారి యభిప్రాయమును వేగమే మాకుఁ దెలియఁజేయుము.

లీలావతి—విధేయను.

రుద్రమదేవి—ఈ చీటి నెప్పటియట్ల భద్రపఱచి, తాళపుచెవి నిట్లిమ్ము. (లీలావతి అట్లు చేయును.) చో! రాజ్యసహాయమునకై బసవదండనాథుఁడు ససైన్యముగ నెల్లి ప్రొద్దునఁ బంపఁ బడుచున్నవాఁడు. అతఁడు నేఁటిసభలో సెలవుఁ గైకొనుటకై వచ్చును. కావున సభాయోగ్యమగు వస్త్రధారణ మొనర్చుకొన సమయ మైనదేమో ప్రక్క గదిలోని హోరాయంత్రమును చూడుము.

లీలావతి—(చూచి వచ్చి) ప్రభూ! సమయ మైనది. స్త్రీస్వభావంబుఁ గలిగిన పూర్ణచంద్రుండు తారామండలంబునం బ్రకాశించునట్లు కామినీమణియైన తాము ఖడ్గాదులతోడ వీరపురుషోచిత సపరివారంబుగ సింహాసనంబున నుండుటఁ జూడ నా కెంతయో కన్నుల పండువుగ నుండును. కాని తల్లీ! క్షమింపఁబడుదునుగాక! నీ ముఖవైఖరి యంతర్గత సంతాపంబును సూచించుచున్నదే?

రుద్రమదేవి—(నిట్టూర్పు విడిచి) సామ్రాజ్యవాహులకు సంతాపముల కేమికొఱంత?

లీలావతి—ప్రభువుల సంతాప ముపశమించునుగాక.

రుద్రమదేవి—(కొంచెము విరమించి) లీలావతీ! మన మాట వినని వారినిగూర్చియే మనస్సు అంతగ సంకటపడునేమి?

లీలావతి—తల్లీ! అది స్త్రీస్వభావ మని గ్రంథములలోని పెద్దల చరిత్రలే తెలుపును.

గీ. జడత నీటిలోఁ బడి పోవు జనుని కంటె
ఈది పెనఁగెడు వానినే యేరు కాచు
వంగి తనమాట వినుచుండు వాని కంటె
వినక తను నేలు మగవాని వనిత మెచ్చు.

గీ. తమకు భిన్నమౌ నన్యోన్య తత్వములకు
తమకపడుటయే స్త్రీపుంస తత్వమేమొ
లలితవల్లిక ఘనశాఖ నలము కొనఁగ
నవ్యతరుశాఖ లతికకై నమ్ర మగును.

రుద్రమదేవి—బసవన్నతో వోరయుద్ధములకు......తానుకూడ పోయెద ననుచున్నాఁడు.

లీలావతి—మల్లికార్జునవర్మయుఁ బోయెద ననుచున్నాడా!

రుద్రమదేవి—అవును. వారింపు మని రేచర్ల ప్రసాదాదిత్యునకు సూచింపఁబడినది.

లీలావతి—పూజ్యులగు గణపతిచక్రవర్తినాఁటినుండియు కాకతిరాజులకు కుడిభుజ మగు రేచర్ల ప్రసాదాదిత్యులవారి మాట నాతఁడు వినక నిరాకరించునా?

రుద్రమదేవి—వినవలెననియే నా కోరిక. మఱియు రాఘవశర్మకూడ నేఁటిసభలో సెలవుఁ గైకొని ధాన్యవతీనగరమునకుఁ బోవనున్నాఁడు.

లీలావతి—(ఉద్వేగముతో) ధాన్యవతీనగర మాతని మేనమామగారి యూరఁటకదా తల్లీ!

రుద్రమదేవి—(నవ్వి) నిజమే. ఐనను భయపడకుము. ఆతని మేనమామకు కొమార్తలు లేరులే. మఱియు నాతఁడు మా ప్రియసోదరి గణపాంబకు మా లేఖను గొని పోవుచున్నాఁడు. ఆయమయొక్కయు, ఆమె భర్తయొక్కయు క్షేమము తెలిసి చాలకాల మైనది.

[మహారాజ్ఞి లేచఁగా తెర దిగును.]

తృతీయాంకము—ప్రథమ రంగము—సంపూర్ణము.

తృతీయాంకము.

ద్వితీయ రంగము.

ప్రదేశము:—ఓరుగంటిరాజుల కొలువు కూటములో నొక భాగము.

ప్రవేశము:—మల్లికార్జున వర్మ, రాఘవ వర్మ, బసవన్న, ప్రసాదాదిత్యుఁడు.

మల్లికార్జునవర్మ—బసవన్నా! నేనుకూడ నీతోడ పోరియుద్ధంబుల కేల రాఁగూడదు?

బసవన్న—మల్లికార్జునా! నీవు రాకుండుటకుఁ గారణము లున్నవి. నీ మిత్త్రుఁ డగు రాఘవశర్మ నడుగుము.

రాఘవశర్మ—అడుగకముందే చెప్పెదను. మల్లికార్జునా! ఎవ్వరియాజ్ఞను శిరసావహించి ఈ దండనాథు లందఱు సమములఁ గట్టి పోరికి నడచుచున్నారో యట్టి ప్రభువే యనుమతింపనప్పుడు సుఖముగ నొడలు కందకుండ నింటఁ గూర్చుండక కత్తివ్రేట్ల కనకపు వంటి శరీరము నాయాసపెట్టుకొనఁజూచుటకు వెఱ్ఱివాఁడవా?

మల్లికార్జునవర్మ—మిత్త్రమా! నీ వెప్పుడు నిట్లు హాస్యము లాడుచుందువు. ప్రసాదాదిత్యా! తామైన మహారాజ్ఞితో విన్నవించి, నాకు సమరంబున కేగ ననుజ్ఞ నిప్పింపుఁడు. కీర్తిశేషులగు గణపతిచక్రవర్తివారి కాలంబునం దింక చిన్నవాఁడ నయ్యు నిట్టి నిర్బంధ మెఱుఁగను.

రాఘవశర్మ—ఇప్పుడు పెద్దవాఁడ వగుటచేతనే నిర్బంధము కావలసివచ్చె ననుకొనుము.

ప్రసాదాదిత్యుఁడు—మల్లికార్జునా! నా వచనము నాలింపుము. ఆంధ్రసామ్రాజ్యము నిప్పుడు నీ మఱఁదలగు రుద్రాంబామహారాజ్ఞి పరిపాలించుచున్నది. ఆమె యింకను అవివాహిత. ఈ కాకతిసింహాసనముపై నధివసింపఁదగిన పురుషసింహకిశోరము ఆమెకు జనించునప్పుడే కాకతివంశంబునకు భూలోకంబునను, దివంబునను కీర్తి నిలిచిన ట్లగును. ఇఁక నీవు మా రాణికి మేనత్త కుమారుఁడవు. భర్తవు గానున్నావు. అట్టి నిన్నిప్పు డనావశ్యకముగ నపాయంబునఁ బెట్టుట ఈ త్రిలింగాంధ్రసామ్రాజ్యక్షేమము కోరు మా కెవ్వరకు నిష్టము కాదు.

మల్లికార్జునుఁడు—అట్లయిన నా కెప్పు డీ పు రు ష రా ణి వా స మేనా!

రాఘవశర్మ—ఓహో! మహారాజునంతటివానికే కాక పురుషరాణివాసము సామాన్యులకు సిద్ధించునటోయి మిత్త్రమా!

మల్లికార్జునుఁడు—మిత్రులారా! వినుఁడు.

చ. పురుషులచే సతుల్ ప్రియముపూర్వకరక్షణఁ బొందుచుండుటల్
సరియగుఁగాని కామినులచాటున, సాహసహీనవృత్తి, సం
గరవిముఖత్వ మూని, పురకారణ మేదియొ కల్గునంచు, నే
పురుషవరుల్ రణస్థలికిఁ బోవఁగ నింట వసింప నేర్తురే!

ఉ. నిక్కమ మేము రుద్రమయు నెమ్మిక శైశవమాది యుండుటల్;
నిక్కమ మామె తండ్రి యది నెయ్యముసం గను; కైన శౌర్యముల్
దక్కి, మగల్ సముల్ సగువిధంబునఁ—గాకతిరాజ్యలక్ష్మి తా
నెక్కమ దూరమౌగాక—యిటు లింతుల చాటున డాఁగి యుందునే!

ప్రహ్లాదాదిత్యుఁడు—కొంచెపడక నా వచనము పూర్తిగ నాలింపుము. నీవు మా మహారాజ్ఞికి భర్త కాఁదగినవాఁడవు. బాంధవ్యముచేతనేగాక బలమైన ప్రేమానుబంధము చేతఁ గూడ మీ యిరువురు నొకరి కొకరే తగియున్నారు. మగవాఁడవైన నీ మనస్థితి యిట్లున్నను మా మహారాజ్ఞి నిన్నుఁ దప్ప మఱియొకని—వివాహము మాట యట్లుండ—కన్నెత్తియైనఁ జూడదు. పూర్వపు సంధిబంధనలఁ బట్టి బసవన్న యేఁగవలసివచ్చును గాని నిజముగా దోఃయుద్ధములలో మన కెక్కువ ప్రమేయమే లేదు. ఇఁక స్వారాజ్యమున కానశ్యకము కలుగునెడల నిన్నాఁగుమనువా రుండరు.

మల్లికార్జునుఁడు—ఈవిషయమై నా మనస్థితి మీ రెఱుఁగనిది కాదు. త్రిలింగసామ్రాజ్య సముద్ధరణమునకై అత్యంత శౌర్యరస ప్రదర్శన మొనర్చు మీ యుద్ధముల మధ్యను ఊరక తిని కూర్చుండుట నా కిష్టములేదు. నిర్వీర్యుఁడనై తనకై వేచియుండు నన్ను మీ మహారాజ్ఞి హర్షించిన హర్షించుఁగాక! మెచ్చుటకును, మెప్పునకుం దగినట్లు ప్రేమించుటకును అవకాశ మేది?

బసవన్న—మిత్రమా! తెలుపుగ పైకెగిరించి పావురంపు ఱెక్క విఱిగి పరీక్షింతుము కాని నాటివఱకు ఎర చూపుచున్నప్పుడేకదా కనుమూఁత తీయుట.

రాఘవశర్మ—మా మహారాణికి ఆమాత్రపు భేదము తెలియునులెమ్ము.

మల్లికార్జునుఁడు—ఏమొ! మీ యిచ్చవచ్చినట్లు కానిండు. ఐనను యుద్ధంబున కేగుటకు సెలవు నేఁటి సభలో సింహాసనాసీనుల నడిగెద. (అటుచూచి) అదిగో వెలమనాయకు లందఱును వచ్చుచున్నారు. సభాసమయ మైనట్లున్నది.

[వెలమనాయకులు ప్రవేశింతురు.]

ప్రసాదాదిత్యుఁడు—నయముచేయుఁడు. అందఱును దయచేసి, సభ నలంకరింపుఁడు. ప్రభువులు విచ్చేయు సమయముగూడ నైనది. బిరుదావళి పఠించు భట్టులు వచ్చిరా?

భట్టుమూర్తులు—(ప్రవేశించి) అయ్యా! సిద్ధముగా నున్నాము.

సీ. నీకీర్తి నీమూర్తి నీశౌర్య సంపూర్తి.............

ప్రసాదాదిత్యుఁడు—ఆఁగుఁ డాఁగుఁడు. ప్రభువు సింహాసన మలంకరింపనున్నారు. ముందుగ నుతింపఁబడవలసినది ప్రభువులు.

[తెరలో] జే! కాకతీయవంశమునకు జే! ఆంధ్రసామ్రాజ్యలక్ష్మికి జే!

ప్రసాదాదిత్యుఁడు—మహారాజ్ఞి సభ నలంకరింపనున్నారు.

(మంగళవాద్యములు మ్రోఁగును. అందఱును వరుసగ నిలుతురు. స్వపరివారముతో స్త్రీవేష చిహ్నంబులగు చేలాదులపై పురుషవేషోచితములగు కవచకిరీట ఖడ్గాదుల ధరించిన రుద్రాంబా మహారాజ్ఞి ప్రవేశించి, సింహాసనాసీన యగును. రాణి యాజ్ఞానూచనతో నందఱు నుచితాసనంబులఁ గూర్చుందురు. సింహాసనము ముందు రెండుప్రక్కల పద్మనాయకవీరులు కూర్చుందురు. వారి వెనుక ఈఁటెలుపట్టియుండు భటులు నిలుతురు భట్టుమూర్తులు ప్రభువునకు ఎదుర నొకప్రక్కగ నిలుతురు. మహారాజ్ఞికి ఇరుప్రక్కల చామరగ్రాహిణు లుందురు. వారితరువాత కొల్వుకూటంబు వెనుకప్రక్క దరుల స్త్రీపరివారము నిలుతురు. వాద్యములు నిలుచును.)

భట్టుమూర్తులలో—ఒకఁడు కుడిచేయి పైకెత్తి)

శ్లో. యోఽయం జాతః త్రిలోకీప్రథితసుచరితే కాకతీయాన్వవాయే
యస్మైత్ర శ్రియాం స్యజస్రం వితరతి భగవాన్ దేవదేవ స్స్వయంభూః
యస్యాజ్ఞా సర్వ పృథ్వీపతి మకుట మణిశ్రేణి కేళీనయస్యా
సోఽయం భూపాలమౌళి ర్జయతి గుణమహాన్ రుద్రదేవో నరేశః.

ఇంకొకఁడు—*శ్లో. యో రుద్రో రజతాచలే స్థితిమగా దర్ధాంగనారీః పురా
సోఽయం సంప్రతి కాకతీశ్వరకులే సర్వాంగనారీ స్థితః
స్థానే యద్విషమావలోకనకళామాత్రేణ భస్మీకృతా
న్యాసన్ వైరిపురాణి చిత్రమధునా ఖడ్గే విషం ధార్యతే.

ఇంకొకఁడు—*శ్లో. సైవ సోమాచేతి నిర్దిష్టా
సోమాచేతి ప్రథామగాత్

---

* ప్రతాపరుద్రీయము లోనివి.

తవ మాతా శివా సాక్షా
ద్దేవో గణపతిః పితా.

మఱియొకఁడు—సీ. జయ నభోమణికుల సదమలాలంకార
జయ కాకతీంద్రవంశప్రదీప!
జయ బాహువీర సంస్థాపిత సామ్రాజ్య!
జయ రాజసామంత సంప్రపూజ్య!
జయ ఖడ్గశాసిత సకల శాత్రవ జాల!
జయ మిత్రనృపబద్ధ సమయ పాల!
జయ శాస్త్రనిగదిత సద్ధర్మ పరిపోష!
జయ పద్మనాయకశౌర్య భూష!

గీ. జయ యనంతసేనాయుక్త! నయ నియుక్త!
జయ సకలసౌమ్యమతిహిత! సాధు సహిత!
జయ నిజాశ్రితజన పక్ష! సత్య రక్ష!
జయ యశఃకామ! శ్రీ రుద్ర సార్వభౌమ!

ఇంకొకఁడు—సీ. విక్రమార్కునితోడ వెలసి తాతకు తాత
మాన్యుఁడౌ త్రిభువనమల్లనృపుఁడు
అనఁచె తాతకు తండ్రి యరులైన చాళుక్య
భూపుల కాకతిప్రోలరాజు
మహిత త్రిలింగసామ్రాజ్యంబు నెలకొల్పె
తాత ప్రతాపరుద్ర ప్రభుండు
భల్లాణ యాదవ ప్రబలసేనల గెల్చె
తండ్రి శ్రీ గణనాథ ధారుణీశుఁ

గీ. డట్టి మీపూర్వులు గడించినట్టి యశము
పెంపు గాంచంగ శాత్రవుల్ భీతిలంగ
వెలయు దేకశిలారాజ్య విపుల విభవ
భద్ర పదభావ! కాకతి రుద్రదేవ!

వేరొకఁడు—సీ. లలిత కోమలమైన లలనాప్రకృతితోడ
వీరపూరుషసాధ్య ధీర ఫణితి
పరతరాంతఃపుర వాస సమ్మతితోడ
కదనభూవిహరణ కౌశలంబు



నునుచేతి తమ్మిమొత్తని లేత నసి తోడ
భూషా సంవాహ భుజబలంబు
మృదుల సుస్నిగ్ధ దృక్ప్రేమ ప్రభతోడ
ఒక శ్రీకరేక్షణ పాటవంబు

తే. గలుగ నానూనాంగసంపూర్తిఁ గాంచఁ దలఁచి
భువిని సోమాంబ కీవన్ను కన్నదు ఫుట్టి;
ఇంక నినుఁ బూరుషాఖ్యచే నెన్నఁ దగదె!
దివ్యగుణసాంద్ర! కాకతిరాజచంద్ర!

(మహారాజ్ఞి కుడిచేయి కొంచెము ఎత్తఁగా భట్టుమూర్తులు ప్రభువునకు నమస్కరించి, విరమించి, వెనుకకు తగ్గి, నిలుతురు.)

రుద్రమదేవి—ప్రసాదాదిత్య దండనాథా! మహామంత్రి శివదేవయ్యగారింకను సభకు రాలేదా?

ప్రసాదాదిత్యుఁడు—శ్రీవారు విహారాంతర నిమగ్నులై యుండి నేఁడు నా మూలమున నాశీర్వాదముల కభివందనంబుల నంపిరి.

రుద్రమదేవి—పద్మనాయకవీర బిరుదపాఠము కానిమ్ము.

(ప్రసాదాదిత్యుఁడు సింహాసనముచెంత కేగి, తదభిముఖుఁడై, కొంచెము ప్రక్కగ నిలుచును.)

(భట్టుమూర్తులు మరల ముందుకు వచ్చి ఒక్కఁడు కుడిచేయి యెత్తి, బిరుదము చదువుచుండఁగా తక్కినవారు జయశబ్దములు చెప్పుచుందురు. ఒక్కొక దండనాథుఁడు సింహాసనముచెంత కేగి, ఎడమచేతిలో కత్తిపరను కుడిచేతితో కత్తిపిడిని పట్టుకొని, నిశ్చలుఁడై మహారాజ్ఞికి అభిముఖుండై నిలువఁగా, బిరుదపాఠము భట్టుమూర్తి పఠించును. ఒక్కొక దండనాథుని బిరుదపాఠము "సంత పద్మాకర సుధాకరం" అను వచనముతో ముగిసినతోడనే ఆ దండనాథుఁడు కుడిచేతిలో కత్తిని, వరనుండి తీసి, పైకెత్తి, మహారాజ్ఞికి అభివాదన మొనర్చి, కత్తిని వరలోనికి దించి, వెనుకనడకతో తన పీటను చేరి కూర్చుండును. ఇది అభివాదనక్రమము.)

1 వ భట్టుమూర్తి—పంచ వాద్యేయ దళ విశాల!

తక్కిన భట్టుమూర్తులు— ... ...జయ,

1 వ భట్టుమూర్తి—కాకతిరాజ్య స్థాపనాచార్య!

తక్కిన భట్టుమూర్తులు— ... ...జయ,

1 వ భట్టుమూర్తి—చలమర్తి గంగన!

ఎక్కిన భట్టుమూర్తులు— ... ...జయ,

1 వ భట్టుమూర్తి—జల్లిసెట్టి పినక్షేత్ర శోభాశ్రీ కనుం!

ఎక్కిన భట్టుమూర్తులు— ... ...జయ,

1 వ భట్టుమూర్తి—సోమకుల పరశురామ!

ఎక్కిన భట్టుమూర్తులు— ... ...జయ,

1 వ భట్టుమూర్తి—యంబిరుదగండ సర్వబిరుదకుమార!

ఎక్కిన భట్టుమూర్తులు— ... ...జయ,

1 వ భట్టుమూర్తి—రాయవేశ్యా భుజంగ!

ఎక్కిన భట్టుమూర్తులు— ... ...జయ,

1 వ భట్టుమూర్తి—అమరగంటి పురవరాధీశ్వర!

ఎక్కిన భట్టుమూర్తులు— ... ...జయ,

1 వ భట్టుమూర్తి—రాయగోవాళ!

ఎక్కిన భట్టుమూర్తులు— ... ...జయ,

1 వ భట్టుమూర్తి—కంచి కవాట చూరకార!

ఎక్కిన భట్టుమూర్తులు— ... ...జయ,

1 వ భట్టుమూర్తి—కేచన్నవంశ పయఃపారావార రాకాసుధాకర!

ఎక్కిన భట్టుమూర్తులు— ... ...జయ విజయీభవ!

(ప్రసాదాదిత్యుడు కత్తిని యెత్తి. ప్రభువులకు అభివాదము పట్టి, వెనుకనడకతో తన స్థానమునకు తిరిగి వచ్చును. ఇట్లే కొలువునందుండు పద్మనాయకవీరు లందఱును ఒకరితర్వాత నొకరు వారివారి గోత్రబిరుదములు పఠింపబడునప్పుడు అభివాదము పట్టుదురు. తక్కినవారి బిరుదముల కొఱకు అనుబంధమును చూచునది. బిరుదపాఠములు ముగియంగనే భట్టుమూర్తులు ప్రభువునకు మరల నమస్కరించి, ఒకప్రక్కకు, ఒదిగి, నిలిచెదరు)

రుద్రమదేవి—నేటి సభావిషయ మేమి?

ప్రసాదాదిత్యుడు—బసవన్నా లెమ్ము.

బసవన్న—శ్రీమన్మహారాజాధిరాజ సార్వభౌముల యనుమతిని చోళరాజ సహాయార్థమై ససైన్యముగ వెడలుట కనుజ్ఞం గోరుచున్నాడను.

రుద్రమదేవి—దండయాత్రకు వలయు సాధనము లన్నియు సమకూర్పఁబడినవా!

బసవన్న—అన్నియు సంసిద్ధము లను విషయము నేఁటి యుదయమున తీరినిలిచిన సైన్యములను అశ్వారోహులరై పరీక్షించిన సార్వభౌములకు విదితమే. అయినను వివరముగ విన్నవింతును.

సీ. శస్త్రసాధనముల సానలఁ దీర్పించి,
దుస్తు ముస్తీనుల సిస్తు పఱచి,
వ్యూహముల్ కట్టించి యుద్ధపద్ధతి నేర్పి,
సైనిక పటిమంబు చక్కఁ జూచి,
చిన్న చీఁకులు లేని శిబిరముల్ సమకూర్చి
భండారము ధనంబు నిండఁ జేర్చి,
బండ్ల నొంటెలమీఁద బరువుల నెత్తించి,
తనగంపు టెడ్ల సంతన యొనర్చి,

తే. చారులను గ్రామ సంచార సాధకులను
మార్గకారుల ముందంపి, మన పురంపు
దైవములఁ గొల్చి, తమ యాజ్ఞ తల ధరించి,
నపుములం గట్టి, నాయకుల్ నడువఁ గలరు.

రుద్రమదేవి—మీకు సంపూర్ణవిజయంబు చేకుఱి, ఇదివఱకు గడించిన "రాష్ట్రరాజ్యస్థాపనాచార్య" బిరుదంబును సద్వితీయంబుగా నొనర్చుకొనవలయును.

బసవన్న—ప్రభువుల యుద్దేశముతో పెద్దల యాశీర్వచనము, దైవ సహాయము తోడై, తావ కాజ్ఞాపరిపాలనమును నిరవశేషముగ నెఱవేర్పఁగలవు.

ప్రసాదాదిత్యుఁడు—సందేహమేమి? పరభయంకరు లగు విప్పర్లగోత్రవీరులు శౌర్యనిధియు ననుభవశాలియు నగు బసవన్న వెంట నేగుచోఁ బ్రభువుల యాదేశపూర్తికిని చోళ నృపాలవాంఛాపూర్తికిని ఏ యంతరాయమును గలుగదు. విప్పర్లవారి ఘనత మన మెఱుఁగనిదా!

సీ. చండ దోర్దండ ప్రకాండ మండిత రణ
పాండిత్య ఘనులు విప్పర్లవారు
సకల శాత్రవ భీత సమర కేళీ లోల
పటు శౌర్యనిధులు విప్పర్ల వారు

గజ వాజి యాన సత్క్రమ విక్రమోత్సాహ
పార ధీయుతులు విప్పర్ల వారు
సర్వ సైన్యవ్యూహ సార భేదోపాయ
పరమర్మ విదులు విప్పర్ల వారు

తే. అట్టి విప్పర్ల గోత్రజు లాదియైన
వీరనికరంబు చతురంగ విభవ మెసఁగ,
దనదు యాజ్ఞానువర్తనఁ దనరి నడువ,
బసవ దండనాథున కలభ్యంబు కలదె?

బసవన్న—వాత్సల్యముచేత నన్నుత్సాహపఱచుటకు తా మనిన సర్వ మంతయు నా సార్వభౌముని యాజ్ఞాబలములో నున్నది. కాని మాలో నేమున్నది?

రుద్రమాదేవి—విప్పర్ల గోత్ర వీరులయొక్కయు, బసవదండనాథులయొక్కయు శౌర్య సాహసములు మే మెఱిఁగినవే! వారి దక్షిణ దండయాత్రా విజయము మా కెంతో సంతుష్టి! మఱియు నట్టి విజయంబు ధర్మానుసారంబుగ జరుగవలయును.

బసవన్న—ప్రభువుల యుద్దేశ మెఱింగితిని. నా విజయంబులే దమకుఁ జేకుఱు యశోధవళిమంబై యుండఁగలదు.

సీ. దండులో సైనికుల్ బారి పల్లెలయందు
చూఱగొట్టక యుండఁ జూచువాఁడ
స్త్రీ బాల వృద్ధులఁ జెనఁగిన రణకోపు
లలఁతి పెట్టఁగనీక యాఁపువాఁడ
తురగాది సైన్యజంతువుల నన్నింటి నాదు
సహజన్ములటు రక్ష సలుపువాఁడ
చేఁ జిక్కినట్టి యే చెనఁటి శాత్రవునైన
సర్హ గౌరవమున నరయువాఁడ

తే. శత్రుశుల్కంబు, భవదీయ సైన్యవిధుల
బలఁగములపాలు బంట్లకుఁ బంచి యిచ్చి,
రాజభాగం బిచటి కంపి, మీ జయంబు
తెలుపు శాసన మెల్లెడ నిలుపువాఁడ.

ప్రసాదాదిత్యుఁడు—మేలు! బసవన్నా! లెస్స నాడితివి.

రుద్రమదేవి—మా మనస్సంకోచంబుఁ బోఁగొట్టు వాక్యంబు పలికిన బసవ దండనాథు నెడఁ గృతజ్ఞులమగుచు, దక్షిణదండయాత్రకై యనుజ్ఞ నిచ్చుచున్నారము. నేఁటి సభలో నింక విచారణీయాంశము లేమైనఁ గలవా?

రాఘవశర్మ—(ముందుకువచ్చి, ప్రభువునకు నమస్కరించి) రాజ్యకార్యార్థమై ధాన్యవతీనగరంబున కరుగ ప్రభువు ననుజ్ఞను వేఁడుచున్నాఁడను.

రుద్రమదేవి—మా ప్రియసోదరి నభిమానించితి మని తెలుపుఁడు.

రాఘవశర్మ—విధేయుఁడను.

(రాఘవశర్మ వెనుకకు తగ్గఁగా మల్లికార్జునుఁడు ముందుకు వచ్చును)

మల్లికార్జునుఁడు—బసవదండనాథునితోఁ జోళయుద్ధంబుల కేఁగ సార్వభౌము నంగీకారముఁ గోరుచున్నాఁడ.

రుద్రమదేవి—(యోచించి) బసవదండనాథునితో నరుగు సైన్యములో మల్లికార్జునశర్మ కెట్టి యధికారపద మున్నది?

మల్లికార్జునుఁడు—నా కేసైన్యభాగంబుతోడను ప్రమేయము ఏర్పఱుపఁబడలేదు. మన్మాతృమూలమున కాకతీయవీరోత్తముల రక్త మీ శరీరమునఁ గలుగు నా కెట్టి నిర్వ్యాపార స్థితి యహితముగా నున్నది.

రుద్రమదేవి—(యోచించి) బసవదండనాథా! మీతోడ నేగు సైన్య మెంత?

బసవన్న—మేమును, మా యనుచరులును, పదివేలమంది. మట్టూన్నాళ్ళ గోత్రవీరులును, వారి యనుచరులును గలిసి మఱియుఁ బదివేలు. సామ్రాజ్యసైన్య మొక పదివేలు. చేరి ముప్పది వేలు.

రుద్రమదేవి—రాష్ట్రసైన్యమునకు మీ యధీననాయకు లెవరు?

బసవన్న—నగరసైన్యాధికారిగ నుండిన వీరమల్లు.

రుద్రమదేవి—ప్రసాదాదిత్యా! నగరసైన్యాధికారమునకు వీరమల్లు దండనాథునకు బదులుగ నెవ్వ రేర్పఱుపఁబడిరి?

ప్రసాదాదిత్యుఁడు—ఇంక నెవ్వరును నియమింపఁబడలేదు. ఇంతవఱకు విప్పర్లవారలును, మట్టూన్నాళ్ళవారును కాచు, రామలక్ష్మణులపేరుగల, నగరోత్తర ప్రాకారభాగంబులం దున్న బురుజులపై యధికారములును నింక నెవరియందు నుంపఁబడలేదు.

రుద్రమదేవి—దక్షిణంబున కేగు దండులో నెట్టిమార్పులును ఆవశ్యకములు కావు. నగర సైన్యాధిపత్యంబునకు మల్లికార్జునవర్మ నియమింపఁబడిరి. రామలక్ష్మణగడీలఁ గాచుటకుఁ బెంపాలవారలను, మీ కేచర్లవారలను, నియమింపుఁడు. వీరోత్తములగు మల్లికార్జునవర్మయొక్క సమరోత్సాహము, సామ్రాజ్యవహనమునకుఁ బెంపొందుఁగాక. రాజ్యకోశాధికారి మంగలి వచ్చువజహును రెండవమంత్రియే యీ యధికారమును నెఱవేర్చుఁగాక!

ప్రసాదాదిత్యుఁడు—భాగ్యము.

రుద్రమదేవి—స్వయంభూదేవు కరుణ నాంధ్ర సామ్రాజ్యము వర్ధిల్లుఁగాక!

(మహారాజ్ఞి లేవఁగా సభవా రందఱును లేచి, నమస్కరించి, నిలుతురు.)

భట్టుమూర్తులు—కాకతి సామ్రాజ్యలక్ష్మికి జే!

(తెరదిగును.)

తృతీయాంకము.

తృతీయరంగము.

ప్రదేశము—ఏకశిలానగరములోని భాస్కరాచార్యుని గృహము.

(ప్రవేశము—గ్రంథపఠనశీలన మొనర్చు భాస్కరాచారి, గణితమును సాధించు లీలావతి.)

భాస్కరాచారి—అమ్మా! లీలావతీ! ఆ పద్యమునకు నేఁ జెప్పిన యర్థమును మహారాజ్ఞికి విన్నవించితివా!

లీలావతి—విన్నవించితిని.

భాస్కరాచారి—ఎట్లు విన్నవించితివి? వివరముగఁ జెప్పుము.

లీలావతి—నిన్న సభానంతరమున మహారాజ్ఞి నన్నుఁ గాంచుటతోడనే "నీ తండ్రి భాస్కరాచారి యీ కట్టుపద్యమున కర్థ మేమైనఁ జెప్పఁగలిగెనా?" యని యడిగెను. అప్పుడు నేను ఆపద్యమును జదివి, తాము చెప్పిన యర్థమును విన్నవించితి.

భాస్కరాచారి—మఱల నా పద్యముఁ జదివి తాత్పర్యము చెప్పుము. నేను చెప్పిన దంతయు సరిగ ప్రభుసన్నిధిలో విన్నవించితివో లేదో చూచెదను.

లీలావతి—"ఆ. గ్రంథ ములను గోరు కన్య ద్విజాంగన
పెండ్లి వేళఁ దనదు ప్రియునిఁ గూడి
వేయి మంది నాకు వేడుక బలి యిచ్చి
బ్రహ్మ చర్య దీక్షఁ బరయ వలయు."

కాళికాలయములోని గుప్తంబులగు గ్రంథములఁ దీయించు ప్రయత్న మొక ద్విజ కన్యకచేఁ జేయింపవలె ననియు, అట్టి కన్యక వివాహసమయంబుననే వరునితోఁ గూడి అట్టి యత్నముఁ జేయఁ బూనుట కాళికి ప్రీతికర మనియు, మొదటి రెండుపాదముల తాత్పర్య మని మనవిచేసితిని.

భాస్కరాచారి—ఆ భావము సరి యని మహారాజ్ఞి యంగీకరించెనా?

లీలావతి—"అంతవఱకు సులభమే. కడమ రెండుపాదముల భావ మేమి?" అని యడిగెను.

భాస్కరాచారి—నీ వేమని బదులు చెప్పితివి?

లీలావతి—"వేయిమంది నాకు వేడుక బలియిచ్చి" అనుచో జీవబలుల నిచ్చుటకు వీలులేని సమయమున మంత్రబలంబున జంతువులఁ గల్పించిన నారికేళఫలంబులను వానికి బదులుగా బలిగా నుపయోగించుట శాస్త్రమర్యాద యని విన్నవించితిని.

భాస్కరాచారి—ప్రభు వేమనెను?

లీలావతి—"కాళి నింత సులభముగా మోసపుచ్చెదవా?" యని నవ్వెను.

భాస్కరాచారి—సరి. తరువాత?

లీలావతి—నాల్గవపాదములో సూచింపఁబడిన బ్రహ్మచర్యదీక్షకుఁ గాలమితి పద్యమునఁ జెప్పఁబడియుండకపోవుటచేత ఒకసంవత్సరము మాత్రమె యీ నియమము పాటింపఁ బడుట పద్యభావ మని చెప్పితిని.

భాస్కరాచారి—మంచిది. నీపైఁ బెట్టిన పని నెఱవేర్చితివి. మహారాజ్ఞి యీవిధమగు ప్రయత్నమునకు సమ్మతించెనా?

లీలావతి—ఆలోచించి యుత్తరువు పంపెద ననియు, ... (సందేహించును.)

భాస్కరాచారి—నీ తండ్రినగు నాయందు సందేహ మేల! చెప్పుము.

లీలావతి—ఆ పద్యమునఁ జెప్పఁబడియుండు కన్యక నీవేయగుటకు సిద్ధముగా నుండునని యుఁ బలికెను.

భాస్కరాచారి—(సంతోషముతో) తల్లీ! మహారాజ్ఞి మనయెడ సుముఖియై పలికెను. కావున మన మదృష్టవంతులమే.

(తెరలో) భాస్కరాచార్యా!

భాస్కరాచారి—అమ్మా! ఎవరో పిలుచుచున్నారు. చూడుము.

(లీలావతి నిష్క్రమించును.)

భాస్కరాచారి—(తనలో) నేను వచ్చిన జ్యోతిర్గ్రంథ సంపాదన కార్యముతో పాటుగ సన్ని కార్యములును సానుకూలముగ నున్నవి. మహారాజ్ఞి వివాహమునకుఁ గూడ ముహూర్తము విచారించుటకు జాతకములు నాయద్దకుఁ బంపఁబడినవి. ప్రకృత సందర్భములకు తోడుగా మహారాజ్ఞి వివాహముతో నా కొమార్తయగు లీలావతియొక్క-వివాహమును, అందుమూలమున జ్యోతిర్గ్రంథ సంపాదనమును గలిసివచ్చునట్లు తోఁచుచున్నది. ఇవన్నియుఁ ద్వరలోనే సమకూడఁగలవు.

ప్రవేశము—లీలావతి.

లీలావతి—తండ్రీ! ప్రసాదాదిత్య దండనాథులు వచ్చియున్నారు.

భాస్కరాచారి—వెంటనే లోనికిఁ దీసికొని రమ్ము.

(లీలావతి నిష్క్రమించును.)

భాస్కరాచారి—(తనలో) మహారాణిగారి వివాహముం గూర్చి విచారించుటకై ప్రసాదాదిత్య దండనాథుఁడు వచ్చియుండనోపు. కొన్ని రాజ్యకార్య సందర్భములఁ బట్టి మహారాణిగారి వివాహము త్వరలోఁ జేయింప నీ రాజ్యసామంతులు, దండనాథులు, ప్రజలును వేగిరపడుచున్నారు.

ప్రవేశము—లీలావతి వెంట ప్రసాదాదిత్యుఁడు.

ప్రసాదాదిత్యుఁడు—భాస్కరాచార్యా! నమస్కారము.

భాస్కరాచారి—శుభమస్తు. శుభమస్తు. దయచేయుఁడు.

(ప్రసాదాదిత్యుఁడు చిత్రాసనముపైఁ గూర్చుండును.)

భాస్కరాచారి—తల్లీ! నీ వేగి యీ గణితమును సాధింపుచుండుము.

(లీలావతి ఫలకముతో నిష్క్రమించును.)

ప్రసాదాదిత్యుఁడు—భాస్కరాచార్యా! రాణిగారియొక్కయు, మల్లికార్జునవర్మయొక్కయు జాతకముల రెంటిని బరిశీలించితిరా!

భాస్కరాచారి—ఆ! చాలవఱకుఁ బరిశీలించితిని.

ప్రసాదాదిత్యుఁడు—అట్లయిన జాతకములఁబట్టి చూడ వారి కిద్దఱకు ననుకూల దాంపత్య యోగములు కనిపించినవా?

భాస్కరాచారి—దండనాథా! అట్టి యోగము భగవంతుఁడే నిశ్చయించినాఁడు. లేకున్నచో వారిద్దఱును సమహృదయభావనులుగ, అన్యోన్యానురాగ పాత్రులుగ, బాల్యమునుండియుఁగా నీ కల్లోలసమయముల నొక్కచో విధి పుట్టించియుండునా?

ప్రసాదాదిత్యుఁడు—నక్షత్రముల యనుకూల్య మట్లే యున్నది. చిరకాలమునుండి యీ రాజకుటుంబమునందుఁ గల భక్తిచే మా కందఱకును సంకల్ప మట్లనే యున్నది. త్వరలో మహారాణిగారికి వివాహము చేయించి, ఏకశిలానగరసింహాసనముపై పురుష సింహకిశోరము నధివసింపఁజేయవలయు నని ముచ్చటపడుచుంటిమి.

భాస్కరాచారి—అయిన నా కొక సందేహము. మన మహారాజ్ఞిని పరిణయంబు కాఁగోరు స్వతంత్రరాజ్యాధిపతు లనేకు లుండరుకదా. వా రందఱకంటె నీ యిల్లటపుట్టినవాఁడగు మల్లికార్జునునే మీరు కోరుటేల?

ప్రసాదాదిత్యుఁడు—దానికి ప్రబలమైన కారణము లున్నవి. కీర్తిశేషులగు గణపతిచక్రవర్తిగారి యాదేశము నట్లే యుండెడిది. కావున తమ మేనల్లుఁడగు మల్లికార్జునుని, కొమార్తెయగు రుద్రాంబను, వారు తమతోఁగూడ దండయాత్రలఁ ద్రిప్పుకొనుచు వచ్చిరి. అప్పటినుండియు తన హృదయఫలకమునందుఁ జిత్రించుకొనిన మల్లికార్జునమూర్తినేకాని రుద్రమాదేవి వేఱొక రాజకుమారుని పాణిగ్రహణం బొనర్చుటకు ఒప్పనేరదు. పోనీ. ఆమెను వేఱొక స్వతంత్ర రాజ్యాధిపతి కుమారునికి వివాహము చేయుద మనుకొన్నను, అతఁడు మా రుద్రమతోపాటుగ ఓరుగంటిరాజ్యము గూడ స్వీకరించి, తన రాష్ట్రములోఁ గలుపుకొనుటకుఁ బ్రయత్నించును. అందుచే నింతకాలమునుండి నిరంకుశస్వాతంత్ర్యమును నొప్పిన యీ త్రిలింగమహాసామ్రాజ్య మొక మాండలిక రాష్ట్రమగును. మఱియు నింతకాలమును ఈ రాజ్యపరివారము, పౌరుషముతో బ్రతికిన మే మందఱమును మాచే పలుమార్లోడింపఁబడిన యే రాజులనో యాశ్రయించుట కొప్పుకొనవలసివచ్చును. లేదా రాజ్యకల్లోలమునకైన సిద్ధపడవలెను. అడవులఁబట్టియైన పోదుముగాని యిట్టిపద్ధతికి ఆంధ్రవీరులు ఒప్పుకొనరు. కావున నీ కాకతిరాజకుటుంబమునకు సమీపబంధువుఁడగు మల్లికార్జునస్వామియే మా రాణికిఁ దగిన వరుఁడుగ మా కందఱకును దోఁచినాఁడు. ఇఁక నాతని జాతకవిషయ మెట్లున్నదో తాము సెలవీయవలయును.

భాస్కరాచారి—ఎట్లుండుటేమి! దివ్యముగ నున్నది. అయ్యా! చూచితిరా! దీనిలో నొక్క రహస్య మున్నది.

తే. ఆత్మలో దృఢతరమగునట్టి పూన్కి-
మంచి యోచించి మీవంటి మనుజవరులు
చేయఁదలఁచిన కార్యంబు శీఘ్రకాల
ఫలితమై తీరు గ్రహయోగబలముకలిమి.

తే. మంచిచెడుగుల సూచించు మహితయోగ
కారణా గ్రహపూరుషుల్ కలుగఁజేయు
మిశ్రఫలముల వివరించి మేలుకీళ్లు
సూఁచి యితమిత్థ మనుటయు దుర్ఘటంబు.

తే. మదిని మీరెంచు కార్యంబు మంచిదైన
సద్గ్రహానుకూల్యంబును, శత్రుయోగ
కరణ శాంతియు, యోచించి కార్యసుఫల
సరణి నెఱఁగింత్రు జ్యోతిషశాస్త్రవిదులు.

ప్రసాదాదిత్యుఁడు—(నవ్వి) అట్లయిన "మనోజయంతు మాండవ్య" మనియే తమయుద్దేశమా?

భాస్కరాచార్య—కాదా? తమయభిప్రాయమో?

ప్రసాదాదిత్యుఁడు—నా యభిప్రాయమును నాచేతిలోని కత్తి యెఱుఁగును. నే నెఱుంగను. కాని యేదియెట్లున్నదో జాతకములఁ బరీక్షించుట మర్యాదకదా?

భాస్కరాచార్య—అవును. కావుననే యిటు చిత్తగింపుఁడు. ఇది రుద్రమాదేవి జాతకము.

గు	రా		
ల. చం	రాశిచక్రము.		
			ర
	కు	శ కే	బు శు

మహారాణీవారిది కుంభలగ్నము. అందే చంద్రుఁడు. రెండవది యగు వాక్స్థానమున తదధిపతియు విద్యాకారకుఁడును నగు గురువు. మూడింట, ధైర్యస్థానమున, విజయకారి యగు రాహువు. సప్తమంబున సప్తమాధిపతి యగు రవి. అష్టమంబున అష్టమాధిపతి బుధుఁడు ఉచ్చ. ఆయుర్వృద్ధికరము. అతనితో శుక్రుఁడు. తొమ్మిదవది యగు తులారాశి యందు లగ్నాధిపతి యగు శని; ఉచ్చ. ఆతనితో కేతువు. రాజ్యస్థానం బగు దశమంబున క్షేత్రకారకుం డగు కుజుండు.

ఆ. జన్మలగ్నమునకు సప్తమంబు వివాహ
భావ మధిపుఁ డైన భానుఁ గూడె;
నదియు సింహరాశి యగుట జాతకకాంత
ప్రియుని శౌర్యనిధిని బెండ్లి యాడు.

ఆ. సతికి లగ్నమందు సంపూర్ణ శుభచంద్రుఁ
డలరుఁ; బుత్రకారుఁ డయిన గురువు
తనదు నింట రెంటఁ దనరుఁ బంచమనాథు
నుచ్చగతుని చూడ్కి- నొప్పు కలిగి.

కావున మహారాణికి శుభదాంపత్య సంతానయోగంబు కలదు.

ప్రసాదాదిత్యుఁడు—ఎట్టిసంతానము!

భాస్కరాచారి—(కొంచెము సందేహించి) ఆవిషయమే సరిగ లేదు.

ఆ. పుత్ర భావ భర్త బుధుఁడు షండుఁడు చేరె
నీచ గతుని శుక్రు నెలతగొనము
లిచ్చు వాని నెన్మిదింట; మీ రాణికి
నాఁడుబిడ్డ లిద్ద అనఁగ వలయు.

ప్రసాదాదిత్యుఁడు—సింహాసనముపై మగబిడ్డను గూర్చుండఁబెట్టి, నేత్రోత్సవముగఁ దిల కింపఁదలఁచు మాకు మజల స్త్రీప్రభుత్వమునే సూచించుచున్నారే!

భాస్కరాచారి—అట్లుకాదు. మీ రాణిగారి ఆయుస్థానాధిపతి యగు బుధుండును, ఆయుష్కారకుఁ డగు శనియు నుచ్చయం దున్నారు. కావున మీ రాణిగారు దీర్ఘాయుష్మతియై వర్ధిల్లును.

ప్రసాదాదిత్యుఁడు—అదియే మే మెప్పుడును కోరునది.

భాస్కరాచారి—అట్లామె వర్ధిల్లుచుండఁగనే వంశోద్ధారకం బైన మనుమఁడు కలుగునని ఈ యోగంబువలనఁ దెలియుచున్నది. కావున ఈ రాజ్యమున కింకొక స్త్రీప్రభుత్వము కలుగదు.

ఆ. పుత్ర కారి గురువు పురుషుండు కుజు రాజ్య
నాథు భావవర్తి నవమదృష్టిఁ
జూచు చుండు కలన శుభమూర్తి యీ రాణి
పౌత్రుఁ డగును మీకు భావి రాజు.

ఆ. పంచమంబునకును పంచమం బగు తుల;
దీని భర్త గురుని దృష్టి నుండి
ఘన కుటుంబ భావ గతుల నాతనిఁ జూడ
వనిత కుమరుఁ డగును వంశకర్త.

ప్రసాదాదిత్యుఁడు—సంతోషమే! మా రాణికిఁ బుత్రుఁడైనను, పౌత్రుఁడైనను, శాకతి సింహాసనముపైని బురుషుఁడు కూర్చుండవలెను. ఇఁక మల్లికార్జునన్న జాతక మెట్లున్నది?

భాస్కరాచారి—అదియు నిట్టిఫలంబులనే సూచించుచున్నది.

ప్రసాదాదిత్యుఁడు—ఏవిధముచేతనైన నేమి! ఏకశిలానగర రాజ్య సింహాసనంబున పురుషసింహ కిశోరముం జూడఁగోరు మా సంకల్పములు ఫలించినఁ జాలును.

భాస్కరాచారి—తప్పక ఫలింపఁగలవు.

ప్రసాదాదిత్యుఁడు—ఇంకొక్క సంతోషవార్త మీకు తెలియఁగింప వచ్చితిని.

భాస్కరాచారి—వేగమె సెలవిందు.

ప్రసాదాదిత్యుఁడు—మీ కొమార్తయగు లీలావతి వివాహము కూడ వారి పాణిగ్రహణ సమయముననే కావలె నని మహారాజ్ఞి యాదేశము. అది మీకు సమ్మతమా?

భాస్కరాచారి—అంతకంటె మేము కోరఁదగిన దేమున్నది? మహారాజ్ఞి వివాహ మహోత్సవ సమయంబున శుభంబుగా లీలావతీవివాహముఁ గూడఁ జేయింపుఁడు.

ప్రసాదాదిత్యుఁడు—లీలావతికి వరుని నిశ్చయించితిరా?

భాస్కరాచారి—ఆవిషయమై మహారాజ్ఞి యాజ్ఞయు, మీ యందలి యనుమతియు, నాకు సమ్మతము. ఐనను మా యాత్రేయశాఖవారైన రెండవమంత్రిగారి పెద్దకుమారుఁడగు రాఘవశర్మను గూర్చి యిదివఱకే యాలోచించుచుంటిమికదా.

ప్రసాదాదిత్యుఁడు—సరియే. కానిమ్ము. ఆతఁడు ధాన్యవతీపురమునుండి వచ్చెనా!

భాస్కరాచారి—త్వరలో రాఁగలఁడని తెలియుచున్నది. అయ్యా! దండనాథా! నాకొమార్త పెండ్లితో సంబంధించియున్న వేఱొక ప్రయత్నమును గూర్చి మహారాణిగారు తమతో నేమైన సెలవిచ్చిరా!

ప్రసాదాదిత్యుఁడు—జ్యోతిర్గ్రంథసంపాదనమును గూర్చియా! ఆ. సెలవిచ్చిరి. మీ లీలావతి మహారాజ్ఞితో విన్నవించినరీతిగ మిమ్ములను దేవికి పూజావిధానములఁ జేయించు యత్నంబున నుండుఁడని వారి యాజ్ఞ.

భాస్కరాచారి—మిగుల సంతోషము. అన్నిప్రయత్నములు సానుకూలములును, శుభప్రదములును కాఁగలవు.

ప్రసాదాదిత్యుఁడు—ఈ వివాహములకు ముహూర్తంబు లెప్పుడుకుదురునో యేమైన విచారించితిరా!

భాస్కరాచారి—ఈవిషయ మిదివఱకే యాలోచించి కొన్నిముహూర్తంబులఁ జూచితిని. అవన్నియు త్వరలోనే కుదురఁగలవు. ఈ సందర్భములోఁ గొంచెము గణితసాధనముచే నిర్ణయింపవలసిన యంశములు కలవు. గణితమునఁ బ్రవీణయగు నాకొమార్తతో ఆ గణితమును పూర్తిపఱుచు చుంటిని. ఈపాటికిఁ బూర్తిచేసియుండును. అమ్మా! లీలావతీ!

(ప్రవేశము:—లీలావతి పలకముతో.)

భాస్కరాచారి—అమ్మా! ఆ గణితమును బూర్తిగ సాధించితివా!

లీలావతి—పూర్తిపఱచితిని.

భాస్కరాచారి—ఏదీ! పలక నిటు తెమ్ము. (పలక పరీక్షించి) ఏమీ! ఇంతత్వరలోనే కుదిరినదా! ఇంకఁ గొంత సావకాశముగాఁ జూడకపోతివా! ఇది మిక్కిలి యనవకాశముగ నున్నది.

లీలావతి—ఇన్ని శుభంబులకును విశేషసమయము త్వరలో వేఱొకటి లేదు. పరిశీలింపుఁడు.

భాస్కరాచారి—సరే చూచెదను. నీ వేగి లోపల విశ్రమింపుము.

(లీలావతి నిష్క్రమించును.)

ప్రసాదాదిత్యుఁడు—"ఇంతత్వరగా" ననుచున్నారు. ఎన్నాళ్ళకు వీలుగనున్న దేమి!

భాస్కరాచారి—ఈ శుభముహూర్తంబు పండ్రెండు దినములకే కలదు.

ప్రసాదాదిత్యుఁడు—అయిన నేమి!

భాస్కరాచారి—మహారాజ్ఞి వివాహమునకు దగునంతటి ప్రయత్నముల కీమాత్రపు గడువు చాలునా!

ప్రసాదాదిత్యుఁడు—చాలునది చాలనిది మహారాజ్ఞియే నిర్ణయింపఁగలదు. నే నొక్కదానిఁ జూపి మాత్రము చెప్పఁగలను. ప్రభువులు తలపెట్టిరేని పండ్రెండుదినములకే కాదు; రేపటికే యీవేళకు నన్నియు సిద్ధపఱుపఁగల పరివారము, సామగ్రి, ధనమును, గలిగి సామ్రాజ్యము సంపాదించుచున్నది.

భాస్కరాచారి—అంతేకాక యీ శుభవార్త విస్తీర్ణమైన యీరాజ్యమం దంతటను దెలిసి, మహోత్సవ సమయంబునకు రాఁదగిన ముఖ్యులందఱును వచ్చుటకుఁ దగినంత యవకాశము కావలయుఁగదా.

ప్రసాదాదిత్యుఁడు—ముఖ్యు లందఱును నుత్సవములఁ జూడవత్తురేని రాజ్యపరిపాలన మెట్లు నెఱవేఱును. రాజ్యపు సరిహద్దులఁ గాచు కోటలనుండి గాని, దండయాత్రలందుండి కాని, యెడతెగని జాగ్రత్తతో నుండవలసిన దండనాథులు వచ్చుటకు వలనుపడదు. ముఖ్యమగు రాజకార్యముల నియుక్తులగువారును రాఁజాలరు. ఎవరెవరి వంతుల వెంట వారువారు పనులయందును పండుగలయందును కష్టసుఖములఁ బడక తీరదు.

భాస్కరాచారి—అట్లయినచో "శుభస్య శీఘ్ర" మ్మను వచనము ననుసరించి వెంటనే మహారాజ్ఞీ వివాహ శుభకార్యములఁ బ్రారంభింపుఁడు.

ప్రసాదాదిత్యుఁడు—మహారాజ్ఞితో విన్నవించి, వంశవృద్ధుల యొక్కయు, కులగురువుల యొక్కయు, ననుమతిఁ బడసి, వారి యాజ్ఞ తెఱఁగున వర్తింతును. నే నిఁక సెలవు పుచ్చుకొందునా! (నమస్కరించును.)

భాస్కరాచారి—శుభమస్తు.

(ప్రసాదాదిత్యుఁడు నిష్క్రమించును.)

భాస్కరాచారి—జోతిశ్శాస్త్రములోని యొక్క విషయముం గూర్చి నాకు సందేహము కలదు. గ్రహ చార బద్ధులై యగుచు జీవకోటి సకలవిషయంబులందును ప్రవర్తించు నెడల వ్యక్తిస్వాతంత్ర్యమున కవకాశ మేది! పాపపుణ్యకార్యసమాచరణంబున జీవకోటికి ఎట్టిస్వాతంత్ర్యమును లేనిచో ధర్మశాస్త్రంబులకు ప్రయోజనము లేదే! ఎవ్వఁడేపని చేయునో ఆపనియొక్క పర్యవసానమునకు నాతఁడే యుత్తరవాది కావలెను. కాని "ఏగ్రహముయొక్క ప్రేరేపణచేతనో యట్లు చేసితి" నని వాఁడు జవాబు చెప్పి నెడ మనము హర్షించి యూరకుండవలసినదేనా! కావున ఆలోచింపఁగా వ్యక్తిస్వాతంత్ర్యమునకు సంపూర్ణావకాశము తప్పక యుండితీరవలెను. ఈ పర్యవసానమును స్థిరపఱుచుటకై నా మనంబు ఏకారణంబుననో మిగుల నుత్సాహపడుచుండును. శాలికాలయములోని గ్రంథములు సాధించి, ఈవిషయమును గూర్చి వానిలో నేమైన చర్చింపఁబడనేమో చూచెదఁగాక.

(నిష్క్రమించును.)

తృతీయాంకము సంపూర్ణము.

శ్రీ

జ్యోతిర్లీల.

చతుర్థాంకము.

ప్రథమరంగము.

ప్రదేశము—ఏకశిలా నగరములోని వీధి.

ప్రవేశము—రాహుకేతువులు, వేఱుదిక్కులనుండి.

కేతువు—అన్నా! రాహూ!

రాహువు—ఎవరది? కేతువా?

కేతువు—అవును. నీవుకూడ ఈ యోరుగంటి నగరవీధులం దిరుగుచున్నావే!

రాహువు—ఈ నగరమునం గల వింత లారయుటకు మనవారిచేత నంపఁబడితిని. నీవో?

కేతువు—నేను వేడుకపడి మీయందఱికంటె నొకింత ముందుగనే యీ పురంబునకు వచ్చితిని. కాని ... ... ఏమంత తొందర? కొంచెము నెమ్మదిగా నడువుము.

రాహువు—అవు నట్లే నడువవలెను. పారములేని యాకాశమున పరుగిడునంత తొందరగ నడుచుట కీ భూమిపై నవకాశ మేదిరా తమ్ముఁడా?

కేతువు—అదికాదు. ఆకాశంబున మన కిద్దఱికిని వెనుకనడచుట యలవాటు. ఈ భూమికి వచ్చినప్పటినుండియు మానవులకు విపరీతముగఁ గన్పింపకుండుటకై ముందుకు నడువ వలసివచ్చినందుకు నేను చిక్కుపడుచున్నాను.

రాహువు—(నవ్వి) ఇదియా! అలవాటులేని క్రొత్తపద్ధతులలో నుండు చిక్కు లిట్టివే. సరేకాని కేతూ! ఏమిభూగోళమురా!

కేతువు—అవునురా అన్నా! పైపేరునకు మాత్రము మన గోళము లన్నింటిని గొప్పగఁ జెప్పుకొందుము. నిజముగ కొన్ని వైశాల్యమునమాత్రము పెద్దవే. కాని అవన్నియు నీ చిన్ని భూగోళము పైని దిగదుడుపునకైనఁ బనికిరావురా!

రాహువు—నీకుఁ దల లేకున్నను తెలివిగల మాటచే చెప్పితివి కా! ఎంతటి సౌమ్యవాయువు! ఏమి పావనోదక సుసృష్టి! ఎంతటి ఫలవృక్షములచే నిండిన పర్వతపంక్తులు! ఏమి జీవనదులు! నాకిందే యుండిపోవలెనని యున్నదికా!

కేతువు—ఇఁక మనగోళముల మాట తలపెట్టకు. ఒకటి నల్లి నీడ; వేఱొకటి మంటల గ్రక్కు, పొగలు రేఁగుచుండె. ఇంకొకటి మేడియుండెయు నశించి గొడ్డువారిన జీవచ్ఛవము. మఱియొక్కటి చిరకాలానావృష్టిచే నివాసానర్హమైనది.

రాహువు—వలదు వలదు. ఇఁక వానిమాట చెప్పకు. ఈ గోళమంతటిలో నీ యూర్ధ్వపర్వము గనుక్క రామణీయక విశేషము కనిపట్టితివా?

కేతువు—కనిపట్టితి. కర్మభూమి. వైరాగ్యనిధులగు ప్రజలు.

రాహువు—అదిగో మునిసీ వైరాగ్య మిటుఁ దెచ్చిపెట్టుచున్నావు. ఇదివఱకే వైరాగ్యాతిశయముచే ప్రజా సమూహమునకు కర్మసన్యాసము పట్టుచున్నది.

కేతువు—మఱి నీవు చెప్పఁగలవేమి?

రాహువు—చెప్పెద నిట్లు విన్నవించిన నా. నవయౌవనులు నారీమణుల లావణ్యము కనిపెట్టకుండుటకు గ్రుడ్డివాఁడవా యేమి? నీ మనంబు నందభామ లెందు కన్పడకుందురు?

కేతువు—స్త్రీల సౌందర్యవిశేషములలో నా కెన్నఁడును ప్రవేశము లేదు. ఆ విషయమై చిత్రసేనల నడుగుము.

రాహువు—పశ్చిమాంధ్ర రాజధానియగు ఏకశిలానగరంబు రామణీయకముచే నమరావతిని ధిక్కరించుచున్నది. అందలి పౌరులలో విశేషముఁ గనిపట్టితివా?

కేతువు—లేదు. ఏమది?

రాహువు—ఇందున్న పురుషవరుల నీ లక్షణములు. వారి నేత్రముల నిశ్చలతీక్ష్ణత. వారి మోములందలి శౌర్యదీప్తము. వారి బాహువుల పటిష్ఠత. వారి దేహముల బలిమి.

కేతువు—వారి కత్తుల మెఱమెఱ. వారి యీటెల మిఱుమిఱు. దివ్యతేజస్సున కలవడిన నాకన్నులకే మిఱుమిట్లు గొల్పినవి. వారెవ్వరు?

రాహువు—వారలే యాంధ్రసామ్రాజ్యస్థాపనమునకు కారకులగు క్షత్రియ, త్రిలింగ, కూర్మ, పద్మనాయకాది మహావీరులు.

కేతువు—వీరిపైనా మన మా దేవగిరిప్రభుఁ బురికొల్పినది?

రాహువు—అవును. వీరిపైనే.

కేతువు—మనము వీరిని గెలువఁగలమా?

రాహువు—గెలువఁగలమా యను సందియ ముంచు కోటనే పోరి గెలుచుట వినోల్లాసకరము కాని నీవంటి పిఱికి పెద్దమ్మల నెంచుకొని బెదరించిన నేమికీర్తిరా?

కేతువు—ఏమో. అది వినాయకుని యిష్టము. దేవగిరిరాజగు మహాదేవుని సైన్యము లన్నియు నీ కాకతీయ నగర ప్రాంతములకుఁ జేరినవా?

రాహువు—ఓరుగంటి ప్రాంత తారణ్యములఁ బ్రవేశించినవి. కొలఁది కాలములోనే కోట పట్టుకొను ప్రయత్నము జరుగును. ఇది యిట్లుండ మన కార్యసాఫల్యమునకుఁ గొంత యానుకూల్య మేర్పడినది.

కేతువు—ఏమది? త్వరగఁ జెప్పుము. ఈ నగరవాసులలోఁ బోరుట యనిన నాకు మిగుల నిరుత్సాహముగ నున్నది.

రాహువు—సైన్యనాయక వీరశ్రేష్ఠులలో నొక్కఁడగు విశ్వస్త బలవసింహనాథుఁడు కొంత సైన్యముతో మిత్రరాజ సహాయార్థము దక్షిణదిక్కునకు కొలఁదికాలముక్రిందటనే బయలువెడలి పోయెనఁట.

కేతువు—సంతోషము. సంతోషము. తక్కిన వీరవరులు కూడ కోట విడిచిపోవు నుపాయము గల్పించరాదా? అప్పుడు స్త్రీజనముతోడ మాత్ర ముండిన కోటఁ బట్టుకొనుట మనకు సులభము.

రాహువు—ఈదేశపు స్త్రీలయినను కంచుకములపైని కవచములు తొడిగి, బాలుర దించి, బల్లెముల కత్తులఁ బట్టి లేని దేవసైన్యముల నైనను తెగనఱుకఁ గలరఁట.

కేతువు—ఓహో! మన కన్ననహా ఏదో చిక్కు వచ్చునట్లున్నదే. అది యట్లుండ నగము సైన్యము పైకి వెడలిపోయిన తర్వాత నీ కోట గుఱించింత విశ్రాంతిగ నుండుటకు మాఱుగ నింత క్రిక్కిరిసిన జనముతో మిగుల సందడిగా నున్నదేమి?

రాహువు—ఎఱుఁగవా! ఈ రాణికి కొలఁదిదినములలోనే [illegible] వివాహము కానున్నదని వాడుకగ నున్నది. అందుకై యీ రాజధాని చుట్టుపట్లఁ గల పల్లెలనుండి ప్రజలు నిజ మెఱుంగుటకై కోటలో గుమిగూడుచున్నారు. ఆజనములోఁ గలిసియే నేనీ నగరములోఁ బ్రవేశించితి.

కేతువు—ఓహో! మంచిసమయమునకే వచ్చి చేరితిమే! ఈవార్త మన గోష్ఠాధిపు లందఱకుఁ దెలియునా

రాహువు—నిరంతర వైరాగ్యచింత గల నీకుఁ దక్క తక్కినవారందఱకుఁ దెలియును. కావున నీ సందడిసమయముననే మనసైన్యముల నీకోటలోఁ బ్రవేశపెట్టి, యప్రమత్తులగు దేశ్యవీరుల లోఁబఱచుకొను తలంపుతో మనవా రున్నారు. ఏమి జరుగునో చూచెదము రమ్ము.

కేతువు—సరే పదము. (కొంత నడచి) ఆఁగుమాఁగుము. ఈ వీధివెంట నెవ్వరో తప్పటలఁ గొట్టుచు వచ్చుచున్నారు. వారినిఁ జూచి పోవుదము. (ప్రక్కగ నిలుతురు)

(ప్రవేశము—తప్పెటలవారు)

తప్పెటలవాండ్లు—(తప్పెటలు వాయించుచు) మా మా మహారాణిగారికి, మమ్ముఁ గాచు తల్లిగారికి, పెండ్లినేఁడుకలు, రేపటినుండి, మొదలు. కాఁబట్టి, ఈపట్టణములో, పల్లెలలో, ప్రజ లందఱు, పురుషులు, స్త్రీలు, బాలురు, కోటలోనికి రావలసిందోహోయి. (అనుచు చాటింతురు)

రాహువు—కేతూ! వింటివా? మహారాణి వివాహకార్యములు రేపటినుండియే ప్రారంభమఁట.

కేతువు—అయ్యో! మన ప్రయత్నములచే నీ శుభములు భంగపడును గాఁబోలు.

రాహువు—ఏమో! భావికాల పరిస్థితులు మనముమాత్రము నిశ్చయముగాఁ జెప్పఁగలమా?

కేతువు—సరికాని యీ తప్పెటలు వాయించు వారల లందఱు చెడత్రాగి యున్నారు. మనకుఁ బనికివచ్చునేమో!

తప్పెటలవాండ్లు—తొలఁగు. తొలఁగు. మావోళ్లా గుంటావయ్యా! ఇదిగో సారాకాయి. (అని రాహువునకు సారాకాయ నిచ్చి, తప్పెటలు వాయింపుచు, మహారాణీ వివాహవార్త చాటింపుచు, నిష్క్రమింతురు.)

కేతువు—ఈ పాత్రలోని రసము కొంచెము రుచిచూడుము. ఈ లోకపు మత్తుపదార్థము లెట్టివో తెలియును.

(తెరలో మేళములు)

రాహువు—ఆఁగుము. ఇవ్వైపునుండి కొన్ని మేళములు వచ్చుచున్నవి. వీనితోఁ గొందఱు పెద్ద లున్నారు. ఈ పానపాత్ర మనచేత నుండరాదు. (పాఱవైచును.)

కేతువు—అయ్యయ్యో! సోమసుధవంటి పానీయమును వృథచేసితివే!

(ప్రవేశము—మేళములు, వేశ్యలు, విప్రులు, భటులు, సర్దారులు. వేశ్యల నాట్యము జరుగుచుండును.)

కేతువు—(జనాంతికముగా) అన్నా! యీ సంబరమును గూర్చి యీ భటుల నడుగుము.

రాహువు—(ఒక బంటుతో) ఈ యుత్సవములు మీ రాణి వివాహమును దెలుపునవేనా?

భటుఁడు—కనకతప్పెటలు వినలేదో! చెవులు లేవో! రాణి యనెద వేల? మహారాణి యనలేవో! నోరు తిరుగదో?

కేతువు—మేము ఈయూరికి క్రొత్తవారము. కావున ... ...

భటుఁడు—క్రొత్తవారా! క్రొత్తవారైనచోఁ గోటలోనికి వచ్చుటకు సెలవుచీటి యేది? చూపుఁడి. త్వరగ.

రాహువు—అది మావద్ద లేదు. నగరద్వారముల వద్ద సెలవుచీటి కొఱకు మమ్మెవ్వరు నడుగ లేదు.

భటుఁడు—హో! నాయకా! వీ రెవ్వరో క్రొత్తవారు. సెలవుచీటి లేదు. తన్నుదునా?

కేతువు—అన్నా! మన మంతర్ధాన మగుటకు సమయ మైనది.

నాయకుఁడు—ఈ మహోత్సవసమయమున సెలవుచీట్లు నమగవలదను ప్రభువు నానతి తాగుడుచే మఱచితివా? వానిని చిక్కఁబెట్టక వదలను. (రాహు కేతువులతో, అయ్యా! ఆ తాగుబోతుగోల మీకేల? ఇటురండి. కాకతిరాజన్య కులదైవమగు శ్రీ స్వయంభూదేవుని కరుణచే మా ప్రభువైన రుద్రాంబామహారాజ్ఞికి పాణిగ్రహణమహోత్సవము జరుగును. ఆమె మేనత్తకుమారుఁడగు మల్లికార్జునవర్మ వరుఁడు. మఱియు మహారాజ్ఞిగారి కృపకుపాత్రురాలగు లీలావతి యను విప్రకన్యకను మా దండనమంత్రిగారి పెద్దకుమారున కిచ్చి యించుమించుగ నదేసమయమున వివాహము సేయుదురు. తామేగి, నగరమున నాగంతుకులకునై యేర్పాటుగబడిన భోజనశాలలో సాపడి, యచ్చోఁ జక్కఁగఁ బురంబునం గల వినోదములఁ దిలకింపుఁడు. మే మింకఁ బెద్దల నాహ్వానింప నేగవలెను. ఆఁ! పదుఁడు. నడువుఁడు. (కేతాళములతో నాయకుడు నిష్క్రమించును)

రాహువు—కేతూ! గ్రహగోళాధిపునకుఁ దెలుపవలసిన విశేషము లెన్నఁటి నెఱింగితిమో చూచితివా!

కేతువు—త్వరలో వానిని గనిపెట్టియుందము. ఇక్కడ విశ్రాంతిగ నూపిరివదలుటకే నాకు భయముగనున్నది.

రాహువు—ఈవైపునకే యొక్క ముసలిబ్రాహ్మణుఁడు వచ్చుచున్నాఁడు. ఈతనినుండి యేమైన విశేషములు గ్రహింపఁగలుగుదుము. రమ్ము.

(ప్రవేశము—గుడిపూజారి బ్రాహ్మణుఁడు.)

బ్రాహ్మణుఁడు—ఈ సంబరములు చూడకుండ నాకిప్పు డీ గ్రహచార మేమి!

రాహువు—అయ్యా! గ్రహచార మనుచున్నావు. జ్యోతిష్కుఁడవా?

బ్రాహ్మణుఁడు—జ్యోతిషము, గ్రహములు నూతిలోఁ బడుఁగాక! జ్యోతిషమే నన్నీ సంబరములఁ జూడనీక కోటవెలికిఁ దోలుచున్నది.

రాహువు—అట్లనుట కేల? గ్రహములచే మీ కట్టియపకారము జరిగినది?

బ్రాహ్మణుఁడు—లేదా? జరుగలేదా! మాతల్లి మహారాజ్ఞి యొక్క పెండ్లివేడుకలు చూడకుండ కోటవెలుపలనున్న కాళిగుడికి "దేవుఁడా" యని పోవుట సంతసమా! ఆ గుడి పూజారినై యగుదునుగాక. పెండ్లిసమయములందైన సానిమేళము చూడఁగూడదంటయ్యా!

రాహువు—చూడవలదని మిమ్ముల నిర్బంధించినవా రెవ్వరు?

బ్రాహ్మణుఁడు—తెలియనట్లే యడిగెదవేమయ్యా! మహారాజ్ఞి వివాహములోనే లీలావతి పెండ్లి కూడ కావలెనా! ఆమె వరుఁడగు రాఘవశర్మ యింక నగరంబునకు తిరిగి

రాన్నైన లేదు. అయినను లీలావతిపెండ్లికిని కాళికాలయములో నున్న జ్యోతిర్గ్రంథములకును ఏల సంబంధము ముడిపెట్టవలెను? అవి తీయించునప్పు డింకొక విప్రకన్యకకుఁ బెండ్లి చేయింపఁ గూడదా? బాగుగనున్నది. తొలఁగవయ్యా! ఆ లీలావతమ్మ దేవిపూజ కిప్పుడే గుడికి వచ్చునఁట. నేను ముందుగఁ బోవలెను. (నిష్క్రమించును.)

రాహువు—వినఁదగిన దీ ముసలివాని నుండి వింటిమి.

కేతువు—ఏమది?

రాహువు—రుద్రాంబవివాహములోపాటుగ లీలావతిపెండ్లియు జరుగుచున్నది. లీలావతి వివాహమునకును కాళికాలయములోని జ్యోతిర్గ్రంథములకును ఒకవిధమగు సంబంధము కల్పింపఁబడినది. మనము దివిపై నూహించినట్లే యిచ్చటి సందర్భములు సమకూడుచున్నవి. మనవారికి వీనిఁ దెలుపవలయును. మఱియు కోటలోనికి వచ్చువారికి సెలవుచీటి యక్కఱలేదనెడి సందడిసమయమునందే మనసేనలను కోటలోనికిఁ బ్రవేశపెట్టుచో మనకార్య మతిసులభముగ నెఱవేఱును. కావున త్వరపడుము. రమ్ము.

కేతువు—ఇట్టి సమయమును పోఁగొట్టుకొనరాదు. పదవుము.

(ఇద్దఱును నిష్క్రమించుచుండఁగా తెర దిగును.)

చతుర్థాంకము.

ద్వితీయరంగము.

ప్రదేశము—ఓరుగంటి రాచనగరు. మహారాజ్ఞి మందిరోపాంతము.

ప్రవేశము—స్త్రీజనము పెండ్లిపనులయందు సందడిగాఁ దిరుగుచుండగా పెండ్లిసింగారములో చేతిలో పూజాద్రవ్యములు గల పళ్ళెరముఁ బూని లీలావతి.

లీలావతి—వకుళా! వనమాలి! ఈసందడిలో నామాట నెవరును వినుపించుకొనునట్లు లేదు. చేటీ! వకుళా!

(ప్రవేశము—చేటి.)

చేటి—లీలావతీదేవియా? పెండ్లికూఁతురై వచ్చినదే!

లీలావతి—ఈనాఁటి మీ యలంకారము చూచిన అందఱును పెండ్లికూఁతులవలెనేయున్నారు. మహారాజ్ఞి దర్శనమునకు సమయమా?

చేటి—ఇప్పుడే యభ్యంజన మైనది. కురు లార్చుకొనుచు నలంకరించుకొనుచున్నారు.

లీలావతి—ఈ పూజాద్రవ్యములను మంగళస్నానమొనర్చిన మహారాజ్ఞిచే స్పృశింపఁజేసి, దేవిగుడికిం గొంపోవలెను.

చేటి—లోనికిరమ్ము. ఒకసారి నిన్నుఁ గూర్చి ప్రభువు ప్రశంసించిరి.

(తెర తొలఁగఁగా అభ్యంజనస్నాన వస్త్రధారణానంతరము మేడ డాబాపై రుద్రాంబ యలంకరించుకొనుచుండును. స్త్రీపరిజన మామె కురు లార్చుచుందురు.)

రుద్రమదేవి—లీలావతీ! నీకు అప్పుడే గుడికిఁబోవు సమయ మైనదా!

లీలావతి—సమయమునకు ఒకింత ముందుగనే వచ్చితి.

రుద్రమదేవి—పెండ్లికై యింత తొందరయా?

లీలావతి—తల్లీ! అదికాదు.... ...

రుద్రమదేవి—సిగ్గువడకు. జీవిత పరిస్థితులలో కోరుకొను మార్పు మేలు గలిగింపవలెనని యాసపడుట ప్రకృతిసహజము. అది యట్లగుట అదృష్టవిశేషము. కాఱ్చుదాము. (దాదులతో) సాంబ్రాణి వెచ్చఁ దెండు.

దాదులు—అనుజ్ఞ! (నిష్క్రమింతురు.)

రుద్రమదేవి—మంచిదిని. రాఘవశర్మ నేఁటి సాయంతనమునకే నగరమునకు మరలి రావలసి యుండెను. అతఁడు వచ్చెనా?

లీలావతి—(సిగ్గుతో) ఇంకను రాలేదఁట. కొంచెము సేపటికే వచ్చుననుకొనుచున్నారు. మహారాజ్ఞీ! పెక్కు నాళ్ళ కోరిక నేఁడు సమకూడెను.

రుద్రమదేవి—(నవ్వి) అట్లగుటయే మా యుద్దేశముకదా.

లీలావతి—తల్లీ! నేఁ జెప్పు కోరిక యదికాదు.

రుద్రమదేవి—మఱేది?

లీలావతి—అసామాన్యంబైన తమ కురుల విలాసము చూడవలెనని.

రుద్రమదేవి—(నవ్వి కురులార్చుకొనుచు) ఇం దసామాన్యం బేమున్నది! చూడుము.

లీలావతి—అనుజ్ఞ! (రుద్రాంబ కురు లార్చుచు) తల్లీ! కాంతలకుఁ గబరీభారమే మేలైన యలంకారము సుమా!



ఉ. నీలపు టుంగరాలవలె నిద్దపు ఫాల మలంకరించి, పైఁ
దేలి, శిరంబుఁ గ్రమ్ముకొని, తీరగు నంసయుగంబు, మధ్యమున్
లీలఁగ దాఁటి, శ్రోణి విపులీకృతలంబలిలోలవిశ్రుతిన్
వ్రేలెడి పెన్నెఱుల్ భ్రమరవేణికిఁ జేకుఱు భాగ్యరేఖలై.

ఉ. చిక్కఁగ శీర్షభాగమునఁ జేరు కురుళ్ళను రెండు మూఁడు నిం
కెక్కువగా జనించి, మలినేతరనైల్యముతోడ సోగలా
నొక్కులతోడ రాజిలి, మనోహరనిర్జిత జానుసీమముల్
జిక్కఁగ బాఱు పెన్నెఱుల చెల్వమె చెల్వము కాంత కెయ్యెడన్.

రుద్రమదేవి—దృష్టిబెట్టుచుంటివా!

లీలావతి—మన్నింపవలెను. తమకురులం దగులు దృష్టి నాది కాదు.

రుద్రమదేవి—(కొంచెముగ నవ్వి) దాదుల త్వరగా సాంబ్రాణి తెమ్మనుము.

లీలావతి—(చూచి) ఇదే తెచ్చిరి.

(ప్రవేశము—దాదులు సాంబ్రాణి బొచ్చెలతో)

రుద్రమదేవి—కానిండు. (కురులు చూపును.)

(దాదులు నిప్పుల బొచ్చెలు పట్టఁగా, లీలావతి సాంబ్రాణి వైచును. మఱియొక దాది వేణి సవరించును.)

దాది—లీలావతీ! మాతల్లి కురుల సౌరు చూచితివా!

రుద్రమదేవి—లీలావతి వాని మెచ్చలేదు దాదీ!

లీలావతి—మెచ్చకపోవుటే! మహారాజ్ఞీ! నేను వివిధదేశస్త్రీల వేణీసౌందర్యముల బాగుగఁ బరీక్షించితిని.

సీ. బంగారుమొలకఁగల పట్టుమెత్తని కురుల్
యవన పాశ్చాత్య హూణాంగనలకు
గౌరవర్ణపు నిగ్గు గల మృదుకేశముల్
గాంధార సౌరాష్ట్ర కామినులకు
లాలిత నీల రోలంబ కుంతలములు
పాంచాల మగధాంగ భామినులకు
ఘన కాలకాంతి సంగత కచభారముల్
కొంకణ ద్రవిడాంధ్ర కోమలులకు

గీ. లలిత కేశ సమ్మోహ విలాసములగు
నైపథ్యనాపాదలంబ నీలాభ్ర కుటిల
కుంతలంబుల నిగ్గు లత్యంత మొప్ప
ధన్యకేరళదేశ కాంతలను జూడు.

రుద్రమదేవి—ఇందఱ శిరోజములఁ బరీక్షింపనే కేమి యూపత్యకరి కలిగెను? అనకాక మొట్లు చిక్కెను?

లీలావతి—వేణీవర్ధనము, వేణీరక్ష యను రెండు భాగములు గల 'వేణీవిలాస' మను గ్రంథ మొకటి స్త్రీల యుపయోగార్థము రచింపుచు, తద్గ్రంథ సంపాదనార్థము దేశయాత్ర సలుపు మా తండ్రి భాస్కరాచార్యులవారి వెంట నేగుచో, నాయాదేశములందాయా నారీమణుల పరిచయమును, వారివారి కేశ సౌకుమార్యాదులను వారువారుపయోగించు తైలాదులను బరీక్షించుచు వచ్చితి.

రుద్రమదేవి—గ్రంథము పూర్తియైనదా?

లీలావతి—సర్వవిధ సువిలాస భాసురంబై యెల్లర కాదర్శప్రాయముగ నుండదగిన వేణీవిలాసంబు నింతవఱకుఁ జూడకుంటచే గ్రంథము నింక ముగింపలేదు. నేఁటి కా కోరిక తీరెను.

రుద్రమదేవి—లీలావతి మాటలు నేర్చినది.

లీలావతి—నిజము చెప్పవలసినఁ గాని తప్పక సంతోషపెట్ట నెఱుంగుట లేదు. తల్లీ! నాకింక కాఁగినచోఁ బోవ సమయమైనది. నేఁటి గ్రీష్మఋతుశోభ గాంచి యీ పల్లెలయం దున్న పూర్ణప్రసన్నముల స్పృశింపుఁడు.

రుద్రమదేవి—అప్పుడే! నీ కింత పనిగా కావలసినచో తలుపులు తెఱతురు.

లీలావతి—ప్రభువుల సన్నిధి యొప్పంపుమ పట్టనగలుగ నుండును. అమ్మా! గుడి కోట వెలుపల నుండుటచే నే వచ్చుటకు కొంత తడవు పట్టును. అదికాక చీఁకటియుఁ బడుచున్నది. చూడుము.

గీ. అల్ల చంద్ర ఖండ మదిగో! నీలాకాశ
మును తారలందు దనరుచుండె
నీదు లేత నొసలు నెఱి చికురములందు
విరుల సౌరు తోడ వెలయునట్లు.

స్త్రీపరిజనము—మేలు! లెస్సగఁ బలికితివి లీలావతీ!

లీలావతి—ఆ. అదిగో! యుత్తరమున నచలుఁడౌ ధ్రువు చెంతఁ
దిరుగు వారు సప్త దేవ మునులు;
వారి వలెనె నిఖిల తారాగణమ్మును
నింగి నెలవు లందు నిండి వెలుఁగు.

రుద్రమదేవి—(శిరి కేశముల మడుమకొని, త్రిశూల చిహ్నముగల శిరోభూషణమును ధరించి) మహాతపస్వుల నిటు తెమ్ము.

లీలావతి—(పత్రికను రాణిచే స్పర్శింపఁజేయుచు) మహారాజ్ఞీ! శ్రీ రుద్రాంబికాదేవి కృపచే స్వయంభూదేవు ననుగ్రహమ్మున వీరోత్తముఁడగు మల్లికార్జునుని భర్తగాఁ బడసి వర్ధిల్లుము.

అందఱు—మేలు! మేలు! వర్ధిల్లు. వర్ధిల్లు తల్లీ!

రుద్రమదేవి—(స్తబ్ధురాలై యుండి) ఇప్పుడే స్ఫురించెను. లీలావతీ! నీ విప్పుడు చేసినట్టి కాళిగుడి వంక నుండి యేదో వింత ధ్వని వినిపించుచుండే వినవచ్చెను.

లీలావతి—అమ్మా! ఏమి ధ్వనులు!

రుద్రమదేవి—ఏమి ధ్వనులో చెప్పఁజాలను. అట్టి విదివఱ కెన్నఁడును వినలేదు. దూరమున తుమ్మెదల రొదలవలె—పక్షుల కలకలము వలె ... ...

లీలావతి—(వినయముతో నవ్వి) అది నీ వివాహ మహోత్సవమును దెలుపు ప్రజల కలకలము. తల్లీ! క్షమింపవలెను. నా కొక్క విషయము స్ఫురణకు వచ్చినది.

రుద్రమదేవి—ఏమది?

లీలావతి—ఆ. కలికి కోకిల పాటలోఁ గన్నెతెరయు,
చంద్రు మోములో నీడియు, మందపవను
నంపు శోభనా భావమ్ము, చెంది చేసి
కవులు విరహిణులకు నార్తిఁ గల్గు చుందురు.

గీ. కాని, కవిమన్మథుండవు నీ ఘనత నరసి
నిశను మట్టుపడగలెంబు నిఖిల పక్షి
రవము విని నీకు వింత విభ్రమముఁ గూర్చె
నూత్నకవి భావకల్పనా యత్న మట్లు.

రుద్రమదేవి—(నవ్వి) అప్పటి కింక చీఁకటి పడలేదు కదా. మఱియు నంత సులభముగ భ్రమపడుదుమా! అది యట్లుండె. నీవిఁకఁ బోవచ్చును. వెంటఁ దగు భటులు యున్నారా?

లీలావతి—భటరక్షకను మార్గమునఁ గలిసికొనఁ గలను. సెలవుఁ గైకొందును.

రుద్రమదేవి—మంచిది.

(లీలావతి నిష్క్రమించును.)

రుద్రమదేవి—(పరిజనముతో) వలయునపుడు పిలిచెద.

(పరిజనము నిష్క్రమించును)

రుద్రమదేవి—అధికసించి నేఁ డేలొకో మా మనంబు వింతరీతి సందేహములకుఁ జాలగు చున్నది. ఇట్టి తెన్నఁడును లేదు. కులదైవముల నిత్యార్చనలలో లోప మేమియు లేదుకద. విచారింతము. చేటీ!

(చేటి ప్రవేశించును)

రుద్రమదేవి—స్వయంభూదేవు నాలయమునుండి, తీర్థప్రసాదములు వచ్చినవా?

చేటి—ఇప్పుడే పూజరులు ప్రసాదములఁ దెచ్చి యిచ్చి, దేవపూజలు సరిగ నెఱవేర్పఁబడినట్లు తమకు విన్నవింపు మని మాతోఁ జెప్పి, సెలవుపుచ్చుకొనిరి.

రుద్రమదేవి—మంచిది. మొన్న లీలావతి లిఖించిన నక్షత్రపట మా గోడకు వ్రేలుచున్నది. తెమ్ము.

చేటి—ఆజ్ఞ! (తెచ్చి, ఒల్లెపైనుంచి, నిష్క్రమించును.)

రుద్రమదేవి—(పటమును ఆకాశమును పరికించుచు) అల్లదే సప్తర్షి సమితికి తిన్నగ పై నాందోళి కాకృతిగఁ గనఁబడు నైదు చుక్కలే మఘా నక్షత్రము. తరువాత పూర్వోత్తర ఫల్గుణీ నక్షత్రములు. ఆపై నైదును హస్త కాంబోలు. అటుపై తూర్పుగ మాణిక్యమువలె దివ్యతేజస్సున వెల్గునదే చిత్రాతార. (వినుట నభినయించి) అదిగో! మజల నా వింతధ్వని వినఁబడుచున్నది. నేఁ డేవియో విపరీతములు జరుగునట్లు మా మనమున నొక సందియము కలుగుచున్నది. ఏమీ! సందియమా! కాకతిసింహమునకు సందియమా! ఏవంకఁ జూచినను శతయోజనదూరంబునం గాని పరరాజ్యంబే లేని ఆంధ్ర సామ్రాజ్య లక్ష్మికి సందియమా? (నవ్వి, తిలయూచి) అల్లదే యేకశిలానగర ప్రాకారము. డెబ్బది యేడు బురుజులతో వెలయుచున్నది. ఒక్కొక బురుజునకు వేయేసి మంది మన్నె దొరలు ... కోటను దమ ప్రాణంబులతో సమంబుగ గాచు డెబ్బదియేడు గోత్రంబుల పద్మనాయక వీర నికరములు ను గలవు. శత్రుదుర్భేద్యంబుగ నొప్పుచున్న ఓరుగంటి మేటి కోటయొక్క నగద్వయు నదిగో. ఇటకు దగ్గఱనున్న యీ ప్రాకారభాగంబున గస్తితిరుగు రక్షకభటుల యీటెలు మొదళ్లపొన్నుకట్లు గోడరాళ్ళపైఁ దగిలి యదె కంగు కంగున మ్రోఁగుచున్నవి. (యోచించి నవ్వుకొనుచు) నేఁడు నామనం బింత భ్రమ పడుచున్నదేమి! పెండ్లివేడుకఁ జూడవచ్చు జనుల సందడి కింత యోచనయేల?

(తెరలో యుద్ధసంబంధమైన కలకలము.)

అదేమి! ఉత్తరప్రాకారపు బురుజులకడ నేదియో కలఁత జరుగుచున్నట్లున్నదే! పెండ్లిసంబర మను నెపమున కమఁ దాగి, యొడలు తెలియక, మా భటులు వారిలోవారు కలహించుచున్నవారేమో, విచారింతము. దాదీ!

(ప్రవేశము:—దాది.)

రుద్రమదేవి—దాదీ! ఉత్తరద్వారముచెంత నేదో కలకలము వినవచ్చుచున్నది. ప్రతీహారిణిని గుఱ్ఱముపై నంపి యదేమో తెలిసికొని రమ్మనుము.

దాది—ఆజ్ఞ! (నిష్క్రమించును.)

(తెరలో గడితలుపులు మూయు చప్పుడు.)

రుద్రమదేవి—అదేమి! నగరద్వారములు అప్పుడే మూయఁబడినవే! చేటీ!

(చేటి ప్రవేశించును.)

రుద్రమదేవి—నేఁటినుండి వేడుకలఁ జూడవచ్చు జనుల సౌకర్యమునకై నగరద్వారముకడ సెలవుచీటినే యడుగవలదనియు, రాత్రి సగము కడచువఱకును గడితలుపులు తెఱచి యుంచుఁడనియు మే మాజ్ఞాపించియుండఁగా నిప్పుడే వానిని మూయు చప్పుడు వినఁబడు చున్నది! (తెరలో కలకలము.) అదిగో! సంబరములో నుత్సాహముగఁ దిరుగుట మాని స్త్రీజన మీ వైపునకు వేగముగా వచ్చుచున్నది. వీథిలోని కరిగి, యీ వచ్చువారి నుండి విశేషముల నరసి రమ్ము.

చేటి—ఆజ్ఞ. (నిష్క్రమించును.)

రుద్రమదేవి—అదిగో! ప్రతీహారిణి తొందరతో మఱలివచ్చుచున్నది.

(వేఱొక చేటి ప్రవేశించును.)

చేటి—అమ్మా! ప్రతీహారిణి దర్శనముకొఱకు వచ్చియున్నది

రుద్రమదేవి—తోడుకొని రమ్ము.

(చేటి నిష్క్రమించి, ప్రతీహారిణితో వచ్చుచున్నది.)

ప్రతీహారిణి—జయము. జయము. కాకతిసామ్రాజ్యలక్ష్మికి.

రుద్రమదేవి—విశేషములు చెప్పుము.

ప్రతీహారిణి—ఉత్తరద్వారమునొద్ద నొక విపరీతము జరిగినది.

రుద్రమదేవి—విపరీతము!

ప్రతీహారిణి—ప్రభువులకు శుభకల్యాణసమయ మగుటచే నగరద్వారములచెంత సెలవుచీట్లు నడుగుట లేదు. ఈ యవకాశమును గొని కొందఱు విదేశీయులు సాయుధులై పురముఁ జొచ్చుచుండఁగా నగరసేనాని వారల నాఁపె నఁట.

రుద్రమదేవి—వేడుకలఁ జూడ నెందఱు విదేశీయులు వచ్చుట లేదు. దారిలో నాపుకొనుటకు ఆయుధములఁ దెచ్చుకొనిరేమో. వారల నాఁపుట యెందులకు [illegible]?

ప్రతీహారిణి—అంత వా రాఁగక బలవంతముగ లోనికిఁ బ్రవేశింపఁ బ్రయత్నించిరి. వారికిని మనవారికిని గొంత పోరు జరిగె నఁట.

రుద్రమదేవి—ఆఁగుమనుచున్న నాఁగక మనవారితోఁ బోరునకుఁ గడఁగిరిగా! ఆపైన?

ప్రతీహారిణి—ఉభయపక్షములవారికిని గాయములు తగిలిన తరువాత మనవారు కొందఱు ప్రతికక్షులఁ బట్టుకొని, కొందఱు పాఱిపోవువారల ద్వారపాలకులకు [illegible]. తోడనే నగరద్వారము లన్నియుఁ బంధింపుఁ డని నగరసేనాని యుత్తరువు లిచ్చెనఁట!

రుద్రమదేవి—ఈమాత్రమునకే నగరద్వారము లన్నియు మూయఁబడుట యెందుకు?

ప్రతీహారిణి—కొదువవివరము లన్నియు నగరసేనానియే తమ కడ విన్నవింప వచ్చెద నని మనవి చేయుమనెను.

రుద్రమదేవి—సరియే. నీవు వెలుపల నిలిచి, యాతని రాక మా కెఱుఁగఁ బంపుము.

(ప్రతీహారిణి నిష్క్రమించును.)

చేటీ! ఎదుట చవికె నుంచుము. (చేటి అట్లు చేయును.)

(మఱొకచేటి ప్రవేశించును.)

చేటి—అమ్మా! కొందఱు పురస్త్రీలు దేవిదర్శనమునకు రాఁగోరుచున్నారు. సెలవా?

రుద్రమదేవి—రానిమ్ము.

(చేటి నిష్క్రమించును.)

రుద్రమదేవి—ఈ యనుమానము లన్నియు సత్యములే యగుచున్నవి. నే ననుమానించినట్లే యీ విపరీతము జరిగినది. (స్మృతి నభినయించి) కాన మల్లికార్జునుఁడే నగరసేనాని. ఇట్టివేళ నే నాతని నొంటరిగఁ జూడవచ్చునా? (తల యూఁచి) సామాన్యజన నిబంధనలను సామ్రాజ్యవాహులు లోకోత్తరు లెట్టిని దాఁటక తీరదు.

(ప్రవేశము:—దాదులు, కొందఱు పురస్త్రీలు)

పురస్త్రీలు—తల్లీ! మహారాజ్ఞీ! నగరదైవంబుల కాగ్రహము కలిగినది.

రుద్రమదేవి—ఏమది?

శ్రీలంకాబు—గనీలన్నియు మూయఁబడినవి. మా యమ్మవైన నీయొక్క పెండ్లిసంబరమునకై అంగళ్లలోఁ దిరిగి వస్తువులఁ గొనుచున్న మమ్మందఱ నిండ్లకుఁ బోవలసిన దని నగర సేనాని యుత్తరువు లిచ్చినాఁడఁట. వీధులలో మన బంట్లటు నిటు పరుగులెత్తు చున్నారు.

రుద్రమదేవి—ఛీ! కలవరపడ వలదు. ఇదే నగరసేనాని రాఁగలఁడు. అతనివలన వివరము లెఱుఁగవచ్చును.

(ప్రతీహారిణి ప్రవేశించును)

ప్రతీహారిణి—మహారాజ్ఞీ! నగరసేనాని వచ్చియున్నారు.

రుద్రమదేవి—లోనికి రమ్మనుము.

(ప్రతీహారిణి నిష్క్రమించును)

(ప్రవేశము—మల్లికార్జునవర్మ.)

మల్లికార్జునుఁడు—(కత్తియెత్తి యభివాదనము సల్పుచు) ఆంధ్రసామ్రాజ్యలక్ష్మికి జయ మగుఁగాక! కాకతిసింహాసనమునకు భద్ర మగుఁగాక!

రుద్రమదేవి—దాదీ! ఆధివసింపఁజేయుము.

(దాది పీఠిక చూపును.)

మల్లికార్జునుఁడు—అనుగ్రహింపఁబడితిని. నావచ్చిన కార్యము సామ్రాజ్యమున కత్యావశ్యకము. కాలము మిక్కిలి యపాయప్రదము.

రుద్రమదేవి—(ఉద్వేగముతో) అత్యావశ్యకమా! అపాయమా! సామ్రాజ్యమునకా! ఎట్టి మాటలు! విశేషములు?

మల్లికార్జునుఁడు—మహారాజ్ఞిక హృదయోద్వేగ ముపశమించుఁగాక. అత్యావశ్యకము తీరినది. అపాయప్రదము కాకపోవచ్చును. మన కోటచుట్టును ప్రబలసైన్య మొకటి యరికట్టియున్నది.

శ్రీలంకాబు—నేఁడేయే! మా తల్లి పెండ్లిసమయము! ఇప్పు డీ విపరీత మేల దాపురించెను. మహారాజ్ఞీ! మహారాజ్ఞీ! నగరంబును గాపాడుము.

రుద్రమదేవి—ఊరకుండుము. ఊరకుండుము. ఆంధ్రవీరుల గని పెంచు మీర లిట్లలజడి నొందఁ దగునా? స్వయంభూదేవు ననుగ్రహంబున కాకతిసింహంబు కత్తి ధరింపఁగల్గు నంత వఱకును మీ కేమియు భయము కలుగదు. (మల్లికార్జునునితో) నగరద్వారములు?

మల్లికార్జునుఁడు—కోటలోనికి శత్రువులు ప్రవేశింపకుండ మూయఁబడినవి.

రుద్రమదేవి—మేలు! నగరము రక్షింపఁబడినట్లే. నగర రక్షణ సైన్యము నిదురించుటలేదు. మన సైన్యంబులను కూడఁబట్టుకొనుట కవకాశ మేర్పడినది. (పురస్త్రీలతో) మీ రేఁగి వెనుకగదులలో నుండుఁడు. పొండు. మీ కేయిక్కట్టును రానీయను.

(స్త్రీలు నిష్క్రమింతురు.)

పెద్దదాదీ! నీవు అక్కడ నాయెదుట నుండుము.

పెద్దదాది—అనుజ్ఞ! (దూరమున నిలుచును.)

మల్లికార్జునుఁడు—స్త్రీలను బాలురను ఇట్లలజడి పడుదురనియే వేడుకలోఁ దిరుగు జనుల నిండ్లకుఁ బొమ్మని యాజ్ఞాపించితిని. సేనలు నిరాఘాటముగ నడచుటకు వీధులు వట్టివిగ నుండు టావశ్యకము కదా.

రుద్రమదేవి—అది సరియే. కాని సైన్యమా? ఎవ్వరిసైన్యము? ఎక్కడిసైన్యము? ఎట్లు రాఁగలిగెను.

మల్లికార్జునుఁడు—మిత్రసైన్యము మాత్రము కాదని తెలిసికొని తొలుత నగరద్వారములు మూయించితి.

రుద్రమదేవి—శత్రుసైన్య మగునో? రాజ్యమునం దెవ్వ రెఱుంగకుండ రాజధానిచెంత కెట్లు రాఁగలిగెను. బావా! నేనుకూడ బురుజుపైకి వచ్చి చూచెదను. నా స్వారియశ్వమును సిద్ధపఱచుమనుము.

మల్లికార్జునుఁడు—(తనలో) ఉద్వేగముచే నీయమ తన రాజఠీవి నేమఱి, చిన్ననాఁటివలె, నన్ను 'బావా' యని పిలుచుటచే నెంత యానందముగ నున్నది.

రుద్రమదేవి—(కోపముతో) అడిగినమాటకు మాఱుపల్కక యేదియో తలంచుచు నూరక నిలిచెదవేమి? మమ్ము వేడుకపఱచుటకై వచ్చితివా?

మల్లికార్జునుఁడు—క్షమింపఁబడుదునుఁగాక. మహారాజ్ఞి బురుజుపైకిఁ బోవుట యనావశ్యకము. ఏలయన ఈ ప్రాసాదభాగంబును ఇంచుమించుగ ఆబురుజునంత యెత్తుగలదే. కావున నిచటికిఁగూడ నా సైన్యముల సూచనలు కనఁబడఁగలవు. ఆ పరిఖాభాగంబున కావల వెన్నెలలోఁ గనిపించు బయలున కావలనున్న కొలఁది యడవిపైకి మహారాజ్ఞి దృష్టిఁ బఱపినచో నా వాక్యముల నిజస్థితి విశదమగును.

మ. ఇటు నా యంగుళిచాయఁ జూడు; మదిగో యెత్తైన ప్రాకార; మిం
కటుపై నీడను వల్లమే పరిఖయా; నా నీడకున్ నిండు చెం



గట కాంతీనిలయంబు; నాపయి నవే కాన్పించు నందెల్ల న
స్ఫుటమౌ బాలశశాంకు వెన్నెలలలోఁ జూపట్టు లోహప్రభల్.

కం. లోహంబుకాంతి సైనిక
దేహత్రాణాసి కుంత దీపిత; మిఁక నీ
వూహింపు మచటి జనసం
దోహము విస్తార మనుచుఁ దోఁచునొ లేదో.

రుద్రమదేవి—ఆ కనిపించు వింతకాంతులు సైనికుల యాయుధములపైవా?

మల్లికార్జునుఁడు—అవును. ఆ యడవితోఁ గలసినట్లు కనిపించు వైరిసైన్యములను మహారాజ్ఞి వివరముగా పరికింపఁగును.

సీ. హిమబిందు సిక్త పర్ణములట్లు తళతళల్
గలవి బల్లెంబుల కఱకు మొనలు,
పుష్పాడి నిండిన పొదరిండ్ల యట్టివి
సేనాను లుండెడి శిబిర తతులు,
వనపుష్ప చిత్రాంశు వర్ణ మొప్పునవి
ఘన హయానీక మీఁది కంబళములు,
ఛాయాసమేత సంచారవృక్షంబుల
సరణి నందం దవే సామజములు,

తే. వివిధ వల్మీక బహుశిలావితతి రీతి
సమ విశాల కోణము లవి సైనికోప
కరణ పేటికా నివహముల్ గలుగు బండ్లు;
కాఱడవిఁ బోలు రిపుసేనఁ గాంచు మదిగో!

రుద్రమదేవి—నేఁ డీ విపరీతములు కలుగనై యుండుటచేతనే కాఁబోలు మా మనంబు మిగుల నవిశ్రాంతిఁ జెందినది. ఆ వినిపించు సందడి కూడ నీ వింతసైన్యముదేనా?

మల్లికార్జునుఁడు—సందేహమేమి? దానిదే. ఆ ధ్వనుల నొక్కొక్కటిం బ్రత్యేకముగ వినఁదగును.

సీ. తుమ్మెదరొదలట్లు జుమ్మను వేనవేల్
మనుజు లొక్కటఁ బల్కు మాటల సడి
పాలపిట్టల జీర్ల భంగి మంద్రత నొందు
కెరలు నేనుంగుల ఘీంకృతములు

పక్వఫలంబులు పసు చప్పనుగఁ దోఁచు
  ధర మోఁదు హయముల తాపసములు
ఉరియు గూబల వలవలపు టార్పులఁ బోలు
  నుబ్బు నాలుకఁ జాచు నుష్ట్రికవము
గీ. వీచు పెనుగాలి నొండొంటి రాచుకొనెడి
  వెదురు గుమ్ములు కట్టు విధముఁ దెలుపు
  సమర సంభార భరములతో శకట తతుల
  వేఁడి యురుసులు రాపాడు వింత మ్రోఁత.

రుద్రమదేవి—(విసుఁగుతో నవ్వి) వర్ణన లిట్టివేనా? నగరద్వారము లన్నియు భద్రముగ మూయఁబడినవికదా?

మల్లికార్జునుఁడు—మూయఁబడినవి.

రుద్రమదేవి—అపాయమునకుఁ దెరువు తెరిచినది. ఇఁక మనకోటను ముట్టడికై సిద్ధముచేసికొన వలసియున్నది. దాసీ!

దాది—అమ్మా.

రుద్రమదేవి—ఆ కలమును, కాగితములను ఇటు తెమ్ము.

దాది—అనుజ్ఞ. (తెచ్చును)

రుద్రమదేవి—వాని నీ బల్లపై నుంచి, బల్లను సేనాని యెదుటికి జరుపుము.

దాసి—అనుజ్ఞ. (అట్లు చేయును)

రుద్రమదేవి—ప్రతీహారులను నిద్దఱ నిటు పిలుచుకొని రమ్ము.

దాసి—అనుజ్ఞ. (నిష్క్రమించును)

రుద్రమదేవి—మల్లికార్జునునితో, తాము ఆ బల్లవద్ద కూర్చుండి కొన్ని యాజ్ఞాపత్రముల వ్రాయుఁడు.

మల్లికార్జునుఁడు—ఆజ్ఞ. (బల్లవద్ద కూర్చుండును)

రుద్రమదేవి—కోటలోని సైన్యంబు లన్నింటిని వేగమే సిద్ధపఱిచి, కోటగోడల మీఁదను బురుజులందును కావలులను — నగరద్వారంబులచెంత వీధులలో గుఱ్ఱపుదండును, ఏనుఁగులను — తీర్చి, నిలుపు మని సర్వసేనాధ్యక్షులకు వ్రాయుఁడు.

మల్లికార్జునుఁడు—(లిఖించి) వ్రాసితిని.

రుద్రమదేవి—అట్లు సేనల నిలిపిన తరువాత —— సైన్యాధ్యక్షులలో ముఖ్యులను —— మంత్రివర్గముతో గూడ ప్రాసాదమునకు ఆలస్యములేకుండ రమ్మని నేఁడొకయాజ్ఞ మహామంత్రికి వ్రాయుఁడు.

మల్లికార్జునుఁడు—లిఖించి వ్రాసినాఁడను. మహారాజ్ఞి వీనిని పరిశీలింపనగును.

రుద్రమదేవి—(కాగితములఁ బుచ్చుకొని చదివి) కలము నిట్లిండు.

మల్లికార్జునుఁడు—ఇచ్చును.)

ప్రవేశము—దాది, ఇద్దఱు ప్రతీహారిణులు.

ప్రతీహారిణులు—జయము. జయము. మహారాజ్ఞికి.

రుద్రమదేవి—(కాగితములపై సంతకముచేసి, ఒక ప్రతీహారిణితో) నీ వీ యాజ్ఞాపత్రమును త్వరితముగను భద్రముగను గొంపోయి సర్వసేనాధ్యక్షుల కిమ్ము.

1వ ప్రతీహారిణి—అనుజ్ఞ. (వెరుగున నిష్క్రమించును.)

రుద్రమదేవి—(రెండవ ప్రతీహారిణితో) నీ వీ యాజ్ఞాపత్రమును మహామంత్రికి అందఁజేయుము. త్వరగ.

2వ ప్రతీహారిణి—అనుజ్ఞ. (నిష్క్రమించును)

దాది—(మౌనముగ నిలుచును)

రుద్రమదేవి—ఈ సైన్యము మన యాహ్వానముపై వచ్చిన యే మిత్రరాజులదో యైయుండదుకదా? వైరుల దైనట్లు మన కేమి నిదర్శనము?

మల్లికార్జునుఁడు—స్వానుభవమే నిదర్శనము. కోటవెలుపల నున్న కాళీనిలయమునకు నేఁడు పూజకై యేఁగు లీలావతికి ... ...

రుద్రమదేవి—అవునౌను. లీలావతి యా సైన్యమున్న బయలులోని కాళిగుడికై కదా బయలుదేఱెను. ఆమె యాసైన్యములలోఁ జిక్కుకొనినదా యేమి?

మల్లికార్జునుఁడు—లేదు. కాని యంతపని కావలసినదే.

రుద్రమదేవి—ఎట్లెట్లు! మీరు చూచితిరా?

మల్లికార్జునుఁడు—లీలావతికి భటరక్ష ననుప సార్వభౌము లగు మీ యానతి నేను ఆయుత్తర ప్రాకారంబుపై కొలఁదిమంది భటులతో నుండఁగాఁ దెలిసెను. అప్పుడే పూజకై

యేగు లీలావతి యచ్చటికి వచ్చెను. అప్పుడు భటరక్షను సైనికహజారంబునుండి తెప్పించు టాలస్యమగునని తలంచి, నాతోనున్న కొలఁదిమందినే రక్షగా నేర్పఱిచి, పురద్వారము వెడలనున్న లీలావతికిని ఆమెతండ్రిగారికిని తోడుగాఁ బంపించితి.

రుద్రమదేవి—తరువాత?

మల్లికార్జునుఁడు—అంత నాపనిపై బురుజులయందలి కాపుల నరిచూచుకొనుచు, గడి తలుపులు మూయుట కింకను సమయము కాకుంటచే నొంటిగ పురద్వారము వెడలి, లీలావతి రక్షకభటులతో నేగిన కాలిగుడిబాటనే, కందకముచేరువ నేటి దరి దాఁక నడచి, ఆ యిసుకదరి నొకింత నిలిచితిని.

రుద్రమదేవి—ఏ యిసుకదరిని?

మల్లికార్జునుఁడు—చిన్ననాఁడు మన మిరువురమును స్వారిచేయుచు నీటికై వచ్చు జంతువులఁ జూడ నిలుచుచుండిన యిసుకదరినే.

రుద్రమదేవి—అందు నిలిచి చూడఁదగు విశేష మేమున్నది?

మల్లికార్జునుఁడు—చిన్ననాఁటి సందర్భములను మనసులోనికిఁ దెచ్చుకొను సంతోషము ...

రుద్రమదేవి—(నవ్వి) సరిసరి. దాదీ!

దాది—అమ్మా.

రుద్రమదేవి—వేఱొక ప్రతీహారిణి నిటు రమ్మనుము.

దాది—అనుజ్ఞ. (నిష్క్రమించును)

రుద్రమదేవి—అంతట?

మల్లికార్జునుఁడు—అంత నాశ్చర్యమగునట్లు, కొంతమంది విదేశసైనికులు నీటితొట్టెగంబుల మోచు నెడ్లమంద నొకదానిని నీటిదరికి తోలుకొనివచ్చి, తొట్టెగంబులలో నీరు నింపఁ జొచ్చిరి.

(ప్రవేశము:—దాది ప్రతీహారిణితో.)

ప్రతీహారిణి—జయము. జయము. ఆంధ్రసామ్రాజ్యలక్ష్మికి.

రుద్రమదేవి—నగరంబునందలి కంచరులను వడ్లబత్తులను పరికరములతో నిప్పుడే చేర్చి, నగరద్వారంబుల తలుపుల నన్నింటిని లోపలినుండియే పరీక్షించి, ముట్టడికిఁ దగనట్టి లోపము లున్నయెడల బాగుచేయింపు మని నగరశిల్పాధికారికి మా యాజ్ఞ వేగమే పోయి తెలుపుము.

ప్రతీహారిణి—ఆజ్ఞ. (నిష్క్రమించును.)

(దాది దూరముగ నిలుచును.)

రుద్రమదేవి—(మల్లికార్జునునితో) అట్లు నగరపు పెద్దమంద కనిపించుటలో విపరీతమేమున్నది?

మల్లికార్జునుఁడు—సాధారణముగ నుండఁ గూడదు. కాని వారి వేషభాషలఁ జూచిన నా కొకరీతి సందియము తోఁచినది. అందుకుఁ దగినట్లు ఇంతలో లీలావతియేగిన గుడి చెంతనుండి కత్తులమ్రోఁతయు, పోరాటపు సందడియు వినవచ్చెను.

రుద్రమదేవి—అప్పుడు?

మల్లికార్జునుఁడు—అప్పుడు నే నా వైపునకుఁ బరునెత్తఁగా పెక్కుమంది క్రొత్తవారలు లీలావతీరక్షకసైన్యమును చుట్టుముట్టి పోరాడుచుండిరి.

రుద్రమదేవి—(ఉద్వేగముతో) అప్పుడు నీ వొంటరిగనే పోయి, వారితోఁ గలియఁబడితివా యేమి?

మల్లికార్జునుఁడు—నే నేగి కంటఁబడుసరికి కొంతమంది క్రొత్తవారు నాపైకి వచ్చిరి. తమ్ము నొత్తిడిచేయువారిలో నిట్లు కొంతమంది తగ్గఁగా మన సైనికులు లీలావతీ భాస్కరాచార్యులను నడుమ నుంచుకొని, సూచీవ్యూహముగ నేర్పడి, దర్పముతో వైరి సమూహమును భేదించుకొని, దాపుననున్న కాళిగుడిం బ్రవేశించి, తలుపుల మూసికొనిరి.

రుద్రమదేవి—అట్లయిన నిప్పటికి లీలావతి కపాయము తప్పినట్లే యెంచఁదగును. ఈ యలజడిలో పురమునకై చేరవచ్చు రాఘవశర్మ యెక్కడ చిక్కుకొనెనో! వైరు లందఱొక్క మొగి నీపైఁ బడలేదుకదా?

మల్లికార్జునుఁడు—నా వెంటఁ బడిరి. కాని చీఁకటిలో పొదలమాటున నే నుండు చోటును సరిగ గుర్తింపనేరక, నాకొఱకై వెదకుచు, వేఱొకదిక్కునకు దాఁటిపోయిరి.

రుద్రమదేవి—(వేడుకగ) బావా! దాఁగుకొంటివా!

మల్లికార్జునుఁడు—నగరంబుఁ గాచు పూచి నాయందుఁ బెట్టియు దాఁగుకొనినందుకు హేళనము సేయఁదగునా?

రుద్రమదేవి—(నవ్వుచు) బావా! కోపింపకు. నీతో వేడుకసేయుచుంటిని. తరువాత?

మల్లికార్జునుఁడు—వా రట్లు పోవఁగనే నేను కోటకై మరలితిని. ఉత్తరద్వారంబు చేరితినో లేదో! ఆ క్రొత్తవా రనేకులు సాయుధులై లోపలఁ బ్రవేశింపఁబోవుట జూచి, వారి నాఁపుమని ద్వారపాలురగు మన భటులకుఁ గేకలువైచితిని. మనవార లాఁగుమనినను వా రాఁగక బలవంతముగ లోనఁ బ్రవేశింపఁ జూచిరి. ఉభయులకు నొకింత కత్తులాట జరిగెను.

రుద్రమదేవి—ఇంతకుముందు ఉత్తరద్వారమునొద్దను వినిపించిన కలకల మిదియా! తరువాత?

మల్లికార్జునుఁడు—ఒకంతసేపటిలో నా క్రొత్తవారలతోఁ గొంతమందిని పట్టుకొని, కొదువ వారల వెలుపలకుఁ దఱిమి, గడీతలుపులు మూయఁగల్గితిమి.

రుద్రమదేవి—పురంబును, కాకతీయుల యశంబునుఁ, గాచితివి బావా! తరువాత?

మల్లికార్జునుఁడు—అంతట దుర్గద్వారము లన్నియు మూయించుచు కోటగోడలపై బురుజులను ఎక్కి చూడఁగా నేమిచెప్పుదును! ఎక్కడఁజూచినను వైరిసేనాపారావారమే! ఏదిక్కుచూచినను శాత్రవకోటులే!

రుద్రమదేవి—ఈ విషయము సేనాధిపులకు హెచ్చరిక చేసితిరా?

మల్లికార్జునుఁడు—ఆట్లొనర్చి సర్వసేనాపతి యగు ప్రసాదాదిత్యునకుఁ గబురంపి, నేను మహారాజ్ఞి సందర్శనమునకై వచ్చితిని.

రుద్రమదేవి—వేఱొక యాజ్ఞాపత్రమును వ్రాయుఁడు. కోటలో మన భాండారంబులనేమి వర్తకులయొద్దనేమి భోజనసామగ్రులు, తైలాదులు, గ్రాసము, ఎంత నిలిచియున్నదో లెక్కింపఁజేసి, వివరముగ వ్రాయించిన పట్టికనొకటి మా కంపు మని మహామంత్రికి వ్రాయుఁడు.

మల్లికార్జునుఁడు—అనుజ్ఞ. (వ్రాయుచుండును.)

రుద్రమదేవి—మఱియు మహా యుత్తరువు అగుదనుక వాని నెవరును ఉన్నచోటునుండి కదలింపకుండునట్లు భద్రముచేయింపు మని కూడ వ్రాయుఁడు.

మల్లికార్జునుఁడు—అనుజ్ఞ. (లిఖించి) వ్రాసితిని.

రుద్రమదేవి—ఇటు తెండు. (కాగితము పుచ్చుకొని, చదివి, దానిపై సంతకముచేసి,) దాసీ! దీనిని వేఱొక ప్రతీహారిణికిచ్చి, వేగము మహామంత్రికి అందఁజేయు మనుము.

దాసి—అనుజ్ఞ. (కాగితము పుచ్చుకొని నిష్క్రమించును.)

రుద్రమదేవి—(మల్లికార్జునునితో) ఈసేన లెవ్వరివని మీ యూహ?

మల్లికార్జునుఁడు—కోటవెలుపల చీఁకటిలో సరిగ పోల్చుటకు వీలులేకుండెను. ద్వారమునొద్ద జరిగిన పోరులో పట్టుపడినవారిని అడిగితిమి. బలవంతపెట్టఁబడియు వారు జవాబు చెప్పలేదు. కాని దుస్తులను బట్టి చూడఁగా (వక్రోక్తితో) మన పూర్వమిత్రులగు [illegible] దేవగిరివారివలె నున్నారు.

రుద్రమదేవి—(నవ్వి) పూర్వమిత్రులే యైనచో వారికి తగిన యాతిథ్య మిచ్చితీరుదుము. కాని ముట్టడి విగియకముందు ఒక్క కార్యము నెఱవేర్పఁబడవలెను.

మల్లికార్జునుఁడు—అవహితుఁడను.

రుద్రమదేవి—కోటలో నిపుడున్న సైన్యము వీరోత్తంసులతో నిండియున్నను సంఖ్యలఁ గూర్చి యోచించునెడ మనస్సునకు తృప్తిగ లేదు.

మల్లికార్జునుఁడు—కొలఁదినాళ్ళక్రిందటనే ముప్పదివేల సేనలు బసవన్నతోఁగూడ నేగెనుగదా.

రుద్రమదేవి—మేము తలంచునది ఆ సైన్యభాగమును గుఱించియే. దూరప్రయాణము చేయవలెను కావున, బసవన్న సైన్యములను అలసిపెందనీక, నెమ్మదిగఁ, గొంపోవుచుండును. కావున నిప్పటికి విశేషదూర మేగియుండఁడు.

మల్లికార్జునుఁడు—కాకతిలక్ష్మి యాజ్ఞ యేమి?

రుద్రమదేవి—మన కోటను ముట్టడించియున్న వైరుల సైన్యములలో నెవ్వరైన నొంటరిగఁ బ్రవేశించి, వారి నెలవుపట్లఁ గనిపెట్టవలెను. అట్లు కనిపెట్టిన తర్వాత వీలగునంత వేగముతోఁ బోయి, బసవదండనాథుని సైన్యముతోఁ గూడ వెనుకకుఁ బిలుచుకొని వచ్చి, అట్లువచ్చిన సందర్భము కోటలోనుండు మేమెఱుంగుటకై దక్షిణముగఁ గనిపించు నా గుట్టపై మూడువోట్ల పొగ వేయింపవలెను. అటు తర్వాత శత్రువుల నెలవుపట్లు వేరువేరట్లు నెలవులనుండి వారిపై డీకొనవలెను. అట్లు డీకొన్నచో వైరుల సైన్యము రెండుముఖంబులై పోవలసివచ్చును. అందుచే కోటపై గొత్తిడి తగ్గును. అప్పటి సందర్భముల ననుసరించి, కోటలోని సైన్యమును మేము నడపెదము.

మల్లికార్జునుఁడు—ఈ ప్రకారమైన ఒక యాజ్ఞాపత్రము బసవన్నకు వ్రాయుమని మహారాజ్ఞి యానతియా?

రుద్రమదేవి—(యోచించి) వలదు. అట్టి యాజ్ఞాపత్రమును గొంపోవునాతఁడు వైరులచేఁ జిక్కు నేని ఆ పత్రము కూడ వైరులచేఁ బడును. అప్పుడు వారు మన ప్రయత్నముల నెఱింగి, ప్రతిగా వ్యూహములను బన్నుదురు. కావున శత్రువుల బలఁగముల నడిమి నుండి బసవన్నకుఁ బంపఁబడు ఆజ్ఞ లిఖితరూపమునకంటె వాగ్రూపమునఁ బంపుటే క్షేమకరము.

మల్లికార్జునుఁడు—అట్లయినచో నెవ్వని మాటనైతే రాజాజ్ఞగా బసవన్న తప్పక విశ్వసించునో అట్టివాఁడే యీపనికై పోవలెనుగదా?

రుద్రమదేవి—అవును. అట్టివారే పోవలయును. ఇక్కడనుండి ... ఎవ్వరైన ముఖ్యులే పోవలెను. కాని యీపని చాల అపాయముతోఁ గూడినది. కోటలో ముఖ్య సేనానాథులు ఎక్కువమంది లేరు. దండనాథుల పట్టిక అందున్నది. అందుకొనుము ... ఆ పొడవు కాగితము.

(కొంచెము దూరమున బల్లపైనుండు నొక కాగితమును మల్లికార్జునుఁడు ఇచ్చును.)

రుద్రమదేవి—(ఆ కాగితము పరీక్షించుచు) ఎవ్వరిని బంపుదము?

మల్లికార్జునుఁడు—ఆజ్ఞయైనచో నేనే పోవుదును.

రుద్రమదేవి—(సంభ్రమపడి) నీవా! బావా! ఇట్టిసమయమున నీవా! (విస్మయముతో నవ్వి, తలను అడ్డముగ నాడించి) వేడుకగ మాటాడుచుంటివి.

మల్లికార్జునుఁడు—వేడుకమాటల కిది తరుణము కాదని ఎఱుఁగనంతటి మూఢుఁడనా?

రుద్రమదేవి—(ఉద్వేగముతో) నిజముగ.

మల్లికార్జునుఁడు—విధేయుఁడను.

రుద్రమదేవి—[illegible] నగరపాలక సేనాధికారివి. నీవెట్లు పోవనగును?

మల్లికార్జునుఁడు—ముట్టడివేళల సర్వసేనానియే నగరపరిపాలకుఁ డగును గదా!

రుద్రమదేవి—(విముఖముగ) నీవు పోవుటకు మేము అంగీకరింపము.

మల్లికార్జునుఁడు—అట్లంగీకరింపకపోవుటకు నా యసమర్థతయే కారణమగునా?

రుద్రమదేవి—(విముఖియై యూరకుండును.)

మల్లికార్జునుఁడు—నే నసమర్థుఁడ నని చెప్పుట కిష్టములేక మహారాజ్ఞి మాఱుపలుకుట లేదేమో. అట్లైనచో నాంధ్రసామ్రాజ్య లక్ష్మీసంసేవకుఁ దగు నీ ఖడ్గము ఈ దుర్బలుని చేతిలో నుండఁగూడదు.

(వరతోఁ గూడ కత్తి నియ్యఁ బోవును)

రుద్రమదేవి—ఆఁగుము. ఆఁగుము. బావా! నీ సామర్థ్యమును గుఱించి సంశయ మెప్పుడును నాకు లేదు. లేదని నీవును ఎఱుంగుదువు. అట్లు సంశయించు మహారాజ్ఞి ని న్నాజ్ఞాపించుటయు లేదు. ఈ యపాయప్రదమగు పనిపై నీ వేగుట ఇష్టములేని నీ మఱఁదలు ని న్నాఁగుమనుచున్నది.

మల్లికార్జునుఁడు—మహారాజ్ఞి కేవలము మఱఁదలై మాటలాడుచున్నదా?

రుద్రమదేవి—అబ్బ! ఎట్లుమాట్లాడిన నేమి? ఈపనిపైఁ బోవుటకంటె కోటలోనేయుండి, నేను చూచి మెచ్చుకొనునట్లు పోరు సల్పరాదా?

మల్లికార్జునుఁడు—కోటలో నున్నచో పోరుసల్పు నవకాశము నాకు దొరకదు.

రుద్రమదేవి—ఏల దొరకదు?

మల్లికార్జునుఁడు—దొరకనీయకుండుట కీవు ప్రయత్నింతువు. (కోపముతో) రుద్రదేవీ! మఱఁదలి వలె మాటాడితివి. కావున బావనై నా యభిప్రాయమును తెలిపెదను. వినుము. కాకతివంశంబున జనింపకున్నను మ న్మాతృమూలమునన్నైన కాకతీయనృపాలుర రక్తము ఈ నా శరీరమున ప్రవహించుచున్నది. ఇఁక మా వంశము ఐశ్వర్యమున కాకున్నను, ధైర్యసాహసములలో పేరుపొందనిది కాదు. అట్టి నన్ను మొదటి నుండియు వీరోత్తంసులకు తగునట్టి సాహసకార్యములందు చొరనీక నీవు ఆటంకపెట్టుచున్నావు. ఇట్లు కోఁతగొఱ్ఱెవలెఁ గూర్చుండి తినుచు, క్రొవ్వు పెంచుకొనుట నా కిష్టము లేదు. ఇట్టి నన్ను తలఁచుకొని నేనే అసహ్యపడుచుందును. ఇతరులకు హాస్యాస్పదుఁడ నేల కాకుందును? అనావశ్యకముగ నిట్టి సంరక్షణ నీచే పొందుట కేను పసి బాలుఁడనా? భీరునకేకాని ధీరునకు తగనట్టి యీ బహిరంగ రాణివాసము చేసన్నేల యవమానపఱచెదవు? మహారాజ్ఞివైన నగుదువుకాక. నీ కొఱకైన నిట్లు వీరలోకముచే నవ్వించుట న్యాయముకాదు. నేనింక నిట్టి నిర్బంధమును సహింపను.

రుద్రమదేవి—(ఉత్తప్తయై కోపగర్భితములగు శాంతవచనములతో) వీరవరులగు మీకుఁ గల సమరోత్సాహమును మేము వారింపము. మాకొఱకు ఒకరు నిర్బంధింపఁబడు టేల? మీ యిచ్చవచ్చినట్లు ఒనర్పుఁడు. (కొంచెము దూర మరిగి, విముఖియై కూర్చుండి, కొప్పుముడి స్పృశించుచు) దాదీ! తడిగనున్నవి. కురు లార్పుము. (కురులు విడఁబాఱునట్లు కొప్పుముడి వదల్చును.)

మల్లికార్జునుఁడు—(కోపంబుగనున్న ముఖభావమున క్రమముగ సౌమ్యమును, ఆహ్లాదమును సూచించుచు తనలో) ఆహా! ఈమె కబరీభార విలాస మెంత శోభాకరముగ నున్నది! ఇప్పటికదా యీయమ సౌందర్యము కన్నులపండువుగఁ జూడఁగలిగితిని.

తే. నీలనీరమ్ము తరఁగల నిండి పాఱు
సమయమునసె కృష్ణాపగా సౌరకళలు;
నిడుదనొక్కుల కురుల పెన్ముడిని విప్పి
జారవిడిచిన యప్పుడే చాన సొగసు.

తే. కనుమ కోసల సౌవాస వనములందు
వలిపెములఁ బొలు కృష్ణాప్రవాహమట్లు
మరకతాదిక మేఘులా మణుల దాఁటి
నెలత నీలంపు నిగ్గుల నిమురు కురులు.

తే. వాలుజడ, జడచుట్టయు, కీలుజడయు,
త్రిప్పుముడి యను ఘనవేణి తీర్పు లన్ని
కూర్పు నత్యంత విభవంబు కోమలులకు
నరలి విడబాలు పెన్నెఱి కురులు వోలె.

(దగ్గఱ కేగి, ప్రకాశముగా వినయముగా) దాది యింకను రాలేదు. మహారాజ్ఞీ సాహసచే మన్నింపఁబడుదునుగాక. జారిన నెఱికురులు వడ్డాణపు గజ్జెలలోఁ జిక్కుపడునేమో. సరి చేయుదునా? (చేయి చాఁచును. వాఁడిఁగా చేతిపైనుండు గాయము కనిపించును)

రుద్రమదేవి—వలదు. రాజసేవయందు సమయ తారతమ్య జ్ఞానముతో నుండవలెను. (తిరిగి చూచి) కాని యిదియేమి? నీ చేతిపై గాయ మున్నదే!

మల్లికార్జునుఁడు—(గాయముమీఁద వస్త్రముఁ గప్పి) నగరద్వారము మూయించు తొందరలో నేదో యినుపముక్క గీచుకొని యుండవచ్చును.

రుద్రమదేవి—బావా! గడెకల్పులు మూయునప్పటి పోరులో శాత్రవుని కత్తిచే నైన గాయ మిది.

మల్లికార్జునుఁడు—(వినయమును సూచించి) అయిననేమి! రాజ్యసంసేవలో ఈమాత్రపు గాయము తగిలిననే ... ...

రుద్రమదేవి—వినయములు నెమ్మదిగఁ దెలిపికొందును. కాని యిటురమ్ము. గాయముపై రసిగ నిదే నా చేతి రుమాలుతో కట్టు కట్టెదను. చేయి చాఁచుము.

మల్లికార్జునుఁడు—సన్మానింపఁబడితిని. కాని వలదు. మహారాజ్ఞి యనుజ్ఞయిచ్చిన సమయ తారతమ్యజ్ఞానము ... ...

రుద్రమదేవి—(చిఱునగవుతో) బావా! ఊరకుండుము. పరిజనుల నిబంధనలు మా పట్ల వర్తింపవు. (చేతి గాయమునకు తన రుమాలును కట్టుచు, బావా! అపాయప్రదమగు నిట్టి

పనికై నీవే పోవలెనా? ... ... ప్రస్తుత సందర్భములఁ గూర్చి యాలోచింపుము. ... ... నీ చేతిపై బలమైన గాయముకూడ నున్నది. ఇంకొకరిని బంపనిమ్ము

మల్లికార్జునుఁడు—(సందేహించుచు ప్రతి చెప్పకుండును.)

రుద్రమదేవి—(కట్టుకట్టుట ముగించి) బావా! చెప్పవేమి? ఈపనిపై నెవ్వరిని బంపుదము?

మల్లికార్జునుఁడు—క్షమింపఁబడుదును గాక. రాజసేవా తత్పరత మహారాజ్ఞి యాజ్ఞకు వ్యతిరేకముగా నున్నది.

రుద్రమదేవి—రాజసేవ యన మహారాజ్ఞి యాజ్ఞానువర్తనమే కదా.

మల్లికార్జునుఁడు—మహారాజ్ఞి కేవలము మఱఁదలివలె మాటాడునప్పుడు కాదనియే చెప్పవలెను.

రుద్రమదేవి—నీకు మఱఁదలికంటె మహారాజ్ఞియే యెక్కువయా?

మల్లికార్జునుఁడు—మఱఁదలు ప్రేమస్వరూప. మహారాజ్ఞి యాజ్ఞాస్వరూప. అదియుఁగాక నాకంటె సమర్థులై నీ నగర పాలనాధికారము నెఱవేర్పఁగలవారు చాలమంది నాయకులు కలరు.

రుద్రమదేవి—నే దానిఁగూర్చి తలంచుట లేదు.

మల్లికార్జునుఁడు—తలంపనప్పుడు నా కనుజ్ఞ యొసంగిన నేమి? ... ... సాహసకార్యము నుండి నివారింపఁబడ నని సింహాసనమునుండి నాకు వాగ్దానము కూడ వచ్చినది.

రుద్రమదేవి—(కోపముతో) పలుమారులు పోయెదనన్నవారి నుంచుమనుటయు, వాగ్దానము నిచ్చి యనంతరము వెనుకాడుటయు, రెండును తప్పులే. కావున పొమ్ము. (కనులు వంచి) ఇతరు లాక్రమింపఁజాలని యింకొక పదవి నీ కుండుట మఱచితివి కాఁబోలు.

మల్లికార్జునుఁడు—స్వారాజ్యమున కావశ్యక మగునప్పుడు ... ...

రుద్రమదేవి—(పొమ్మని సంజ్ఞ చేయుచు, దగ్గుత్తికతో) అనుజ్ఞ యొసంగఁబడినది.

మల్లికార్జునుఁడు—(కత్తి దూసి, అభివాదనంబు పట్టి) మహారాజ్ఞి కార్యము సానుకూలమగుగాక.

(నిష్క్రమించును.)

రుద్రమదేవి—(ఒక్కింతసేపు విరమించి, విచారముతో) అకటా! కోపములో నొడలు తెలియక ... ఈతని ఆ శత్రుసేనలఁ నడిమికి ఒంటరిగ బోవ ననుజ్ఞ నిచ్చితినే! ... ... దాదీ!

దాది—(ప్రవేశించి) అమ్మా! ఇక్కడనే యున్నాను.

రుద్రమదేవి—త్వరగఁ బోయి, యాతని బిలువుము.

దాది—ఆజ్ఞ. (పోవుచుండఁగా)

రుద్రమదేవి—(తలయూఁచి) దాదీ! వలదు. ... ... పోవనిమ్ము. జన్మదేశసేవ పవిత్ర కార్యములలో మహోత్కృష్టమైనది. ... ... స్వతంత్రబుద్ధి కల పురుషుఁడు ... ... సామంతుఁడై నను మెచ్చఁదగినవాఁడు ... ... మక్కువఁ గల చోట ... ... మనసు నిల్పుకొనుట, ... మహారాజ్ఞినై యున్నను, మగువకు సంతృప్తిగ నుండును.

(ప్రతీహారిణి ప్రవేశించి.)

ప్రతీహారిణి—జయము. మహారాజ్ఞికి జయము.

రుద్రమదేవి—వచింపుము.

ప్రతీహారిణి—మహామంత్రి శివదేవయ్య, సర్వసేనాని ప్రసాదాదిత్యుఁడు, మఱియుఁ గొండఱు దండనాథులు, రాజోద్యోగులు ను సందర్శనార్థమై వచ్చియున్నారు.

రుద్రమదేవి—(విస్మృతిగ) మంచిది. వారితో ప్రసంగించిన పిమ్మట మన సైన్యపరిస్థితులను మేము స్వయముగఁ బరీక్షింతుము. మా స్వారి యశ్వము నాయిత పఱచి యుంచుమనుము.

ప్రతీహారిణి—ఆజ్ఞ. (నిష్క్రమించును)

రుద్రమదేవి—దాదీ! దుస్తుల సిద్ధపఱుచుము.

దాది—అనుజ్ఞ.

(మహారాజ్ఞి లేవఁగా తెర దిగును.)

చతుర్థాంకము.

తృతీయరంగము.

ప్రదేశము—హనుమకొండవద్ద ఆంజనేయాలయము. సంధ్యచీఁకటి.

ప్రవేశము—రాఘవశర్మ, గుజ్జుపుట్టు నొకటిని చేతఁబట్టుకొని.



రాఘవశర్మ—(హనుమంతునకు నమస్కరింపుచు.)

సీ. ఘనకార్యకరణ దక్షతకు బాల్యమునాఁటి
    రవిబింబ కబళ నోత్సవమె సాక్షి
న్యాయైకపక్ష సాహాయ్య దీక్షకు వన
    వాస సుగ్రీవ సేవనమె సాక్షి

వీర కారుణ్య ప్రసారంబునకు, జిత
లంకిణీ ప్రాణ పాలనమె సాక్షి
నియత ధర్మ వినమ్ర నిష్ఠా ప్రతిష్ఠకు
బ్రహ్మాస్త్రమునకు లోఁబడుటె సాక్షి

గీ. స్వల్పవాంఛావతీర్ణ మా సత్యతత్వ
నైజ జిజ్ఞాసకును, రామనామవర్ణ
సాధనోత్సాహ వర వజ్రశోధ సాక్షి
యమరముని గేయ! మహనీయ! యాంజనేయ!

చ. చంగున నొక్కగంతునను సాగరముం గడదాఁటునట్లుగా
సంగవిమోహపాశ భవసాగర మీ వవలీల దాఁటి, త
త్సంగమకారకత్వపదసామ్యముఁ గోరుట నిక్కమౌనె? నీ
వుం గనుతత్వవేత్తవు; ప్రబోధమనోంబుజ! మారుతాత్మజా!

సీ. అల దేవతల వరంబులఁ బొంది నీవు న
ర్వాస్త్రానపాయత నందకున్న
రవిపుత్రునకు రఘురాముసఖ్యముఁ గూర్చి
భూమిజాన్వేషణఁ బూనకున్న
వార్ధి లంఘించి, రావణు లంక శోధించి,
సీతాసతీవార్తఁ జెప్పకున్న
సమరవీరులఁ ద్రుంచి, సంజీవమునుఁ దెచ్చి,
భూపు మూఁపున మోచి, పోరకున్న.

గీ. భరతునకు రామ జయవార్తఁ బలుకకున్న
రామునకు లోపమా! ... యైన నీ మహిమము
విడిచి వాల్మీకి కథ నెట్లు నడపియున్నొ!
యమరముని గేయ! మహనీయ! యాంజనేయ!

(హనుమంతునకు మొక్కి)

హనుమంతునకు మ్రొక్కితిని. కావున సంకటముల నన్నింటిని సమయఁ ద్రొక్కినట్లే సంతోషింతును. సంతోషించునెడల సర్వార్థములు సిద్ధించు నని నా మతము. ఈ మతము పుట్టుకతోడనే నా కబ్బినది కాఁబోలు. ఎట్లనఁగా ముల్లుగ్రుచ్చుకొను నప్పు డెవ్వరికైన నం గొంచెము కష్టము తోఁచును. కాని సందర్భముల వైచిత్రి చూడ నాకు నోరు పట్టనంత

నవ్వు వచ్చినది. "ధాన్యవతీనగరమునుండి ఈ తట్టుగుఱ్ఱము నడువఁగలుగునంత వేగముతో నిటకు వచ్చితిని. ఇది హనుమకొండ. అదె యోరుగంటి కోటపై దీపముల వెలుఁగు. ఇం కొకింత సేపటిలో కోటలోని మా యిల్లు చేరియుందును. కాని కోటచుట్టును ఈ క్రొత్త బలఁగ మొకటి యుప్పెనవెల్లువవలె క్రమ్మియుండుటచే దారి దొరకక నే నిక్కడనే యాఁగి పోవలసివచ్చెను. అలయుచున్నను గదలఁజాలని యీ నా గుఱ్ఱపుజాతిగాడిద యలసి యున్నదిచేఁ బాఱిపోవ దనుకొని, దీని నొక పొదచాటున మేయ వదలి, యీ సైన్యముల బాగుగఁ జూచుట కీ గుట్ట యెక్కితిని. ఇంతలో నొక యేనుఁ గెక్కడిదో "ఘుయ్య్" మని యఱవఁగా, నీ తట్టువునకు నెక్కడలేని మహోద్రేకము జనించి, నాచేట్టు చూడకయే, తోఁక నెత్తుకొని, దౌడు తీయసాగినది. దీనిని బట్టుకొను ప్రయత్నములో, నా కీ ముల్లు గ్రుచ్చుకొన్నది. ఇంతలో చీఁకటి పడినది. మా యిద్దఱకును ఈ యాలయమే యిప్పటికి శరణమైనది. గుఱ్ఱమునకు గడ్డిలేదు. రౌతునకు తిండిలేదు. ఆహా! సందర్భముల సామరస్య మిట్లుండవలెను. దీని కంతకును పర్యవసానము నా కీ ముల్లుదిగుటే గాఁబోలు! ప్రపంచస్థితి యీపాటిది. భగవంతుఁ డొక హాస్యగాఁడు. (గుఱ్ఱమును వదలి) పో నాపాలిఁటి శనివై దాపురించితివి. నీ యిచ్చ వచ్చినచోట రాత్రియంతయు పొరలాడి, వేకువ నే ముఖసమ్మార్జన మాచరించి——నా మాటలచే దీనికిఁగూడ నవ్వువచ్చుచున్నది! (పరిక్రమించి చూచి) ఈ దారి నెవ్వఁడో యింటి వాఁడు వచ్చుచున్నాఁడు. నాకువలెనే వీనికిఁగూడ ముల్లు దిగినదేమో! నేను ఈ యరుఁగుపైఁ బరుండి, నిద్రను నటించి, వీని చర్యల నరసెదఁగాక. (గుడి అరుఁగుమీఁద పండుకొనును)

(ప్రవేశము: —శనిగ్రహము.)

శని——ఏమో గ్రహరాజంబు లఁట! మంత్రిగ్రహము లఁట! గణకులఁట! సేనాధిపు లఁట! అందఱ కన్నియుఁ బెద్దపేరులే! చూడఁబోయిన పరాగరేణువంత మగతన మొక్కని కైన లేదు. నాకంటె నీ గ్రహవీరు లందఱును ఘనులా? అంద ఱన్ని పదవుల నాక్రమించుకొని, నాకు దివిపై బానిసతనము ... అట్టిదేయగు వేగువారిపని నిక్కడ నొప్పగించిరిగా! (తలయూఁచి) ఇందఱు మహామహులు చేరి, తగుదు మని, పనిలేనిపని పెట్టుకొని, యీ భూగోళమునకు వచ్చి, దేవగిరిసైన్యముల నీ రాజ్యముపైకిఁ బురికొల్పిరికదా! తన మహారాజ్ఞీ వివాహమహోత్సవములందు ఈ యాంధ్రవీరు లెల్లరు నియతులై కార్యభారమగ్నులై యుండఁగా వీరల సంభ్రమింపఁజేసి, కోటను లోఁబఱుచుకొందు మని మా మిత్రులు తలంచిరి. కాని వారు జాగరూకులై యుండి యట్టి ప్రయత్నమును సాగనీయ లేదు. మహామహుల మని పెద్దపేర్లు పెట్టుకొని వచ్చిన వీ రందఱిలో నొక్కొక్కఁడు తన గోళము చేరువఱకును జ్ఞప్తియుండునన్ని తన్నులు తిని పోవునెడ నేను మనస్ఫూర్తిగ సంతసింతును. కాని నా కొప్పగించిన పనిని చేయక తీరదు. ఇ దేదో దేవాలయముగా నున్నది. గ్రంథములుండు కాళి

కాలయము కాదుగద. (పరిక్రమించి చూచి) కాదుకాదు. ఇదేదో దారినిబోవువారు పూజ సేయు ఆంజనేయాలయము వలె నున్నది. ఆహా! పరమపూజ్యుఁడా హనుమంతుఁడు. అసామాన్యప్రజ్ఞావంతుఁడు. పరోపకారి. అతనికీర్తి యెల్లలోకముల వ్యాపించి యున్నది. నే నీ యాలయమునఁ బరుండి, సమాచారములను కనుగొనఁ బ్రయత్నింతును. (ఆలయపు టరుఁగుపై నెక్కి) ఓహో! ఇం దిదివఱకే యెవ్వఁడో పండుకొనియున్నాఁడు. నావంటి యింకొక వార్తాహారి కాఁడుకదా? ఆలోచించుకొనుచ దంతయు గట్టిగ గొణఁగుకొను చెడ్డయలవా టున్నదినాకు. వీఁడు నామాటలు వినియుండఁడు కదా. అయినను విచారింతము. ఒశ్. గుఱ్ఱుపెట్టి నిద్రించుచున్నాఁడు. నిజమైన గుఱక యింత సుదీర్ఘాన్వాటముగ నుండునా? చూచుటకు పెండ్లికొడుకువలె ముచ్చటగ నున్నాఁడు. ఈతనిని హఠాత్తుగ లేపుదో నిజముగ నిద్రించువాఁడైన కలవరపడి లేచును. (వంగి లేపఁబోయి యరుఁగుమీఁదినుండి క్రిందికిఁ బడును.) అయ్యయ్యో! చచ్చితి. చచ్చితి. కాలు విఱిగినది.

రాఘవశర్మ—(తొందరగ లేచి) ఆఁ! ఆఁ! కాలు చచ్చినదా! కాలు చచ్చినదా! చచ్చుపడిన దేమో!

శని—(తనలో) తప్పుమాట లాడుచున్నాఁడు. నిజముగ నిద్రలాగున నున్నది. (ప్రకాశముగ) కాలు చచ్చుట కాదయ్యా! నేను చచ్చితిని. కాలు విఱిగినది.

రాఘవశర్మ—చచ్చుట ముందా? కాలు విఱుగుట ముందా? చచ్చినతర్వాత కాలు విఱిగిన నేమి? ముక్కలైన నేమి? నాకు నిజము చెప్పుము. నేను తార్కిక వేదాంతిని.

శని—నేను సిద్ధాంతిని. కాని నన్ను లేవదీయకున్నచో నీది కుతర్క వేదాంతమే.

రాఘవశర్మ—ఓహో! క్రిందఁ బడితివఁటయ్యా! మొదటనే యట్లు చెప్పక పోతివేమి? (సమీపించి) అమ్మో! ఎంతదెబ్బ తగిలెను. కాలు బెణికి వంకరపోయిన ట్లున్నది. నరములు బిగియకమునుపే సరిగా లాగనిమ్ము. (లాగును.)

శని—ఆఁ! ఆఁ! అదిమొదలేకుంటికాలు.

రాఘవశర్మ—బెణకిన దీకాలా? (రెండవది లాగును.)

శని—ఆఁ! ఆఁ! ఆఁగుము. ఏదియు బెణకఁ లేదు. బెణఁకునంత దెబ్బ తగిలినది.

రాఘవశర్మ—ఇంతేనా! లేచి యరుఁగుపైఁ గూర్చుండుము. (లేవదీసి) ఇదేమి. నీకు శని గ్రహమునకువలె నొకటి కుంటికాలున్నది. బాగుగఁ జూడనిమ్ము. (మోము పరీక్షించి) నీవు కావయ్యా!

శని—(తనలో) వీఁడు నన్నెట్లు గుర్తుపట్టెనో! (ప్రకాశముగ) నేనేనయ్యా.

రాఘవశర్మ—కావు.

శని—(తనలో) వీఁ డేమి పిచ్చివాఁడా! (ప్రకాశముగ) నేనే!

రాఘవశర్మ—అట్లయిన నీ వెవరో చెప్పుము.

శని—ముందుగ నేనెవ్వరను కానో చెప్పుము.

రాఘవశర్మ—చెప్పెదను. ఈగుడిలో జ్యోతిషమునేర్చి ప్రశ్నము చెప్పఁగల యొక పూజరి యుండెను లెమ్ము. నీవు సిద్ధాంతి ననుటచే నాతఁడేమో యనుకొంటిని. కావు.

శని—నీవు వేదాంతి నంటివే. నే నాతఁ డేలకానో చెప్పుము!

రాఘవశర్మ—నీ కొక్కటే కుంటికాలు. ఆతనికి రెండును కుంటికాళ్లే. కావున నీ వాతఁడవు కావు. నా వేదాంతము సిద్ధాంతీకరింపఁబడెఁగదా!

శని—అట్లయిన నా సిద్ధాంతము నీచే వేదాంతీకరింపఁబడినది. నీవు పూజారి నేదో ప్రశ్న యడుగుటకు వచ్చితివి. అది నన్నే యడుగరాదా?

రాఘవశర్మ—మఱేమియు లేదు. రాత్రి యెంత గడచెనో చెప్పఁగలవా?

శని—చెప్పుటకు నాకడ హోరాయంత్ర మున్నదా?

రాఘవశర్మ—లేకున్నను నక్షత్రముల లెక్కించి చెప్పలేవా?

శని—అదియూ! నే నెఱుఁగుదును. శిరోనక్షత్రమును బట్టి యిప్పటి కేరాశి యుదయించుచున్నలగ్న మగునో, దానిలో భుక్తి యెంతయో యెఱింగి, అక్కడనుండి సూర్యుఁడున్న రాశిలోని భుక్తఘటికలవఱకు లెక్కించి, రాత్రికాలఘటికలనుండి తగ్గించినచో రాత్రికాలభుక్తి తెలియును.

రాఘవశర్మ—ఈ గొడవకు పంచాంగము కావలెను. అది చదువుటకు దీపము కావలెను. రెండు నిక్కడలేవు. చిక్కువచ్చెను.

శని—సరికాని నీవు చాల బుద్ధిమంతుడవు. ఇందాఁక శని కొక్కకాలంటివే! అది నీ కెట్లు తెలిసెను?

రాఘవశర్మ—ఈ లోకములో శని కొక్కకాలనియు, శుక్రున కొక్క కన్ననియు వాడుక కలదు లెమ్ము. కాని శనిమాట తలపెట్టకుము.

శని—(నిర్వెఱపడి) ఆఁ! శనిమాట వలదందువేమి? శని అంత చెడ్డవాఁడా!

రాఘవశర్మ—ఈ లోకపు సందర్భము తెలియఁగనట్లు నీవు పల్కుచున్నావే! శని దుష్టగ్రహమను మాట లోకప్రసిద్ధము కాదా?

శని—(తనలో) అరెరే! నన్నుగూర్చి యీలోకమున నిట్లు తలంచుచున్నారు కాఁబోలు. ఈయపకీర్తి నీ సందర్భమునఁ బాపుకొనవలెను. (ప్రకాశముగా) శని చాల మంచి వాఁడు సుమా.

రాఘవశర్మ—కానిమ్ము. మంచివాఁడే కావచ్చును. ఇదిగో చూడుము. మంచివాఁడవు. నాకా పేటలో ప్రవేశముఁ గలుగఁజేయుటకు నీ కందెవ్వరైన పరిచయు లున్నారా?

శని—నా కందఱును మావారే. వారిలో నెవ్వరి కభిమానపత్రము వ్రాయుమందువు?

రాఘవశర్మ—అందఱకుఁ బనికివచ్చున ట్లొకటియే చాలును. నాకీ సాహాయ్యము చేసినందుకు మఱల నీ కేమి ప్రత్యుపకారము చేయఁగలను?

శని—అంత మంచివాఁడవైనచో నొక చిన్న పని చేసిపెట్టుము.

రాఘవశర్మ—ఏమది? చెప్పుము.

శని—శనిగ్రహమంత మంచివాఁడే లేఁడని యీ లోకమం దంతటను చాటించి రాఁగలవా?

రాఘవశర్మ—ఒశ్! అ దెంత పని? ఇంతలో. (చిటికె వేసి) కాని శనిగ్రహమనిన అంత యభిమానము చూపుచున్నావు. అతఁడు నీ కొక విధమగు వేలువిడిచిన మేనమామయా?

శని—వేలు విడువని మేనమామయె.

రాఘవశర్మ—చాల దగ్గఱచుట్టమే! ఆ బయలున కత్తులను తళతళ మెఱపించు వారందఱును మీవా రంటివి. బహుశః వారిలో మీచుట్టమగు శని యుండవచ్చునా?

శని—(తనలో) ఇప్పుడు నిజముఁ బల్కకే వీని మోసపుచ్చుట. (ప్రకాశముగా) నిజముఁ బల్కెదను. నేనే శనినయ్యా? వా రందఱును మా బంధువులైన రవి శశ్యాది గ్రహరాజులును, వారి సహచరులును.

రాఘవశర్మ—(తనలో) వీని కబద్ధమాడుటందును నేర్పు లేదు. (ప్రకాశముగా) చాల గొప్పవారలే. మీ రందఱు నెక్కడనుండి వచ్చితిరి?

శని—గ్రహము లెక్కడనుండి వచ్చును. ఆకసమునుండి.

శని—(తనలో) వీఁడు నన్నెట్లు గుర్తుపట్టెనో! (ప్రకాశముగ) నేనేనయ్యా.

రాఘవశర్మ—కావు.

శని—(తనలో) వీఁ డేమి పిచ్చివాఁడా! (ప్రకాశముగ) నేనే!

రాఘవశర్మ—అట్లయిన నీ వెవరో చెప్పుము.

శని—ముందుగ నేనెవ్వరను కానో చెప్పుము.

రాఘవశర్మ—చెప్పెదను. ఈగుడిలో జ్యోతిషమునేర్చి ప్రశ్నము చెప్పఁగల యొక పూజరి యుండెను లెమ్ము. నీవు సిద్ధాంతి ననుటచే నాతఁడేమో యనుకొంటిని. కావు.

శని—నీవు వేదాంతి నంటివే. నే నాతఁ డేలకానో చెప్పుము!

రాఘవశర్మ—నీ కొక్కటే కుంటికాలు. ఆతనికి రెండును కుంటికాళ్లే. కావున నీ వాతఁడవు కావు. నా వేదాంతము సిద్ధాంతీకరింపఁబడెఁగదా!

శని—అట్లయిన నా సిద్ధాంతము నీచే వేదాంతీకరింపఁబడినది. నీవు పూజారి నేదో ప్రశ్న యడుగుటకు వచ్చితివి. అది నన్నే యడుగరాదా?

రాఘవశర్మ—మఱేమియు లేదు. రాత్రి యెంత కడచెనో చెప్పఁగలవా!

శని—చెప్పుటకు నాకడ ఘటీయంత్ర మున్నదా?

రాఘవశర్మ—లేకున్నను నక్షత్రముల లెక్కించి చెప్పలేవా?

శని—అదియా! నే నెఱుఁగుదును. శిరోనక్షత్రమును బట్టి యిప్పటి కేరాశి యుదయించుచున్నలగ్న మగునో, దానిలో భుక్తి యెంతయో యెఱింగి, అక్కడనుండి సూర్యుఁడున్న రాశిలోని భుక్తఘటికలవఱకు లెక్కించి, రాత్రికాలఘటికలనుండి తగ్గించినచో రాత్రికాలభుక్తి తెలియును.

రాఘవశర్మ—ఈ గొడవకు పంచాంగము కావలెను. అది చదువుటకు దీపము కావలెను. రెండు నిక్కడలేవు. చిక్కువచ్చెను.

శని—సరికాని నీవు చాల బుద్ధిమంతుడవు. ఇందాఁక శని కొక్కకాలంటివే! అది నీ కెట్లు తెలిసెను?

రాఘవశర్మ—ఈ లోకములో శని కొక్కకాలనియు, శుక్రున కొక్క కన్ననియు వాడుక కలదులెమ్ము. కాని శనిమాట తలపెట్టకుము.

(రాఘవశర్మనుఁగదలించుచు) మిత్రమా! రాఘవశర్మా! మిత్రమా! అరెరే! ఈతని కింతలో తెలివి రానట్లున్నది. ఏమిసేయనగును? (యోచించి) నాకొక్క యుపాయము తోఁచు చున్నది. నేఁటి సాయంత్రము నగరద్వారమునొద్ద మాకుఁ బట్టువడిన దేవగిరిసైనికుని దుస్తు లివే. ఎందునకైనఁ బనికివచ్చు నని నాతోఁ దెచ్చితిని. ఈ దుస్తుల నీతనికిఁ దొడిగి, కోవెలచాటున నీతని దాఁచెదను. ఈతనికి ప్రియయగు లీలావతి కాళికాలయమున మట్టడింపఁ బడిన విషయము నొక చీటిపై లిఖించి యీతని జేబులో నుంచెదను. కాదు. అట్లుంచిన చీటి నీతఁడు వెంటనే చూచుట తటస్థింపదు. కావున ఈచీటి నీతని మెడకు కట్టెదను. క్రమంబుగ నీతఁడు తెలివిఁ గాంచి, తన మెడకు వ్రేలు చీటి చూచుకొని, లీలావతికిఁ దగిన సాయ మొసర్పఁ బ్రయత్నించును. నేను ఈతని వస్త్రముల ధరించి ఈచోటనే పండుకొందును. దేవగిరివారు నన్నే ఈ బ్రాహ్మణుఁ డనుకొని తమ శిబిరంబులకుఁ దీసికొనిపోవఁగలరు. ఈ కారణమున శత్రువుల శిబిరములలోఁ బ్రవేశించి, వారి పరిస్థితుల బాగుగఁ గనిపెట్టవచ్చును. ఆలయము చాటున నీతని దాఁచి వచ్చెదఁగాక. (రాఘవశర్మ నెత్తుకొని నిష్క్రమించును.)

(ప్రవేశము:— దేవగిరి భటులు)

ప్రథముఁడు—ఓరీ! ఈ కటికి చీఁకటిలో నిదేమి పనిరా మనపాలఁబడినది!

ద్వితీయుఁడు—పనిలేనిపని. అతఁడు చెప్పిన చోటిదే యైయుండవలెరా!

తృతీయుఁడు—వెదకండి. ఆ బ్రాహ్మణుఁడు పడియుండు కోవెల యిందే యుండవలెను. వెదకండిరా!

(భటులు చుట్టుపట్ల వెదకుచుండఁగా రాఘవశర్మవస్త్రముల ధరించిన మల్లికార్జునశర్మ భటు లెఱుంగకుండఁ బ్రవేశించును.)

మల్లికార్జునుఁడు—(తనలో) ఈ చీకఁటిలో నన్ను వీరు చూడలేకున్నారు. నాకత్తి ఈ బొక్కసలో పట్టలేదు. కావున దాని నొకచోట దాఁచితిని. సమయమున దీసికొందును. (అరుఁగుపై బరుండి కొంచెముగ దగ్గను.)

ప్రథముఁడు—అరే! ఇక్కడ నున్నాఁడురా. ఇంకా తెలివి లేకయే పడియున్నాఁడు. రండు. రండు. పట్టుకొందము. (భటులు మల్లికార్జునుపైఁ బడి పట్టుకొందురు.)

భటుడు—లే! లే! మాకుఁ జిక్కితివి. మాతోఁ గూడ రమ్ము.

మల్లికార్జునుఁడు—(లేచి, విస్మయము నటించుచు) మీ రెవ్వరు?

ప్రథముఁడు—ఎవ్వరైన నీకేమి? నడువుము.

మల్లికార్జునుఁడు—వచ్చెదను.

(అందరు నిష్క్రమించుచుండఁగా తెరదిగును.)

చతుర్థాంకము సంపూర్ణము.

శ్రీ

జ్యోతిర్లీల.

పంచమాంకము.

ప్రథమరంగము.

ప్రదేశము—ఓరుగంటికోటముందు విడిసియుండు దేవగిరిసైన్యములోని రాజశిబిరములలో నొకటి.

ప్రవేశము—ఆసీనులగు గ్రహపూరుషులు.

సూర్యుఁడు—గ్రహపూరుషులారా! మనము పారసీకులను దేవగిరివారికిఁ దెలిపి, వారలను ఈ యోరుగంటి సామ్రాజ్యముపైకి దాడివెడలునట్లు ప్రోత్సాహపఱిచితిమి.

కుజుఁడు—ఔను. అదే యేకశిలానగరప్రాసాదము. పదిదినములనుండియు నుభయసైన్యములకును తీవ్రముగ పోరు జరుగుచున్నది. కోటగోడలపైకి ప్రాఁకి వానిని సాధించుటకు దేవగిరిసైనికులును, వారి నడ్డగించుటకు గోడలపైనుండి కాకతీయసైనికులును ఒకరితో నొకరు అధికోత్సాహముతో పోరుచున్నారు.

రాహువు—లేదా మఱి! రణము సల్పువారలను పురికొల్పుచు వారితో నడచుచుండుటయే మన కెంత యుల్లాసకరముగ నున్నది. ఇఁక వారివలె ఆయుధములఁ బట్టి మనము కూడ రణమొనర్చిన నెంత మహోత్సాహముగ నుండునో!

సూర్యుఁడు—స్వయముగ మనము పోరు సలుపరాదు. మన గ్రహగోళబలమును దేవగిరివారలకు సహాయముగ నిచ్చి యుభయసైన్యముల పరాక్రమములను మనము వేడుకగ చూచెద మని యీ భూలోకమునకు వచ్చుటకు ముం దనుకొంటిమి. అందుకు వ్యతిరేకముగ నడిచినచో మన ప్రతిజ్ఞాప్రయత్నమునకు ప్రతికూల మేర్పడఁగలదు.

గురువు—మన కనుకూలములగు సూచన లింకఁ గనిపించుట లేదు.

శని—ఇట్టి సందర్భములలో త్వరపడరాదు.

బుధుఁడు—శనీ! నభస్సంచారమునఁ గల మాంద్యత నిక్కడ నుపపాదింపకుము. సూర్యమండలమునకు నలువదిలక్షల యామడల దూరమున నుండునట్టిదియు, ఒకకోటి నలువదిలక్షల యామడల పొడవు గలదియు, నయిన పరిధిమార్గము నంతయు నెనుబదియెనిమిది దినములకే మన్మండలాధిష్ఠాతనై పరిచలనము సలుపుట నాకు

శ్రమలేకుండెను గాని (దీర్ఘనిశ్వాసము విడుచుచు) ఈ భూలోకమునకు వచ్చినదిమొదలు ఈ నేలవెంటఁ దిరుగుచో గజముమొదలు ఖరమువఱకు నే వాహనము నధిరోహించినను ... ... అబ్బ (బొజ్జ నిమురుకొనుచు) నా కాయాసము కలుగుట తప్ప లేదు. నా కీ యుద్ధముల గొడవ చాలును. త్వరగ మనమన లోకములకు వెడలిపోవుదము.

శని—బుధా! సూర్యమండలమునకు ముప్పదియైదు కోట్ల యోజనముల దూరము లోపుగ నుండునట్టి నియమిత దిక్చక్రముల వెంట వివృతమండల పరిమాణము గల మే మెల్లరము ను క్షణమునకు వందలు, వేలు, లక్షలు, కోట్లు యోజనంబుల వేగముగ సంచలనము సలుపుట లేదా? పదునాల్గువందల యోజనములే మండలవేష్టి గల నీవె మహారాజు నాసతిని కొన్నినా ళ్ళిచ్చట తడయఁజాలవా?

బుధుఁడు—మండలపరిమాణముల కేమిలెమ్ము. ఎవరికిఁ దగినంత వారికే యున్నది. మహారాజగు నీకిఁ దగునట్లుగా మూఁడులక్షల యోజనములు మండలము చుట్టుకొలత. గురువునకు ముప్పదినాలుగువేల యోజనంబులు. శుక్రునకు మూఁడువేల యోజనములు. యువరాజగు చంద్రునకు ఎనిమిదివందల యోజనములే. ఇక్కడ లేరు కాని అనూరునకు పదుమూఁడువేలు! నభస్థూనునకు పన్నెండువేల యోజనంబులు మండల మధ్యమరేఖా ప్రమాణము. నామండలమునకు చుట్టుకొలత నీవుచెప్పినట్లు పదునాలుగువందలే. నీకు మండలవేష్టి ఇరువదియెనిమిదివేల యోజనంబులు; నీకు మండలవేష్టి యధికమనువేడ నాకు మధ్యమవేష్టి (బొజ్జ నిమురుకొనుచు) యధికము. కావున మఱియు నాయాసమునకు కారణము.

గురువు—అది యట్లుండనిమ్ము. మనమన మండలముల వదలి యింక విశేషకాలము మన మిక్కడ తడయ రాదు. ఏలయంటిరా ఆయా గోళప్రపంచములోని కాలభేదము ననుసరించి ఒకచోట క్షణము గడచిన వేఱొకచోట చాలకాలము గడచిపోవును. ఈ భూమిపై మన మిప్పటికి నెలదినములు కడపితిమి. భూమికంటె నధిక కాలమానము గల కుజ గురు శని చంద్ర మండలములలో తక్కువదినములు నడచినను భూమికంటె నల్పమగు కాలమానము గల బుధ శుక్ర మండలములలో నెక్కువదినములు ఇంత లోపలఁ గడచియుండవలెను. ఇన్నిదినములు మన మన మండలములలో ధర్మప్రవర్తన మెట్లు నెఱవేఱుచున్నదో మన మూహింపవలసియున్నది.

రాహువు—కేతూ! ఛాయాగ్రహముల మగు మన కిద్దఱకును మండలములే లేవు కావున మనకేచింతయు లేదు.

కేతువు—అవును. సంసారముండుటే సకలయాతనలకును కారణము.

చంద్రుఁడు—గురువరా! సూర్యభగవానుఁడు మన కెల్లరకు నధిష్ఠాత యైయుండఁగా నెచ్చటను నెట్టి ధర్మలోపమును వాటిల్లదు. ఇఁక, మన మిక్కడకు వచ్చిన కార్యమునకు పర్యవసాన మగు ధర్మము ను తీర్మానించుటకై త్వరపడవలయు ననుటయు సమంజసమే. (సూర్యు నుద్దేశించి) దేవా! దీనిఁగూర్చి దేవగిరిప్రభువగు మహాదేవరాజుతో నుచితరీతిని తా మానతీయవలెను.

సూర్యుఁడు—అవును. అట్లే. కాని, చూచితిరా! ఈ వ్యవహారమున మనకును మన మిత్రులగు దేవగిరివారికిని లక్ష్యస్థానము ఒకింత భేదించుచున్నది. పూర్వవైరమే ప్రధానముగ నెంచు, మనమిత్రుల యుద్రేక మంతయు, ఈ రాజధానీనగరంబునొక్క కోటగోడలపైఁ జూపఁబడుచున్నది. భాస్కరాచార్యుని ప్రయత్నభంగమునే ముఖ్యముగ నెంచు మనకు ఆ కోటవెలుపలి దేవళములోని గ్రంథసాధనమే లక్ష్యము. దీనిగురించి మహాదేవరాజుతో నిదివఱకు ముచ్చటించితిని. మఱల నతనితో నాలోచించెదము. అదిగో! అతఁడు నిదే వచ్చుచున్నాఁడు. చంద్రా! పోయి యాతని నెదుర్కొని తోడితెమ్ము.

చంద్రుఁడు—ఆజ్ఞ.

(చంద్రుడు ఎదురేగి, మహాదేవరాజును మఱియు కొందఱు దేవగిరినాయకులను తోడితెచ్చును.
గ్రహపూరుషులును, దేవగిరివారలును, కుడిచేతులను నిలువుగా పైకి చాచి యొకరినొకరు సన్మానింతురు.)

సూర్యుఁడు—వీరులారా! ఆసీనులగుఁడు. (అందఱాసీను లగుదురు.) కోటగోడలపై మన ప్రయత్నము లెంతవఱకు నేఁటి పగట జయప్రదములుగ నున్నవి?

మహాదేవరాజు—మిగుల బలమైనవియు, ఎత్తైనవియు, సమరపరిచితులగు వీరులచే సంరక్షింపఁబడునట్టివియు నగు, ఓరుగంటి కోటగోడలను, నాటకములోని కాగితపు తెడకలను వలె, నొక్కసారిగ నణఁగఁద్రొక్కుట దుర్ఘటమగు కార్యము. అయినను, నేఁటి యుదయమున మాసైన్యము లెట్లు ఢీకొనినవో మీలో చంద్రుఁడను పేరుగల యీ పారసీకప్రభువు నాచెంతనే యుండి చూచుచు, సేనల పురికొల్పుచు వచ్చెను. ఆయననే విచారింపుఁడు.

చంద్రుఁడు—అవును. కోటగోడల సాధించు ప్రయత్నమున దేవగిరివీరులు నేఁటిపగలంతయుఁ జూపిన సాహస మెంతయని చెప్పఁగలను.

సీ. ఘన శిలాతతిఁ దెచ్చి, కందకంబులఁ బూడ్చి,
కోటపై రాల్ రువ్వ మీఁట వదలి,
మ్రోఁకుతున్కల మల్చి, మదపుటేన్గుల కిచ్చి,
గవిదార్ల తల్పులఁ బొమవఁ జేసి,

గొప్ప నిచ్చెన లేర్చి, కోటగోడకు వాల్చి,
పండ్లఁ గత్తులఁ బట్టి, పైకిఁ బ్రాఁకి,
యెుసకునీరును తారు జడివాన కురియంగ
ఛత్రంబులటు డాళ్ళఁ జాఁచి పట్టి,

తే. పడిన తమవారిఁ గని, జంకుపడక, సలుక
పెరుఁగు తేనెగుమ్ముల యట్లు పెచ్చుపెరిగి,
సమర మొనరించు వీరుల సాహసంబుఁ
గనవలెంగాక యంతింత యనఁగ రాదు.

సూర్యుఁడు—సత్యము. సత్యము. మనమిత్రుల ధైర్యసాహసములచే మన మండలమును కిన్నెలవలెఁ జేయుచునే యుంచిరికదా.

మహాదేవరాజు—అయినను కోటగోడలపై మా సైన్యములు మఱికొంత యుత్సాహముతోఁ బోరకుండుట కొక కారణ మున్నది.

సూర్యుఁడు—ఏమది?

మహాదేవరాజు—ఈ రాజ్యమునకు గణపతిచక్రవర్తి కొమార్తె యగు రుద్రాంబ యను యువతి రాణిగా నున్నది. ఆమె కిప్పుడు తన మేనత్త కొమారునితో వివాహ మఁట. ఇట్లు వివాహము జరుగుచున్న కోటను ముట్టడించువారికి అపజయము కలుగునను నమ్మకము మాదేశమునందుఁ గలదు.

రాహువు—అట్టినమ్మకమును ధీరులు ఆదరింపఁదగునా! ఇప్పుడు వీరులు ఒక్క పెండ్లికూతునకు భయపడవలసినదేనా!

మహాదేవరాజు—ఏమో మాదేశపు సేనలకుఁ బెండ్లికోటను ముట్టడించు నాచారము లేదు.

శని—మహాదేవరాజా! అట్లయినచోఁ నిట్లు నిరుత్సాహులగు మన సైనికులను నిట్టి సమయమునఁ, గష్టసాధ్యములగు కోటగోడలపైకిఁ బ్రాఁకించుటలోఁ శ్రమపెట్టుటకు బదులుగా, సులభముగ సాధింపఁదగిన ఆ దేవళప్రాకారములపైఁ బ్రయోగించి, వాని ఛేదించి, అట్టివిజయముచే నుత్సాహపూరితులగు వీరిని మఱల కోటగోడలపైకిఁ ద్రిప్పుట మంచిపద్ధతిగా నాకుఁ దోఁచుచున్నది.

బుధుఁడు—దానిలోఁ గూడ నింకొక పెండ్లికూతు రున్నదేమో!

సూర్యుఁడు—బుధా! హాస్యము వలదు. మహాదేవరాజా సెలవిమ్ము.

మహాదేవరాజు—(కొంచెముగ నవ్వి) ఈ దేవళమును సాధింప నెంచుటకు మీకు అంతయుత్సాహముగ నున్నదో నే నూహింపఁజాలకున్నాను. అయినను, స్థలపరిస్థితుల నొక్కించుక వివరించెదను. చూడుఁడు. ఆ కనిపించునవే [illegible] ఏకశిలానగర ప్రాకారములు, కందకములు. ఆ గోడలకు నించుమించుగ నర్ధక్రోశంబు దూరంబున, నదే, మీరు ప్రస్తావించిన [illegible] కాళికాలయము. లోపలి దేవళ మెంతచిన్న దైనను ప్రాకారములు మాత్రము బలహీనములుగా నగపడవు. ఆస్థలమును సంరక్షించు సైనికులు, సంఖ్యలం దెట్లున్నను సాహసమునందు అల్పులు కానట్లు పోరునకు మొదటిదినము దారిలో వారి నడ్డగించిన మనవారే చెప్పఁగలరు.

కుజుఁడు—కావున?

మహాదేవుఁడు—కావున కొలఁది సైన్యముతో నా దేవళమును సులభముగ సాధింపఁజాలము. ఇఁక, కోటగోడలపై డీకొనువారినుండి విశేషసంఖ్యల నచటికిఁ ద్రిప్పితిమేని, కోటపై నొత్తిడి తగ్గును. అప్పుడు కోటలోనివారికి విశ్రాంతి చిక్కును. అట్లు విశ్రాంతిని కలుగనిచ్చితిమేని ... ... అట్లు కలుగనీయ రాదు.

రాహుత్తు—పోరులో నొకింత తెఱపి కలుగునేని కోటలోపలివారికిఁ గొంచెము విశ్రాంతి కలుగునే కాని అంతలో వారు మనల నేమిచేయఁగలరు.

మహాదేవుఁడు—అవ్వలిసేనాని నిపుణుఁడేని, యట్టివిశ్రాంతిని ఊరకపోనిచ్చునా? ఎవ్విధముగ నైన నుపయోగింపఁగలఁడు.

[illegible]ఁడు—ఆ గోడలవారి చేతుల పుష్పములతో తలవంచుకొని కూర్చుండియుండు పెండ్లికూఁతురు నబలయే కదా వారి సేనాని.

మహాదేవుఁడు—అబల యని తృణీకరింపరాదు. పోరాడు బంటునకువలె పోరాడఁజేయు సేనానికి దేహబలము ముఖ్యము కాదు. పరిస్థితులను, ప్రతి సైన్యభాగమును, ఎఱుక ప్రతిభతో తెలిసియుండఁజాలును. మఱియు, నామె దేహమనోబల సంపన్నురాలని వినియుంటిని.

సూర్యుఁడు—మహాదేవరాజా! మా మంచిగ సందేహపడవలసిన యవసర మిది కాదేమో యని నా తలంపు. మన సైన్యము లింక నేమూలలను చెక్కుచెదరక యున్నవి.

మహాదేవుఁడు—(నెమ్మదిగ, అవును. అదియు నిజమే, ... మన సైన్యముల కింత వఱకే లోపమును లేదు. నష్టము చాలవఱకు కోటలోనివారికే కలిగినది.

సూర్యుఁడు—కావున, నిట్టిసమయమున, సులభసాధ్యమగు విజయము చేకూర్చి, మనవారికి మఱింత యుత్సాహముఁ గలిగించిన నేమి?

మహాదేవుఁడు—(ఆలోచించి, తలయూఁచి) సరియే. ఈసారి వీరు చెప్పినట్లు చేసిచూచెదను. రేపటియుద్ధములో ముందుగ కోటగోడలపైకి నొకసారి ఢీకొల్పి, తరువాత విశేష సైన్యముల నా దేశముయొక్క ప్రాకారములపైకిఁ ద్రిప్పి, వానిని కూల ద్రోయించెదను.

(తెఱలో — పోయెరా — పోయెరా — పట్టుకో — పట్టుకో — చచ్చితిని — చచ్చితిని — అను కేకలును, కలకలమును వినిపించును.)

అందఱు—ఏమది? ఏమది?

మహాదేవరాజు—(తన ముఖ్యనాయకులలో నొకనితో). నీలకంఠా! ఆ కలకలమునకుఁ గారణ మేదియో కనుఁగొని రమ్ము. (నీలకంఠుఁ డను నాయకుఁడు నిష్క్రమించును.)

సూర్యుఁడు—ఎవఁడో పోవుచుండఁగా కొందఱాతనిఁ బట్టుకొని హింసించునట్లు తోఁచెడిని.

గుణుఁడు—ప్రక్కనుండి పాఱిపోవఁజూచుటకు వైరులలో నెవ్వఁడు నింక మనకుఁ బ్రాణములతోఁ జిక్కలేదుకదా.

మహాదేవుఁడు—యుద్ధ ప్రారంభమయిన రాత్రి (శనిని చూపి) ఈమహాశయుఁడు ఎవనినో విస్మృతునిగాఁ జేసి, పట్టుకొనివచ్చెను. ఇప్పుడు పాఱిపోవుటకుఁ బ్రయత్నించిన వాఁడేమో!

శని—అతఁడా! అతఁ డెట్లు పోఁగలుగును? చంద్రుఁడును, నేనును, పసిమి శిబిరమునకే కాపాసినుంచి, సగౌరవముగఁ జూచుచున్నను, మిగుల జాగ్రత్తతో, నిరోధించి యుంచితిమి గదా.

ఇంద్రుఁడు—చంద్రునకాతనియందు చాల మన్నన.

చంద్రుఁడు—ఔను. నే నాతని బాగుగఁ బరీక్షించితిని. సద్గుణము లాతని సద్వంశమును తప్పక నిరూపించుచున్నవి.

సీ. వెలితిచూపులను దిక్కులఁ బరీక్షింపఁడు,
యోచింపకే పల్కఁ డొక్క మాట,
కొలువు వాఁడుకయట్లు కుదురుగఁ గూర్చుండు,
చవిచూచునట్లు భోజనముసేయు,
సైన్య రాజ్యాంగాది మర్మ్య విజ్ఞతనేర్చు,
గజ వాజి సాధకక్రమము మెఱుంగు,
సౌందర్య వివరణ సారస్యవిదుఁ డౌను,
నిందింపఁ డేరిని నీచ భాష,

తే. సేవకులచెంత చనవునఁ జేరఁ బోఁడు,
దీనజనులకుఁ దగురీతి దాన మిచ్చు,
కాంచఁగా స్నేహపాత్రుఁడై కానిపించు
మహిత వంశోద్భవుం డైన మానవుండు.

మహాదేవరాజు—ఇట్టి సద్గుణములు కల యాతఁడు ఇప్పుడు వీరితోఁ జెప్పకయే పారి పోవునా!

చంద్రుఁడు—అతని నిందు నిర్బంధమున నుంచితిమి కాని, పోవకుండునట్లు అతనివలన వాగ్దానము పుచ్చుకొని స్వేచ్ఛమై తిరుగనీయ లేదు. అతఁడు పోవఁదలఁచినచో, అందఱును బడమోఁదియే పోఁగలఁడు.

(ప్రవేశము:—నీలకంఠుఁ డను దేవగిరిరాయకుఁడు దేవగిరి సైనికుని దుస్తులతో, కృత్రిమమగు గడ్డముతో నుండు రాఘవశర్మ, మఱికొందఱు దేవగిరి సైనికులు.)

మహాదేవరాజు—నీలకంఠా! వచింపుము.

నీలకంఠుఁడు—శని యను పేరుగల యీ పారసీకమిత్రుఁడు, యుద్ధ మారంభమగునాఁటి రాత్రి, మన బంట్లచే మోయించుకొనివచ్చిన యాతఁడు పాఱిపోయెను.

శని
చంద్రుఁడు } —పాఱిపోయెనా!

మహాదేవుఁడు—పోవుచుండఁగ మనభటు లాతని నడ్డగింప లేదా!

నీలకంఠుఁడు—అడ్డగించినవారినెల్ల నాతఁడు చిందరవందరగాఁ బడఁగొట్టి, (రాఘవశర్మను జూపుచు) ఈ మహాసైనికుని సర్వమునుండి పడఁదోసి, యాతని గుఱ్ఱము నెక్కి మన సేనలను దాఁటిపోయెను. (రాఘవశర్మతో) ఓరి! వివరములను విన్నవింపుము.

రాఘవశర్మ—ఏమివివరములు!

నీలకంఠుఁడు—నీ పాటును గూర్చి.

రాఘవశర్మ—నా పాటా! (కఱుకు గాఁగ లడవు గొఁణుఁగుచు) నడుము విఱిగినది. ఇఁక నాపాటే నా పాటు. అతని పిడికిటిపోటులు గుఱ్ఱపుతన్నులవలె కమ్మగా నుండినవి.

నీలకంఠుఁడు—(తీవ్రముగ) మహారాజులతో వేళాకోళమా! సరిగఁ జెప్పుము. నిన్నాతఁడు గుఱ్ఱముపైనుండి క్రిందికి బడఁదోయ లేదా!

రాఘవశర్మ—అదా! దానినిగూర్చి చెప్పుట కేమున్నది? (చిటికెలు వేయుచు) చిటుక్కున వచ్చెను. తటుక్కున నన్ను గుఱ్ఱముపై నుండి పడద్రోసెను. కిటుక్కున నా గుఱ్ఱముపై నెక్కెను. లటుక్కున పాఱిపోయెను. పెటుక్కున నా నడుము విఱిగెను.

మహాదేవుఁడు—(నవ్వుచు) క్రిందనుండువాఁడు త్రోసినంతనే గుఱ్ఱము పయినుండి పడిపోవు నంతటి చేఁతకానివాడు మా సేనలోనుండుట మా కపకీర్తి. బడిగుఱ్ఱము వీఁపున నిన్ను గట్టి, నీకు సరియైన స్వారి తరువాత నేర్పెదను. (గృహపూరుషులతో) మిత్రులారా! మన మింతకుముందు తలంచుచుండిన సమర సన్నాహముల రేపు రేపకడనే చేయింతము. నేఁటి రాత్రి కింక నావడి విశ్రమింతము. రండు.

గృహపూరుషులు—అట్లే. (అందఱు నిష్క్రమింతురు. రాఘవశర్మ మాత్రము వెనుకకు తగ్గినిలుచును.)

రాఘవశర్మ—(నవ్వుచు) ఈదుస్తులతోనున్న నన్ను రాఘవశర్మనుగా లీలావతియైన గుర్తుపట్టఁ గలదో లేదో! నా మిత్రుఁడగు మల్లికార్జునుఁడు పుస్తెవలె నామెడకుఁ దగిలించిన యీ చీటిని జూచుకొనువఱకును నన్ను నేనే గుర్తింపలేకుంటిని. అదిగాఁక కృత్రిమ శ్మశ్రువుల నలంకరించుకొంటిని. నన్ను విస్మృతునిగాఁ జేసిన యీ మాంత్రికుఁడుగాని యితరులుగాని వారిబంటుగా నట్లు ఇన్ని దినములనుండియు నన్ను గూర్చి యనుమానించి యైన నుండలేదు. ——— ఆ మాంత్రికుఁడు నాకును, నా మూలమున మా రాజ కార్యమునకును మిగుల నుపయోగకారి యయ్యెను. ఎట్లనిన నేను విస్మృతుఁడుగాఁ జేయఁబడుటచేతనే నావస్త్రములు నామిత్రున కుపయోగకరము లయ్యెను. తరువాత నాతఁడు నాకుఁ దగిలించిన యీ దేవగిరి సైనికుని దుస్తులలో నేనుండుట కారణముననే వీరల సైనికాశ్వము నొకదానిని సాధించుటకు వలనుపడెను. అదియు నాతనికే యుపయుక్తమగుట నాకెంత సంతసముగ నున్నది. కాని, మర్యాదలేక, యెముకలు విఱుగునట్లు గుఱ్ఱమునుండి క్రిందికిఁబడఁద్రోసెను.

(తెఱలో గంట మ్రోఁగును.)

అదిగో దేవగిరిసైనికులు సాయుధులై విశ్రమించు సమయమైన ట్లున్నది. వారలలోఁ జేరి నిదురించి, మావారి కెట్లు సాయపడఁగలనో రేపుదయము చూచెదఁగాక.

(నిష్క్రమించుచుండగా తెరదిగును.)

*

ద్వితీయరంగము.

ప్రదేశము—కోటలో యుద్ధసంబంధమైన కలకలము. రణభూములకు కొంతదూరమున నొక గుట్ట.

(ప్రవేశము—మల్లికార్జునుఁడును, బసవన్నయు, అలసిన గుఱ్ఱముల చేఁబట్టుకొని.)

మల్లికార్జునుఁడు—సైన్యంబుకంటె మనము ముందుగ నుడాయించుకొని వచ్చుటచే నశ్వము లెంత యలసినవి.

బసవన్న—అదియుఁగాక పొద్దెక్కి యెండతీవ్రమగుచున్నదికదా! అశ్వములమాట కేమి కాని, మల్లికార్జునకుమారా! నీవు ధైర్యశాలివైనను, పెండ్లికుమారుఁడవు కానుండిన సమయమున, నింతసాహసము చేయఁగూడదనుమా! మహారాజ్ఞి నీకొఱకెంత పరితపించుచున్నదో!

మల్లికార్జునుఁడు—సమయము వచ్చినప్పుడు నీవు మాత్రము ... ...

బసవన్న—ఏమీ! శత్రువుల సమూహము నొంటరిగినా? నిరాయుధుఁడవు! తొమ్మిదిదినములే!

మల్లికార్జునుఁడు—ఇంతకుముందే వారినుండి రాఁబయల్వెడలించితినిగాని, రాత్రియైనాకు గుఱ్ఱము దొరకుటకు వీలుచిక్కినది. గుఱ్ఱము లేనిదే, యంతశ్శీఘ్రముగ నిన్ను గలిసికొనఁగలిగి యుందునా? కాని బసవన్నా! నేను చెప్పిన నమ్మకుంటివి. అదిగో! చూడుము.

బసవన్న—(పాఱఁజూచి) ఆశ్చర్యాశ్చర్యము. అబ్బురము.

మల్లికార్జునుఁడు—నిన్నరాత్రిపట్టి ససైన్యముగ వెనుకకుఁ బిలుచుకొని వచ్చుచుందునుఁ గాఁగాను కలసిందువా! లేదందువా?

బసవన్న—కన్నులకగపడుచుండఁగ నెట్లు లేదందును. కాని యేమి విపరీతము! నేను బయలుదేఱి పూర్తిగ పదునైదు దినములు కాలేదు. అప్పుడే కబురేలేని యీ కాకతీయమూఁకయంతయు నింతలో నెటనుండి ప్రత్యక్షమైనది!

మల్లికార్జునుఁడు—కొంచెము పానీకమునుండియు, విశేషముగ దేవగిరినుండియు నని వారి వల్లనే వింటిని. కాని సైన్యముతో మనము వచ్చియుంటిమట కోటలోనివారికిఁ దెలియుటకు ఈ గుట్టపై మూఁడుచోట్ల పొగ లేఁచునట్లు చేయుమని నా కాజ్ఞయైనది. రమ్ము. ముందుగ నట్లొనరింతము.

బసవన్న—అట్లేని ఆ యెండుకట్టెలను విఱిచి, మూఁడుచోట్ల పోగులుగఁ బెట్టెదను. (అట్లుచేసి) గుఱ్ఱముపైనుండు నా పొక్కసములోని చెకుముకిరాతి నిటు తెమ్ము. నేను

కొన్ని యెండాకులను, కొన్ని పచ్చియాకులను తెచ్చెదను. ఎండాకులు రగులుటకును, పచ్చియాకులు పొగను దట్టముగ జేయుటకును బనికివచ్చును. (అట్లొనరింతురు.)

మల్లికార్జునుఁడు—చాలు. చాలు. అంతకంటె నెక్కువ యగునేని కోటవెలుపలి శత్రువుల కనుమానము తట్టును.

బసవన్న—(అటుచూచి) ఒకఁడా! యిద్దఱా! సముద్రమంత సైన్యము. సకలాంగయుతము. రాష్ట్రింపు హద్దులఁ గాపాడు దుర్గములలోనివారు నిద్రపోవుచుండిరా? లెక్క కెక్కువ యగు వార్తాహరు లేమూలనుండిరి? ఇంతసైన్యము వచ్చునప్పుడు తప్పక రానుండిన యుపద్రవమునుగూర్చి దారి పల్లెల, పట్టణముల వా రందఱును తుపానునకు ముందు గాలివలె బయలుదేఱి దేశమునంతను ఏల కల్లోలపఱుపలేదు?

మల్లికార్జునుఁడు—ఈసైన్యములను పల్లెలఁ బట్టణముల సంటనీయక, యరణ్యమార్గముల రాత్రివేళల నడుపుచు, నెవ్వ రెఱుంగకుండ, రాజధానీప్రాంతములకుఁ గొనివచ్చిరఁట.

బసవన్న—ఎవ్వరు కొనివచ్చిరి? విదేశీయులకీ దుర్గమారణ్యమార్గము లెట్లు తెలిసెను.

మల్లికార్జునుఁడు—మన రాజ్యముపై నీర్ష్యతోనుండు దేవగిరివారలే వారికి దారి చూపి యుండవలెను.

బసవన్న—దేవగిరివారికిని మనకును పూర్వవైర మున్నది కాని ఈ పారసీకులకు మనపై వైర మెందుకు?

మల్లికార్జునుఁడు—బసవన్నా! తెలియనివానివలెనే యడిగెదవేల? నిస్సారభూప్రదేశముల నివసించు పశ్చిమోత్తరఖండవాసు లీ రత్నగర్భయగు నార్యభూమికి వచ్చు టెందుకు?

బసవన్న—సరే. ఎందుకైననేమి! ఎట్లయిననేమి? వచ్చిరి. కోటను ముట్టడించిరి. ప్రస్తుతము మన మాలోచింపవలసిన విషయము లింకవఱకే.

మల్లికార్జునుఁడు—కావున నిప్పుడు చేయఁదగిన దేమున్నదో యాలోచింపుము.

బసవన్న—(వెనుకకుఁ దిరిగి చూచి) మన మశ్వంబుల నతిత్వరితంబుగ నుఱికించుకొని వచ్చుటచే మన సైన్య మింకను వెనుకఁబడినది. ఒకంతలో కలియఁ రాఁగలదు. అంతవఱకీ మిట్ట యెక్కి, తలపడు నుభయసైన్యముల పరిస్థితులఁ బరీక్షింతము. పిమ్మట కర్తవ్య మాలోచించెదము. గుఱ్ఱముల నీ పల్లమునందలి వృక్షములకుఁ గట్టుదము. (గుఱ్ఱములఁ గట్టి, మిట్టయెక్కి చూచి) ఔరా! శాత్రవుల దెంత పెద్దబలఁగమోయీ! మల్లికార్జునా! ఇటు చూడుము!

ఉ. నేలమె యీనిన ట్లిచట నిండి, సమీక్ష వివేక విక్రమో
ద్వేల భయానక ప్రకట వీర హృ దుత్సవకారణ ప్రభా
జాల సముజ్వ్వలంబు లగు శస్త్రపరంపర లొప్పఁగా, మహా
భీల చమూ సమూహములు పేర్చి, రణాంబునఁ దాఁకెఁ, జూచితే!

మల్లికార్జునుఁడు—కోట నాక్రమింపవచ్చు శత్రుబలంబులను మా వారలె ట్లడ్డగించి నిలుపుచున్నారో చూడుము!

సీ. గడితల్పులను గ్రుమ్ము గజ గండ కుంభముల్
కుంతంపు మొనలచేఁ గ్రుంగఁ బొడిచి,
మేటి నిచ్చెన లెక్కి., కోటగోడకుఁ బ్రాఁకు
బంట్లు తుట్టగఁ గూల బండ వేసి,
పైన కాలూనిన భటుల కత్తులవ్రేట్ల
డా ళ్ళడ్డి, తిరుగుఘుట్టనలఁ జమరి,
పేర్వుల వెలికిచ్చు పెద్దగాయం బైన
మోము చిట్లని ధృతి మోసి, పోరి,

గీ. "రమ్ము రా! చూత మిటు వైర" మ్మటంచు
పరులఁ దరుముచో వ్రేటులఁగి పడియుఁ, బోటి
వీరులఁ బోరఁ బురికొల్పు శూరవరులు
భద్రముగఁ గాచు కోట కేభయము లేదు.

బసవన్న—కాని వైరులుమాత్రము సులభముగా వెనుకాడువారా!

శా. ప్రాకారంబుల నెక్కుచో శరసముల్ బల్ రాళ్లు దట్టంబుగా
వీకన్ వైఁబడ నేయు దేశ్యభటులన్ విశ్వప్రయత్నంపు టు
ద్రేకం బొప్పఁగ డిగ్గఁద్రోచి యురలన్, ధీరాత్ములై కోటకున్
బ్రాఁకన్ జంకరు శత్రువీరులు జయప్రారంభ సంరంభులై.

మల్లికార్జునుఁడు—ఉభయపక్షములవారును, సమానశౌర్యసాహసములతోఁ బోరుటచే నింకను జయాపజయసూచన లెవరియందును కనిపించుట లేదు.

గీ. సమబలోన్నత సాహస శాలు లైన
వీరు లుభయపక్షంబులఁ బోరు నపుడు
తుల్య భార బాహుద్వయ తులిత మైన
తులను జయలక్ష్మి యట్టిట్టు తూఁగు చుండు.

బసవన్న—ఇంకను వివరముగాఁ బరికించినచో కోటగోడల యుద్ధమున మనవారికే గెల్పుగా నున్నట్లగపడుచున్నది. (సైనికుల నుద్దేశించి)

ఉ. మేలు! బళీ! స్వదేశజన మేదురకీర్తి మహాత్త్వకారులా
రా! లలితప్రపూత మతిరమ్యము నౌ మన మాతృభూమికై
యాలముఁ జేసి, జన్మఋణమం దొకకొంచెముఁ దీర్చి మీరలే
చాల పవిత్రులు; లల్లవిగో! జంకఁ దొడంగెను శత్రుకోటులున్.

మల్లికార్జునుఁడు—మిత్రమా! ప్రస్తుతము కోటకువచ్చిన యలజడి తగ్గినది. గోడలపైనుండి శాత్రవులు తరుమఁబడిరి. కాని, వారిలో చాలమంది ఆ కాళికాలయమునంక నడచుచున్నారే! అటు చూడుము.

బసవన్న—(చూచి) అన్నా అన్నా! ఈవైపు సందర్భములు మనవారలకుఁ గొంచెము విపరీతముగఁ గూడ నున్నవే!

మల్లికార్జునుఁడు—అవునవును. అచ్చటి మన సైనికుల సంఖ్య యత్యల్పము. అదిగో! విశేషసంఖ్యాకు లగు శాత్రవులచేత మనవారలు ప్రాణములఁ గోల్పోవుచున్నారు.

చం. కొలఁదియె రాష్ట్రసైన్య మరికోటులు కోటులు చుట్టుముట్టి బి
ట్టలమిన విక్రమోక ఘనులై మనవారలు పేరునిల్పఁగాఁ
దలపడి, పోరిపోరి, తమ దాఁకెనువారల నడ్డియడ్డి, వై
రుల ఘనసంఖ్య మీఁఱ నుసురుల్ వసివోదురు దేశసేనకై.

బసవన్న—ఔను. అరరే! అచట కోటపైఁ గవిసి యాడిన తమవారిఁ గని సిగ్గుఁ జెందు కొనక వైరులు తగుదు మని యీ దేవళంబుఁ గాచు చిన్నసైన్యంబునే నిర్తిఁ జేయుచున్నారు.

మల్లికార్జునుఁడు—మందము తక్కువగఁ గట్టబడిన యీ దేవళప్రాకార మింకను నిలిచియుండు టాశ్చర్యము.

చ. అలసుల వన్యజంతువుల కడ్డముగా నిడినట్టి దేవికో
వెల వెలిగోడ వైరిగజవిద్వర ఘంతకుఁ గాళికామహా
బలమున నాఁగెఁగాక యిఁకపైని గదంగను ఘట్టనంబులన్
నిలువదటంచు సందియము నిండెఁ గదన్నగనుఁ దూలుచుండుటన్.

వెంటనే మనమేగి తోడ్పడనిచో నచటి మనవార లపాయమునకు లోనగుదురు. ప్రాకార మెట్లదరుచున్నదో చూడుము.

బసవన్న—అదరుచున్నను ఇంతలో పడదు. ఏలయంటివా! ప్రాకారంబులోపలినుండి మన వారలు అగ్నిచక్రంబుల విసరుటచే భీతిల్లి వైరుల యేన్గులు చెంతఁ జేరకున్నవి. మనుజులిఁకఁ జేతులతోఁ బడఁద్రోయఁ జాలరు.

మల్లికార్జునుఁడు—ఆఁగినను ఎంతవఱకు ఆఁగును! అరగంట నిలుచుట దుర్ఘటము.

బసవన్న—అరగంటలో ననేకములైన మార్పులు కలుగవచ్చును.

మల్లికార్జునుఁడు—పోరులో పాల్గొనకుండ మన మిక్కడనుండుట కెంతసేపు?

బసవన్న—అస్త్రంబులతోఁ గూడిన ధైర్య మన్నివేళలఁ బనికిరాదు. నావెంట వచ్చు సేనలిదే చేరవచ్చెను. వానిచే రేపఁబడిన పరాగ మదిగో! వారు వచ్చువఱకును గుట్టముఁ గట్టియుంచుము.

మల్లికార్జునుఁడు—ఉన్నైపుకోటపైఁ జూడుము. ఒకింత వెనుకకుఁ దగ్గిన శత్రుసేనలు మఱలఁ గవియ సమకట్టుచున్నవి.

బసవన్న—సమరోద్రేకము చూడ ముట్టడి దీర్ఘకాలము సాగించు నుద్దేశము శత్రువుల కున్నట్లు తోఁచును.

మల్లికార్జునుఁడు—మనకు నదియే మేలు. అబ్బ! కనునాళ్లు ముట్టడి సాఁగినచో కోటలోపలి ఘోరములకు మితి యుండదఁట.

బసవన్న—అది సందర్భముల ననుసరించి యుండును. కాని అదేమి! లోపలనుండి కోట యొక్క పెద్దద్వారము తలుపుల నట్లు కదలించుచున్నారే!

మల్లికార్జునుఁడు—అరరే! ఎవ్వరో తెఱవఁ బ్రయత్నించుచున్నారే!

బసవన్న—ప్రయత్నమేమిటి? తెఱవనే తెఱచిరి!

మల్లికార్జునుఁడు—ఇదేమి విడ్డూరము! ఏదైనఁ గృతఘ్నులగు నాతతాయుల కృత్రిమ మనుకొనుటకు ... ...

బసవన్న—అదికాదు! అదికాదు! చూడుము! కోటలోనుండి కొంత గుఱ్ఱపుదండు వెడలుచున్నది!

మల్లికార్జునుఁడు—బసవన్నా! ఏమిదింత! కోటలోనుండి దాడిచేయు నవసర మిదియా?

బసవన్న—అవసరము కాఁబట్టియే వెడలుచున్నా రనుకొనుము.

మల్లికార్జునుఁడు—ఏమి! వైరిబలఁగ మపారమై సంపూర్ణోత్సాహముతో వెలుపల నుండఁగా మన ... ... రాష్ట్రసైన్యము లింకఁ గూడఁబట్టుకొనకుండ ... ...

బసవన్న—కోటపై డీకొను సైన్యములు వెనుకకు మఱలినప్పుడు కోటలోపలినుండి దాడి వెడలుట, గొప్ప సంకల్పము. చూడుము! చూడుము! చిన్నదండే కాదు. దుర్గమందున్న యాశ్వికసైన్య మంతయు వెడలున ట్లున్నదేమి? ఆహా! అశ్వముల యంద మితర వాహనములకు లేదు సుమా!

సీ. కలియనంగిన కొనల్ గల చెవుల్ నిక్కించి,
తలయెత్తి దిక్కులఁ గలయఁ జూచి,
మెడ నందముగ వంచి, వెడఁద వక్షం బొప్పఁ
గళ్లెంబుఁ గఱచుచుఁ గాలు దువ్వి,
పల్లంబుపై రౌతుఁ బ్రబలలీలగ మోచి,
వెనుకకాళ్ళను పూని వేడ్క నిలిచి,
నిడువెంట్రుకల తోఁక యడుఁ గొంచెం బెత్తి,
ఘన పృష్ఠపార్శ్వముల్ దనర విసరి;
తే. జంతుసౌందర్య సంపూర్ణజన్మఁ దనరు
గుఱ్ఱములు నూర్లు వేలుగఁ గూడి నడచు
నాశ్విక దళంపు గౌరవం బతిశయంబు
కడమ సైన్యాంగముల కెప్డుఁ గలుగఁ బోదు.

మల్లికార్జునుఁడు—ఎదిరిబంట్లు నివ్వెఱపడి యెట్లు చూచుచున్నారో?

బసవన్న—కాని వారు వైళంబ మొగతీరి దట్టంబగు మూఁడుపంక్తు లేర్పడి, వెనుకవారు నిలిచియు, మధ్యవారు వంగియు, ముందువారు మోఁకఱించియు, ఈఁటె మొనలను తమపైకివచ్చు గుఱ్ఱంబుల వైపునకుఁ చిక్కఁగ నెట్లుపట్టిరో చూడుము.

మల్లికార్జునుఁడు—పురద్వారంబునుండి నాలుగు వరుసలుగ బయలువెడలిన హయబలంబులు వెలుపలి బయలున నర్ధచంద్రవ్యూహముఁ దాల్చుచున్నవి! అదిగో! కదలినవి! ముందుకు సాగుచున్నవి! కదలికొలంది వేగం బతిశయించుటచే మహాఝంఝామారుతంబు వలె పరుగిడు హయసమూహంబు ముందు, ఆ వైరిభటుల సన్నని పంక్తులు ఎండుటాకులవలె తెగి, చెల్లాచెదరై పోవా?

బసవన్న—చూచుచుండుము. అంతసులభంబుగఁ బోవు. (తెరలో నాయుధంబుల చప్పుడు.) అదిగో! ఆశ్వికులును, పదాతులును తలపడిరి! ఓహో! ఏమియుద్ధము! చూచి తీరవలెను.

మల్లికార్జునుఁడు—చేసి తీఁపవలె నినుము.

మానినీవృత్తము.

నూటి జవాశ్వము లుద్ధతిఁ బర్విడ, మేదిని బిట్టదరన్, రవ్రతుల్
వాటపు టేఁటులఁ గాల్వురులన్ బొడువన్, గడుకత్తులచే నఱకన్,
వేటులు తప్పఁ దొలంగుచు వారలు వ్రీలెడి సంకియవన్నెలతో
దాఁటెడ రాశ్వికులన్ బడఁగొట్టఁగ దండి మగంటిమి వాజులపై.

అహహా! ఈ మహోత్సవములో మనము పాల్గొనకుండుట ఇంకెంతసేపు! సైన్యము లెక్కడ నిద్రపోవుచున్నవోయి బసవన్నా!

బసవన్న—ఇదిగో నచ్చినవి. ఇప్పుడే నచ్చినవాని నొక్క యుజునిమునవు విశ్రమింపఁజేసికాని పోరిలోఁ జొచ్చను. (తెరవంక వెనుకవట్టు చూచి) హో! ఒక బంటు నిట్లంపుఁడు.

(ఒకబంటు పరుగున వచ్చును)

బసవన్న—అక్కడ నుండు మా గుఱ్ఱములను గొంపోయి, ముందుఁ గల సముద్రపదేశము నందు నిలుపుము. (బంటు గుఱ్ఱములతో నిష్క్రమించును)

బసవన్న—(తెరవంక ముందునకుఁ జూపి) అదే! శత్రువుల కాలిబంట్లు మున్వరుసను రెండుదోట్ల త్రెంచుకొని, మనవారి యాశ్వికదళంబు రెండుపాయలుగా శత్రుసైన్యమునం బడి పోరాడుచున్నది. ఒకతెగ కాళికాలయంబునకై నూటిగా వైరులఁ దెగటార్చు కొనుచుఁ బోవుచున్నది. రెండవతెగ యీకట్టునకే వైరులభేదించుకొని వచ్చుచున్నది. కాని శత్రువులచేఁ బొడువఁబడి మనవారి గుఱ్ఱము లెన్నిపడుచున్నవో చూచితివా?

మల్లికార్జునుఁడు—అరెరే! వేయేసి నిష్కములు వెలగల వాజులు మట్టి కఱచుచున్నవే!

బసవన్న—వెలలేని మనుజులే మట్టి కఱచుచుండఁగా వెలగల గుఱ్ఱముల లెక్కయేమి? అదిగో! మనవైపునకు వచ్చు నాశ్వికదళంబు వైరిసైన్యాకారంబును గడచినది! ఈదెసకే వచ్చి యాఁగినది. అదిగో! ముందుగ పంచకల్యాణిపై నెత్తురొడియు కత్తిని గుఱ్ఱపు మెడవెంట్రుకలపై తుడుచుచు ప్రసాదాదిత్యుఁడు.

మల్లికార్జునుఁడు—హెచ్చరింపుము. మరల నాతఁడు చూడలేదు. హెచ్చరింపుము.

బసవన్న—హో! ప్రసాదాదిత్యా! హో! (చేతులు తట్టును) అతండును, మఱియుఁ గొందఱును గుఱ్ఱంబులనుండి దుమికి పరుగున నిచ్చటికి వచ్చుచున్నారు.

(ప్రసాదాదిత్యుఁడు మఱికొందఱు నాయకులు రక్తసిక్తాంగులై పరుగున వత్తురు.)

ప్రసాదాదిత్యుఁడు—(తొందరగా) బసవన్నా! వచ్చితివా! మల్లికార్జునా! తలపెట్టిన పని సకాలంబునకే నెఱవేర్చితివి. మేలు! కాని, యింత దూరక నిలిచితి వేమి?

బసవన్న—ఇప్పుడే వచ్చిన నా సైన్యమున కొంత విశ్రాంతి నిచ్చుచున్నాఁడ.

ప్రసాదాదిత్యుఁడు—ఇప్పుడేమి విశ్రాంతి! మహారాజ్ఞి అక్కడ పోరుచున్న అశ్వదళంపు తెగలో నున్నది.

మల్లికార్జునుఁడు
బసవన్న } —మహారాజ్ఞి?

ప్రసాదాదిత్యుఁడు—కాఱుమబ్బులసందున మెఱయు చంద్రరేఖ కైవడి! ... ... నా ఆ వైరిబలంబు నడుమ! ... ... తన సైన్యమునకు ముందుగనుండు శ్వేతాశ్వంబుపై నెవ్వరనుకొంటిరి?

బసవన్న—మహారాజ్ఞియే!

మల్లికార్జునుఁడు—రుద్రదేవియే!

ప్రసాదాదిత్యుఁడు—కాకెవ్వరు? వైరిసైన్యములు మన కోటగోడలపైకి విజృంభించుట మాని, కాళికాలయము వైపునకు మఱలినవి. మహారాజ్ఞి తన చుట్టు నిలిచియుండి మాకు ఈగుట్టనే చూపెను. దీనిపై మీచే రేపఁబడిన పొగ కట్లు మాకును కనిపించినవి. తోడనే అశ్వబలము నాయత్తపఱిచి, మహారాజ్ఞి తన స్వీయాశ్వమగు రాజహంసముపై నధిరోహించి, "నగరద్వారము ను తెఱవుఁ" డని యానతిచ్చె.

మల్లికార్జునుఁడు—మేలు! కాకతిసామ్రాజ్యలక్ష్మికిం దగినమాట!

ప్రసాదాదిత్యుఁడు—కాదనఁగలవా రెవ్వరు? మఱియు మమ్ముల నీప్రక్కకు, మరల్చి మీతోఁ గలిసికొని, మఱల గవియుడని, మహారాజ్ఞియే యానతిచ్చెను.

బసవన్న—ఇంక మన మిక్కడ మాటాడుట కవకాశము లేదు. దాదాపు దేవళంబునఱకును శత్రువులఁ జీల్చుకొని యేగినను, మహారాజ్ఞి వెంటనున్న యాశ్వికులు చాలమంది కూలిరి. మహారాజ్ఞికిఁ దోడావశ్యకము. సేనలఁ దీర్చి, పోరులోఁ జొత్తము. గుట్ట దిగినతర్వాత సమభూములలో గుఱ్ఱముల నెక్కెదము. (తెరవంకఁ జూచి) విన్నారా, సేనాధికారులారా! పోరునకు సిద్ధమా!

(తెరలో ననేకులు)— సం సి ద్ధ ము.

తాండ్రవా రటు! కమదనవా రింక పైకి! ఇంక! పెద్దచింత కావలగ! కలకొండవా రా తాళ్ళ నానుకొని! మావా రిట్లు నా చెంతకు! (కొందఱు యోధులు ప్రవేశించి బసవన్న వెనుక నిలుతురు) ప్రసాదాదిత్యా! తా మీ ప్రక్కగ నడచుట నా మనవి.

ప్రసాదాదిత్యుఁడు—అట్లే! (ఒక వంక నిలుతురు.)

బసవన్న—(గన సైనికులను గలయఁజూచి) సిద్ధమా!

అందఱు—సిద్ధమే.

బసవన్న—హెచ్చరిక! ఆత్రముతో నడుగు పెట్టవద్దు. పెట్టినయడుగు వెనుకకుఁ దీయవద్దు. (కత్తిమాని, పైకెత్తి,) ఆంధ్ర నాయకులారా! త్రిలింగదేశ వీరులారా!



ఉ. ఓ జగదేకవీర వినుతోద్యదమేయ బలాఢ్యులార! మీ
తేజము లెల్లకాలము సుధీజనగేయములై చెలంగ, నే
డాజిని పద్మనాయక మహాజన శౌర్యరస ప్రదర్శనం
బే జయలక్ష్మినిం దనుప, బీరముతో రణభూమిఁ బోరుఁడీ.

అందఱు—జే! భేతాళా! (అందఱు పరుగిడుచు నిష్క్రమించుచుండఁగా తెరదిగును.)

తృతీయరంగము.

ప్రదేశము—అక్కడక్కడ బొందలుపడిన ప్రాకారముఁగల కాళికాలయము యెదుటి బయలు.

దేవగిరిసైనికులు వెలుపలనుండి ప్రాకారము కూలద్రోయుటకుఁ బ్రయత్నించుచుఁ బోగుచుందురు.

ప్రాకారము పైనుండి కాకతీయ సైనికులు వారల నాటంకపెట్టుచు పోరుచుందురు.

ప్రవేశము—మహాదేవరాజు, సూర్యుఁడు, చంద్రుఁడు.

మహాదేవుఁడు—దేవగిరి సైనికులారా! ఇక్కడి ప్రయత్నము నిలుపుఁడు. ఆవైపునుండు గోడఁబడగొట్టుదము. రండు. రండు.

(మహాదేవరాజు దేవగిరిసైనికులతో నిష్క్రమించును.)

కాకతినాయకుఁడు—దేవగిరిసైనికు లటు వచ్చుచున్నారు. మనమును ఆవైపునకే పోయి లోననుండి వారి నెదుర్కొందము. రండు.

(కాకతిసైనికులు ప్రాకారములోనికి నిష్క్రమింతురు.)

సూర్యుఁడు—చంద్రా! సృష్ట్యాదినుండియు ననుదినము నభస్సంచారము సేయుచు నీ ధాత్రిపై విశేషములనుఁ జూచుచుంటిని. కాని నేఁటిదినమున నీ యాంధ్రవీరులు చూపిన శౌర్య మప్రతిహతము. అద్భుతము. నాకంటె భూమండలమునకు మిగుల దగ్గఱగ సంచరించు నీ వెప్పుడైన నిట్టి శౌర్యప్రదర్శనమును జూచితివా!

చంద్రుఁడు—లేదు. నేను స్వప్నమున జూచియుండ లేదు.

గీ. ఘనత పున్నది వేల యోజనములందు
ధరను నేఁ జుట్టితిరుగుచు దాపునుండి
కాంచినాఁడను యుగయుగ కదనములను
గాని యిట్టి వేనాఁడును గాంచి యెఱుఁగ.

తే. ఏన్గు ఢీకొన్న వెఱవరు; హెచ్చియున్న
శత్రుసంఖ్యలఁ జిక్కియు జంకుపడరు
పోరునకుఁ బెండ్లికింబోలె కోరి నడతు
రహహ! యేమందు పద్మనాయకుల కడిమి!

ప్రవేశము—కుజ, శని, బుధ, రాహువులు.

కుజుఁడు—ఓహో! ఏమియుద్ధము! మనస్స్ఫూర్తిగ వీరరస మొప్పారుచున్నది.

శని—యుద్ధకారకుఁడ వగు నీకు మనస్స్ఫూర్తి యన నెంతమంది చచ్చుటో!

రాహువు—సర్వమారకుఁడ వగు నీకంటెనా!

సూర్యుఁడు—పోసుపుమాటలిప్పుడా! అదిగో విరోధుల యశ్వదళము!

(తెరలో కోలాహలము)—కాకతిరాజ్యలక్ష్మికి; జే! ఆంధ్రసైన్యములకు జే!

(తెరలో కోలాహలము)—దేవగిరి శౌర్యాగ్నికి జే!

కుజుఁడు—మేలు దేవగిరిమిత్రులారా! అట్లు తలపకుఁడు. ఇంకొక్క తాఁకునకు దేవళంపు గోడ పడఁగలదు.

చంద్రుఁడు—కొలఁదిమందియే పట్టుదలతో ప్రాణంబుల కాసింపక పోరుచున్నారు. ఆసేనకంబులో నేర్పైన ముఖ్యు లుండవచ్చును.

సూర్యుఁడు—ఆ యశ్వదళంబునకు ముందుగ ససహాయశూరత్వంబునఁ మునుపడుచు వారలఁ దెగనఱుకుచున్నది స్త్రీ వ్యక్తి లాగున్నదే!

శని—ఆ శ్వేతాశ్వంబుపై నేనా?

సూర్యుఁడు—ఔను.

శని—ఆవ్యక్తియే కాకతిరాణి యగు రుద్రమాదేవి.

సూర్యుఁడు—స్వయంబుగ నామెయే పోరునకు దిగినదే! ఏమిశౌర్యము! ఎట్టియాశ్వికనైపుణ్యము.

(తెరలో) కాకతిలక్ష్మికి జే! రుద్రమదేవికి జే!

రాఘవుడు—సామ్రాజ్యాధికారిణియే స్వయముగ నీ దేవగిరిప్రాకారంబులోనివారికి సాయమునిచ్చుచున్నది. జ్యోతిర్మండలముల్కాలతిని వెదఁజిమ్మునట్లు మన సేనలఁ జెదరఁగొట్టుచు, మఱికొందఱువైపునుండి వచ్చుచున్నారు. వారు వచ్చులోపల మన సేన యీ ప్రాకారము గూలద్రోసి, లోనఁబ్రవేశింపవలయును. (సేనలకై చూచి) మిత్రులారా! అద్దె! అద్దె! ప్రాకారము కూలనున్నది. ఇంకొక్క తాఁకు. ఇంకొక్క నూకె. మీలోఁ గొంద ఱిటు రండు. ఈవైపున మఱియొకసారి ప్రయత్నింతము.

(దొంగగడ్డములోనుండు రాఘవశర్మయును, కొందఱు దేవగిరిసైనికులును ప్రవేశించి కాలిగుడి వెలుపలిగోడ కొంతఁ బడఁద్రోయుదురు. పడిన గోడబండలక్రింద రాఘవశర్మయు మఱికొందఱు చిక్కుకొందురు. పడిన ప్రాకారభాగమునుండ గర్భాలయము, కాళివిగ్రహము, పూజించు లీలావతి, తత్తరపడు భాస్కరాచారి, పూజారి, పడియుండు కొందఱు కాకతీసైనికులును కనిపింతురు)

సింఘణుడు—గోడ పడినది. లోపలఁ బ్రవేశింతము. ఈఁటెల మొన పట్టుఁడు. గోడదాఁటు నుండి వారు మనపైఁ బడవచ్చును.

(దేవగిరిసైనికులు మొనపట్టి లోపలి కేఁగు ప్రయత్నములో నుండఁగా.)

(తెరలో)— కాకతీశ్వరునకు జే! రుద్రమదేవికి జే!

(నెత్తురోడు కత్తితో పరుగున రుద్రాంబ ప్రవేశించి, దేవగిరి సైనికులను, రెండు ప్రక్కలకును పడఁద్రోయుచు వారి నడుమనుండి యేగి, పడిన ప్రాకారంబున కడ్డముగ నిలుచును. ఆమెను గాంచి, విస్మయమున, పడఁగా నిలిచిన దేవగిరివారు ఒకింత వెనుకాడుదురు.)

రుద్రమదేవి—(తెరవంకఁ జూచి) నాయకులారా! మీరుకూడ నక్కడనే గుఱ్ఱముల దిగి రండు. ఈ బండలలో నవి నడువలేవు.

(పరుగున నాంధ్రనాయకులు ప్రవేశించి, దేవగిరిసైనికులతోఁ బోరి, వారిని సైన్యములోనికిఁ దాఁటద్రోలి, మరలి మహారాజ్ఞి కడకు వత్తురు. గృహపూరుషులు ఒక ప్రక్కగ నిలిచి చూచుచుందురు)

ఆంధ్రనాయకుఁడు—మహారాజ్ఞీ! ఎటు?

రుద్రమదేవి—అటు! (దేవళమువంకఁ జూపి) వైరులావైపునకుఁ బోయిరి. మీ రందఱు కూడ నట్లే పోయి, వారల నింకను దఱిమి రండు.

ఆంధ్రనాయకుఁడు—నీవద్ద నెవరి నుండుమందువు?

రుద్రమదేవి—నావద్ద నెవ్వరును వలదు. పొండు! త్వరగా! అదిగో! వైరులు పటాల తెప్పిరిలి, ఆవైపున గోడలకుఁ బ్రాఁకుచున్నారు. పొండు! పొండు! వారిని వెనుకఁ గొట్టుఁడు. అదె! నిలిచియుండు రాజహంసము నొద్ద నొకబంటు నుండుమనుఁడు,

ఆంధ్రనాయకులు—ఆజ్ఞ.

(పరుగున నాంధ్రనాయకులు నిష్క్రమింతురు.)

రుద్రమదేవి—(దేవళముపంకc జూచి) లీలావతీ! లీలావతీ!

లీలావతి—(లోననుండి తొంగిచూచి) మహారాజ్ఞియేనా? (నివ్వెఱపడి చూచును.)

రుద్రమదేవి—చంద్రికాదేవి నీకును క్షేమమా? అట్లు చూచెదవేమి?

లీలావతి—ఈ దీనురాలిc గావ నీవే వచ్చితివే తల్లీ. అమ్మో! ఎంత ప్రమాదము!

రుద్రమదేవి—పలుమాటలు వలదు. మీ రిద్దఱు సహాయముం బొరయరైరి కదా!

లీలావతి—నీ యండ నుండువారి కపాయమా తల్లీ!

రుద్రమదేవి—చాలు. మీ రిద్దఱును లోపలనే యుండుడు. నే నీ చోటును గాచెద.

(పడిన గోడ కడ్డముగ నిలుచును. లీలావతి గదిలోని కేగును.)

శని—కుజా! చూచెదవేమి? మూర్తీభవించిన శౌర్యప్రభ ద్వారమునc బెట్టియున్నది. పోయి కుంభలగ్నజాతకశౌర్య మెట్టిదో ఒకింత పోరి చూపుము!

కుజుడు—రాహో! త్వాదృశులకు నీ కుంభలగ్నమున కెక్కడిది? పనిని చూతము. (సూర్యునితో), దేవా! ఇట్టి మహోత్సాహ సమయమున మేము పోరాడకుండుట బాగుగ లేదు. పోరుటకు సెలవా?

సూర్యుడు—(ఉత్సాహముతో) సౌమ్యా! ఇట్టి యుత్సాహతరుణము, అన్నివేళల లభ్యపడదు.

కుజుడు—దేవగిరివీరులారా! అక్కడ నిలిచియున్నది కాకతిరాణి. ఆమెను బట్టుకొనుడో దక్షిణ సైన్య మంతయు మనకు లోcబడును. రండు! పట్టుకొందము!

(కొందరు దేవగిరి సైనికులు ప్రవేశింతురు.)

రుద్రమదేవి—రండు! రండు! దేవి కీ నసుమ సరబలు లరుదైనవి.

(కుజుడు, రాహువు, దేవగిరినాయకులును మహారాజ్ఞిపై నొక్కపెట్టున తలపడుదురు. వచ్చువారిని కేరసీక పడ నఱుకుచు రుద్రాంబ పోరుచుండును.)

శని—(చప్పటలు కొట్టి యెగురుచు) మేలు! తల్లీ! అల్లే! ఊc! అగ్గి! మజల! ఆc! ఆc! అట్లు బీరములు పల్కు నా కుజుcడుగాని పొట్టc బగులc బొడువుము. రాహువుగాని పండ్లు రాలcగొట్టుము.

(తెరలో)— కాకతీంద్రునకు జే! పద్మనాయక శౌర్యాగ్నికి జే!



(మల్లికార్జునుఁడు, ప్రసాదాదిత్యుఁడు, బసవన్న, విశ్వగ్లసైనికులు ప్రవేశించి, మహారాజ్ఞితోఁ బోరు వార్తలను అందఱును, గృహపూరుషులను, బాహుఁదోలుకొనును సేవన్యమునకు నివృత్తిమింతురు.)

(మల్లికార్జునుఁడును, బసవన్నయు, తిరిగి ప్రవేశింతురు.)

రుద్రమదేవి—బసవన్నా! సమయమునకు వచ్చితివే!

బసవన్న—మహారాజ్ఞికి భద్రమా! (కత్తియెత్తి అభివాదము సల్పును)

రుద్రమదేవి—(చిఱునగవుతో) అలసటగ నున్నది. ఐనను, వారి కత్తితునుకలచే ... ..., నొడలిపై గీఁతయైనఁ బడలేదు. మీకేమైన గాయము లైనవా?

బసవన్న—విశేషమేమియు లేవు.

రుద్రమదేవి—సరి! యుద్ధమటు సాగుచుండగా నిచటికి వచ్చితిరేమి?

బసవన్న—ప్రభువుల క్షేమ మారయవచ్చితిమి. ఇదే పోరునకేగెదను. మల్లికార్జునకుమారా! నీ వొకింత యాఁగి, మహారాజ్ఞి యుత్తరువుల వివరముగ నెఱిఁగి రమ్ము. జే! శభాషా! ఆంధ్రసామ్రాజ్యమునకు జే! రుద్రాంబాదేవికి జే! (పరుగున నిష్క్రమించును.)

(మహారాజ్ఞియు మల్లికార్జునుఁడును ఒకరినొకరు ఒకింత సిగ్గుతోఁ జూచుకొందురు.)

మల్లికార్జునుఁడు—(కత్తి యెత్తి అభివాదము సల్పి) నాపైని బెట్టఁబడిన కార్యభారము శ్రీ రుద్రాంబికాకృపచే శుభంబుగ నెఱవేర్పఁబడినది.

రుద్రమదేవి—ప్రత్యక్షముగఁ జూపఁబడిన సాహసమునకు నాంధ్రసామ్రాజ్యము శూరుల యెడ కృతజ్ఞతతో నిండినది.

మల్లికార్జునుఁడు—సామ్రాజ్యావశ్యకమున నొప్పింపఁబడిన మఱదలి మనంబునుండి మన్ననలఁ గోరుటే కొదువ.

రుద్రమదేవి—(చిఱునగవుతో) ధీరోత్తంసుల సమరోత్సాహ మింకొకసారి మాచే నివారింపఁబడు టెందులకు? (పోరువంకఁ జూపును)

మల్లికార్జునుఁడు—నివారింపఁబడుటకు (రుద్రమదేవి తనచేతికి కట్టిన కట్టు చూపి) ఇట్టి ప్రేమానుబంధమే కారణముకదా! ఇదే నాకు రక్షయై నాచే నిన్ని పనులు చేయించినది.

రుద్రమదేవి—(ఉద్వేగముతో) కట్టు సడలి మఱల నెత్తురోడియునట్లున్నదే!

మల్లికార్జునుఁడు—(చేతిపై కట్టు చూపి) ఈ కట్టు సడలునది కాదు. దీనిపై నున్నునది వైరుల రక్తము. మఱల సమరంబున పాల్గొన నాకు సెలవా? ఇక్కడ కింక శాత్రవులు రాఁజాలరు.

రుద్రమదేవి—శౌర్యరసప్రదర్శనంబుఁ దిలకింప నుత్సాహపడు ననుమతిని సూచించుచు, నా కత్తి నిదే గ్రహింపఁదగినచేతి కిచ్చుచున్నదానను.

(మహారాజ్ఞి తనచేతి కత్తిని మల్లికార్జునున కిచ్చును.)

మల్లికార్జునుఁడు—(అతిభయముగ వంగి, పుచ్చుకొని, యా కత్తిని ముద్దుఁగొని, నిలిచి, తనకత్తినిఁ జూపుచు) మునివలికి కాపుగ నుండుటకును, మహారాజ్ఞికి సంసేవ నొనర్చుటకును, నాప్రాణసమమైన కత్తి నిదే సమర్పించుచున్నాఁడను. (తన కత్తిని మహారాజ్ఞి కిచ్చును.)

రుద్రమదేవి—సస్నేహము పుచ్చుకొని) బాగా! తృప్తిపడుము. వైరులు నీరసిలి పోరు తెలుపి కాక ముందే సురవారిఁ గలిసికొనుము. నా గుఱ్ఱము నెక్కి పొమ్ము. నీ గుఱ్ఱ మలసి యున్నది.

మల్లికార్జునుఁడు—(కత్తితో నభివాదనము బట్టి, కాకతిలక్ష్మికి విజయ మగుఁగాక!

(పరుగున నిష్క్రమించును)

(ఇప్పటినుండి యుద్ధవిరామంబునుదూర్చి తరువాత మహారాజ్ఞి యాజ్ఞ యగువఱకును, యుద్ధము జరుగుట సూచించు రౌద్రధ్వనులు తెరలో మ్రోగుచునే యుండును.)

రుద్రమదేవి—(తెరవంకఁ జూచి) ఓరీ భటులారా!

(కొందఱు కాకతీయ భటులు ప్రవేశింతురు.)

రుద్రమదేవి—ఈ రణనిహతులను, గాయపడినవారలను, అవలకుఁ దీయుఁడు.

భటులు—ఆజ్ఞ. (అట్లు చేయుదురు)

రుద్రమదేవి—సూర్యకిరణంబులముందు చీఁకట్లవలె మా సైనికులముందు వైరులు క్రమంబుగ వెనుకకుఁ బోవుచున్నారు. ఇంచుమించుగ రణ మింతటితో ముగిసినట్లే. (కాళిగుడివైపు చూచి) లీలావతీ! వైరులు తఱుమఁబడిరి. వెలుపలికి రమ్ము.

భాస్కరాచారి—(గుడిలోనుండి లీలావతితో వచ్చి) నిజమేనా! అపాయము తప్పినదా! అమ్మా! మహారాజ్ఞీ! దీర్ఘాయుష్యమస్తు!

రుద్రమదేవి—పెద్దల దీవనలు మాకుఁ జెందినవి.

భాస్కరాచారి—మేము నేఁడు ప్రభువులవలననే మృత్యువు నోటినుండి కాపాడఁబడితిమి. కాని యింకను అక్కడ కత్తులు మ్రోఁగుచున్నవే!

రుద్రమదేవి—మ్రోఁగనిండు. ఇంత పెద్దగ నింతసేపు మ్రోఁగిన వొక్కసారిగ నాఁగునా! లీలావతీ' దేవిపూజ ముగిసెనా!

లీలావతి—మహాభిషేకము కాక యన్నియు ముగిసినవి. తరువాత సహస్ర నారికేళ బలి కావలెను.

రుద్రమదేవి—నారికేళంబు లెందు కింక? దేవికిఁ బ్రీతికరముగ సగబలుల వేలు పూర్తియైనవి. తన సమస్యా పూర్తిని తానే కాళిక నెఱవేర్చుకొనినది. జ్యోతిర్గ్రంథ సాధనమున కింక నే యాటంకమును గలుగఁగూడదు.

రణనిహతుల మోయు బంటు—మహారాజ్ఞీ! ఈ బండక్రిందనున్న యొక దేవగిరిభటుఁడు ప్రాణములతో నున్నాఁడు.

భాస్కరాచారి—ప్రభూ! వాని నలిగి చావనిమ్ము

రుద్రమదేవి—అది సరికాదు. ఎదుటఁబడి పోరునప్పుడు శత్రువుని వధింపఁదగును గాని పోరఁజాలని దుస్థితి యందుండు వానిపై వైర మెందుకు? (బంట్లతో) ఓరీ! ఆ బండల నాతని పైనుండి తొలంగఁద్రోయుఁడు.

బంట్లు—అనుజ్ఞ!

(భటు లట్లు చేయుదురు. బండలను తొలఁగఁద్రోయఁగా దేవగిరి సైనికుని వేషముతో రాళ్ళలో నిఱుకుకొనియున్న రాఘవశర్మ కనిపించును)

రుద్రమదేవి—పాపము! రాలదెబ్బలతో నొడలి యెముకలు విఱిగినవా!

భటుఁడు—(రాఘవశర్మ శరీరము తడవి చూచి) ప్రభూ! ఎముకలు విఱిగినట్లు లేదు. ఒడలు నలిగి సొమ్మసిలిన ట్లున్నది.

రుద్రమదేవి—ఆతని నీ గడ్డిగల తెఱపిచోట నెమ్మదిగ పరుండబెట్టుఁడు. (భటు లట్లు చేయుదురు) సరి! మీరు పొండు. (భటులు నిష్క్రమింతురు.) భాస్కరాచార్యా! ఆ దేవళమునుండి తీర్థము గొనితెండు.

భాస్కరాచారి—ఆజ్ఞ! (దేవళములోనికి నిష్క్రమించును.)

రుద్రమదేవి—లీలావతీ! ఈతని మోము బాగుగఁ జూడుము.

లీలావతి—(చూచి) తల్లీ! అనుజ్ఞ యేమి!

రుద్రమదేవి—ఈతని నీ విదివఱకు చూచినట్లు గుర్తు లేదా?

లీలావతి—ఈ దయ్యపుగడ్డము గల దేవగిరిభటుని నే నెట్లెఱుఁగుదును!

రుద్రమదేవి—ఆ దయ్యపుగడ్డము కృత్రిమము. నాటకములలో వేషధారులు పెట్టునట్టిది. మఱల చూడుము.

లీలావతి—(చూచి) అవును! అవును! ఈఁగా క్రమములు చెవులసందులఁ గనిపించుచున్నవి. (ఆశ్చర్యములో) ఎవ్వరిది? ఆతఁడా?

రుద్రమదేవి—(నవ్వి) ఆతఁడే. నీ ప్రియుఁడగు రాఘవశర్మయే!

లీలావతి—(ఉద్వేగములో) అమ్మో! ఎంత దెబ్బలు తగిలినవో!

రుద్రమదేవి—భయపడకుము. ముక్కు, నోరు, చెవి, కన్నులు, వీనివెంట నెత్తురు వచ్చుట లేదు. తలపై పెద్దదెబ్బ తగిలినట్లు లేదు. శ్వాసము సాధారణముగా నున్నది. కాన గుండెల కేమి యొత్తిడి తగిలియుండదు. ప్రాణాపాయ మగునట్లు బలమైన బండ లీతనిపైఁ బడియుండ లేదు. కొలఁది రాలు తగిలి సొమ్మసిలి నట్లున్నది.

లీలావతి—శాంభవి! కాని తల్లీ! ఈతఁ డీ వింతవేషముతో నిచట నుండుటకుఁ గారణ మేమైయుండును? కృతఘ్నుఁడై శత్రువులలోఁ జేరెనా!

రుద్రమదేవి—కాదు. కాదు. అట్లైయుండదు. అట్టి దుష్టుఁడు కాఁడు. వేదనఁ గలిగించు నీతని చిత్తచర్యలలో నిది యొకటై యుండవలెను. అదిగో! కదలుచున్నాఁడు.

లీలావతి—అదే! మా నాన్నగారు నీరు తెచ్చుచున్నారు.

రుద్రమదేవి—లీలావతీ! ఇటు చూడుము! మన మీతని గుర్తించినట్లు తెలియనీకుము. సందర్భముల పర్యవసానమును బరీక్షింతము.

(ప్రవేశము—భాస్కరాచారి నీటిచెంబులో.)

భాస్కరాచారి—ప్రభూ! నీరు తెచ్చితిని.

రుద్రమదేవి—నెమ్మదిగ నీతని నోటఁ బోయుఁడు.

భాస్కరాచారి—(సందేహించుచు) ఈతనిని ఏ సలమో!

రుద్రమదేవి—(కొంత తీవ్రముగా) తోడిమానిసికిఁ బ్రాణములు పోవుచున్నపుడా కులభేద విచారము? పోయింపుఁడు. లీలావతీ! కొంచెముగ నీతని తలను ఎత్తిపట్టుము.

లీలావతి—ఆనుజ్ఞ! (లీలావతి తల నెత్తఁగా, భాస్కరాచారి రాఘవశర్మకు నీరు త్రాగించును. రాఘవశర్మ తెప్పిఱిల్లి లేచి కూర్చుండును.)

రాఘవశర్మ—(వెఱ్ఱిచూపులతో దిక్కులు చూచి) ఎక్కడ? ... ఏ ... మి ... ఎవ్వరు ...

భాస్కరాచారి—నెమ్మది చెందుము. నీకు వచ్చిన భయము లేదు.

లీలావతి—నీవు శాత్రవుఁడవైనను, మా మహారాజ్ఞి నిన్ను రక్షించెను. భయపడకుము.

రాఘవశర్మ—మహారాజ్ఞియా! (స్మృతి నభినయించి తనలో) ఓహో! అంతయు స్మరణకు వచ్చినది. గొప్పచిక్కు తటస్థించినదే! ఇట్టిదుస్థితిలో నుండు నన్ను ప్రభువునకుఁ దెల్పుకొనుటకు సిగ్గగుచున్నది. దేవగిరిభటునివలె నటింతును. (లేచి నిలుచును.)

రుద్రమదేవి—ఒడలు నెమ్మదియా?

రాఘవశర్మ—అమ్మా! తలమాత్రము దిమ్ముగ నున్నది.

రుద్రమదేవి—త్వరలోనే యాబాధయు తగ్గఁగలదు. సరి. మాకు లోఁబడిన శాత్రవుఁడవు. లీలావతీ! వీఁడు పారిపోవకుండఁ గనిపెట్టుము. (రాఘవశర్మతో) నీ వామెవెనుక నిలిచి, మా ఖేటమును వహింపుము. (డాలు వాలని చేతి కిచ్చి) అదిగో! కాకతిసామ్రాజ్య వీరులు. నీ మిత్రుల నెట్లు సలుపుచున్నారో చూడుము.

రాఘవశర్మ—నామిత్రులా?

రుద్రమదేవి—కారా?

లీలావతి—(తెలివంకఁ జూచి) శివ! శివ! ఏమిఘోరము! అంతయు రక్తమయమే. (కన్నులు మూసికొని) తల్లీ! చూడలేకున్నదానను.

రుద్రమదేవి—అవును. ఎదిరించువారలఁ జంపుట క్షాత్రము. తిరుగఁబడలేనివారల హింసించుట క్రౌర్యము. ఇంక దీని నాఁపెదము. ఓరీ! (తెరవంక చూచి చప్పటులుకొట్టి, రమ్మని సంజ్ఞ చేయును. బాకాబంటు వచ్చును.)

రుద్రమదేవి—యుద్ధవిరామమును ఊదుము.

బాకాబంటు—ఆజ్ఞ! (బాకాను దీర్ఘముగ మూఁడు సార్లు ఊఁదును. తెరలోని కార్యధ్వనులు నిలుచును.)

(తెరలో)—ఆంధ్రసామ్రాజ్యమునకు జే!

లీలావతి—యుద్ధము విరమించినది. కాళికాదేవి కృపవలన నేఁటి ఘోరనములు ముగిసినవి. (గుడివంకఁ దిరిగి నమస్కరించుచు)

ఉ. ఓ! హిమవన్నగేంద్ర జగదున్నత జన్మతపఃఫలంబ! యో
మోహనరూప! యో యభవ మోద కరామల దివ్యదేహ! యో
ద్రోహమనస్క దుర్మత విదూర మహామహిమాఢ్య! యో సము
త్సాహ సతార్త వారిగుణధామ! దయామయి! యోమహేశ్వరీ!

శా. ఉల్లాసంబున నేఁడు యుద్ధమిష వీరోత్తంసులై నట్టివా
రెల్లన్ వేనకువేలు నీకు బలియై; రీ రక్తవర్షంబు నీ
యుల్లంబుం దనివొందఁగాఁ గురిసె; శాంతోద్భాసవై యింక నో
తల్లీ! మారణఘోరముల్ నిలుచుటన్ ధ్యానింతు నీ పాదముల్.

రుద్రమదేవి—లీలావతీ! చూడుము. వైరినాయకులఁ దోడ్కొని మనవార లిచ్చుటకై వచ్చుచున్నారు.

(తెరలో)—త్రిలింగసామ్రాజ్యమునకు జే!

(ముందుగ కాకతీయదండనాథులు, వారివెంట నొకింత దీనవదనమ్ములతో దేవగిరి వీరులు, మహాదేవరాజు, గ్రహపురుషులు ప్రవేశింతురు. వీరిలో గ్రహపూరుషులుగాక కొందఱవారు చాలమంది గాయపడియుందురు. మహాదేవరాజు మిక్కిలి గాయపడి, తనబంటుపై వ్రాలుకొని నడచుచుండును. కొందరు కాకతివీరులు నట్లే గాయపడి నడుచుచు ప్రవేశింతురు.)

ప్రసాదాదిత్యాది కాకతీయవీరులు—(కత్తులను పైకెత్తి అభివాదనములు పట్టుచు) ఆంధ్రసామ్రాజ్యమభివృద్ధి నొందుఁగాక! కాకతిసామ్రాజ్యలక్ష్మికిఁ గల్యాణ మగుఁగాక!

రుద్రమదేవి—మిత్రులారా! గాయములచే నొచ్చియుంటిరిగదా!

ప్రసాదాదిత్యుఁడు—మహారాజ్ఞీ! యావజ్జీవితము, మేము గర్వపడఁదగిన విజయ లాంఛనములు గాని, యివి గాయములు కావు.

మ. నయశాస్త్రోక్త సుధర్మపాలన కళానైపుణ్య పారంగతా
వ్యయ ధీ ప్రేరిత సత్య శౌర్య విభవ వ్యాయామ సంగ్రామ రం
గ యశోవ్యాలిఖితామలాక్షర దిశాగంధేభ దంతస్థలీ
జయతేజోధిక కాకతీయ నృపవంశ ప్రాంశ రాజన్మణీ!

బసవన్న—సీ. మీ కులదైవంబు శ్రీకంఠుఁ డల స్వయం
భూదేవు కరుణానుభూతిచేత
భవ దాహ్వయముగల్గు పరమేశు నిల్లాలు
రుద్రాంబికా కృపారూఢి కతన
మీ వంశపూర్వులౌ మేటి నృపాలుర
వీరమాతల దయావృష్టి వలన
సంకల్పసిద్ధంబు జయశీలమైన మీ
ఘనయత్నపూర్ణతా కారణమున

గీ. నాంధ్ర వీరజనోత్సాహ మతిశయిల్లె;
సకల పరిపంథి గర్వాంధసమితి దొరఁగె;
జగము లెఱుఁగంగ ధర్మసంస్థాపన మయ్యె;
విజయలక్ష్మికి కల్యాణ విభవ మెసఁగె.

రుద్రమదేవి—మేలు! కాకతికులదైవములకు విశేషార్చనలు సమర్పింపఁబడుఁగాక.

బసవన్న—ప్రభూ! ఇదే జయింపఁబడిన వైరివర్గము. (దేవగిరివారిని చూపును.)

రుద్రమదేవి—(మహాదేవరాజును చూచి, ఉవీరుని యొడలిపైఁ దగిలిన కత్తివ్రేట్లు చూడ, నీతను సులభముగ మనకు లోఁబడినట్లులేదే!

బసవన్న—ప్రభూ! అట్లే. ఒడలినెత్తురు వరదలై పాఱి స్మృతితప్పు సమయమువఱకు నీతఁడు పోరుమానలేదు. ఈతఁడె మన ముఖ్యవైరియగు మహాదేవరాజు. ధీరోత్తముఁడు.

(మహాదేవరాజు, గ్రహపూరుషులు, దేవగిరివీరులు అర్ధంబుగ పంక్తి, వరుసతోఁగూడ పిడివైపు ముందుకుఁ బట్టి తమ కత్తులను మహారాజ్ఞికి అందఁజేయఁబోవుదు.)

మహాదేవుఁడు—కాకతివీరలక్ష్మీ! రణవిజయ శుల్కంబుల నిదే పరిగ్రహింపుము.

రుద్రమదేవి—భద్రులారా! కులదైవముల కరుణచే మాకు విజయము చేకూరెఁగాక! శూరులగు మీయొక్క శౌర్యచిహ్నముల మేము పరిగ్రహింపము. మీ ఆయుధంబులు మీయొద్దనేయుండుట మాకు పరమాహ్లాదకరము. లెండు. విశ్రాంతులగుఁడు.

(దేవగిరివారు, గ్రహపూరుషులు ప్రక్కకు నిలుతురు.)

(కాకతీయవీరులతో) దండనాథులారా! అప్రతిహతంబగు మీ సాహసము మనకు సంపూర్ణ విజయము చేకూర్చినది. బసవన్నా! సమయమునకు వచ్చి నేఁటి విజయమునకు ముఖ్యకారకుఁడ వైతివి.

బసవన్న—అనుగ్రహింపఁబడితిని. కాని, నేఁటి విజయమునకు మన మల్లికార్జుననే ముఖ్యకారకునిగా నెంచఁదగును.

సీ. పెనుగట్లు లక్షపైని బడిన సైన్యము నాఁపి
ఘనత నీకోటను గాచి నాఁడు
ఘోర నొక్కండు వైరివారిధిఁ జొచ్చి
నెలవుపట్ల తెఱంగు నేర్చినాఁడు
పెక్కామడలదూర మొక్కరేయిన పోయి
సను దెచ్చి రణమందుఁ జొనిపినాఁడు
నేఁటి సంగర మీవు, మేటివీరులు, మెచ్చ
శత్రుభీకరలీల సలిపినాఁడు
తే. మేము వినుతింపఁ జోలదు మిత్రుఁ డగుట;
నైజ భవదీయ మృదుల కటాక్ష రక్తిఁ
జూచి యెట్లుమన్నించెదో శూరవరుఁడ
మల్లికార్జున వర్మ నీ మామకొడుకు.

(రుద్రాంబా మల్లికార్జును లొండొరుల మొగములఁ జూచుకొని కొంచెము నవ్వుకొందురు.
అందఱును కరతాళధ్వని గావింతురు)

ప్రసాదాదిత్యుఁడు—మేలు! బళి నన్నా! స్వారస్యమగు వాక్యమోయి!

మల్లికార్జునుఁడు—నాకంటె మెప్పునకుం దగినవారు లేరా? లేకేమి! (వికారముతో) ఉండిరి. వైరిసైన్యము లన్నియు నొక్కపెట్టున డీకొనినను వెనుకాడక, ఈ చిన్నదేవళంబును గొన్నదుంబులును కాపాడి, పౌరుషముతో ప్రాణంబులు వదలిన కొలఁదిమంది వీరోత్తంసులు మన కాదర్శప్రాయులును, పూజ్యులును గదా.

రుద్రమదేవి—అవును. వారిశౌర్యమును వినుతించునట్టి శాసనము నొకదాని నిక్కడ నిలిపెదము. మఱియు ఈ యుద్ధమున వీరస్వర్గముఁ గొన్నవారి యొక్క బంధువర్గము సామ్రాజ్యముచేతఁ బోషింపఁబడుఁగాక. ఇఁక రణములో గణ్యమానంబగు శౌర్యముఁ జూపిన వీరుల కెల్లరకు విజయపారితోషికము లొసంగఁబడుఁగాక.

ప్రసాదాదిత్యుఁడు—అనుగ్రహింపఁబడితిమి.

రుద్రమదేవి—దండనాథా! గాయపడినవారికి అత్యవసరమగు చికిత్స చేయుటకై వైద్యుల కొఱకుఁ గబు రంపితిరా?

ప్రసాదాదిత్యుఁడు—రణము నిలుచుటతోడనే యొక రౌతును ఆపనిపై నగరంబులోనికిఁ బంపితిని. ప్రభూ! తమ సైనికుల కేలోపమును గలుగదు.

రుద్రమదేవి—మనవారికే కాక వైరిసైనికులకుఁగూడ వలయు వైద్యసహాయ మలవడఁ జేయుఁడు.

ప్రసాదాదిత్యుఁడు—ఆజ్ఞ. ప్రభువులు కరుణాసముద్రులు.

రుద్రమదేవి—(ప్రసాదాదిత్యునకు గ్రహపూరుషులను జూపి) ఈ మహాతేజశ్శాలురు ఏదేశమువారో?

ప్రసాదాదిత్యుఁడు—అనుజ్ఞ యగుచో నేను మహాదేవరాజు నడిగెదను.

రుద్రమదేవి—అడుగవచ్చును.

ప్రసాదాదిత్యుఁడు—మహాదేవరాజా! మన కిదివఱకు రణరంగపరిచితి కలదు, కాని క్రొత్త వారలగు ఈ తేజశ్శాలు లెవ్వరు?

మహాదేవరాజు—పారసీకులు.

ప్రసాదాదిత్యుఁడు—పారసీకులా?

మహాదేవరాజు—మీకు సందేహముగా నున్నచో ఎదుటనున్న వారినే యడుగరాదా?

ప్రసాదాదిత్యుఁడు—(గ్రహపూరుషులతో) భవ్యులారా! ప్రతికక్షు లొండొరుల నామములఁ దెల్పుకొనుట యుద్ధ పరిసమాపక సమయ మర్యాద సుండీ.

సూర్యుఁడు—గురువర్యా! ఇంక దాఁచుట యెందులకు? సందర్భములను క్లుప్తముగ నెఱింగింపుము.

గురువు—సృష్ట్యాదినుండి ప్రదర్శింపఁబడుచున్న యీ మహాకథను క్లుప్తపఱచి చెప్పుటకంటె నిందున్న వీరల కందఱ కొక్కక్షణము సేపు దివ్యదృష్టి నొసఁగుచో నిజస్థితిని వారే యెఱుంగఁగలరు.

సూర్యుఁడు—అట్లే యొనర్పుఁడు.

గురువు—వీరవరులారా! నిస్సంశయుల రగుఁడు.

(హస్తములు వారి కన్నులముందు త్రిప్పును.)

అందఱు—(కన్నులు మూసికొని) అద్భుత మద్భుతము! ఆశ్చర్య మాశ్చర్యము! (కన్నులఁ దెఱతురు)

గురువు—మహారాజ్ఞీ! సందేహము వీడినదా?

రుద్రమదేవి—(తనలో) ఇది యింద్రజాలము కాదుకదా! పరీక్షింతును. (ప్రకాశముగా) మహాత్ములారా! దివ్యతేజస్కులయెడ మాబోఁటి మానవులకు సందేహము కలుగదు. కాని తమరు మమ్ముఁ బరీక్షింప దయతో నేఁడు సలిపిన విక్రమలీలయందుఁ జాలమంది యసురులఁ గోల్పోయిరి. ఇది తమకు లీలమైనను వారికిఁ బ్రాణాంతక మయినది.

సూర్యుఁడు—భవ్యా! ఇదియా నీ సంశయము! మాపరీక్షకు మీరలు ఆఁగియుండఁగా మీ సందియము వాపక మే మేగుదుమా! ఇదే నేఁటివఱకును జెలరేగిన యీ సమీకంబున విగతాసు లైనవా రెల్లరును మఱల సజీవులై యెప్పటియట్లు విలసిల్లఁగలరు. దీననే మా దివ్యత్వము మీకుఁ దెలియఁగలదు.

(తెరలో కలకలము)

అందఱు—(ప్రక్కకుఁ జూచి) ఆశ్చర్య మాశ్చర్యము! యుద్ధనిహతు లందఱును నిద్రనుండి మేల్కొనువారివలె లేచుచున్నారు.

గాయపడినవారు—మాగాయంబుల బాధయు లేకుండపోయినది! ఆశ్చర్యము'

రుద్రమదేవి—(లోపలఁ గల తెరవంకఁ జూచి) వారు మఱల యుద్ధ మారంభింపనున్నారు! ఆఁగుమనుఁడు! అపుఁడు!

ప్రసాదాదిత్యుఁడు—(తెరవంకఁ జూచి పేరులుంగున) వీరులారా! యుద్ధపరిసమాప్తి యైనది. ఇంక పోరకుఁడు! పోరకుఁడు!—— (తెరలో కలకలము ఆఁగును)

మల్లికార్జునుఁడు—మఱల తలఁపడకముందే రణ మాఁపవలసివచ్చినందులకేమో వారు విస్మయమును అసంతృప్తిని చెందుచున్నారు.

రాఘవశర్మ—పాపము! రంభసన్నిధినుండి మఱల హఠాత్తుగ అనుదినసంసారస్థితికి దిగలాఁగఁబడినవారికి అసంతృప్తిగానుండదా! (అందఱును నవ్వుదురు)

మహాదేవరాజు—(అపవారించి) నీలకంఠా! ఆ బంటు మనవాఁడు. పిలుచున్నాఁడు.

నీలకంఠుఁడు—(అపవారించి) తరువాత రెండు తన్ని బుద్ధి సెప్పెదను.

రుద్రమదేవి—యుద్ధనిహతులను పునర్జీవితులుగఁ జేయఁజాలువారు దివ్యులగు గ్రహపూరుషులే. సందేహము లేదు.

భాస్కరాచారి—ప్రభూ! ఎల్లరకు సందేహము నివారణమైనది. కాని నా సందేహము బలము చెందినది.

రుద్రమదేవి—వివరింపుఁడు.

భాస్కరాచారి—ఖగోళపాలురు ఈ లోకమునకు విచ్చేయుట మానవులయొక్క మహాద్భాగ్యమే. ఇఁక నన్నుఁగూర్చి ఖగోళపాలురు, దివ్యజ్ఞాన ప్రదర్శనము చేత, నిట్లు నిరూపించిరి. తొల్లి సృష్టికాలమున బ్రహ్మసభలో గ్రహగోళాధిపులును, ప్రజాపతుల మగు మేమును, భిన్నాభిప్రాయులము కాఁగా, నప్పుడు అర్ధనారీశ్వరుఁడవత

రించి, మా కొఱకు పరీక్షాభిధానమును గల్పించినట్లును, దానిచే బ్రజాపతులలో నొకఁడ నగు నేను మావాదమును గెలిపించుటకొఱకే భూలోకంబునఁ బుట్టి యింతటి రాద్ధాంతమునకుఁ గారకుఁడనైనట్లును, ద్యోతకంబయ్యె. నేను వచ్చినది వ్యక్తిస్వాతంత్ర్య నిరూపణమునకు. గ్రహపూరుషులు విచ్చేసినది గ్రహబల ప్రపాదనమునకు. ఇప్పుడు విజయలక్ష్మీకటాక్షము ఏపక్షమువారిపైఁ బ్రసరించినది?

బసవన్న—విజయలక్ష్మి నేఁ డెవ్వరి పక్షమున వర్ధిలుచున్నదో లోకమెఱుంగదా!

సూర్యుఁడు—సృష్ట్యాదినుండియు విలయకాలమువఱకు నాడఁబడిన యీ మహానాటకమున నేటి యుద్ధ మొక చిన్న రంగము. ఇందు ఎవరు గెల్చినను సమిష్టిపై తుదకు మాకే విజయము గలుగును.

భాస్కరాచారి—గ్రహపూరుషులచే మనిషి నాఁడు బ్రతుకును గాఁక. మేమే విజయపక్షమున నిప్పటివఱకు నుంటిమి. ఇఁకముందునుగూడ నట్లుందుమని నా వచనము.

సూర్యుఁడు—అట్లయిన మొదటినుండివలెనే మన కిరువురకును భేదాభిప్రాయము ఉండి తీరవలెను.

భాస్కరాచారి—అట్లయిన నీ కథావిధానమునకు పర్యవసానముగ నెట్టి ధర్మమును స్థాపింపఁబడలేదు. మహాపురుషులగు తామందఱును విచ్చేయుట వ్యర్థమైనది.

గురుప్ర—(తనలో) ఓహో! రాద్ధాంతము మఱల మొదలగుచున్నదే. (ప్రకాశముగా) దివ్యులారా! ఈ వివాదము నింతటితో ముగించుటకు నా కొక సులభోపాయము పొడకట్టుచున్నది.

(రుద్రమదేవి కాక కొదువవా రందఱు)—ఏమది?

గురుప్ర—నేటి యుద్ధమున కాకతీయసామ్రాజ్యలక్ష్మికే జయము చేకూఱినట్లు మన మందఱమును ఒప్పుకొనఁదగును. ఇఁక పూరుషప్రతిభ స్వతంత్రమైనదా, గ్రహబలాధీనమైనదా అను మహావివాదాంశమునుఁ గూర్చి మూర్తీభవించిన కాత్యాయని యనఁదగి, సర్వధర్మవివేకినియై, ప్రజాపాలన మొనర్చు కాకతీయసామ్రాజ్య లక్ష్మి యభిప్రాయమును చేకొందము.

(రుద్రమదేవి కాక కొదువవా రందఱు)—మేలు. మేలు. తప్పక చేకొందము.

సూర్యుఁడు—మహారాజ్ఞీ! వీరి యుద్దేశ మెఱిఁగితివికదా?

రుద్రమదేవి—ఈ మహావిషయమును నిర్ణయింప నేను సమర్థురాలనా?

సూర్యుఁడు—మహారాజ్ఞి యభిప్రాయ మంగళమును సమ్మతమగుఁగాక!

అందఱు—మేలు. మేలు. తప్పక యగుఁగాక!

రుద్రమదేవి—ఖగోళాధిపులచే ననుజ్ఞాతను. లోకంబున భిన్నవస్తువుల తారతమ్య మెఱుంగఁ గోరునప్పుడు తొలుతవాని నైజతత్త్వంబు నెఱుంగవలెను. ప్రకృతవిషయంబు లగు పురుషప్రయత్నము, గ్రహబలము, అను నీ రెంటి తత్త్వ మేదో విచారించెదము. కావున నిందుండు భవ్యులు, దివ్యులు, నాకొలఁది ప్రశ్నంబులకు ప్రత్యుత్తర మొసంగుదురు గాక!

అందఱు—అట్లే యొనర్తుము.

రుద్రమదేవి—పురుషప్రయత్న మనఁగ పురుషునిచేఁ జేయఁబడు యత్నము కదా. ఇందు పురుషుఁ డనఁగ నెవరో?

(అందఱును ఒకరి మొగము నొకరు చూచుకొనుచు, నాలోచించుచు మాఱు పలుకకుందురు.)

బసవన్న—మహారాజ్ఞీ! దివిజులనే సంశయపఱచఁజేయు నీ ప్రశ్నకు నాకుఁ దోఁచిన సమాధాన మిత్తును. ధర్మసంరక్షణార్థమై కత్తిఁ బట్టి, కదనంబున ధీరుఁడై మెలఁగు పౌరుషశాలియే పురుషుఁడు.

అందఱు—మేలు. మేలు.

శని—అట్టి ఘనకార్య మొనర్చునది పురుషుఁడుమాత్రమేనా? స్త్రీ యేల కాఁగూడదు?

బసవన్న—కావచ్చును. వేయేల? ఇందుకు మా మహారాజ్ఞియే తార్కాణము. అట్టి స్త్రీ వ్యక్తిని పురుషవర్యునిగాఁ గొనియాడఁదగును.

కాకతీయపక్షమువారు—అవునవును. తప్పక కొనియాడఁదగును.

చంద్రుఁడు—అట్లే! ఈసందర్భమున పురుషశబ్దము కేవల స్త్రీపురుషజంతుభేదము సూచించు వాక్యము కాదు; ఘనకార్యకరణ దక్షతాద్యోతకమైనది.

సూర్యుఁడు—అవును. ఘనకార్యకరణసమర్థతయే నిజమైన పురుషలక్షణము.

రుద్రమదేవి—ప్రపంచమునందలి అనంతకార్యజాలమునందు గొప్పదానికంటె గొప్పదియు; కొలఁదిదానికంటెఁ గొలఁదిదియు, నుండునప్పుడు ఏది ఘనకార్యమో, ఏదికాదో, నిర్ణయించు టెట్లు?

సూర్యుఁడు—కావున, కేవల కార్యకరణదక్షతయే పురుషలక్షణ మని చెప్పవలెను. గురువరా! మహారాజ్ఞికి సమాధానము సెలవిండు.

గురుఁడు—మంచిది.

రుద్రమదేవి—కార్యకరణదక్షత యనఁగా చైతన్య మని చెప్పవచ్చునా?

గురువు—అట్లే చెప్పవలెను. కాని యింకొకరీతిగఁ జెప్పుటకు వీలే లేదు. చైతన్యమే పురుషలక్షణము.

రుద్రమదేవి—అట్టి చైతన్యము వినా భావంబుగ నెవ్వరియం దుండునో!

గురువు—పరమపురుషునందే యుండఁగలదు.

రుద్రమదేవి—పరమపురుషుఁ డెవ్వరు?

గురువు—పరమాత్ముఁడైన పరబ్రహ్మము.

రుద్రమదేవి—అట్టి పరమాత్మునకు పురుషుం డను నామాంతరము లేదా!

గురువు—ఉన్నది.

రుద్రమదేవి—కాన పురుషప్రయత్న మనఁగా నా పరమాత్మని సంకల్పలేశమే యని చెప్పఁదగునా?

గురువు—చెప్పవచ్చును. కాని ... ... (సందియములో నూరకుండును.)

సూర్యుఁడు—గురువరా! సంశయింతురేమి?

శుక్రుఁడు—గురువు దివ్యమాని.

గురువు—సన్నిధిక్షేపింతు వేల? యుక్తి తోఁచెనేని మహారాజ్ఞికి నీవే ప్రత్యుత్తర మిమ్ము.

శుక్రుఁడు—అట్లే యిత్తును. మహారాజ్ఞీ! పురుషుఁ డనఁగ పరమాత్ముఁ డనియు, పురుష ప్రయత్న మనఁగ దైవసంకల్ప మనియుఁ జెప్పితివి.— కాదు, మాచేతనే చెప్పించితివి. ఇఁకపై దైవేచ్ఛకు గ్రహబలము తగ్గు నని నుడువఁదలఁచితివేమో. అట్లగుచో గ్రహబలముకూడ దైవసంబంధమైనదే యని యేల యూహింపరాదు?

రుద్రమదేవి—గ్రహబల మనఁగా తమ యభిప్రాయమేమి? గ్రహాగోళాధిదేవతలైన మీ మీ స్వతేజోబలములా? లేక తమ పర్యటనంబులందు దేశకాలంబుల లేశమైన స్వేచ్ఛమై నతిక్రమింపఁజాలక యంబరంబునఁ దిరుగాడు నట్టి గ్రహాగోళంబుల సత్వమా?

శుక్రుఁడు—రెండు నొకటియె కాదా?

రుద్రమదేవి—రెంటికిని చాల భేద మున్నది. చైతన్యము దైవలక్షణ మని తాము అంగీకరించితిరి. జడత్వము ప్రకృతిగుణ మగునుగదా?

శుక్రుఁడు—అగును. అయిన?

రుద్రమదేవి—చైతన్యముచే వాంఛితకార్యనిర్వహణసమర్థు లగు తమయొక్క స్వీయవర్తనలు దైవసంకల్పాంశము లనఁదగును. స్వవర్తనలలో చైతన్యద్యోతకమగు స్వేచ్ఛాశక్తియే

లేక ఆయావేళలకు ఆయాప్రదేశములఁ దిరుగుచు నాయా ఫలాఫలముల నిచ్చు గ్రహగోళములు ప్రకృతిసంబంధ మైన వగునట్లు తోఁచెడిని. ప్రకృతి జడమైన పదార్థ మని తా మంగీకరించితిరి.

గురువు—ఓహో! ఆంధ్రవీరలక్ష్మీ! నీ బుద్ధిసూక్ష్మత మెచ్చఁదగినదికదా!

శుక్రుఁడు—అట్లయిన చైతన్యపూరిత మగు పురుషప్రయత్నమే ప్రకృతిగుణక మగు గ్రహ బలమున కంటె సత్వాధిక మైనదని ఆంధ్రలక్ష్మియొక్క యభిప్రాయమా?

రుద్రమదేవి—ప్రకృతిపూరుషుల బలాబలము లెన్న నెవ్వరితరము? కాని పురుషునకుఁ బ్రకృతి యధీన యని తమవంటి పెద్దలచే వింటిని.

సూర్యుఁడు—అట్లయిన చైతన్యముఁ గల ప్రతివ్యక్తియుఁ బ్రకృతి నధిగమించునదేనా?

రుద్రమదేవి—చీఁకటిఁ దొలఁగింపనిదే వెలుఁగు అనునది యుండదు. అట్లే ప్రకృతి నధిగమింప నిదే చైతన్య మనునది యుండదు. ప్రకృతి నధిగమించుటే చైతన్యలక్షణము. ఇఁక ప్రకృతి సత్వముల నధిగమించుటకు వ్యక్తిస్వాతంత్ర్యబలమును యోగాభ్యాసా దులచే సాధించిన ఘనులు సమర్థులగుదురు.

అందఱు—మేలు. మేలు. మహారాజ్ఞి బుద్ధికుశలత మెచ్చఁదగియున్నది.

సూర్యుఁడు—అట్లయిన గ్రహబలము నిరసింపఁబడ వలసినదేనా?

రుద్రమదేవి—నిరసింపఁబడు టేల? పూజింపఁబడవలెను.

శుక్రుఁడు—అదెట్లు! ఎవ్వఁడైన తనకంటెఁ దక్కువవానిని గౌరవించునా?

రుద్రమదేవి—మహాత్మా! ఈశక్తి నాచేతిచేఁ గదలింపఁబడున దయ్యు, నాచేతనే పూజింపఁ బడుచున్నది. మఱియుఁ బ్రపంచమునందలి వస్తుతత్వముల మూలముల నారయు నప్పుడు వానియందు భిన్నోపయోగంబులు కనిపించును గాని, ఎక్కువ తక్కువలు కనిపించునా?

శుక్రుఁడు—అదెట్లు! లోకములో నన్నియు సమానము లగునా?

రుద్రమదేవి—తత్వచింతన చేయునప్పుడు అట్లె తలంపవలయును.

శుక్రుఁడు—ఎట్లు!

రుద్రమదేవి—భోక్తయగు పురుషుండును, భోగ్యమగు ప్రకృతియు, నను రెండు పదార్థముల యంశములే కలిసి సకల చరాచర జీవలోకంబుగఁ బరిణమించిన వని తలంచునెడ, వాని గౌరవంబున గొప్పకొలఁదులు పొడకట్టునా? పరస్పర సాహాయ్యమునకే కాక

పరస్పరవిరోధమునకుఁ గారణ మాపంతైనఁ గలదా! అట్టి పరస్పరసాహాయ్యము పరస్పరసహనమునఁగాని వర్ధిల్లదు. పరమాణు పరంపరకు పరస్పరసహనమనఁగా విశ్వసంపూర్ణమగు ప్రేమ. సూర్యదేవా! చీఁకటి తొలఁగఁగా భూమిపైనుండు మాకుఁ బావనంబైన భవదీయ మండలంబే కనిపించునట్లు, ప్రేమంబు వాసిన మనస్సునకుఁ బ్రపంచమంతటను ఆ ప్రేమ యొక్కటియే కనిపించును. ఆ ప్రేమయే పరిపూర్ణచైతన్యమూర్తి యగు భగవంతునకు లక్షణము. గ్రహపూరుషు లగు తాము గ్రహగోళముల వలెఁ బ్రకృతిస్వభావులు కారు. భగవదంశా సంభూతులు. కావునఁ బ్రేమస్వభావులు. మానవుల మగు మాయందు అట్టి సంపూర్ణప్రేమ నవర్తింపఁజేసి, మాచేఁ బూజల నందఁదగును. జ్యోతిర్విద్య లోకంబునకు అలవడఁజేయఁ దలఁచు భాస్కరాచార్యునకు వలసిన జ్యోతిషగ్రంథంబుల ననుగ్రహింపవలెను. జ్యోతిర్విద్యావ్యాపనమున మే మెల్లరము గ్రహపూరుషులగు మీయెడఁ బూజ్యభావముతో నుందుము.

అందఱు—మేలు! మేలు! ఆంధ్రవీరలక్ష్మీ! బాగుగ వచించితివి.

రుద్రమదేవి—మఱియు దేవగిరి నృపాలురును మాయందలి వైరము మాని మైత్రిమై మెలంగుదురుగాక. సన్నిహితప్రాంతరాజ్యములకు అన్యోన్యద్వేషము ఉభయరాజ్య ప్రజాక్లేశకారణము గదా!

మహాదేవుఁడు—భవ్యా! అసమానంబగు నీ శౌర్యంబును, వివేకంబును, వినయంబును, జూచుటచే నా మది మిగులఁ దనివి సెంది, నీ యెడ నత్యంత గౌరవభావ మూనినది. ఇట్టి నిన్నుఁ గాంచి, నీ జననీజనకు లగు సోమాంబాదేవియు, గణపతిచక్రవర్తియుఁ గృతార్థులైరి. కుమారమల్లికార్జునుఁడు నీకుఁ దగిన వరుఁడు. మన రాజ్యములు రెంటికి నింకపై నత్యంత స్నేహభావము వర్ధిలుఁగాక.

అందఱు—సంతోషము. సంతోషము.

సూర్యుఁడు—ఆంధ్రలక్ష్మీ! యుక్తియుక్తంబు లగు నీ సౌమ్యవాక్కుల సామరస్యమునకు సంతసించితిమి. గ్రహబల పురుషయత్నములఁ గూర్చిన నీ యభిప్రాయ మెల్లరకు సమ్మతముగా నున్నది. పరమపూరుష ప్రేమాంశ పూరితం బగు నీ ప్రపంచతత్త్వము వివరించిన నీ కెంతయుఁ గృతజ్ఞులము. గురువర్యా! ఆంధ్ర సామ్రాజ్యలక్ష్మి యొక్క యభిప్రాయము నొక పద్యరూపమున సెలవిండు.

గురువు—ఆజ్ఞ.

సీ. పురుషుండు హరి యాట, పురుషయత్నము లన్ని
దైవ సంకల్పాంశ తన్మయములు.

చైతన్యతత్త్వమో స్వేచ్ఛందమో లేని
  గ్రహగతుల్ ప్రకృతి సంకల్పితములు.
ప్రకృతిపూరుషులందుఁ బ్రభువైన పురుషుండు
  భోక్తయౌ, ప్రకృతి తా భోగ్య మగును.
గాన యత్నముచేత ఘనుఁడైన పురుషుండు
  గ్రహయోగ సమ్మతుల్ గాంచఁ గలఁడు.
గీ. ప్రేమతత్త్వాత్మకముసృష్టి, భేద భంగి
భ్రమముచే గల్గెఁ; గాన నా భ్రమమువీడి
పురుషయత్నంబు గ్రహబలం బరయ నొకటి
కొకటి సాహాయ్య సంసిద్ధి నొసరుఁ గాక!

సూర్యుఁడు—భాస్కరాచార్యా! ఇఁక మన వివాదమునకుఁ గారణము లేదు. మీ రెల్లరు సౌమ్యులు, ఆస్తికులు, కుశ్శంకలఁ జేయనివారు, కావున నీ వింక నీ కాళికా దేవాంబున నిక్షిప్తంబు లగు జ్యోతిర్గ్రంథంబుల గ్రహించి, యందలి విశేషంబుల వీరల కెఱింగించుటకు మే మంగీకరించితిమి.

భాస్కరాచారి—గ్రహరాజుచే ననుగ్రహింపఁబడితిని. జ్యోతిర్విద్య నెఱుంగుటచే మానవులు గ్రహపూరుషుల నధికభక్తితోఁ బూజింతురు. ఇప్పు డా గ్రంథము లెందుఁ గలవో!

సూర్యుఁడు—ఆ రాతిఫలకంబు క్రింద నున్న బిలమునం దున్నవి. (ప్రసాదాదిత్యునితో) సేనాధీశా! ఇద్దఱు బంట్లచేఁ ఆ రాతిఫలకంబును బెకలింపఁజేయుము.

ప్రసాదాదిత్యుఁడు—అట్లే! (బంట్లచేత నొకబండను దొలఁగింపఁజేయును. ఒక బిలముఖంబు గనిపించును)

భాస్కరాచారి—(బిలములోనికిఁ జూచి) ఓహో! ఎంత పెద్ద బిలము! ఎన్ని గ్రంథములు! ఎన్ని గ్రంథములు! బండ్లపైఁ దోలఁపవలెను. సావకాశంబుగ నింటికిఁ దీసికొనిపోవుదును. కాని ఈ రాతిపైఁగల కట్టుపద్యమునకు సంపూర్ణమగు వివరణముఁ గూడ గ్రహపూరుషులే సెలవిచ్చెదరుగాక.

సూర్యుఁడు—శుక్రాచార్యా! సెలవిమ్ము.

శుక్రుఁడు—ఆజ్ఞ!

"గీ. గ్రంథములను గోరు కన్య ద్విజాంగన
పెండ్లివేళ ... ...

అను పద్యముయొక్క భావ మిది. వినుము. ఇందు సూచింపఁబడిన ద్విజాంగనగ నీ కొమార్త లీలావతి యయ్యెను. ఆమెకుఁ గూడ నేఁడే వివాహము నిశ్చయించితిరి. కావున

నామె "పెండ్లివేళఁ దనదు ప్రియుని గూడఁ" గలదు. నేటియుద్ధంబున మడిసినవా రందఱును, మఱల సజీవులైనను, దేవికి బలియైనవారుగనే తలంపఁబడవలయును. కావునఁ బ్రీతికరముగనే సమస్యాపూరింపఁబడినది. (కాళిగుడిలోఁ దీవ్రముగ గంటమ్రోఁగును) అదిగో! తనంతటఁ దా మ్రోఁగు జయఘంటయే కాళికాదేవి సమ్మతిని తెలుపుచున్నది.

అందఱు—ఆశ్చర్యము! అద్భుతము!

శుక్రుఁడు—"వేయి మంది కాళికి వేడుక బలి" యైరి. తరువాతఁ జెప్పఁబడిన బ్రహ్మచర్య దీక్షను గూర్చి ఈ పద్యమునఁ గాలమితి చెప్పఁబడి యుండలేదు. కావున నీ కొమార్తె వివాహిత యయ్యును ఒక్క వత్సరంబు దనుక విప్రకన్యాధర్మంబు నను వర్తింపుచుఁ గాళికాదేవికి నిత్యమును పూజలు సల్పుఁగాక! ఇఁక పద్యభావపూర్తికై లీలావతిగెలుచుకొనిన వరుని బిలిపింపుఁడు.

భాస్కరాచారి—అతఁడు గ్రామాంతరమున నున్నాఁడు.

మల్లికార్జునుఁడు—యుద్ధారంభమునకుఁ బూర్వమె అతని ... ...

రుద్రమదేవి—భాస్కరాచార్యా! అతఁడు లేకున్న మానె. ఈతఁడైనను మన లీలావతికిఁ దగినవాఁడేమో చూడుఁడు. (దేవగిరిభటుని దుస్తులలోనుండు రాఘవశర్మను జూపును.)

భాస్కరాచారి—(అవమానముతో) ఈ దేవగిరిభటుఁడా? ఈతని కులగోత్రములేవియో తెలిసికొనకుండ మాకు——

రాఘవశర్మ—మా దేశమున పెండ్లిండ్లకుఁ గులగోత్రములతోఁ బని లేదు.

మహాదేవుఁడు—అది వట్టిమాట. అట్లు చెప్పువాఁడు మా భటుఁడు కాఁడు. మా సైనికుల దుస్తుల నెక్కడనో దొంగిలించి, ధరించినాఁడు. (రాఘవశర్మను బరికించి చూచి) ఓరీ! రాత్రి గుఱ్ఱమునుండి త్రోయఁబడిన బడుగువాఁడవు నీవే కదా?

రాఘవశర్మ—ఎట్లు? బడుగునా? ప్రస్తుతస్థితినిబట్టి మన మిద్దఱ మొక తెగలోనివారమే.

నీలకంఠుఁడను దేవనాయకుఁడు—ఏమీ! మూఢా! కాలవిపర్యాసముచేఁ బరాజయ మొందినను నీప్రభువును నీవే తృణీకరింపరా దని యెఱుంగని నిన్ను గడ్డములాగి రెండు తన్నులు ... (రాఘవుని గడ్డము లాగఁగా నది యూడివచ్చును. అందఱు "రాఘవశర్మ" అని నివ్వెఱ పడుదురు. మహారాజ్ఞి కొంచెము నవ్వును. లీలావతి సిగ్గుచే వెనుకకుఁ దగ్గును.)

మల్లికార్జునుఁడు—మిత్రమా! నీవా! నీవా! నిన్నా నేను గుఱ్ఱమునుండి పడఁద్రోసినది? క్షమింపుము. క్షమింపుము. దెబ్బతగులలేదుకద. ఈ గడ్డ మెక్కడ సంపాదించితివి?

రాఘవశర్మ—బారెడేసి తోఁకల గుఱ్ఱములు ఇన్ని గల యుద్ధభూమిలో దొంగగడ్డముల కేమిగొదువ! కాని నాకుఁ దగిలించిన ఈ వైరులదుస్తుల తామెటనుండి సంగ్రహించితిరి?

మహాదేవుఁడు—భట్యులారా! వీరుల చెవులకు వెగటుగాఁ దోచునట్టి యీదుస్తుల దొంగగడ్డముల మార్పు లేమిటి?

మల్లికార్జునుఁడు—మహాశయా! ఈ సందర్భములలోఁ గూటయుద్ధధర్మము నతిక్రమించు వివరము లేవియు లేవని యెఱుంగుఁడు.

గ్రహపూరుషులు—లేవులేవు. అందుకు మా దివ్యచక్షుస్సులే సాక్షులు.

మల్లికార్జునుఁడు—గ్రహపూరుషులకుఁ గృతజ్ఞుఁడను.

ప్రసాదాదిత్యుఁడు—రాఘవశర్మా! ఈ చిత్రకథ యేదో నీ హాస్యశీలమునకుఁ దగినట్లున్నదే.

రుద్రమదేవి—ఇది మిత్రుల లీలా పర్యటనము కాఁబోలును. ప్రసాదాదిత్యా! ఈ చిత్రకథను తరువాత వివరముగా వినెదము. దేవగిరిప్రభువులు, సేనానాయకులుఁ గొన్నాళ్లు మన యతిథులై యుండుటకును, వారి సైనికులు భద్రంబుగ వారి రాజ్యంబునకు త్వరలోఁ బంపఁబడుటకు, నేర్పాటు గావింపుము.

ప్రసాదాదిత్యుఁడు—భాగ్యము.

బసవన్న—అదిగో! నగరంబునుండి ప్రజలు రాజోద్యోగులు వచ్చుచున్నారు.

(రాజోద్యోగులు, ప్రజలు, ప్రవేశించి మహారాజ్ఞికి నమస్కరింతురు)

ప్రసాదాదిత్యుఁడు—మిత్రులారా! రుద్రదేవీకరుణావిశేషంబున మనకు నేఁడు సంపూర్ణ విజయంబు చేకూఱినది.

రాజోద్యోగులు—ఆంధ్రలక్ష్మి యొక్క విజయంబునకు పురమంతయు సంతోషమున పొంగిపోవుచున్నది.

రుద్రమదేవి—కాలయాపన మెందుకు? దండనాథా! ఖగోళాధిపులకు మనవారిని దెల్పుఁడు.

ప్రసాదాదిత్యుఁడు—గోళాధిపులారా! వీరందఱు రాజోద్యోగులు. (రాజోద్యోగులతో) మిత్రులారా! ఈ మహాతేజశ్శాలురు మనలం బరీక్షింప నరుదెంచిన ఖగోళాధిపులు. వీరు దేవగిరి ప్రభువులు.

పౌరులు—(ఆశ్చర్యముతో) ఖగోళాధిపులా! ఎంత యాశ్చర్యకరమగు విషయము!

రుద్రమదేవి—వివరముల సావకాశముగా నెఱుంగవచ్చును. ఖగోళాధిపులకు నమస్కరింపుఁడు.

పౌరులు—అనుగ్రహింపఁబడితిమి. (గ్రహపూరుషులకు నమస్కరింతురు.)

సూర్యుఁడు—మీకు మేలగుఁగాక. మాననీయ యగు మీ మహారాజ్ఞి పరిపాలనము జయప్రదముగ వర్ధిల్లఁగలదు.

పౌరులు—దివ్యుల దీవనలు అమోఘములు.

సూర్యుఁడు—సంతసము. భవ్యులారా! భూలోక పర్యటనము నింక విరమించుటకు మాకు సమయమైనది. గురుచంద్రులారా! మహారాజ్ఞి నభినందింపుఁడు.

చంద్రుఁడు—మహారాజ్ఞీ!

ఉ. ఆపద గల్గువేళ హృదయంబున డిందక ధర్మ విక్రమా
టోపతఁ గార్య వర్తన పటుత్వముఁ బూనుచు వీర పూరుష
ప్రాపక లక్ష్య మాను, పరిపార్థివ జాతపు, వంశ గౌరవ
స్థాపనఁ జేయఁ గల్గితివి, దక్షత నిల్పితి వాంధ్ర తేజముల్.

గురువు—ఉ. అంతటి వీరవంశజవు నై తగు నీవు పరాక్రమించుటే
వింతయుగాదు, నీపురము వేసటఁబెట్టిన మము నింత మ
న్నింతువి దెల్లెడల్ దెలుపు, నీ సుమనోమహనీయ విశ్వవి
శ్రాంతదయాగుణంబు జనశాసనయోగ్యత రాజ్యభాగ్యతల్.

చంద్రుఁడు—ఉ. మీ విభవంబు కంటె మఱి మీ చతురంగబలంబు కంటె మీ
భూవిజయంబు కంటెఁ బరిపూర్ణధనాదుల కంటె నేత్రశ్రీ
తావక వంశ పూర్వులకుఁ దద్దయు మీ ఋజు మార్గ చర్యచే
భావ సుశాంతిఁ గూర్పఁదగు భంగిఁ జరించితి వమ్మ మాన్యవై.

గురువు—ఉ. మెచ్చితి మమ్మ! నీదగు నమేయ గుణాఢ్యతకున్ ద్వదీయ వీ
రోచ్చ్రయ మైన యాంధ్ర జన యోధుల విక్రమలీల గాంచి; మా
వచ్చిన కార్య మందఱి కవశ్యశుభావహమై యెసంగగా
నిచ్చెద మెల్ల వాంఛల మహేశసతీసదృశాభ! కోరుమా.

రుద్రమదేవి—ధన్యుల మైతిమి. తాము విచ్చేయుటచేతనే యిందెల్లరకోర్కెలు సమకూడినవి. కులదేవతల కర్ఘ్యములు సమర్పించు తరుణమైనది. లీలావతీ! దివ్యులఁ గొనియాడుము.

లీలావతి—(గ్రహపూరుషుల కందఱు నమస్కరింపుచుండఁగ)

సీ. భువనజీవనదాత రవికి, సర్వాహ్లాద
కర సౌమ్యకిరణాప్తి వఱలు శశికి,
సకలవిజ్ఞాన ప్రసారుఁడౌ గురునకు,
శుభకళా కారుఁడౌ శుక్రునకును
వినయ వాణిజ్య వివేకియౌ బుధునకు,
నాయుఃప్రవర్ధనుఁడైన శనికి,
శౌర్యబలోత్సవౌదార్యుఁడౌ కుజునకు,
రణజయోదాత్తుఁడౌ రాహువునకు,

గీ. నీత వైరాగ్య పరుఁడైన కేతువునకు,
సత్వనిధులౌ నుపగ్రహ తత్వములకుఁ,
తారకా గణ యుత శింశుమారమునకు,
భవ్యతర ఫలావాప్తికై ప్రణతు లిడుదు.

గ్రహపూరుషులు—శుభమస్తు. శుభమస్తు. శుభమస్తు.

సూర్యుఁడు—రణరంగవిజయంబుచే నలరునట్టి కాకతిసామ్రాజ్యలక్ష్మి యొక్కయు, వినయ వివేక నిధి యగు లీలావతి యొక్కయు వివాహ శుభముహూర్తంబులు సమీపించినవి. గురువరా! దైవకృపచే వర్ధిల్లునట్టి యీ వధూవరులకు గ్రహానుదయంబు కూడఁ గలుగునట్లు దీవింపుఁడు.

గురువు—అనుజ్ఞ. అమ్మా! రుద్రమదేవీ! మల్లికార్జున కుమారా! ఇట్లు జంటగా నిలువుఁడు. లీలావతీ! రాఘవశర్మా! మీ రిట్లు నిలువుఁడు.

సీ. రవి పూర్వరాజేంద్ర రాజ్యపాలన శక్తి,
చంద్రుండు భువనప్రశాంత రక్తి,
కుజుఁడు సుక్షేత్ర భూ విజయైక సంపూర్తి,
రాహువు స్వచ్ఛంద రాజకీర్తి,
గురుఁడు వేదోక్త సద్గుణ కులోన్నత వృద్ధి,
శని పూరుషార్థ సాధన సమృద్ధి,
బుధుఁ డర్థ గణితాంగ బోధ నాధిక యుక్తి,
కేతువు హిత దైవ నీతి భక్తి,

గీ. శుక్రుఁ డనుకూల దాంపత్య శుభ నియుక్తి,
వరుస తమతమ శుభదశా వత్సరముల
భవ్యతర యోగకారులై భావితార్థ
హిత ఫలంబుగ మీ కెప్పుఁ డీయఁ గలరు.

చంద్రుడు—మఱియు,

గీ. కాకతీయ సామ్రాజ్యలక్ష్మి, కదన రంగ
భవ్యజయలక్ష్మి, సకలసౌభాగ్యలక్ష్మి,
పెంపుగా నెల్ల జనులఁ బాలింపుచుండ
నాంధ్రరాజ్యంబు శుభముల నలరుఁగాక.

అందఱు—తథాస్తు. తథాస్తు.

మల్లికార్జునుఁడు
రుద్రమదేవి } —అనుగ్రహింపఁబడితిమి.

మంగళహారతి.

కేదారగౌళ—ఆట.

శ్రీలాలుకురుద్రాంబా సీమంతినీమణికి । మంగళం । జయమంగళం.

చ. ఎల్లజగముల నేలు । నీశ్వరుకృపతోడ - ముల్లోకములవారు । ముదమందిచెలఁగి
"వల్లె! వల్లె! యిట్టు । చెల్లెఁగాక" యనఁగ - చల్లని రుద్రాంబ । సాధ్వీమతల్లికి
పల్లవాధరి, భరతపుత్రికఁ । పావనాంధ్రరమాలలామను, - యుల్లమలరఁడివలపులలరం । జిల్లగాఢ్యతి నేలజాలిన
మల్లికార్జునతేజ । మానితకీర్తికి । మంగళం । జయమంగళం.

(అనుచు నందఱును మంగళగీతము గానము సేయుచుండఁగా మంగళవాద్యములు మ్రోఁగుచుండఁగాఁ దెర దిగును.)

జ్యో తి ర్లీ ల.

ఆంధ్రవీరలక్ష్మీ విజయము
అను
జ్యోతిర్లీల సర్వము సంపూర్ణము.

గీ. ఓర్మి యను సూక్ష్మదర్శిని నొప్పు తప్పు
లేర్చి, సవిమర్శ లెనయంగ, నిందు సాధు
భావ పద గౌరవంబుల భద్రభంగు
లరసి, దిద్దిన భగవంతు నభినుతింతు.

1వ అనుబంధము.

పుట. పంక్తి. కఠినపదములకు అర్థములు.

1 సకల చరాచర హేతుభూత సృష్టికారకుండ—

సకల=సమస్తమయిన, చర=కదలునట్టివానికిని (జంతువులు మొదలైనవి), అచర=కదలనట్టి వానికిని (చెట్లు రాలు మొదలైనవి), హేతుభూత=కారణమైన, సృష్టి=కలిగించుటను, కారకుండు=చేయువాడు.

2 అగమ్యగోచరము - పొందుటకు [illegible]నదియు, కావించునదియు, నిర్హేతుక యదృచ్ఛానుసరణ లీలా ప్రమోద మేదుర వ్యాపార కారణాంతరము— నిర్హేతుక=కారణములేనట్టి, యదృచ్ఛ=స్వేచ్ఛను, అనుసరణ=వెంటనడచునట్టి, లీలా=విలాసముచేతనైన, ప్రమోద=గొప్ప ఆనందముచేత, మేదుర=సంపూర్ణమైన, వ్యాపార=పనియనెడి, కారణ=హేతువుయొక్క, అంతరము=పుట్టుక.

మాయాగర్భాంధకార పరివ్యాప్త జడమయ ప్రకృతి గింజనుండ—

మాయా=మాయయొక్క, గర్భ=లోపలనుండునట్టి, అంధకార=చీకటిచేత, పరివ్యాప్త=అంతట ఆవరింపబడినట్టి, జడమయ=అచేతనస్వభావముతో నిండిన, ప్రకృతి=మూలప్రకృతి (మొదటి పదార్థము)ను, గింజనుండ=గింజను,

ఆశ్చర్యజనక పంచభూతాత్మక బ్రహ్మాండాంతర్గత గోళపరిస్థిత చిత్రతరరూప దీపిత జీవకోటిఫలయుతము:—

ఆశ్చర్యజనక=ఆశ్చర్యమును పుట్టించునట్టి, పంచ=అయిదయిన, భూత=పృథివ్యప్తేజో వాయు రాకాశములను. ఆత్మక=లోపలిభాగముగాఁ గల, బ్రహ్మాండ=బ్రహ్మాండముయొక్క, అంతర్గత=లోపలిభాగమును పొందిన, (బ్రహ్మాండము కోడిగ్రుడ్డువలె నుండుననియు, దాని లోపలి అనరగములఁ దిరుగు పృథివ్యాది గోళములపై జీవకోటి యున్నదనియు ప్రసిద్ధి కలదు.) గోళ=పృథివ్యాది గోళములయొక్క, పరి=ప్రదేశమునందు, స్థిత=ఉన్నట్టి, చిత్రతర=మిక్కిలి చిత్రమైన, రూప=ఆకృతులచేత, దీపిత=ప్రకాశించునట్టి, జీవ=జంతువులయొక్క, కోటి=సమూహమనెడి, ఫల=పండ్లతోడ, యుతంబు=కూడుకొనినట్టి, సృష్టి=సృష్టియనెడి, [illegible] బీజంబు=విత్తనంబు.

త్రిభంగివృత్తి లక్షణము:—

అప్పకవీయమునందు— ప్రతిపాదమునకు 6 సగణములును, స, భ, మ, స, గ, ములు, ప్రతిపాదమునందు ప్రథమభాగమందు మూడు ప్రాసయతులును, ద్వితీయభాగమందు మూడు అంత్యనియమములు.

పద్యలక్షణసార మనెడి గ్రంథమున: న— 6 సగణములు, న, స, స, భ, మ, స, గ ములు అని త్రిభంగిలక్షణము చెప్పఁబడినది. ఈలక్షణము గ్రంథములోని పద్యమునకు సరిపోయినది.

ప్రవిమల=మిక్కిలి స్వచ్ఛమైన, మాన్యమగని, నిజ=తనయొక్క, దృక్=కాంతుల యొక్క, నికర=సమూహముచేత, నిర్భర=నిండినట్టి, కల=భావముకలది కాదనెడి, కలిత=

బాగుగ వికాసమును పొందిన, బంధుర వేషుక్ = చక్కటి యిల్లుగా కలవాఁడును, కల్మష = పాపమును, వారుక్ = పోగొట్టువాఁడు, స్వాత్మ సకాశుక్ = తనకుతానే సమానుఁడు, దివి = ఆకాశము. పవన = వాయువు. సలిల = నీరు, దవ = అగ్ని, (విశేషము సామాన్యము క్రింద నుపయోగింపఁబడినది.) భువి = భూమి అనెడి, వినుమయ = మూర్తిచే, విభజిత = విభజింపఁబడిన, ఆదిగు = మొదటి, తర్క్యక్ = ప్రకృతి గలవాఁడు, భువన = లోకముల యొక్క, రచన = చేయుటయందు, ఘన = గొప్పదయిన, విచరణవి = పరిశీలనప్రకారమే, గుణ = గుణములు గల, భవ = జన్మము, గత = పొందిన, పద్మజ = బ్రహ్మను, కారిక్ = చేసినవాఁడు, ధర్మవిహారిక్ = ధర్మమునందు విహరించువాఁడు, కల్మష = శోకమును, హారిక్ = హరించువాఁడు, అవిచల = స్థిరమయిన, గురు = గొప్పదయిన, తప = తపస్సు యొక్క (తపస్సు అకారాంతము.) జవ = వేగములో, యుత = కూడిన, మునిగణ = మునీశ్వరుల సమూహము యొక్క, వివిధ = అనేకవిధములయిన, వచ = మాటలచే, నుత = పొగడఁబడుచున్న, చర్యక్ = ప్రవర్తన గలవాఁడును అయినవానిని.

తన్వీవృత్త లక్షణము—

భ, త, న, స, భ, భ, న, య గణములు ప్రతిపాదమున రావలయును. 13 వ యక్షరము యతి.

దేహభృత = దేహమును ధరించినవారియొక్క, (ప్రాణులయొక్క), హృదయ = మనస్సునందలి, సందేహ = సంశయమును, నివారణ = పోగొట్టునట్టి, పదయుగళ = పాదములయొక్క జంటఁగలవానిని.

3 పరివ్యాప్తాంతరాళము—

పరివ్యాప్త = అంతట వ్యాపించిన, అంతరాళము = ఆకాశము, ప్రబోధన = జ్ఞానమును, ఉదియ = కలుగఁజేయునట్టి, శాంతుల సహాయమునన్ = శాంతులయొక్క సహాయముచే.

చంద్రవర్త్మ వృత్త లక్షణము—

ర, న, భ, స, గణములు, ప్రతిపాదమునను 7 వ యక్షరము యతి.

భర్గ = ఈశ్వరుని చేతను, పద్మభవ = బ్రహ్మచేతను, భావిత = తలఁపఁబడిన, (ధ్యానింపఁబడిన) గుణ = గుణములయొక్క, సంవర్గ = సమూహముచే, శీల = ప్రకాశించువాఁడా, అపవర్గ = మోక్షమును, వితరణ = ఇచ్చువాఁడా, సన్మార్గచారి = సజ్జనుల (దేవతల) చే, నుత = పొగడఁబడిన, మానిత = ప్రశస్తమైన, చరణా = పాదములు గలవాఁడా!

5 లీలావిభూతి — పరమపదమునకు నిత్యవిభూతి యని పేరు. ఆ పదమునకు చెందని యితర ప్రదేశమునకు లీలావిభూతి యని పేరు.

6 శ్రీవృత్త లక్షణము—

ఒక్కొక్క పాదమునకు ఒక్కొక్క గురువు.

శ్రీరామా = లక్ష్మీదేవికి, ఈశా = భర్తయయినవాఁడా, కారుణ్యా = దయచేత, ఆఢ్యా = ప్రకాశించువాఁడా!

స్త్రీవృత్త లక్షణము—

ఒక్కొక్క పాదమునకు రెండేసి గురువులు.

సార=శక్తిచే, ఉదార=అధికమయిన, స్థైర్యాచార=స్థిరత్వముగల ఆచారముఁ గలవాఁడా!

నారీవృత్త లక్షణము—

ఒక్కొక్క పాదమునకు మూఁడేసి గురువులు. (అనఁగా మగణము.)

మృగీవృత్త లక్షణము—

ఒక్కొక్క పాదమునకు రగణము.

క్రూరహృత్=దుర్మార్గులను, భీరుకృత్=భయపడినవారిఁగాఁ జేయునట్టి, ధీర=స్థైర్యముగల, సంచారణా=ప్రవర్తనఁ గలవాఁడా!

పఙ్క్తివృత్త లక్షణము—

భ, గ, గ, గణములు ఒక్కొక్క పాదమునకు.

ఘోర=భయంకరమైన, తమః=అంధకారముచే, దుర్వార=అతిక్రమింపఁబడనట్టిదియు, భరాప్తి స్ఫార—భర=అధిక్యమును, ఆప్తి=పొందుటచే, స్ఫార=ప్రకాశించునట్టిదియు, అగు, మహాతేజః=మంచి తేజస్సుయొక్క, ధారణకార=ధరించుటను చేయువాఁడా.

సీసపద్య లక్షణము—

ఇంద్రగణము లారు నినగణంబులు రెండు పాద పాదమునకుఁ జరఁగుచుండు ఆటవెలఁదినైన తేటగీతియు నైనఁ జెప్పవలయు మీఁద సీసములకు.

1 వ గణపు మొదటి యక్షరమునకు మూఁడవగణపు మొదటియక్షరము యతి, అయిదవగణపు మొదటి యక్షరమునకు ఏడవగణపు మొదటియక్షరము యతి.

సంశయోత్తారక=సంశయమును పోఁగొట్టువాఁడా! జ్ఞానశక్తిమయ=జ్ఞానశక్తిచే నిండిన (జ్ఞానశక్తి, క్రియాశక్తి, ఇచ్ఛాశక్తి, అను ఈ శక్తిత్రయము.) ఆత్మక=స్వరూపముగాఁ గలది గనుక నే, ఘన=ఎక్కువయిన, వివేక=పరిశీలనచే, భాసురములు=ప్రకాశించునవి.

7 మత్తకోకిల లక్షణము—

ర, స, జ, జ, భ, ర గణములు, 11 వ యక్షరము యతి.

తరళ లక్షణము—

న, భ, ర, స, జ, జ, గ. 12 వ యక్షరము యతి.

సుప్తము=నిద్రావస్థను పొందినది, నిర్వికారము=మార్పులేనిది, దుర్గమంబు=పొందుటకు శక్యము కానిది, నిజ=తనయొక్క, అంశమయ=తేజస్సుచేత నిండిన, అవకాశము=అవకాశమే, భవ్య=ఒప్పు

నట్టి, శబ్దగుణంబుగ=శబ్దమే గుణముగాఁ గలదిగా, అలర్=ఒప్పి, సర్గ=సృష్టియొక్క, స్థాన=తిరుగుటయొక్క, యోగ్యతన్=తగియుండుటను, పొందెన్=పొందెను. తత్త్వకారణుఁడు=మూల తత్త్వమునకు (మొదటిపదార్థమునకుఁ) కారణమయినవాఁడు.

8 పునస్సృష్టివర్తనంబు-మరల సృజింపఁబడుటచే తెలియునది.

వనమయూర వృత్త లక్షణము—

భ, జ, స, న, గ, గ లు గణములు ఒక్కొక్క పాదమునకు, 9వ యక్షరము యతి.

చిన్మయవిహార—చిత్—జ్ఞానముతో, మయ—నిండిన, విహార=సంచారము గలవాఁడా, భవపార కలుషౌఘదార—భవసార=పాదజలములచేత, కలి—పాపములకు, దూర—దూరమయినవారును, ఉదార—ఔదార్యముగలవారును, పరితుష్టి=సంతుష్టిగలవారును అయిన; నిజదాస—నీదాసులయొక్క, పరివార=సమూహముఁ గలవాఁడా!

10 నిఖిల—సమస్తమైన, జీవ=జీవులయొక్క, త్రాణ—రక్షించుటను, నిర్మాణ—చేయుటను, కారణుండు=కారణములు కలవాఁడు, సర్వ—సమస్తమయిన, గోళ=భూమ్యాదిగోళములయొక్క, ప్రచారణ=తిరుగుటకు, జవన—వేగమును, దాత—ఇచ్చువాఁడు, సకల—సమస్తమయిన, లోక—లోకములకు, ప్రభా—కాంతిని, కార=చేయునట్టి. సార=శ్రేష్ఠమయిన, కరుఁడు=కరములు కలవాఁడు.

13 సమానీవృత్త లక్షణము—

ర, జ, వ, గణములు ఒక్కొక్క పాదమునకు.

సారహీన, జన్మరుజా, ఘోరహార, కాంతి.

సారహీన=నిస్సారమయిన, జన్మ=జన్మమునందు, రుజా—రోగములు, ఘోర=ఘోరమయిన, హార=మనోహరమయిన, కాంతి=స్వస్థతను, మనోవైవిరాజిన్—మనః=మనస్సునందలి, వైరి=అరిషడ్వర్గముయొక్క, రాజిన్—సమూహమును, సంసృతివ్యూహము=వ్యూహమువలె చిక్కుగల సంసారము.

14 పరిగ్రహణ మాన్యాకార యోగ్యానుసంధానములు—

పరిగ్రహణ=పరిగ్రహించుటకు, (వివాహమునకు) మాన్య=గౌరవింపఁదగిన, ఆకార=ఆకారమును, (రూపమును,) యోగ్య=తగినటువంటి, అనుసంధానములు=అనుకూలంబులైన ప్రవర్తనలు (కలిగినవారు.)

15 అనంతంబులు—లెక్కలేనివి, ధర్మసంస్థాప్యము (గ్రా) ధర్మసంస్థాపనము అనుట సాధువు. కాని బ్రహ్మస్థాప్యము మొదలగు అప్రయోగములు కలవు.

18 పవనభుగ్భూషణ—పవనభుక్=వాయువును భక్షించునవి (పాములు), భూషణ=భూషణములుగాఁ గలవాఁడు.

20 శుభావహ నిర్ణయములు—

శుభ=మేలును, శుభములను ఆవహ=కలుగఁజేయునట్టి, నిర్ణయములు=ఏర్పాట్లు.

21 కవిక విగిష లక్షణము—

ఒక్కొక్క పాదమునకు 8 సూర్యగణములు. గ్రంథములోనిది తురగ వల్గన రగడ.

గణ్యమాన మానమాన గమన సుమన సాధ్యుడవు—

గణ్యమాన=లెక్కించుటకుదగిన, మాన=మహాత్మ్యమగు కొలతచేత, మాన=గౌరవాన్వితమైన గమన=నడక చేతను, (ఆకాశచలనము), సుమనస=సౌజన్యము చేతను, (వ్యాకరణము—మనస్స్ పదము ను అను ఉపసర్గతో కూడినచో సుమనస అను అకారాంతపద మగునని సంస్కృతవ్యాకరణము.) సాధ్యుడు=సంపూర్ణుడు.

26 తారుణ్యము=యౌవనము.

ఆ + ఆమోద సామోదయంబు—

ఆమోద=సంతోషకరమగు, సామ=మంచిమాటయొక్క, ఉదయము=కలుగుట.

27 కార్యకారణశక్తుల్=ఏద్దాని కది కారణమా అనుట, వివాదము.

28 వ్యత్యస్తకరణము=విపరీత మగు చేష్ట.

31 ఖగోళ మకుటాది విభుడు=ఆకాశమున తిరుగు గోళములకు రాజు, అమిత భామండితుడు—ఎక్కువకాంతి చే వెలుగువాడు, సంజ్ఞాసతీమనవిభునికి=సంజ్ఞ అను పేరుగల భార్యయొక్క మనసును నకు గనియైనవానికి, పుణ్యజనలక్ష్యమండలనవ—యోగముచే మృతినొందినవారు యోగ్యనివాసులు సూర్యమండలము ద్వారా స్వర్గమున కేగదరనుట ఆర్యవచనము.

విగత సమస్త కిల్బిష వివిక్త మనంబులన్—

34 విగత=పోయిన, సమస్తకిల్బిష=అఖిలపాపముల, వివిక్త=పవిత్రమైన, మనంబులన్=మనస్సులచేత, శ్రీకర=శుభమును గలిగించు, కర్మయోగ=కర్మయోగము యొక్క, పరసిద్ధి=శ్రేష్ఠమగు సిద్ధియందు, నిబద్ధులు=దీక్షగలవారు.

41 విద్యలు—వ్యా. వ్యాదయపేక్షము — ఆయుష్కాలవ్యా, తత్త్వపరిచ్ఛేదము, ఇవి వ సూత్రము—విశేష్యము స్త్రీలింగమైనను విశేషణము నపుంసకలింగముగ నుండవచ్చును. కారకపరిచ్ఛేదము, 20 సూత్రము—విశేష్యము బహువచనమైనను విశేషణ మేకవచనముగ నుండవచ్చును.

రవికరప్రభాపరంబు=సూర్యకిరణములచే ప్రకాశము, అన్యదూరంబు=ఇతర కాంతులకు కష్టసాధ్యము.

లోక విషయసార లోకనము—

లోక=లోకమునందైన, విషయ=వస్తువులయొక్క, సార=నిజతత్త్వమును, లోకనంబు=చూచుట.

42 కుంభలగ్న జాత!=కుంభలగ్నమందు జనించినదానా!

51 యోయంజాతః అను శ్లోకమునకు ప్రతిపదార్థము—

త్రిలోకీప్రథితనుచరితే=ముల్లోకములయందు ప్రసిద్ధమయిన నడతగల, కాకతీయాన్వవాయే=కాకతీయవంశమునందు, దేవదేవః=దేవతలప్రభువును, భగవాన్=భగవంతుఁడును, స్వయంభూః=స్వయంభువను అను దేవుఁడు, యస్మై=ఎవ్వరికొఱకు, శ్రేయాంసి=శుభములను, అజస్రం=ఎల్లప్పుడు, వితరతి=ఇచ్చుచున్నాఁడో, యస్య=ఏ రాజాయొక్క, ఆజ్ఞా=ఉత్తరువు, సర్వపృథ్వీపతి మకుటమణిశ్రేణిశేఖరీభవత్యా=అందఱు రాజుల కిరీటములయందలి రత్నసమూహమునకు అలంకర్త అగునో, సః=ఆ, అయం=ఈ, భూపాలమౌలిః=రాజశ్రేష్ఠుఁడయినట్టియు, గుణమహాన్=గుణములచేత అధికుఁడైనట్టియు, రుద్రదేవో నరేశః=రుద్రదేవుఁడను రాజు, జయతి=సర్వోత్కృష్టుఁడుగానున్నాఁడు.

యో రుద్రో రజతాచలే అను శ్లోకమునకు అర్థము—

51 యః=ఏ, రుద్రః=ఈశ్వరుఁడు, పురా=పూర్వమునందు, అర్ధాంగనారీ=సగముశరీరమునందు స్త్రీ గలవాఁడై, రజతాచలే=కైలాసమందు, స్థితిం=నివాసమును, అగాత్=పొందెనో, సః=ఆ, అయం=ఈ యీశ్వరుఁడు, సంప్రతి=ఇప్పుడు, సర్వాంగనారీ=అన్ని అవయవములందును స్త్రీత్వము గలిగినవాఁడై, స్థితః=ఉండును.

యద్విషమావలోకన కళామాత్రేణ—

యత్=ఏకారణమువలన, విషమావలోకన=మూడవనేత్రముయొక్క, కళామాత్రేణ=అంశచేతనే, వైరిపురాణి=శత్రుపట్టణములు, భస్మీకృతాని=భస్మము చేయఁబడినవి, ఆసన్=అయినవి, స్థానే=అది యుక్తము, యత్=ఏకారణము వలన, విషమావలోకన కళామాత్రేణ=ప్రతికూలమైన చూపుయొక్క అంశచేతనే, వైరిపురాణి=శత్రురాజుల యొక్క పట్టణములు, భస్మీకృతాని=భస్మము చేయఁబడినవి, ఆసన్=అయినవి, అధునా=ఇప్పుడు, చిత్రం=ఆశ్చర్యము, ఖడ్గే=కత్తియందు, విషం=విషము, ధార్యతే=ధరింపఁబడుచున్నది (అనఁగా ఈశ్వరుఁడు అర్ధాంగనారియై కంఠమందు విషము దాల్చెను ఈ రుద్రరాజునకు ఖడ్గమునందు విషము.)

సైవ సోమా అను శ్లోకమునకు అర్థము.

సైవ=రుద్రమదేవియొక్క తల్లియో, ఉమా చేతి=పార్వతి అని, నిర్దిష్టా=చెప్పఁబడినదై, సోమా చేతి=సోమాదేవి అని, ప్రథాం=ప్రసిద్ధిని, అగాత్=పొందెను, యస్య=ఎవనియొక్క, మాతా=తల్లి, సాక్షాత్=ప్రత్యక్షముగ, శివా=పార్వతీదేవి, గణపతిః=ప్రమథగణములకు ప్రభువైన గణపతి అను పేరుగల చక్రవర్తి దేవః=ఈశ్వరుఁడు. పితా=తండ్రి.

52 నభోమణికుల సదమలాలంకార—

నభోమణి కుల=సూర్యవంశమునకు, సదమలాలంకార=యోగ్యమైనటువంటి, కళంకము లేనట్టి అలంకారమైనవాఁడా.

మిత్ర నృపబద్ధ సమయపాలా—

మిత్రనృపబద్ధ=స్నేహితులైన రాజులతో చేసికొనఁబడిన, సమయపాల=ఏర్పాటుప్రకారము నడచుకొనువాఁడా.

ఏకశిలారాజ్య విపుల విభవ భద్ర పదభావ—

ఏకశిలారాజ్య=ఏకశిలా ప్రభుత్వముయొక్క, విపులవిభవ=విస్తారమయిన సంపదయొక్క, భద్ర పద భావ=జాగ్రత్తపఱుచుటయే భావముగాఁ గలవాఁడా.

(పద్మనాయకవీర బిరుదపాతమునకు అర్థము 3 వ అనుబంధమునందు చూచునది.)

77 శ్రోణిని విపులీకృత లంబ విలోల విశ్రుతిక—

శ్రోణికా=కటిప్రదేశముయొక్క వెనుకభాగమునందు, విపులీకృత=వ్యాపించినవి, లంబ=పొడవైనవి, విలోల=కదలుచున్నవి, (అని) విశ్రుతిక=ప్రఖ్యాతిచే, మలినేతర నైల్య=నలుపులో మాలిన్యములేనివి (నైగనిగ్యము గలవి.)

79 షట్పదగీతము=తుమ్మెదలగీతము, షట్పద మనెడి సంగీతము.

89 సూచీవ్యూహము=సూదియొక్క ఆకారముగానుండు సైన్యముయొక్క తీర్పు.

94 సోపాన పదములు=సోపానములవలెనుండు పర్వత భాగములపైనుండు పదములు.

99 రామనామ వర్ణ సాధనోత్సాహ పరవజ్ర శోధసాక్షి—

ఈ వాక్యముచే సూచింపఁబడిన కథ.

(శ్రీరాముని పట్టాభిషేకసమయమునందు హనుమంతునకు ఒక వజ్రముల హారము బహుమతిగా నొసంగఁబడెను. దాని నాతఁడు ధరింపక ఒక బండతో నా వజ్రములను చిదుకఁగొట్ట ప్రారంభించెను. ఆతఁ డట్లు చేయుట చూచిన పౌరులు అతనిని మూర్ఖునిగాఁ దలంచి, శ్రీరామునితో విన్నవింపఁగా, అతఁడు హనుమంతుని అభిప్రాయమును అడిగెను. రామనామముయొక్క అక్షరములను హారముయొక్క వజ్రములందు వెదకుచున్నాననియు, అవి యందు లేనందున ఆ హారము తనకు సంతోషదాయకము కాదనియు హనుమంతుఁడు బదులు చెప్పెను.)

109 ఉడుకునీరు—క్రిందినుండి కోటగోడకుఁ బ్రాఁకు శత్రువులకు అటువంటిసమయమున పైనుండి ఉడుకునీరు కోటను కాపాడువారు జడివానవలె కురిపించుట కలదు.

116 సమీక వివేకం అను సమాసమునకు అర్థము—

సమీకవిశేక=యుద్ధమందు అనుభవముగలవారిని, విక్రమోత్సేల-పరాక్రమముచే అధికులును, భయానకప్రకట=భయానకరము శత్రువులయెడ వెలువఱచువారును అను వీర=వీరుల యొక్క, హృత్=హృదయమునకు, ఉత్సాహ=ఉత్సాహమునకు, కారణ=కారణమైనట్టి, ప్రభాజాల=కాంతిసమూహముచే, సముజ్జ్వలము లగు=ప్రకాశించుచున్న, శస్త్రసంపదలు=ఆయుధసమూహములు.

117 స్వదేశజన మేదురకీర్తి మహత్వకారులు—

స్వదేశజన=తమదేశజనులయొక్క, మేదురకీర్తి=ప్రశస్తమయిన కీర్తియొక్క, మహత్వ=ఆధిక్యమును, కారులు=చేయువారు, అలసులు=సోమరులు, అన్యజంతువులు=ప్రవేశించుటకు తగ్గని యితరజంతువులు.

120 మానినీవృత్త లక్షణము—

7 భగణములు, 1 గురువు, ప్రతి పాదమునకు. 13 వ యక్షరము యతి.

132 హిమవన్నగేంద్ర జగదున్నత జన్మ తపః ఫలంబ—

హిమవన్నగేంద్ర=హిమవంతునియొక్క, జగదున్నత=జగత్తునందు అధికమైన, జన్మ=పుట్టుకయొక్క, తపః=తపస్సువలన, ఫలంబ=ఫలమా!

అభవమోదకరామల దివ్యదేహా—

అభవ=జన్మలేనివానికి (శివునికి), మోదకర=సంతోషమును గలిగించు, అమలదివ్యదేహా=స్వచ్ఛమయిన ప్రకాశముల దేహము గలదానా!

సముత్సాహ నతార్తిహార గుణధామ—

సముత్సాహ=మంచి సంతోషముచే, నత=నమస్కరించువారియొక్క, ఆర్తి=దుఃఖమును, హార=పోఁగొట్టునట్టి, గుణ=సద్గుణములను, ధామ=ఉనికిపట్టుగాఁ గలదానా!

133 నయశాస్త్రోక్త అను పద్యమునకు అర్థము—

నయశాస్త్ర=నీతిశాస్త్రమునందు, ఉక్త=చెప్పఁబడిన, సుధర్మ=మంచిధర్మములయొక్క, పాలన కళా=కాపాడుట అనెడి విద్యయందు, నైపుణ్య=నేర్పుయొక్క, పారంగత=చివరకు తెలిసినట్టిదియు, అవ్యయ=స్థిరమయినదియు, (అగు) ధీ=బుద్ధిచేత, పేర్మిరిల=[illegible], సత్య=యథార్థమైన, కాపట్యములేని, శౌర్యవిభవ=పరాక్రమ వైభవమునకు, వ్యాయామ=[illegible] ప్రదేశమయిన, సంగ్రామరంగ=యుద్ధప్రదేశమునందలి, యశః=కీర్తిచేత, వ్యాలిఖిత=వ్రాయఁబడిన, అమలాక్ష=స్వచ్ఛమయిన అక్షరములు గల, దిశాగంధేభ=దిగ్గజములయొక్క, దంతస్థలి=దంతస్థలములయందు, జయతేజః=జయతేజస్సుచేత, అధిక=ఎక్కువైన, కాకతీయన్నపవంశ=కాకతీయ రాజుల వంశమునకు, భ్రాజితరాజత్=మిక్కిలిగా ప్రకాశించుచున్న, మౌళీ=మణివంటిదానా.

149 వరనర్తకులు=మంచి నాటకసంఘులు,

2వ అనుబంధము.

జ్యోతిశ్శాస్త్ర పరిభాషావచనముల వివరము.

జ్యోతిశ్శాస్త్రము:—జ్యోతులు అనఁగా ఆకాశముపై ప్రకాశించు మండలములు. వీనిని గూర్చి చెప్పు శాస్త్రము జ్యోతిశ్శాస్త్రము.

గ్రహములు:—సూర్యమండలము నాశ్రయించి పరిచలనము చేయునట్టి కొన్ని ఖగోళములు. ఇవి చాల గలవు. కాని జాతకఫలము నెఱుంగుటకై మనదేశపు జ్యోతిశ్శాస్త్రజ్ఞులు తొమ్మిది గ్రహములను మాత్రమే యెంచిరి. వాని పేర్లు:—

1 సూర్యుఁడు—(Sun) ఈ మహామండలమును ఆశ్రయించి ఇతర గ్రహగోళము లన్నియు తిరుగుచుండును కావున సూర్యుఁడు గ్రహముకాదు. అయినను జాతకఫలనిరూపణకై శాస్త్రజ్ఞులు భూమినే గ్రహమండలమధ్యమస్థానముగ నెంచి, సూర్యమండలమును గ్రహగోళములలో నొకటిగా గణించుచువచ్చిరి.

తక్కిన ఎనిమిది గ్రహములు—	ఇంగ్లీషుపేర్లు.
2 చంద్రుఁడు—	Moon.
3 కుజుఁడు—	Mars.
4 గురువు—	Jupetor.
5 శని—	Satnrn.
6 బుధుఁడు—	Mercury.
7 శుక్రుఁడు—	Venus.

8 రాహువు—
9 కేతువు— } ఈ రెండు గ్రహములకును గోళములు లేవు. సూర్యుని చుట్టును తిరుగునట్టి భూమియొక్క మార్గమును భూప్రదక్షిణ మొనరించునట్టి చంద్రునియొక్క పరిధి తాకునట్టి రెండు చోట్లను రాహుకేతువు లను పేర్లతో శాస్త్రజ్ఞులు వ్యవహరింపుచు వచ్చిరి. వీనికే ఇంగ్లీషులో (ascending and discending nodes of the moon) అను పేర్లు గలవు. పై గ్రహమండలము లన్నింటికి ఆయా పేర్లు గల అధిదేవతలు గలరని పౌరాణికప్రసిద్ధి. వారలే ఈ నాటకమున పాత్రలుగా గ్రహింపఁబడిరి.

నక్షత్రములు—
తారలు— } మబ్బులేని రాత్రి ఆకాశమున మెఱయునట్టి ఖగోళములో కొన్ని పైఁ జెప్పఁబడిన గ్రహములు. అవిగాక తక్కిన వన్నియు నక్షత్రములు లేక తారలు. ఇవి చాల గలవు. కాని మానవులకు సంబంధించిన కాలచక్రముయొక్క గణనముకొఱకై జ్యోతిశ్శాస్త్రజ్ఞులు అశ్విన్యాదిగ నిరువదియేడు నక్షత్రములను మాత్రమే యెంచుచువచ్చిరి. ఈ నక్షత్రములలో ఒక్కొక్క నక్షత్రమునకు నాలుగు పాదములు అనఁగా భాగములు ఏర్పఱిచి, ఈ క్రిందివిధముగ సూర్యుని మార్గమగు కాలచక్రమును విభజించిరి.

2

1 కాలచక్రము, దివారాత్రములు, సూర్యుడు భూమి చుట్టును తిరుగునట్లు కనిపించు ఆకాశ భాగము. — మేషము, వృషభము, మిథునము, కర్కాటకము, సింహము, కన్య, తుల, వృశ్చికము, ధనుస్సు, మకరము, కుంభము, మీనము అను పండ్రెండు రాసులుగ విభజించిరి.

ఈ పండ్రెండు రాసులును మొత్తముమీద నిరువదియేడు నక్షత్రముల క్రింద విభజింపబడి యున్నవి. పైని చెప్పినట్లు ఒక్కొక్క నక్షత్రమునకు నాలుగేసి పాదము లయినచో అన్ని నక్షత్రములకును కలసి (4 × 27) 108 పాదములు అగును. అనగా పండ్రెండు రాసులలో ఒక్కొక్క దానికి 108/12=9 నక్షత్ర పాదములు వచ్చును. ఈ నక్షత్రపాదములకే నవాంశలని పేరు. ఈ నక్షత్రములను బట్టియే ఆకాశమునందు రాసుల నిర్ణయము చేయబడి, ఆయారాసులకు ఆయాగ్రహములు వచ్చినప్పుడు అందుకు తగిన ఫలముల మేలుకీడులు చెప్పబడుచుండును.

లగ్నము—పైని చెప్పినట్లు సూర్యమార్గమును పండ్రెండు రాసులక్రింద విభజించి, ఆ రాసులలో ఏది ఏసమయమునకు తూర్పు దిక్చక్రముపైకి వచ్చుచుండునో (అనగా ఉదయించుచుండునో) ఆ సమయమునకు ఆ రాసియే లగ్నమని చెప్పుదురు. భూభ్రమణముయొక్కయు భూచలనముయొక్కయు వేగముల వెంట రాసులయొక్క ఉదయాస్తమయములు మారుచు తెలియుచుండును.

జాతకచక్రము—ఎవరైనను జనించు సమయమునందు ఆకాశముపై ఏగ్రహము ఏరాసిలో నుండునో సూచించు పత్రమునకే జాతకము లేక జాతకచక్రము అని పేరు. ఇది చక్రాకృతిగ వ్రాయబడునది గాని పాశ్చాత్యము కొరకు, ఈ నాటకముయొక్క ఇరువది మూడవ పుటలో నుదహరింపబడినట్లు, నాలుగుమూలలుగ గీతలు లిఖించుచుందురు. ఈ చక్రములో 'ల' అని వ్రాసినచోటే లగ్నము. తక్కిన పొడి అక్షరము లన్నియు గ్రహముల పేర్ల మొదటి అక్షరములు.

శింశుమార చక్రము—గ్రహగోళ నక్షత్రగోళాత్మకం బగు సర్వప్రపంచమును శింశుమార చక్రంబను నామంబుచే వ్యవహరింపబడుచున్నది. ఇది భగవత్స్వరూప మని భాగవతాది గ్రంథములలో విపులముగ వర్ణింపబడియున్నది.

పరిచలనము—ఒకగోళము మరియొక ప్రధానగోళము చుట్టును తిరుగుట.

పరిభ్రమణము—గోళములు అన్నియు బొంగరములవలె తమచుట్టునే తిరుగుచుండుట.

3వ అనుబంధము.

పద్మనాయక వీర బిరుదములు.

(గోత్రములు 77. ఒక్కొక్క గోత్రమువారికి బిరుదములు విశేషముగ నున్నవి. వాటి కాఠిన్యము కొలఁది వానిలో కొన్నిమాత్రమే యిం దుదహరింపఁబడినవి.)

(1) బిరుదములు. రేచర్లవారివి— అర్థములు.

1 పంచవాద్యేయ దళ విభాల! = పంచవాద్యేయునియొక్క సేనను భేదించినవాఁడా!
2 కాకతిరాజ్య స్థాపనాచార్య! = కాకతిరాజ్యమును స్థాపించుటలో గురువువంటివాఁడా!
3 చలమర్తిగండ! = చలమర్తి పట్టణమును శాసించినవాఁడా!
4 జల్లిపల్లి రణక్షేత్ర శోణభారతీకమల! = జల్లిపల్లి యుద్ధరంగమందు భారతీకు లనెడి యోధులలో శ్రేష్ఠుఁడా!
5 సోమకుల పరశురామ! = సోముని వంశమును జయించినవాఁడా!
6 యంబిరుదగండ! = యంబిరుదుఁ గలవానిని జయించినవాఁడా!
సర్వబిరుదకుమార! = సర్వబిరుదులయందును కుమారస్వామివంటివాఁడా!
7 రాయవేశ్యాభుజంగ! = రాయఁ డనువానిని స్వాధీనపఱచుకొన్నవాఁడా!
8 ఆమనగంటి పురవరాధీశ్వర! = ఆమనగల్లు అనెడు పట్టణమునకు ప్రభువా!
9 శత్రుగోవ్యాఘ్ర! = శత్రురాజు లనెడి గోవులకు బెబ్బులివంటివాఁడా!
10 కంచికవాట చూరకార! = కాంచీనగరముయొక్క తలుపులను హరించినవాఁడా!
11 రేచర్లవంశ పయఃపారావార రాకాసుధాకర! = రేచర్లవంశ మనెడి పాలసముద్రమునకు పూర్ణచంద్రుఁడా!

(2) ,, దేవనూళ్ళవారివి—

1 శైలగోపాలపార్థివ! = శైలగోపాలుఁ డనెడి బిరుదుఁ గల రాజా!
2 కోడిబిబ్బనాయక రణసింహ! = కోడిబిబ్బనాయకుని జయించినవాఁడా!
3 గురిజాలగణపతి శరభకుమార! = గురిజాలగణపతియనెడి రాజును జయించినవాఁడా!
4 అర్ధనారీ చేలాటరామ! = అర్ధనారీముఖములు గల చేలకడియముఁ గలవాఁడా!
5 రాహుత్తవేశ్యాభుజంగ! = రాహుత్తుని స్వాధీనపఱచుకొన్నవాఁడా!
6 దేవనూళ్ళగోత్ర పయఃపారావార సుధాకరా! = దేవనూళ్ళగోత్ర మనెడి పాలసముద్రమునకు పూర్ణచంద్రుఁడా!

(3) రేపాలవారివి—

1 పాతాళగరుడ! = పాతాళరాజు లనెడి పామునకు గరుత్మంతునివంటివాఁడా!
2 మన్మథనాథ! = మన్మథుని జయించినవాఁడ!

3 నిడుమోలు పరక్షేత్రగణ భారతీక మల్లా! = నిడుమోలు యుద్ధరంగమునందు వారిని
లనెడి యోధులలో శ్రేష్ఠుడా!

4 ఉత్తమగండ! = ఉత్తములలో శ్రేష్ఠుడా!

5 తెల్ల తలాటరాయ! = తెల్లని ముఖములుగల మురుగు గలవాడా!

6 రేపాలగోత్ర పయః పారావార సుధాకరా! = రేపాలగోత్ర మనెడి పాలసముద్రమునకు
చంద్రుడా!

(4) ,, విప్పర్ల వారివి—

1 కరవాల భైరవా! = కత్తులచే భయంకరుడా!

2 దివిచోడకాప! = దివిచోడు డనెడి రాజును రక్షించినవాడా!

3 గండభేరుండ తలాటరాయ! = గండభేరుండముఖములు గల మురుగు గలవాడా!

4 రాయరాహుత్త వేశ్యాభుజంగ! = రాయరాహుత్తు డనెడి రాజును స్వాధీనము
చేసికొన్నవాడా!

5 ఉభయరగండ! = ఇద్దఱు శత్రువులను ఏకసమయములో జయించినవాడా!

6 హొన్నిబ్బరగండ! = ఇద్దఱు వీరులను ఏకకాలమందు జయించినవాడా!

7 హొత్తు మువ్వరగండ! = మువ్వురు వీరులను ఏకకాలములో జయించినవాడా!

8 ధీర సామంత! = ధైర్యముగల సామంతరాజా!

9 బారా మండలీక! = పండ్రెండు సేనలకు అధిపతి యయినవాడా!

10 భాగ్నుకతారమారకార! = భాగ్నుని కత్తిని హరించినవాడా!

11 దుష్టగోవుల తలగుండుగండా! = దుష్టులైన రాజులయొక్క శిరములను ఛేదించినవాడా!

12 సమరపుర తలాటరాయా! = సమరపురిచిహ్నము గల మురుగు గలవాడా!

13 బుధవర్ణకులాలంకరణ! = బుధవర్ణుని కులమునకు అలంకారమైనవాడా!

14 చోళరాజ్య స్థాపనాచార్య! = చోళరాజ్యమును స్థాపించినవాడా!

15 విప్పర్లగోత్ర పయః పారావార సుధాకరా! = విప్పర్లగోత్ర మనెడి పాలసముద్రమునకు
చంద్రుడా!

(5) ,, విరియాలవారివి—

1 పరబలభీమ! = శత్రుసేనలకు భయంకరుడా!

2 దుష్ట రిపు గజాంకుశ! = దుష్టశత్రువు లనెడి యేనుగులకు అంకుశమువంటివాడా!

3 తేరా సామంత! = పదుమూగ్గురు సామంతరాజులు గలవాడా!

4 బారా మండలీక చాళ్లా! = పండ్రెండుగురు సేనాధిపతులను కాంతిహీనులుగా
చేసినవాడా!

5 కరుహూత్తుమల్లా! —

6 దానవ తలాట రాయా! = రాక్షసముఖములు గల చేతికడియము గలవాఁడా!

7 విరియాల గోత్ర పయః పారావార సుధాకరా! = విరియాలగోత్ర మనెడి పాలసము
ద్రమునకు చంద్రుఁడా!

(6) ,, ఆరట్లవారివి—

1 పతిహిత హనుమంత! = ప్రభువునకు హితముచేయుటయందు హనుమంతునివంటి
వాఁడా!

2 భండన భీమ! = యుద్ధరంగమునందు భయంకరుఁడా!

3 ఏకసంఖ్యానుమవు రాహుత్తరగండా! = ఏకసంఖ్యబిరుదు గల రాజును జయించిన
వాఁడా!

4 అర్ధనారీ తలాట రాయా! = అర్ధనారీముఖములు గల చేతికడియము గలవాఁడా!

5 ఆరట్లగోత్ర పయః పారావార సుధాకరా! = అరట్లగోత్ర మనెడి పాలసముద్రమునకు
చంద్రుఁడా!

(7) ,, అల్లుచెర్లవారివి—

1 సాహస హనుమంత! = సాహసమందు హనుమంతునివంటివాఁడా!

3 సంగ్రామవిజయ! = యుద్ధమందు అర్జునునివంటివాఁడా!

3 ముదువక్కోలను వీరక్షేత్రణి భారతీక మల్లా! = ముదువక్కోల ననెడి యుద్ధరంగమందు
భారతీకు లనెడి యుద్ధభటులలో శ్రేష్ఠుఁడా!

4 అరిరాయ భూత భైరవా! = శత్రురాజు లనెడి భూతములకు భయంకరుఁడా!

5 పద్దుకటారి రాయ! = పద్దుకటారి అనెడి బిరుదు గల రాజా!

6 అల్లుచెర్లగోత్ర పయః పారావార సుధాకరా! = అల్లుచెర్లగోత్ర మనెడి పాలసముద్ర
మునకు చంద్రుఁడా!

(8) ,, సామంతరావువారివి—

1 సామంతకొమర ఖండేరాయ! = సామంతకొమర వంశమునకు శ్రేష్ఠుఁడా!

2 వంకిణాకోట దుర విఘాల! = వంకిణాకోటను యుద్ధమునందు పగులఁగొట్టిన
వాఁడా!

3 విజయరాయని దిశాపట్టా! = విజయరాయని వలన దిగ్విజయపట్టికను పొందిన
వాఁడా!

4 తెలుంగుదేశ రాహుత్త! = తెనుఁగుదేశమునకు రాజా!

5 నెహూరునాయని తిరుపూరచ్ఛాళ్లూ! = నెహూరునాయని హృదయమును కాంతిహీనముగా జేసినవాఁడా!

6 సామంతిరాప్పుగోత్ర పయః పారావార సుధాకరా! = సామంతరావుగోత్ర మనెడి పాలసముద్రమునకు చంద్రుఁడా!

(9) ,, పెంపాలవారికి—

1 పెంపాలకుల కమల మార్తాండ! = పెంపాలవంశ మనెడి పద్మమునకు సూర్యునివంటివాఁడా!

2 సాహసార్జున! = సాహసమందు అర్జునుని వంటివాఁడా!

3 అసహాయసింహ! = అసహాయ (శూరు) లలో శ్రేష్ఠుఁడా!

3½ సాహసోత్తుంగతరంగ! = 3½ సాహసమందు సముద్రమువంటివాఁడా!

4 గండభేరుండ! = పౌరుషవంతులలో శ్రేష్ఠుఁడా!

5 యువరాజ స్థాపనాచార్య! = యువరాజును స్థాపించినవాఁడా!

6 పెంపాలగోత్ర పయః పారావార సుధాకరా! = పెంపాలవంశ మనెడి పాలసముద్రమునకు చంద్రునివంటివాఁడా!

(10) ,, పైడిశాలవారికి—

1 వైరి గజ భీమ! శత్రువులనెడి గజములకు భయంకరుఁడా!

2 కంఠోరమునుకట్టినరాగండా! = కంఠోరమును కట్టి తన రాజును జయించినవాఁడా!

3 ఎల్లనాయకుల స్థాపనాచార్యా! = ఎల్లనాయకులను స్థాపించినవాఁడా!

4 ముసునూరిపిల్లలు మహారాజుల కత్తి తగాదము — ముసునూరిపిల్లలరాజులచే యియ్యఁబడిన ముత్యాలచే చెక్కఁబడిన కాలికడెయమును, ధర్మములలోని చేతికడియము, గల ప్రభువా!

5 పైడిశాలగోత్ర పయః పారావార సుధాకరా! = పైడిశాలగోత్ర మనెడి పాలసముద్రమునకు చంద్రుఁడా!

(11) అస్వన్లాలవారికి—

1 గడికోట్ల మల్ల! = శత్రువులకు భయంకరులైనవారిలో శ్రేష్ఠుఁడా!

2 కదన త్రినేత్ర! = యుద్ధమునందు ఈశ్వరునివంటివాఁడా!

3 నానాదిక్పురవరాధీశ్వరా! = నానాదిక్పురములకు రాజా!

4 నవలీసహస్ర బాహా! = బాణాసురునివంటి పరాక్రమము గలవాఁడా!

5 ఉభయదళ పితామహా! — ఉభయదళములకు భీష్మునివంటివాఁడా!

6 కోదండసింహా! = విలువిద్యగలవారిలో శ్రేష్ఠుఁడా!

7 ఇనుగాలగోత్ర పయః పారావార సుధాకరా! — ఇనుగాలవంశ మనెడి పాలసముద్రమునకు చంద్రుఁడా!

(12) „ మట్నూళ్ళవారివి—

1 భండన భయంకరా! = యుద్ధమందు భయంకరుఁడా!

2 తొండ గజ కేసరా! — తొండదేశపు రాజు అనెడి యేనుఁగుకు సింహమువంటివాఁడా!

3 కానిపాంచాల ఏకదళ వీర! — కానిపాంచాలరాజును ఒక్కసేనతో జయించినవాఁడా!

4 ఏకదళ భయంకరా! = ఒక్కసైన్యముచేత శత్రువులను భయపెట్టినవాఁడా!

5 నల్ల తలాట రాయా! = నీలములతో చేయఁబడిన మురుగు గలవాఁడా!

6 చోళరాజ్య స్థాపనాచార్యా! = చోళరాజ్యమును స్థాపించినవాఁడా!

7 మట్నూళ్ళగోత్ర పయః పారావార సుధాకరా! — మట్నూళ్ళగోత్ర మనెడి పాలసముద్రమునకు చంద్రుఁడా!

(13) „ పాట్నూళ్ళవారివి—

1 పట్టరుమారాజ సహాయ! = పట్టరుమారాజునకు సహాయము జేసినవాఁడా!

2 కల్యాణ పురసాళువ! = కల్యాణపురపు కోటను హరించినవాఁడా!

3 కోసలరాజ్యవిహార! — కోసలరాజ్యములో విహరించినవాఁడా!

4 పర్వగోకర్ణుని దక్షిణభుజాదండ! = పర్వగోకర్ణరాజునకు కుడిభుజమువంటివాఁడా!

5 పాట్నూళ్ళగోత్ర పయః పారావార సుధాకరా! = పాట్నూళ్ళవంశ మనెడి పాలసముద్రమునకు చంద్రుఁడా!

(14) „ మారుట్లవారివి—

1 మారుట్లసింహా! = మారుట్లగోత్రమువారిలో శ్రేష్ఠుఁడా!

2 మల్లనోలి పురవరాధీశ్వరా! — మల్లనోలుపట్టణమునకు రాజా!

3 దుర్భిక్షవైరి మధ్యాహ్న కల్పవృక్షమా! = కఱవనెడి శత్రువునకు మధ్యాహ్న కాలమందైన కల్పవృక్షమువంటివాఁడా!

4 అభిమానదుర్యోధనా! = అభిమానమందు దుర్యోధనునివంటివాఁడా!

5 శరభ తలాట రాయా! = శరభముఖముగల చేతికడియము గలవాఁడా!

6 మాచుట్లగోత్ర పయః పారావార సుధాకరా! — మాచుట్లవంశ మనెడి పాలసముద్ర మునకు చంద్రుఁడా!

(15) ,, పానేపల్లివారివి—

1 మండలీకరశాహస్తుమల్లా! — బలవంతులైన మండలాధిపతులలో శ్రేష్ఠుఁడా!

2 భుజబలభీమా! = భుజబలమందు భీమునివంటివాఁడా!

3 మడిమ దిరుగు బిరుదు కుమారనాయకాచ్చాళ్లా! — మడిమ దిరుగు బిరుదుగల కుమారనాయకుని జయించినవాఁడా!

4 తంటతళాట రాయా! = తంటముఖములుగల కడియము గలవాఁడా!

5 పానేపల్లిగోత్ర పయః పారావార సుధాకరా! — పానేపల్లివంశ మనెడి పాలసముద్రమునకు చంద్రుఁడా!

ఇట్టి 77 గోత్రముల పద్మనాయకవీరబిరుదములును, గోత్రవీరుల నామములును, పద్మనాయక చరిత్రమునందును, రావువంశ చరిత్రయందును, పూర్తిగా చెప్పఁబడినవి.

4వ అనుబంధము.

సంస్కృత నాటక లక్షణము.

దృశ్యప్రబంధములు పదివిధములు.

		నాయకుఁడు.	రసములు.	కథ.	అంకములు.
1	నాటకము.	ధీరోదాత్తుఁడు.	శృంగారము లేక వీర రసము ప్రధానము.	ఇతిహాసము, పూర్వముజరిగినది.	5 లేక ఎక్కువ.
2	ప్రకరణము.	ధీరశాంతుఁడు.	శృంగారము.	కల్పితము.	
3	భాణము.	ధూర్తవిటుఁడు.	శృంగార వీర రస సూచన.	,,	1 అంకము.
4	ప్రహసనము.	పాషండాదులు.	హాస్యము ప్రధానము.	,,	,,
5	డిమము.	పిశాచ దేవ గంధర్వాదులు 16 గురు నాయకులు.	రౌద్రము ప్రధానము. శృంగార వీర } సూచన	ఇతిహాసము, మాయ, సూర్యచంద్రాది గ్రహావర్ణన. ఇంద్రజాలము.	4 అంకములు.
6	వ్యాయోగము.	ధీరోద్ధతుఁడు.	వీరప్రధానము.	విఖ్యాత చరిత్ర.	
7	సమవాకారము.	12 దేవాసురులు.	వీరరసము.	కల్పితము లేక ఇతిహాసము.	3 అంకములు.
8	వీధి.	ధీరోద్ధతుఁడు.	శృంగార సూచన.	కల్పితము.	1 అంకము.
9	అంకము.	ప్రాకృతజనుఁడు.	కరుణ రసము.	ఇతిహాసము.	1 అంకము.
10	ఈహామృగము.	ధీరోదాత్తుఁడు. మర్త్యుఁడు లేక దివ్యుఁడు.	శృంగారము.	మిశ్రము.	4 అంకములు.

నాటక పరిభాషలు.

నాంది—కథాసూచన. 8 లేక 12, 18, 22 పదములలోఁ గాని, వాక్యములలోఁ గాని, చెప్పవలెను. కొందఱు పదనియమము చేయరు.

విష్కంభము—జరిగినకథను జరుగఁబోవుకథను మధ్యమపాత్రలు చెప్పుకొనుట.

చూళిక—తెరలో నుండి మాటలాడుట.

ప్రవేశకము—విష్కంభమువలెనే నీచపాత్రలు చెప్పుకొనుట. ఇది 1వ అంకములో ఉండకూడదు.

అంకావతారము—రాఁబోవుసంకములోని విషయమును ముగియు సంకములో సూచించుట.

పాకములు—ద్రాక్ష, నారికేళ, కదళీ అని మూఁడు విధములు.

అంకము—(దృశ్యములోని భాగము) ప్రత్యక్షమైన నాయకుని చరిత్రము గలది. అనేక రచనలకు రసములకు ఉనికిపట్టు.

శయ్య—పదములయొక్క అన్యోన్య మైత్రి.

వృత్తులు.

(1) భారతి—రచనము మృదువై, అర్థసందర్భము కలది.
(2) సాత్వతి—రచనము ప్రౌఢమైనది.
(3) కైశికి—అంతయు సుకుమారమైనది.
(4) ఆరభటి—అంతయు గంభీరమైనది.

రీతులు.

(1) వైదర్భి—బంధకాఠిన్యము లేనిది. శబ్దకాఠిన్యము లేనిది. దీర్ఘసమాసములు లేనిది.
(2) గౌడి—ఓజోగుణము (పెద్దగా సమాసములు విశేషముగా నుండుట) కాంతిగుణము (ఉజ్జ్వలపదత్వము) కలది.
(3) పాంచాలి—పై రెంటియొక్క మిశ్రమము.

నాయకులు.

(1) ధీరోదాత్తుడు—మహాసత్వుడు, గంభీరుడు, క్షమావంతుడు, అవికత్థనుడు.
(2) ధీరోద్ధతుడు—దర్పమాత్సర్యభూయిష్ఠుడు, [illegible] కలవాడు, వికత్థనుడు, మాయావి, సులభకోపుడు.
(3) ధీరలలితుడు—నిశ్చింతుడు, కళాసక్తుడు, సుఖైకభోగుడు.
(4) ధీరశాంతుడు—శాంతుడు, ప్రసన్నాత్ముడు.

నాటకసంధులు.

ఒక్క ప్రయోజనముతో సంబద్ధములగు అవాంతరప్రయోజనములు కలియుట నాటకసంధి.

నాటకసంధులయొక్క వివరములు.

వరుస సంఖ్య.	నాటకసంధిపేరు.	ఆసంధిలో కలియు ప్రయోజనముల పేర్లు.	ప్రయోజనములయొక్క వివరము.
1	ముఖము.	1 ఆరంభము	విస్తారఫలమునకై ఉత్సాహము.
		2 బీజము	కొలది ఉద్దేశముతో విస్తారమైన కార్యమును [illegible]చుట.
2	ప్రతిముఖము.	1 ప్రయత్నము	ఫలప్రాప్తికై తొందరపడుట.
		2 బిందువు	అవాంతరవిఘ్నము నివారించుట.

3 గర్భము.
- 1 ప్రాప్త్యాశ = ఉపాయము అపాయముయొక్క చింత.
- 2 పతాక = చెప్పఁదలఁచిన కథకు అంగముగా వేఱొక కథను వ్యాపింపఁజేయుట.

4 అవమర్శము.
- 1 నియతాప్తి = అపాయాభావముచే కార్యనిశ్చయము.
- 2 ప్రకరి = అవ్యాపిని యగు కార్యమును నిర్వహించుట.

5 ఉపసంహృతి.
- 1 ఫలాగమము = సమగ్రమైన ఫలసంపత్తి.
- 2 కార్యము = ఫలము.

నాట్యశాలావర్ణన.

నాట్యశాలలు మూఁడువిధములగు ఆకృతులు గలవి. (1) దీర్ఘచతురశ్రము. (2) చక్రాకృతి. (3) అండాకృతి. వీనిలో చక్రాకృతిగలవి ప్రస్తుతము పాశ్చాత్య దేశములలో వాడుక చేయఁబడుచున్నవి. అండాకృతిగలవి పూర్వపు రోమక గ్రీకు దేశములలో వాడుకలో నుండెను. ఇప్పుడు మన దేశమునందు మొదట చెప్పఁబడిన దీర్ఘ చతురశ్రాకృతిగలవియే నిర్మింపఁబడుచున్నవి.

విస్తీర్ణము.

నాటకసంఘము యొక్కయు, ప్రేక్షకజనము యొక్కయు ఆవశ్యకమును బట్టి నాట్యశాలల విస్తీర్ణము నిర్ణయింపఁబడవలెను. పూర్వము రోమనుదేశములో అండాకృతిగల నాట్యశాల "కాలసీయమ్" అను పేరుగలది సుమారు లక్షమంది ప్రేక్షకజనము విశాలముగా కూర్చుండునంత పెద్దదిగా నుండెడిది. కాని సాధారణముగా నంత పెద్దవి అనుపయోగముగను నిర్మించుట కష్టముగను ఉండును. ఉచ్చైస్స్వరమున పలుకు మనుష్యుని వచనము ఎంత దూరము వినిపించునో అంతదూరముకంటె అనఁగ సుమారు నలుబది గజములకంటె పొడవగు నాటకశాల నిర్మింపఁబడుట అనావశ్యకము.

నాటకశాలలోని భాగములు.

1 ప్రేక్షకస్థలము, 2 రంగము, 3 నేపథ్యము, 4 దేవయానము, 5 పాతాళము అను అయిదుభాగములును చేరి నాటకశాలయగును. నాటకశాలలో 2 భాగములు ప్రేక్షకస్థలము, ఒకభాగము రంగము, ఒకభాగము నేపథ్యముగ నుండునట్లు విభజించునెడ సౌకర్యముగ నుండును.

ప్రేక్షకస్థలము:—ఇది, ప్రదర్శనమును చూడవచ్చు పౌరులు అధివసించుటకును; పర్యటనము సల్పుటకును, వీలుగ నుండవలయును.

రంగస్థలము:—ఇది నాటకము ప్రదర్శింపఁబడు స్థలము. ఇది ప్రేక్షకస్థలము నానుకొని దానికంటె ఉన్నతముగ నిర్మింపఁబడవలెను. దీనిపరికరములను గూర్చి తరువాత వివరించెదము.

నేపథ్యము:—రంగస్థలమునకు వెనుకను ప్రక్కలను గల భాగమును నేపథ్యమందురు. ఇది నటులు రంగప్రవేశ మొనర్చుటకు ముందు విశ్రమించుటకును, సన్నాహపడుటకును, భూమికాగ్రహణ మొనర్చుటకును ఉపయోగింపఁబడు స్థలము. సామాజికులలో స్త్రీలుకూడ నుండు నేఁడు స్త్రీలకును పురుషులకును ప్రత్యేకముగ భూమికానిర్మాణముకై యభ్యంతరస్థలములు నేర్పఱుపఁదగును. రంగస్థలమునకు చెందిన పరికరముల నన్నిఁటిని దాఁచియుంచుటకును, నటకులును నైపథికులును ఇటునటు [illegible] తిరుగుటకును, తగునంత విశాలముగ నుండవలయును. గావున నేపథ్యము సంకుచితము కాకుండవలెను.

దేవయానము:—రంగస్థలమునకు పైభాగమున నుండు అటకకును, నాటకభవనము యొక్క పైకప్పునకును, నడుమ నుండు ప్రదేశమునకు దేవయాన మని పేరు. ఇది దేవతా భూమికల యానారోహణ అవరోహణ సమయముల నుపయోగింపఁబడును.

పాతాళము:—రంగస్థలమునకు దిగువప్రదేశమున గదిగ నేర్పఱుపఁబడు వివరమునకు పాతాళ మని పేరు. భూప్రవేశాదుల ప్రదర్శించుటకును, పెద్దపెద్ద అద్దముల సహాయమున నంతర్ధానము, యుద్ధము, వర్షము, సముద్రము మొదలైన ప్రకృతి దృశ్యముల సులభముగ రంగమునందు కనఁబఱచుటకును, పాతాళ మనఁబడు నీ దిగువభాగము చాలఁగ నుపయోగపడును. వీని వివరముల కొఱకు రంగనిర్మాణమును గూర్చి ఆంగ్లేయ గ్రంథములను పరిశీలించునది.

రంగస్థల పరికరములు:—

(1) యవనికలు.
(2) రజ్జువులు.
(3) ఆదర్శములు.
(4) ఆయుధములు.
(5) దుస్తులు.

యవనికలు.

రంగస్థలమందు రసమును పోషించుటకు సహాయభూతమై రంగమున కష్టముగ నొకటి తరువాత నొకటిగ కట్టఁబడియుండునవి యవనికలు. వీనిలో నైదుమాత్రము ముఖ్యమైనవి. వాని నీ క్రింద వివరించెదము.

(1) రంగముఖి:—ఇది మొదటి తెర. దీనిపైనుండు చిత్తరువు స్థిరముగాక దేశ కాలానుగుణముగను, ప్రేక్షకరంజకముగను, నాట్యవస్తు సూచకముగను, ఉండునట్లు ఒక్కొక్క నాటకమునకును మార్చఁబడుచుండ వలయును. భక్తిరసప్రధానముగ నుండవలయును. ఇది నాంద్యారంభమున నెత్తఁబడి మరల నాటకాంతము వఱకును దింపఁబడరాదు.

(2) శృంగాటకి:—ఇది రెండవ తెర. దీనిపై హాస్యరసప్రధానముగ పురవీధి చిత్రింపఁబడుట శ్లాఘ్యము. ఈ తెరను ప్రతి ప్రహసనవ్యంగ్యములందును ఎత్తి దింపుచుండవలెను.

(3) మాధ్యమిక:—ఇది మూడవ తెర. దీనిపై చిత్తరువు గృహాభ్యంతర సూచకముగ నుండవలయును. ఇది సామాన్యజన గృహముగ కనఁబడుటకు సాధారణవస్తు రచన చేతను, రాజప్రాసాదముగ గనిపించుటకు రాజోచిత వస్తు రచన చేతను, సమర్థింపఁబడవలెను.

(4) విలాసిక:—ఇది నాల్గవ తెర. దీనిపై చిత్తరువు, శృంగార రస ప్రధాన మగు నుద్యానవనమును, క్రీడామందిరమును, సూచించు చుండవలెను.

(5) నక్తిక:—ఇది యైదవదియు, కడపటిదియు నగు నల్లని తెర. దీని పైని చిత్తరువుండదు. నల్లనగుటచేత నీతెరముందే యరణ్యము, సముద్రము, మేఘావృతాకాశము, యుద్ధభూమి, కోట, శ్మశానము మొదలగునవి సమర్థింపఁబడవలెను. పాతాళ ప్రదేశమున నుండు పెద్ద యుద్ధములు లోనగు దృశ్యము లన్నిటికిని మిగుల సహాయముగ నుండును. ఈ తెర యెప్పుడును ఎత్తఁబడ రాదు.

సాహాయ్యకలు:—పైఁజెప్పఁబడిన అయిదు ముఖ్యమగు తెరలును గాక ధనలోపము లేని సామాజికు లుపయోగించెడి కొదువ తెర లన్నియు సాహాయ్యకలనఁబడును.

పార్శ్వకలు:—పెద్దతెరలకు రెండు ప్రక్కల నుండి నేపథ్యస్థలమును మఱుఁగుపఱుచు నట్టి ప్రక్కతెరల పేరు పార్శ్వకలు. వీనిపైనుండు చిత్తరువులు ఆయా ముఖ్య యవనికలకు ననుగుణముగ చిత్రింపఁబడవలయును.

ఆచ్ఛాదికలు:—దేవయానము అనఁబడు రంగస్థలోపరిభాగము కనఁబడకుండునట్లు అడ్డముగ పైని వ్రేలఁగట్టఁబడియుండు సన్నని జాలరు తెరల పేరు ఆచ్ఛాదికలు. దీనిపైనుండు చిత్తరువులును జతనుండు ప్రధానయవనికల కనుగుణముగ పై భాగమును సూచించున ట్లుండవలయును.

రజ్జువులు.

నాటక సహాయ వస్తువులలో రజ్జువు లనఁబడు నీ త్రాళ్లు మిగుల ముఖ్యమైనవి. మన దేశమునందలి సమాజములు వీని యుపయోగమును పూర్తిగఁ బొందుట లేదు. కంటి కగ్గపడు

సంతటి సన్నని పట్టుదారము మొదలు పెద్ద మోకులను ఎత్తి దింపుటకు వాడఁబడు పగ్గము వఱకును పలువిధములగు రంగుల తాళ్ళు వస్తునిర్మాణమునందు స్వభావసిద్ధముగ యంత్రముల చేయుటలో నత్యంతోపయోగకరము లగును.

ఆదర్శములు.

రంగమందు చూపఁబడు నద్భుతదృశ్యములు అనఁగా దేవతాప్రత్యక్షములు, అంతర్ధానములు, యుద్ధరంగము మొదలగునవి చూపఁబడుటలో అద్దములు గొప్పగ నుపయోగపడుచుండును. రంగస్థలమునందు దళ్ళకాయవనికకు దగ్గఱగ ప్రేక్షకులకు కనఁబడకుండునట్లు, నేపథ్యమున నా యద్దమున కెదుటి ప్రక్కలయందు దానిలో ప్రతిఫలించునట్లు రెండద్దములను, ఉంచి నేపథ్యమునందలి రెండద్దముల ముందు ఇద్దఱు నటకులు అభినయించుచుండునెడ ప్రేక్షకులకు కనిపించు నద్దమున నలువురు రంగస్థలమునందే యభినయించునట్లు కన్పట్టును. యుద్ధమును సులభముగ కనఁబఱుచుటయందు ఈ తంత్రము అద్భుతముగ నుపయోగకారి యగును. ఇట్లే దేవతాగమనమున నొకయద్దమును, పాతాళమున నొక యద్దమును, ఉంచి వాని నుండి బింబములను రంగస్థలమందలి యద్దముపై ప్రతిఫలించునట్లు చేయునెడ దేవతారోహణ అవరోహణాదులను యంత్రసహాయము లేకయే సులభముగ కనఁబఱుపవచ్చును.

ఆయుధములు.

కత్తులు, ఈటెలు, తుపాకులు మొదలగునవి. నటకులు ప్రదర్శనసమయమునందే కాక అభ్యాసమునఁ గూడ నాయుధోపయోగమును సాధనచేయుచుండిననేగాని ప్రదర్శనమునకు స్వాభావికస్థితి కలుగనేరదు.

దుస్తులు.

భూమికాధారణయందు ప్రకృతకాలమున ప్రదర్శనములందు దుస్తుల సహాయమునకు ఆవశ్యకమునకంటె నెక్కువగ ప్రాముఖ్య మొసంగఁబడుచున్నది. స్వభావసిద్ధికొఱకు భూమికాధారుని నైపుణ్యమే ప్రధానముకాని వెలగల దుస్తులు ముఖ్యములు కావు. ప్రస్తుతము పెక్కు సమాజములలో వాడఁబడు చమ్కీ దుస్తులు ప్రాచీన భారత వీరుల సూచించు భూమికలకు కేవల మస్వాభావికము లని చెప్పవలెను. పాత్ర కనుగుణమగు దుస్తులకై యా యా కాలపు చారిత్రను భూమికాధారి బాగుగ గుర్తెఱింగి యుండి, యా కాలపు దుస్తులను నిర్మించుటకు పూనవలెను. అనఁగా ప్రతినాటకమునకును అందుకు చెందిన దుస్తులను నిర్మింపవలయుఁ గాని యొకేరీతి దుస్తులు కాలభేదముగల వివిధ పాత్రలకుఁ వాడఁబడ రాదు. ఆధునిక మహమ్మదీయ పాశ్చాత్య భూమికలకు తప్ప ప్రాచీన హైందవ భూమికలకు సురవాలనఁబడు కాలి తొడవులను, ఆంగ్లేయపాదరక్షలను, ఉపయోగింపక మనపూర్వులు ధరించిన యుచిత వసన

ముల ధరించుటే యోగ్యముగ కనుపట్టెడిని. మఱియు ఋషిభూమికారచనయందు కృత్రిమ శ్మశ్రువులు అనావశ్యకము. స్త్రీభూమికాధారణమునకై స్త్రీలే నియమింపఁబడునెడ వేషరచనయందు అతిక్రమ మనావశ్యకము. ఆధునికచరిత్రకు చెందిన రోషనారా మొదలగు అన్యమత స్త్రీల వేషములకు ఆయాకాలపు స్త్రీల దుస్తుల విచారించునది.

సామాజిక వర్గము.

నియోజకులు, నైపథికులు, నటకులు అని మూడుతరగతులుగ సామాజికులు విభజింపబడుదురు.

నియోజకులు:—వీరు నాటకసమాజము యొక్క పరిపాలనాపద్ధతి నిర్వర్తించువారు. వీరిలో నీ క్రిందివారు ముఖ్యులు.

(1) పాలకుఁడు:—ఈతఁడు నాటక సమాజమునంతను బరిపాలించి, యుపరి పనుల యందు వారిని నియమింపఁజేసి, యాయావేళల కావలయు కార్యములు నిర్వహింపఁబడుట మొదలగు పనులను పరిశీలించు పైయధికారి. నాటక ప్రదర్శన సమయమునం దీతఁడు ప్రేక్షక స్థలమునం దుండి ప్రేక్షకజనముయొక్క సౌకర్యాదులను, ద్వారమునొద్ద ప్రవేశ పత్రముల యమ్మకముయొక్కయు ధనపేటికయొక్కయు పరిశీలనమును, చేయుచుండవలయును. ప్రతిదినమును సమాజముయొక్క ఆదాయవ్యయముల నితఁడు పరీక్షించుచుండవలెను.

(2) ముసద్దీ:—సమాజమునకు సంబంధించిన లెక్కలన్నిటిని వ్రాయువాఁడు. ప్రదర్శన సమయమునందు ద్వారమునొద్ద నుండి ద్వారపాలుర సహాయమున ప్రవేశపత్రముల విక్రయించుచుండవలయు.

(3) ద్వారపాలకులు నలుగురు:—ప్రధాన ద్వారమునొద్దను వెనుక మార్గముకడను ప్రదర్శన సమయమునందు కావలియుండి, తదితర సమయములందు వీలువెంట శాలలోపలి ధనాగారమునొద్ద పహరా యిచ్చుచుండఁ దగినవారు.

(4) పరిచారకులు:—సామాజికనిలయమును పరికరములను శుభ్రపఱచుటయందును, ప్రేక్షకజనుల కావశ్యకము లగు సహాయము నొసఁగుటయందును నియమింపఁబడవలెను.

(5) వైద్యుఁడు:—సామాజికుల కావశ్యకమగు వైద్యసహాయమును, నాటక ప్రకటన కార్యమును నీతని పనులు. ప్రతినాటకమునకు ముందుగ నటకుల నీతఁడు పరీక్షించి, భూమికాధారణమునకు తగినవారిని తగనివారిని నిర్ణయింపవలెను. ప్రదర్శన సమయమునం దీతఁడును ద్వారమునొద్ద నుండి ప్రవేశపత్రముల నిచ్చు ముసద్దీకిని, ప్రేక్షకజనసౌకర్యముఁ జూచు పాలకునకును సహాయ మొనర్చునది.

(6) నియోజకి:—ప్రేక్షకులలో స్త్రీల సౌకర్యములఁ గనుగొనుచుండుటకై యీమె నియమింపఁబడవలెను.

(7) పచకుఁడు (వంటవాఁడు):—సామాజికులకు అనుదిన పచనకార్యము గాక ప్రదర్శన సమయమున ప్రేక్షకుల కావశ్యకములగు ఫలాహారాదుల విక్రయించుటకై యీతఁడు నియమింపఁ బడవలెను. పైఁజెప్పఁబడిన పరిచారకులు ఈతనికి సహాయముగ నుండవలెను.

నైపథికులు.

నేపథ్యమునం దుండు సామాజికులు నైపథికులు. వీరిలో ముఖ్యుల నీ క్రింద వివరించెదము.

(1) రంగప్రధాని:—రంగనిర్మాణమును భూమికా ప్రవేశాదులను విచారించుచు నేపథ్యమునందుండు ముఖ్యాధికారి. ఈతఁడు ప్రదర్శనసమయమున నాటకశాలను విడువరాదు.

(2) భూమికాచారి:—ఈతఁడు భూమికారచనయందే ముఖ్యముగ నియమింపఁబడి యే నిముసమునకే భూమిక సంసిద్ధముగ నుండవలయునో కనుగొనుచుండవలయును. ప్రదర్శనమున స్వభావసిద్ధికై భూమికాచిత్రముల పూర్తిగాఁ దెలిసికొనియుండుటయేకాక రచనా సామర్థ్య నిపుణతకై కుట్టుపనిని, ముఖవర్ణరచనను, పూర్తిగ నేర్చియుండవలెను.

(3) అభినయగురువు:—ప్రదర్శకులకు నాటకాభినయమును నేర్పి, ప్రదర్శనసమయము నందు సరిచూచి, లోపములు లేకుండఁ జేయుచుండవలయును. ప్రదర్శనములేని దినములందు నీతఁడే నటకులకు కవాతు, డ్రిల్లు మొదలగునవి సాధకముఁ జేయింపఁదగును.

కవి, చిత్రకారుఁడు:—ఈ రెండుపనులు నొకనిచే నెఱవేర్పఁబడవచ్చును. అవసరమునకై ఆయా భాగములను మార్పుచేయుటయు, స్వాభావికసిద్ధికై తగు యవనికా చిత్రలేఖనములును ఈతని కార్యములు.

పాఠకుఁడు, లేఖకుఁడు:—ఈ రెండుకార్యములు నొకనిచే నెఱవేర్పఁబడవచ్చును. కవికి సహాయముగ నుండి పాఠభాగములను లిఖించుటయు, ప్రదర్శనసమయములందు పాఠభాగములను మఱచిన ప్రదర్శకులకు స్ఫురణకుఁ దెచ్చుచు సహాయ మొసర్చుటయు నీతని కార్యములు.

యవనికావాహులు:—యవనికలు మొదలగు రంగస్థలపరికరములను రంగప్రధాని యాజ్ఞానుసారముగా సర్దుపాటుఁ జేయు పనివాండ్లు.

మార్దంగికుఁడు:—మద్దెలవాయించునాతఁడు. గానము సరిగఁ జొక్కి తాను ప్రకాశించునట్లు గాక గానములో నిమిడియుండునట్లు తన ప్రజ్ఞను చూపవలెను.

శ్రుతికారకుడు:—హార్మోనియము మొదలగు వానితో శ్రుతి పట్టువాడు. ఇతడు నటకులకును శ్రోతలకును మధ్యగా నుండఁగూడదు. నటకులకు వెనుకగాని ప్రక్కనుగాని ఉండి, నటకుల వచనధోరణిని మించకుండునట్లు శ్రుతి పట్టుచుండవలయును.

జంత్రకారుడు:—ఫిడేలు మొదలగు జంత్రవాద్యముల వాయించు వాడు. వీనిని నటకుల గానములో నిమిడియుండునట్లు వాయింపవలయు. తెర దింపునపుడు మాత్రము విజృంభించి వాయించుచు, తన ప్రజ్ఞ నంతను పూర్తిగ ప్రదర్శింపఁదగును.

నటకులు.

సామాజికులలో నటకులు ముఖ్యులైనను వీరు సంఖ్యలందు మిగుల నతిశయించి యుండుట యనావశ్యకము. నైపథికుల యొక్కయు నియోజకుల యొక్కయు సహాయము పూర్తిగ నుండుచో కొలఁదియుండి నటకులు పాత్రసంఖ్యాధిక్యతగల ప్రదర్శనములను సమర్థతతో నిర్వహింపఁగలుగుదురు. స్త్రీ భూమికలను స్త్రీలే ధరింపవలె ననుట యుద్దేశముగాఁ గలిగి సామాజికవర్గ విధానముల నిర్వచింతుము. నటకులలో నీ దిగువ చెప్పఁబడునంతవఱకు ఆవశ్యకమనియు, అంతకంటె నెక్కువ సంఖ్యల నియమించుట యాయా సామాజిక పోషకుల యిచ్ఛాధీనమనియు, తెలియఁగునది.

పురుషులు.

(1) ప్రధాన పురుష పాత్రము.
(2) సహాయ పురుష పాత్ర.
(3) రౌద్రరస ప్రచారి.
(4) విదూషకుడు.

ఈనలుగురు నటకులును ఎట్టిప్రదర్శనమునకైనను చాలియుందురు. ప్రధాన పురుష పాత్ర యేకారణముచేతనైన ప్రదర్శనమునకు అసమర్థుఁడగునప్పుడు సహాయపాత్ర ప్రధాన వేషము ధరించుటకు చాలియుండవలెను.

స్త్రీలు.

(1) ప్రధాన స్త్రీభూమిక.
(2) సహాయ స్త్రీభూమిక.
(3) బాలభూమిక.
(4) సహాయ నర్తకీ భూమికలు.

స్త్రీసామాజిక లందఱును నృత్త నాట్య సమర్థలై యుండవలెను. బాలభూమికధరించునది ప్రహ్లాదాది బాలపురుషవేషము ధరింపవలె నని యుద్దేశము.

సైనికులు, సేవకులు మొదలగు అప్రధాన పాత్రములను నైపథికులలో ప్రదర్శన సమయమునందు పనితొందర లేనివారు ధరింపవచ్చును. నియోజకులు భూమికా ధారణమునకై పూనుకొనునెడ పోషకులకు అననుకూలమును, సామాజికులకు అపఖ్యాతియు, కలుగును.

సామాజికుల దినచర్యాక్రమము.

స్వస్థలమున—పురుషులకు.

ఉదయము ఘం. 5–30 మొదలు 6 వఱకు వేకువ కాలకృత్యములు.

ఘం 6 ,, 7–30 ,, ప్రార్థన, ఫలాహారము.

,, 7–30 ,, 9 ,, పాఠసాధన.

,, 9 ,, 4 ,, ఇతరవృత్తిజీవనముగల సామాజికులు ఈ కాలమును వృత్తిసాధనకై వినియోగించునది. వేతనము లంది నాట్యవృత్తినే గల సామాజికులు ఈమధ్య దినకాలమును నాట్యపరికర సామరస్యమునకై వినియోగింపవలెను.

సాయంత్రము ఘం 4 ,, 6 వఱకు వ్యాయామము, దేహపరిశ్రమము, ప్రతి సామాజికుఁడును అనుదినమును అభ్యసించి దృఢకాయము, అంగసౌష్ఠవము గలిగియుండినగాని సామాజికధర్మమును పూర్తిగ నెఱవేర్పఁజాలఁడు. ఈసమయముననే వారివారికొకసారి

నియోజకులు:—నియోజక ధర్మములను,

సామాజికులు:—పైనిశప్రదర్శనాదుల కుపయోగించు కనాతు మొదలగు సాధనమును,

నైపథికులు:—తెరలను ఎత్తిదింపుట, రంగవస్తు పరికరములను త్వరిత కాలంబున మార్పుచేయుట, అగ్నిప్రమాదము మొదలగు అపాయసమయములందు పరికరములను శాలను సంరక్షించుట, మొదలగు అభ్యాసములను చేయవలెను.

స్త్రీసామాజికలు కూడ ఈ పరిశ్రమలయందు పాల్గొనవలెను.

ఘం 6 మొ 8 వఱకు అభినయగురువునొద్ద అభినయాభ్యాసము

వారమునకు రెండుసార్లు అభ్యాసనాటకము. (రిహార్సలు)

నాటక ప్రదర్శన దినమాదును, ఆ మరుసటిదిన మంతను యావన్మంది సామాజికులు విశ్రాంతి గైకొనఁదగును.

మజిలీలందు:—పైని చెప్పినట్టి అనుదిన కార్యక్రమమునే పాటించుచు, వారమునకు మూఁడు ప్రదర్శనములకు మించి ప్రయత్నము చేయకుండునది.

మజిలీలందు నూతన పురముల వినోదముల చూచుటకు సామాజికులు (4 మొ 6) సాయంత్రమునే యుపయోగింపవలెను. ఇట్టి పర్యటనములందు పాలకుఁడు, రంగప్రధాని, అభినయగురువు, నియోజకి ఇట్టివారి యధీనము క్రిందనే యేగవలెను. కాని సామాజికులు ఒక్కరొక్కరుగ వారి యిచ్ఛానుసారముగ వెడలుటకు పాలకుఁడు అనుజ్ఞ నీయకుండవలెను.

ఇవి సామాజిక వర్గమునకుఁ జెందిన సాధారణ నియమములు. అవశ్యకమగు నెడల 1 పాలకుఁడు, 2 మునద్దీ, 3 నైపథ్యుఁడు, 4 నియోజకి, 5 రంగప్రధాని, 6 అభినయగురువు, 7 ప్రధాన పురుష భూమికాధారి, 8 ప్రధాన స్త్రీ భూమికాధారి ఒక సంఘముగా నేర్పడి, పాలకుని అగ్రాసనాధిపత్యము క్రింద దేశ కాల పాత్రోచితము లగు మార్పుల నొనర్చుకొనవలెను.

5వ అనుబంధము.

శుద్ధపత్రిక.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
2	18	ష్వినిన్వృత్తము	తన్వీవృత్తము
3	26	చంద్రవిర్మ	చంద్రవర్త్మ
4	27	పద్మనాళాంతరి బిలంబు	పద్మనాళాంతర బిలంబు
9	18	గసనగు	గసనగు
9	25	జలము అను	జలము, పృథ్వి అను
9	29	పస్థలను	పస్థలను
12	24	స్థల	స్థల
14	17	ప్రజానూత	ప్రజామాత
20	25	ప్రథమ	ప్రథమ
21	21	సమకూడ	సమకూడ
24	19	పంచ	పంచ
26	27	ఉభయలు	ఉభయులు
27	25	నిచెదము	నిచ్ఛేదము
29	25	వేవందువా	లేవందువా
31	6	అగుదాంగుష	అంగుడాంగుడు
49	5	రాఘువవర్మ	రాఘువశర్మ
50	18	మనస్థితి	మనస్థినితి
51	20	దేవదేవస్వయం	దేవదేవస్స్వయం
51	24	నారీస్థితః	నారిస్థినతః
63	14	మనోజయంతు	మనోజవంతు
68	2	జోతి	జ్యోతి
78	22	పటపగలు	పట్టపగలు
92	2	అట్ట	అట్ట
93	19	ఉత్థిష్ఠమై	ఉద్ధితమై
111	11	కొందజాలిని	కొంద జాతని
,,	29	సారస్య	సారస్య
114	12	నిరాయుదుడు	నిరాయుధుడు

పుట.	పఙ్క్తి.	తప్పు.	ఒప్పు.
114	13	గుఱ్రము	గుఱ్ఱము
123	16	ఫంచరించు స శైవ్య	సంచరించు నీ శైవ్య
,,	20	కాంచినాఁపు	కాంచినాఁడను
,,	26	మనన్	మనస్
,,	29	పొదువు	పొఁసువు
124	2	మిత్రులా	మిత్రులారా!
125	3	జోతిర్మం	జ్యోతిర్మం
,,	16	సైనుకులను	సైనికులను
127	7	అభిబాదము	అభివాదనము
138	5	ప్రపాదనము	ప్రతిపాదనము
,,	21	నామ్రాజ్య	సామ్రాజ్య
139	26	నిర్ష్ణయించు	నిర్ణయించు
140	16	సన్నధి	స న్నధి
143	13	అస్తికులు	ఆస్తికులు
144	23	దేవనాయకుఁను	దేవగిరినాయకుఁను
146	10	కుము	కుమ్ము
147	7	పామ్రాజ్యలక్ష్మి	సామ్రాజ్యలక్ష్మి